www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 16
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 157
గురువారం | 4-9-2025
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి తె.4.08 తదుపరి త్రయోదశి; నక్షత్రం: ఉత్తరాషాఢ రా.11.44 తదుపరి శ్రవణం; వర్జ్యం: ఉ.7.20-8.58, తె.3.43-5.18; దుర్ముహూర్తం: ఉ.10.11-11.00, మ.3.06-3.55; అమృతఘడియలు: సా.5.10-6.48; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.05; సూర్యాస్తమయం: 6.22
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



జీఎస్టీలో వినూత్న సంస్కరణలు తీసుకువస్తామని ప్రధాని మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రకటించారు. ఈ సంస్కరణలు కేవలం పన్ను రేట్ల హేతుబద్ధీకరణ మాత్రమే కాదు.. పేదలు, మధ్యతరగతి వారికి ఉపశమనం కలిగేలా, సులభతర వ్యాపారాన్ని ప్రోత్సహించేలా ఉండటమే లక్ష్యం.

- నిర్మలా సీతారామన్

వైద్య ఆరోగ్య రంగం	ప్రస్తుతం	తగ్గిన తర్వాత
వ్యక్తిగత ఆరోగ్య, జీవిత బీమా	18%	0%
మెడికల్ గ్రేడ్ ఆక్సిజన్	12%	5%
డయాగ్నస్టిక్ కిట్లు, పరికరాలు	12%	5%
గ్లూకోమీటర్, టెస్ట్ స్ట్రిప్స్	12%	5%
కళ్లజోళ్లు	12%	5%

ఎలక్ట్రానిక్ ఉపకరణాలు	ప్రస్తుతం	తగ్గిన తర్వాత
ఏసీలు, టీవీలు, వాషింగ్‌మెషీన్లు మానిటర్లు, ప్రొజెక్టర్లు	28%	18%
వ్యవసాయ రంగం		
ట్రాక్టర్ విడిభాగాలు, టైర్లు	18%	5%
ట్రాక్టర్లు	12%	5%

జీఎస్టీ తగ్గింపు ఇలా..

నిత్యావసర వస్తువులు	ప్రస్తుతం	తగ్గిన తర్వాత
		
తల నూనెలు, షాంపూలు, టూత్‌పేస్టులు, టూత్ బ్రష్‌లు, షేవింగ్ క్రీమ్‌లు, సబ్బులు	18%	5%
వెన్న, నెయ్యి, చీజ్, డెయిరీ స్ప్రెడ్లు	12%	5%
ప్రీప్యాక్డ్ నమ్కీన్, భుజియా, మిక్చర్లు	12%	5%
ఫీడింగ్ బాటిళ్లు, బేబీ న్యాప్కిన్లు, డైపర్లు	12%	5%
కుట్టు మిషన్లు, వాటి విడిభాగాలు	12%	5%
		
ఆటోమొబైల్ రంగం		
పెట్రోల్, పెట్రోల్-హైబ్రిడ్, ఎల్పీజీ, సీఎన్‌జీ కార్లు (1200సీసీ, 4000ఎంఎంలోపు)	28%	18%
డీజిల్, డీజిల్-హైబ్రిడ్ కార్లు (1500సీసీ, 4000ఎంఎంలోపు మాత్రమే)	28%	18%
త్రిచక్ర వాహనాలు	28%	18%
350 సీసీలోపు ఉండే మోటారు సైకిళ్లు	28%	18%
రవాణా వాహనాలు	28%	18%
విద్యారంగం		
మ్యాపులు, చార్టులు, గ్లోబులు	12%	0%
పెన్సిళ్లు, షార్ప్‌నర్‌లు, క్రెయాన్‌లు	12%	0%
వర్క్‌బుక్‌లు, నోట్‌బుక్స్	12%	0%
ఎరేజర్లు	5%	0%

ముందే పండుగ!

22వ తేదీ నుంచే తగ్గుతున్న నిత్యావసరాల ధరలు.. పేదలు, మధ్య తరగతికి గణనీయంగా ఊరట

- జీఎస్టీ సంస్కరణలకు జీఎస్టీ కౌన్సిల్ పచ్చజెండా
- ఇప్పుడున్న నాలుగు శ్లాబులు.. రెండు శ్లాబులకు కుదింపు
- జీవిత, ఆరోగ్య బీమాపై జీఎస్టీ పూర్తిగా ఎత్తివేత
- 33 రకాల అత్యవసర ఔషధాలపైనా పన్ను జీరో
- ఇతర అన్ని మందులపై పన్ను 5 శాతానికి తగ్గింపు
- సిమెంట్‌పై పన్ను 10% తగ్గింపు.. యథాతథంగా ఫోన్ల ధరలు
- టీవీలు, ఫ్రిడ్జ్‌లు, వాషింగ్ మెషీన్లు 28% నుంచి 18%కి..
- కార్లపై రూ.75 వేల నుంచి లక్షన్నర దాకా ఊరట
- లగ్జరీ కార్లపై రూ.10 లక్షల వరకు ఆదా
- స్కూటర్లపై 10 వేల దాకా.. బైక్‌లపై 13 వేల దాకా..
- రూ.2,500 దాటిన వస్త్రాలు, పాదరక్షల ధరలు పెరిగే చాన్స్

దేశంలో దసరా, దీపావళికి ముందే పండుగ వస్తోంది. పండుగ సరుకులన్నీ అగ్గువకే అందివస్తున్నాయి. పాలు, పనీర్, బిస్కెట్లు, సబ్బులు, షాంపూల నుంచి ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, చిన్న కార్లు, బైకుల దాకా ధరలు దిగొస్తున్నాయి. ఆరోగ్య, జీవిత బీమా మరింత చేరువ అవుతోంది. దసరా నవరాత్రులు ప్రారంభమయ్యే ఈ నెల 22వ తేదీ నుంచి జీఎస్టీ (వస్తుసేవల పన్ను) సంస్కరణలు అమల్లోకి తీసుకువచ్చేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలోని జీఎస్టీ కౌన్సిల్ బుధవారం పచ్చజెండా ఊపింది. ప్రస్తుతమున్న నాలుగు శ్లాబులు ఇకపై 5%, 18% పన్నురేట్లకే పరిమితం కానున్నాయి. ఆరోగ్య, జీవిత బీమాపై జీఎస్టీ రద్దుతోపాటు 33 రకాల అత్యవసర మందులపై ప్రస్తుతమున్న 12శాతం పన్నును పూర్తిగా తొలగించారు. వైద్యపరికరాలపై జీఎస్టీని 12% నుంచి 5%కు తగ్గించారు. దీనితో ప్రజల ఆరోగ్య భద్రతకూ మార్గం పడనుంది. నోట్‌బుక్‌లు, పెన్సిళ్లు, క్రయాన్లు, మ్యాప్‌లు, చార్టులపై జీఎస్టీని రద్దు చేయడం విద్యార్థులపై భారాన్ని తగ్గించనుంది. ఫోన్ల ధరల్లో మాత్రం మార్పు లేదు.

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3: దేశంలో జీఎస్టీ (వస్తు సేవల పన్ను) సంస్కరణలకు లైన్ క్లియర్ అయింది. పేదలు, మధ్యతరగతికి ఊరటనిచ్చేలా పన్ను శ్లాబుల కుదింపునకు జీఎస్టీ కౌన్సిల్ పచ్చజెండా ఊపింది. దీనితో ప్రస్తుతం 5, 12, 18, 28 శాతంగా ఉన్న పన్ను రేట్లలో 5, 18 పన్ను రేట్లు మాత్రమే కొనసాగనున్నాయి. హానికర, విలాస వస్తువులపై 40శాతం ప్రత్యేక పన్ను విధిస్తారు. ఎప్పటి నుంచో ప్రజలు కోరుతున్న మేరకు ఆరోగ్య, జీవిత బీమాలపై జీఎస్టీ పూర్తిగా రద్దయింది. బుధవారం జరిగిన జీఎస్టీ కౌన్సిల్ భేటీ అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ వివరాలను వెల్లడించారు. దుర్గా నవరాత్రుల మొదటి రోజు అయిన సెప్టెంబర్ 22వ తేదీ నుంచి జీఎస్టీ సంస్కరణలు అమల్లోకి వస్తాయని ప్రకటించారు. దేశంలోని సాధారణ ప్రజలకు ప్రయోజనం కలిగించేందుకే జీఎస్టీ సంస్కరణలు చేపట్టామని నిర్మలా సీతారామన్ చెప్పారు. "జీఎస్టీలో వినూత్న సంస్కరణలు తీసుకువస్తామని ప్రధాని మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రకటించారు. ఈ సంస్కరణలు కేవలం పన్నురేట్ల హేతుబద్ధీకరణ మాత్రమేకాదు.. పేదలు, మధ్యతరగతి వారికి ఉపశమనం కలిగేలా, సులభతర వ్యాపారాన్ని ప్రోత్సహించేలా

మిగతా 2వ పేజీలో...

నాన్నా.. జాగ్రత్త..!



మీడియా భేటీలో ఎమ్మెల్సీ పదవికి, బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా ప్రకటిస్తున్న కవిత

మీ చుట్టూ ఏం జరుగుతుందో చూసుకోండి.. కేటీఆర్‌కూ ప్రమాదం పొంచి ఉంది

- రామన్నా.. నాన్న ఆరోగ్యాన్ని, పార్టీని కాపాడుకో
- కాళేశ్వరం డబ్బుతో 25 మంది ఎమ్మెల్యేలకు హరీశ్ ఫండింగ్
- సిరిసిల్లలో కేటీఆర్‌ను ఓడించేందుకు రూ.60 లక్షలు పంపారు
- సంతోష్‌కి ధన దాహం.. అడవులను కొట్టేయాలని చూశారు
- మా కుటుంబం విచ్ఛిన్నమైతేనే వాళ్లకు అధికారం అన్న కుట్ర
- అందులో భాగంగానే మొదట నన్ను బయటకు పంపారు
- హరీశ్‌రావు వల్లే విజయశాంతి, ఈటల బీఆర్ఎస్‌ను వీడారు
- ఫోన్‌ట్యాపింగ్ చేసింది హరీశ్, సంతోష్, శ్రవణ్‌రావులే..
- నా సిబ్బంది, రామన్న సిబ్బంది ఫోన్లనూ ట్యాప్ చేశారు
- రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు సరెండరైంది నిజం కాదా?
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా

హైదరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, సంతోష్‌రావుపై కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. హరీశ్, సంతోష్ అవినీతి వల్లే కేసీఆర్‌కు సీబీఐ మరక అంటిందని చెప్పారు. కాళేశ్వరం అవినీతి డబ్బుతోనే హరీశ్‌రావు 2018 ఎన్నికల్లో 25 మంది ఎమ్మెల్యేలకు సొమ్ములు ఇచ్చారని ఆరోపించారు. ఎమ్మెల్యేలను తన వెంట ఉంచుకొని పార్టీకి నష్టం చేయాలన్న కుట్రతోనే పార్టీ ఫండ్ కాకుండా ఆయన సొంత డబ్బులు ఇచ్చారన్నారు. ఆ ఎమ్మెల్యేల పేర్లూ తనకు తెలుసని, వారికి ఇబ్బంది కలిగించే ఉద్దేశం లేదు కాబట్టి వారెవరన్నది బయటపెట్టనని చెప్పారు. అలాగే సిరిసిల్లలో కేటీఆర్‌ను ఓడించేందుకు హరీశ్ ఓ వ్యక్తికి రూ.60 లక్షలు ఇచ్చారని.. అతనే తనకీ విషయం చెప్పారని అన్నారు. అత్యధిక ధనదాహం ఉన్న సంతోష్‌రావు ఏకంగా అడవులను కొట్టేయాలని చూశారని.. ప్రభుత్వం హరితహారం చేపడితే, ఆయన గ్రీన్ చాలెంజ్ పేరుతో కోట్లు కొల్లగొట్టారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత విమర్శించారు. బంగారు తెలంగాణ అంటే

మిగతా 15వ పేజీలో...

అప్పుడు హామీల జాతర.. ఇప్పుడు చెప్పుల జాతర!

- ఎన్నికల ముందు అడ్డగోలు హామీలిచ్చి మోసగించిన రేవంత్
- ప్రజలు గ్రహిస్తున్నారు: కేటీఆర్
- బీఆర్ఎస్‌లో చేరిన ఐఎన్‌టీయూసీ నాయకులు

3

- హరీశ్‌పై కవిత వ్యాఖ్యలు బాధాకరం: ప్రశాంత్ రెడ్డి
- బీఆర్ఎస్‌కు గొప్ప సంపద హరీశ్: నిరంజన్ రెడ్డి

15

ఆ చెత్తగాళ్ల వెనుక నేనెందుకుంటా?

- హరీశ్, సంతోష్ వెనుక అని కొందరు.. కవిత వెనుక ఉన్నారని మరికొందరు..
- అలాంటి దిక్కుమాలిన ఆరోపణలు చేసే వారిని బండకేసి కొట్టాలి
- నేను ఎవరి వెనుకా ఉండను..
- రాష్ట్రాభివృద్ధి కోసం ప్రజల ముందుంటా
- అవినీతి సొమ్మును ఎలా పంచుకోవాలో తెలియక ఆ కుటుంబంలో పంచాయితీ
- రాష్ట్రంలో మరే పార్టీ బతకవద్దనుకున్న బీఆర్ఎస్ కాలగర్భంలో కలిసిపోతోంది
- పాలమూరు పేదరికానికి ఎగ్జిబిషన్ కాదు అభివృద్ధి ప్రదర్శనకు వేదిక కావాలి: సీఎం
- భద్రాద్రి జిల్లా బెండాలపాడులో ఇందిరమ్మ గృహ ప్రవేశాలు చేయించిన రేవంత్‌రెడ్డి



బెండాలపాడులో లబ్ధిదారుల ఇంటి రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశం చేయిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్/కామారెడ్డి/ఖమ్మం / కొత్తగూడెం / అశ్వారావుపేట / చంద్రుగొండ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వేరే పార్టీ ఉండకూడదని అనుకున్న వారే ఇప్పుడు తన్నుకొని చస్తున్నారని.. చేసిన పాపం ఊరికేపోదని పెద్దలు అన్నట్టే జరుగుతోందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తాను హరీశ్‌రావు, సంతోష్‌రావు వెనుక ఉన్నానని కొందరు, కవిత వెనుక ఉన్నానని మరికొందరు ఆరోపణలు చేస్తున్నారని.. అలాంటి చెత్తగాళ్ల వెనుక తానెందుకు ఉంటానని పేర్కొన్నారు. ఇలాంటి దిక్కుమాలిన ఆరోపణలు చేసేవాళ్లను బండకేసి కొట్టాలన్నారు. అవినీతి సొమ్మును ఎలా పంచుకోవాలో తెలియక కల్వకుంట్ల కుటుంబంలో పంచాయతీలు జరుగుతున్నాయని ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలంలోని కార్నింగ్ టెక్నాలజీస్ కంపెనీలో నూతన యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో, అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బెండాలపాడులో ఇందిరమ్మ గృహ ప్రవేశాల కార్యక్రమం, బహిరంగ సభలో సీఎం రేవంత్ మాట్లాడారు. "పదేళ్ల అధికారంలో ఉండి దోచుకున్న రూ.లక్షల కోట్ల సొమ్ము పంపకం కేసీఆర్ కుటుంబంలో చిచ్చు పెట్టింది. బావ, అన్న, చెల్లి కత్తులు, బల్లేలతో పొడుచుకుంటున్నారు. ఉరుమిరిమి మంగళం

మిగతా 13వ పేజీలో...



చైనా విశ్వరూపం

- భారీ అణు క్షిపణులు.. లేజర్ ఆయుధాలు
- 20 వేల కి.మీ. రేంజ్ ఉన్న మిస్సైల్ డీఎఫ్-5సీ
- భూగోళంపై ఏ ప్రాంతాన్నైనా టార్గెట్ చేసే సత్తా
- అండర్ వాటర్ డ్రోన్లు.. ఐదోతరం జెట్లు
- బీజింగ్ మిలిటరీ పరేడ్‌లో ఆయుధ ప్రదర్శన
- ప్రత్యేక ఆకర్షణగా ఎల్‌వై-1 లేజర్ ఆయుధం
- ఒకేసారి ఐదు మోడళ్ల స్టెల్త్ ఫైటర్ జెట్లు ప్రదర్శన

2

సీఏఏ కటాఫ్ తేదీ పొడిగింపు

- 2024 డిసెంబరు 31లోపు వచ్చిన వారు దేశంలో ఉండొచ్చు
- పాస్‌పోర్టు, వీసా, మరేవిధమైన పత్రాలు అవసరం లేదు
- కేంద్ర హోం శాఖ ఉత్తర్వుల జారీ
- పొరుగుదేశాల మైనారిటీలకు భారీ ఉపశమనం

14



ఐటీ రంగంపైనా.. ట్రంప్ సుంకాలు!

- ఐటీఈఎస్, రిమోట్ వర్క్‌పైనా..
- రెమిటెన్స్‌లపైనా భారీగా భారం
- ఆ మేరకు రీట్వీట్ చేసిన నవారో

2

5 నెలలు.. రూ.760 కోట్లు!

- జీహెచ్ఎంసీకి పెరిగిన భవన నిర్మాణ అనుమతుల ఆదాయం
- గతేడాదితో పోలిస్తే 90% అధికం
- గాడినపడుతున్న 'రియల్' రంగం
- క్రయ విక్రయాల్లో వృద్ధి
- కొత్త ప్రాజెక్టులకు దరఖాస్తులు
- అనుమతుల జారీలో పెరిగిన వేగం

16



ప్రజాభీష్టమే సర్వోన్నతం

- గవర్నర్లు, రాష్ట్రపతి ఇష్టాయిష్టాలకు లోబడదు
- శాసన ప్రక్రియలో కార్యనిర్వాహక వ్యవస్థ జోక్యం తగదు.. కోర్టులు అంగీకరించొద్దు
- చట్టాల అంశంలో పార్లమెంటుకు ఉన్న సార్వభౌమాధికారం రాష్ట్రాలకూ ఉంది
- సుప్రీంకోర్టులో కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్, బెంగాల్ వాదనలు.. 9న తదుపరి విచారణ

14

ముందే పండుగ!

(మొదటి పేజీ తరువాయి)

ఉండటమే లక్ష్యం. అందుకే లోతుగా సమీక్ష జరిపి నిర్ణయాలు తీసుకున్నాం. మద్దతు తెలిపిన అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులకు ధన్యవాదాలు తెలుపుతున్నాను. పన్ను శ్లాబులను రెండుకు తగ్గిస్తున్నాం. ఇకపై 5శాతం, 18శాతం పన్నురేట్లు ఉంటాయి. ఈ మార్పులతో సాధారణ ప్రజలు వినియోగించే నిత్యావసరాల ధరలు చాలా వరకు తగ్గుతాయి. వ్యవసాయ రంగానికి, రైతులకు ప్రయోజనం కలుగుతుంది. ఇది దేశంలో వినియోగాన్ని పెంచి, ఆర్థిక వ్యవస్థకు ఊపునిస్తుంది" అని తెలిపారు. హానికర వస్తువుల కేటగిరీలోని పాన్ మసాలాలు, గుట్కా, సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులపై ప్రస్తుతమున్న ధరలే కొనసాగేలా పన్నులు ఉంటాయని చెప్పారు.

ఆరోగ్య, జీవిత బీమాలపై జీఎస్టీ పూర్తిగా రద్దు

దేశంలో ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని నిర్మల చెప్పారు. వ్యక్తిగత జీవిత బీమా, ఆరోగ్య బీమా, ఫ్లోటర్ పాలసీలు, సీనియర్ సిటిజన్ల పాలసీల ప్రీమియంపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని నిర్ణయించామని ప్రకటించారు. వ్యాపారులకు జీఎస్టీ రిజిస్ట్రేషన్, రిటర్నుల ఫైలింగ్, రీఫండ్ ప్రక్రియలను సులభతరం చేస్తున్నామని, మానవ శ్రమ అవసరమయ్యే పరిశ్రమలను ప్రోత్సహించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య, జీవిత బీమాపై జీఎస్టీతో రూ.16,398 కోట్లు వసూలు చేసింది. ఇందులో జీవిత బీమా నుంచి రూ.8,135 కోట్లు, ఆరోగ్య బీమా నుంచి రూ.8,263 కోట్లు వచ్చాయి.

రాష్ట్రాలకు జరిగే నష్టాన్ని పూడ్చాలి..!

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రతినిధులతో కూడిన జీఎస్టీ కౌన్సిల్ రెండు రోజుల సమావేశం బుధవారం ప్రారంభమైంది. తొలిరోజున సుదీర్ఘంగా జరిగిన భేటీలో.. జీఎస్టీలో సంస్కరణలు, శ్లాబుల హేతుబద్ధీకరణపై ఏర్పాటు చేసిన మంత్రుల సంఘం చేసిన సిఫార్సులపై చర్చించింది. ఈ సందర్భంగా జీఎస్టీ రేట్ల కుదింపునకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఆర్థిక మంత్రులు అంగీకారం తెలిపారు. అయితే శ్లాబుల కుదింపుతో రాష్ట్రాలకు ఏటా సుమారు రూ.2 లక్షల కోట్ల మేర ఆదాయం తగ్గిపోయే ప్రమాదం ఉందని ఎన్డీయేతర రాష్ట్రాల ఆర్థిక మంత్రులు ఆందోళన వ్యక్తం చేసినట్టు తెలిసింది. హానికర, విలాస వస్తువులపై ప్రత్యేక పన్ను, దానిపై సర్చార్జీలు, సెస్‌ల ద్వారా ఆ నష్టాన్ని కేంద్ర భర్తీ చేయాలని కోరినట్టు సమాచారం. ఇక పెట్రోల్, డీజిల్ తదితరాలను జీఎస్టీ పరిధిలోకి తేవాలన్న ప్రతిపాదనకు రాష్ట్రాలేవీ సానుకూలత వ్యక్తం చేయలేదని తెలిసింది. గురువారం జరిగే జీఎస్టీ మండలి భేటీలోనూ దీనిపై చర్చ జరిగే అవకాశం లేదని సమాచారం.

ప్రయోజనమెంత?

జీఎస్టీ మార్పులతో చాలా వరకు నిత్యావసరాల ధరలు తగ్గనున్నాయి. ఇప్పటివరకు 5శాతం పన్నురేటులో ఉన్న టెట్రాప్యాక్ పాలు, పనీర్, బ్రెడ్‌లపై పన్ను పూర్తిగా మినహాయించారు. ఇప్పటివరకు 18%, 12% పన్ను రేట్లలో ఉండి.. ఇకపై 5శాతం పన్ను పరిధిలో వస్తున్న హెయిర్ ఆయిల్, సబ్బులు, షాంపూలు, టూత్ బ్రష్‌లు, సైకిళ్లు, టేబుళ్లు, కుర్చీలు, పాస్తా, నూడుల్స్, కాఫీ, కార్న్‌ఫ్లేక్స్, బటర్, నెయ్యి, హస్తకళాకృతులు, మార్బుల్, గ్రానైట్‌తో పాటు కొన్ని రకాల ఔషధాలు, డయాగ్నస్టిక్ కిట్లు, కళ్లద్దాలు, సోలార్ ప్యానెళ్ల ధరలు తగ్గనున్నాయి.

- పెట్రోల్, డీజిల్, సీఎన్జీ వాహనాలు, వాటి విడి భాగాలపై జీఎస్టీ తగ్గింపుతో కార్లతోపాటు ఆటోలు, బస్సులు, ట్రక్కుల ధరలూ దిగివస్తాయి. ముఖ్యంగా విలాసవంతమైన వాహనాలపై అదనపు సెస్‌ను ఎత్తివేయడంతో వాటి ధరలు మరింతగా తగ్గే అవకాశం ఉంది. ఎలక్ట్రిక్ కార్లపై ఎప్పటిలాగే 5శాతం పన్ను కొనసాగనుంది. ఇక 350 సీసీ సామర్థ్యంలోపు ఉన్న ద్విచక్ర వాహనాలను 28శాతం పన్నురేటు నుంచి 18శాతానికి మార్చడంతో.. వాటి ధరలు పది శాతం మేర తగ్గనున్నాయి.
- 40శాతం ప్రత్యేక పన్ను రేటులోని శీతల పానీయాలు, చక్కెర, ఇతర తీపి పదార్థాలు, కెఫీన్ కలిపిన పానీయాలు, పళ్ల రసాల ధరలు కొంతమేర పెరిగే అవకాశం ఉంది. పాన్ మసాలాలు, సిగరెట్లు, గుట్కాలు, ఇతర పొగాకు ఉత్పత్తుల ధరల్లో పెద్దగా మార్పులు ఉండవు.
- 18 శాతం పన్నురేటులో మొబైల్ ఫోన్లను యథాతథంగా కొనసాగించారు. దీనితో వాటి ధరల్లో మార్పు ఉండదు.
- సిమెంట్‌పై పన్నును 28శాతం నుంచి 18శాతానికి తగ్గించారు. దీనితో దేశవ్యాప్తంగా నిర్మాణ రంగానికి ఊరట లభించనుంది. ఇళ్లు, ఫ్లాట్ల ధరలు కాస్త తగ్గేందుకు వీలుంటుంది
- ప్రస్తుతం రూ.1000 లోపు ధర ఉన్న వస్త్రాలు, చెప్పులు, బూట్లపై 5శాతం, ఆపై ధర ఉంటే 12శాతం పన్ను వసూలు చేస్తున్నారు. ఇకపై రూ.2,500 వరకు ధర ఉన్న వస్త్రాలు, పాదరక్షలపై 5శాతమే పన్ను వర్తిస్తుంది. అంటే రూ.1000 నుంచి రూ.2,500 వరకు ధర ఉన్న వాటి ధరలు తగ్గుతాయి. అయితే రూ.2,500కుపైన ధర ఉండే వస్త్రాలు, పాదరక్షలు 18శాతం పన్నురేటులోకి వెళతాయి. అంటే.. వాటి ధరలు పెరుగుతాయి.

దుస్తులు, పాదరక్షలపై జీఎస్టీ ఇలా..

దుస్తులు/పాదరక్షలు	ప్రస్తుత జీఎస్టీ	కొత్త జీఎస్టీ
రూ.1,000 వరకు	5 శాతం	5 శాతం
1,001 నుంచి రూ.2,500 వరకు	12 శాతం	5 శాతం
రూ.2,500 పైబడి	12 శాతం	18 శాతం

రూ.2,500కు మించిన ఉత్పత్తులపై జీఎస్టీని 12 శాతం నుంచి 18 శాతానికి పెంచడం పట్ల క్లోతింగ్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఎంఏఐ) వంటి అసోసియేషన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జీఎస్టీ పెంపుతో ఉన్ని, హస్తకళల దుస్తుల డిమాండ్‌పై ప్రభావం పడవచ్చని పేర్కొంది. ఇప్పటికే ఎగుమతుల్లో మందగమనం, నగదు ప్రవాహ సమస్యలు ఉన్నట్టు చెబుతోంది. ఇక రూ.2,500 వరకు ధర ఉన్న ఉత్పత్తులపై పన్ను 5 శాతానికి తగ్గడం వల్ల వినియోగదారులకు ఊరట లభించనుంది.

సింగరేణి, 'బొగ్గు' విద్యుత్ భారం!

బొగ్గు, బొగ్గు ఆధారిత ఇంధనాలపై జీఎస్టీని ప్రస్తుతమున్న 5శాతం నుంచి 18శాతానికి పెంచారు. దీనితో బొగ్గు ధరలు పెరుగుతాయి. బొగ్గును వినియోగించే థర్మల్ విద్యుత్ కేంద్రాలపై తీవ్ర భారం పడుతుంది. విద్యుత్ ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. బొగ్గును వినియోగించే ఉక్కు, సిమెంటు, ఎరువులు, రసాయన పరిశ్రమలకూ భారంగా మారుతుంది. మరోవైపు బొగ్గు డిమాండ్ పెంచేందుకు సింగరేణి ధరలు తగ్గించాల్సి వస్తుంది. దీనితో సంస్థపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఇక సిమెంట్‌పై పన్ను తగ్గించినా.. బొగ్గుపై పన్ను పెరగడంతో ధరలు తగ్గే అవకాశం ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రజా ఆరోగ్యానికి భద్రత

పలు రకాల ఔషధాలు, వైద్య పరికరాలు, డయాగ్నస్టిక్ కిట్లు వంటివాటిపై ఇప్పటివరకు 12%, 18% వరకు పన్నులు ఉండగా.. ఇప్పుడన్నింటినీ 5%శాతం పన్ను పరిధిలోకి తెచ్చారు. ముఖ్యంగా కేన్సర్, ఇతర ప్రాణాధార, అత్యవసర ఔషధాలపై జీఎస్టీని పూర్తిగా ఎత్తివేశారు. దీనితో ప్రజా ఆరోగ్య భద్రతకు మేలు కలగనుంది.

గృహ నిర్మాణ రంగానికి ఊతం

ఇంటి నిర్మాణ ఖర్చు	సిమెంట్ వాటా(18%)	పాత జీఎస్టీ(28%)	తగ్గిన జీఎస్టీ(18%)	మిగులు
రూ.20 లక్షలు	రూ.3.6లక్షలు	రూ.1.01 లక్షలు	రూ.65 వేలు	రూ.36 వేలు
రూ.30 లక్షలు	రూ.5.4 లక్షలు	రూ.1.52 లక్షలు	రూ.98 వేలు	రూ.54 వేలు
రూ.40 లక్షలు	రూ.7.2 లక్షలు	రూ.2.02 లక్షలు	రూ.1.3 లక్షలు	రూ.72 వేలు

ఏసీల ధరలు ఎంత తగ్గుతాయ్!

కంపెనీ	ధర	పాత జీఎస్టీ (28%)	కొత్త జీఎస్టీ (18%)	ఆదా ఎంత?
ఓ-జనరల్	49,000	10,719	7,473	3,250
ఎల్జీ	46,590	10,177	7,105	3,070
పానాసోనిక్	44,990	9,873	6,895	2,980
డైకిన్	36,990	8,092	5,644	2,450
బ్లూ స్టార్	34,000	7,438	5,185	2,250
క్యారియర్	34,990	7,686	5,358	2,330
ఓల్టాస్	31,990	6,998	4,877	2,120

350సీసీలోపు బైక్‌ల ధరలు తగ్గుతాయి

350సీసీలోపు మోటారు సైకిళ్ల ధరలు తగ్గుతాయి. వీటిపై 28 శాతం జీఎస్టీ 18 శాతానికి తగ్గనుంది. రాయల్ ఎన్‌ఫీల్డ్, కేటీఎం వంటి 350సీసీ కంటే ఎక్కువ ఇంజన్ సామర్థ్యం బైక్‌ల ధరలు పెరుగుతాయి. ఇప్పటి వరకు వీటిపై 28 శాతం జీఎస్టీతో పాటు 2-3 సెస్ విధిస్తున్నారు. ఇక నుంచి సెస్ ఉండదు కానీ 40 శాతం పన్ను పరిధిలోకి వెళతాయి.

మోడల్	ఇంజన్	ప్రస్తుత పన్ను (28%)	కొత్త పన్ను (18%)	సుమారుగా ఆదా
హోండా యాక్టివా/ టీవీఎస్ జూపిటర్	110-125సీసీ	28,000-31,000	18,000	10,000-13,000
బజాజ్ పల్సర్	150సీసీ	28,000-31,000	18,000	10,000-13,000
రాయల్ ఎన్‌ఫీల్డ్	650సీసీ	93,000	1,20,000	27,000 (పెరుగుదల)
కేటీఎం	373సీసీ	93,000	1,20,000	27,000 (పెరుగుదల)

ఏయే కార్ల ధరలు ఎంత తగ్గుతాయంటే !

కార్ల విభాగం	మోడల్‌లు	ప్రస్తుత పన్ను శాతం (సెస్‌తో కలిపి)	తగ్గాక	ఆదా (రూ.ల్లో)
చిన్న కార్లు (1200 సీసీ లోపు)	స్విఫ్ట్, వేగనార్, బెలెనో, పంచ్, ఐ20	29	18	50వేల నుంచి లక్ష దాకా
మిడ్ సైజ్ (1200 సీసీ పైన)	క్రెటా, సెల్టోస్, సిటీ, ఇన్నోవా	43	40	75వేల నుంచి 1.5లక్ష
ఎస్‌యూవీ/లగ్జరీ కార్లు (1200 సీసీ పైన)	ఎక్స్‌యూవీ 700, ఫార్చ్యునర్, ఆడీ, బీఎండబ్ల్యూ, మెర్సిడిస్	50	40	2లక్షల నుంచి 10 లక్షలు

- ఎలక్ట్రిక్ కార్లపై ప్రస్తుతం 5 శాతం పన్ను విధిస్తున్నారు. ఈ రేటులో ఎలాంటి మార్పులు చేయలేదు. అందువల్ల ఎలక్ట్రిక్ కార్ల ధరల్లో ఎలాంటి మార్పు ఉండే అవకాశం లేదు.



సామాన్యులకు ఊరటనిస్తూనే ఆర్థిక రంగం బలోపేతం

జీఎస్టీ సంస్కరణలపై ప్రధాని మోదీ స్పందన



న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: భారీ సంస్కరణలకు జీఎస్టీ మండలి ఆమోదం తెలపడంపై ప్రధాని మోదీ స్పందించారు. తాజా సంస్కరణలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయన్నారు. వ్యాపారం మరింత సరళతరమవుతుందని, చిరు వ్యాపారులకు మరింత ప్రయోజనం చేకూరుతుందన్నారు. సామాన్య ప్రజలకు ఊరటనిస్తూనే ఆర్థిక రంగాన్ని బలోపేతం చేసేలా కేంద్ర ప్రభుత్వం సంస్కరణలకు శ్రీకారం చుట్టిందంటూ ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సామాన్యులు, మధ్యతరగతి వారు, రైతులు, మహిళలు, యువత, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల వారికి ప్రయోజనం కలిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి నిర్ణయం తీసుకున్నాయని ఆయన చెప్పారు. జీఎస్టీలో భారీ సంస్కరణలు తీసుకురాబోతున్నట్లు ఎర్రకోట వేదికగా తాను స్వాతంత్ర్య దినోత్సవాన ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా మోదీ గుర్తు చేశారు.

నక్సల్స్ లొంగిపోతారో.. ఎన్‌కౌంటర్ అవుతారో తేల్చుకోవాలి: అమిత్ షా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: నక్సలిజాన్ని సమూలంగా నిర్మూలించే వరకు మోదీ సర్కారు విశ్రమించబోదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. ఇప్పటికైనా నక్సల్స్ లొంగిపోతే మంచిదన్నారు. 'నక్సల్స్ అందరూ లొంగిపోవాలి.. వారిని పట్టుకునే వరకు లేదా పూర్తిగా నిర్మూలించే వరకు ఊరుకునేది లేదు' అని వ్యాఖ్యానించారు. ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టలపై 'ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్'ను విజయవంతంగా నిర్వహించిన సీఆర్పీఎఫ్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు, కోబ్రా దళాలను అమిత్ షా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్ సమయంలో జవాన్లు, పోలీసులు ప్రదర్శించిన పరాక్రమం నక్సల్స్ ఏరివేత చరిత్రలో ఓ సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుంది. వాతావరణం, భౌగోళిక పరిస్థితులు అనుకూలించకున్నా.. అడుగడుగునా మందుపాతరలున్నా వెనకడుగు వేయకుండా నక్సల్స్ ప్రధాన బేస్ క్యాంప్‌ను ధ్వంసం చేశారు' అని ప్రశంసించారు.

పోటీ పరీక్షల్లో స్క్రైబ్స్ నిబంధనలు కఠినతరం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: పోటీ పరీక్షలకు హాజరయ్యే దివ్యాంగ అభ్యర్థులకు సహాయకులుగా వ్యవహరించే స్క్రైబ్స్‌కు సంబంధించిన నిబంధనలను కేంద్రం కఠినతరం చేసింది. యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీయే) తదితర అన్ని పరీక్ష నిర్వహణ సంస్థలు తమ పర్యవేక్షణలో సుశిక్షితులైన స్క్రైబ్‌లతో కూడిన బృందాలను రెండేళ్లలోగా ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. పరీక్షల్లో అవకతవకలకు కారణమవుతున్న 'సొంత స్క్రైబ్' వ్యవస్థను దశల వారీగా తొలగించాలని పేర్కొంది. ఈ మేరకు సవరించిన మార్గదర్శకాలను కేంద్ర సామాజిక న్యాయం సాధికారిత మంత్రిత్వ శాఖ తాజాగా జారీ చేసింది. ప్రొఫెషనల్, టెక్నికల్ కోర్సుల్లో ప్రవేశాలతో పాటు వివిధ ఉద్యోగాల కోసం నిర్వహించే అన్ని పోటీ పరీక్షలకు ఈ విధానం వర్తిస్తుందని స్పష్టం చేసింది.

గాలి, నీరుతో విద్యుత్ ఉత్పత్తి..!

ప్రత్యేక పరికరం తయారుచేసిన ఐఐటీ ఇండోర్ పరిశోధకులు

ఇండోర్, సెప్టెంబరు 3: సూర్యరశ్మి, బ్యాటరీ.. ఇవేమీ అవసరం లేకుండా కేవలం గాలి, నీరుతో విద్యుత్‌ను ఉత్పత్తి చేసే పరికరాన్ని ఐఐటీ ఇండోర్ పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఈ పరికరం ద్వారా చిన్న ఎలక్ట్రానిక్ పరికరాలకు నిరంతరం విద్యుత్ సరఫరా అందించవచ్చని వారు తెలిపారు. గ్రాఫేట్ ఆక్సైడ్‌ను జింక్-ఇమిడాజోల్‌తో కలిపి ప్రత్యేకంగా రూపొందించిన ఒక పొరలాంటి పరికరాన్ని అభివృద్ధి చేశామని ఐఐటీ ఇండోర్ అధికారులు బుధవారం పేర్కొన్నారు. ఈ పొర పాక్షికంగా నీటిలో మునిగినప్పుడు నీరు సూక్ష్మదర్శిని మార్గాల ద్వారా పైకి ప్రవహించి ఆవిరైపోతుందని, ఈ బాష్పీభవన ప్రక్రియ ఆధారిత కదలిక.. పొర చివరన సానుకూల, ప్రతికూల అయాన్లను వేరు చేసి.. స్థిరమైన వోల్టేజ్‌ను ఉత్పత్తి చేస్తుందని చెప్పారు. మూడు సెంటీమీటర్ల పొడవు, రెండు సెంటీమీటర్ల వెడల్పు ఉన్న ఈ పొర 0.75 వాట్స్ వరకు విద్యుత్ ఉత్పత్తి చేయగలదని, అయితే ఎక్కువ పొరలను కలపడం ద్వారా అధిక విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చని వారు తెలిపారు.

కొండచరియలు విరిగిపడి సూడాన్‌లో 1000 మంది మృతి

కైరో, సెప్టెంబరు 03: అంతర్యుద్ధం, మానవతా సంక్షోభాలను ఎదుర్కొంటున్న సూడాన్‌ను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడి ఓ గ్రామం పూర్తిగా తుడిచిపెట్టుకు పోయింది. మర్రా పర్వతాల్లోని తరాసిన్ అనే గ్రామంలో ఆదివారం కొండచరియలు విరిగిపడడంతో గ్రామంలోని ఇళ్లన్నీ భూమిలోకి కుంగిపోయాయి. ఈ ఘటనలో వెయ్యి మందికి పైగా మృతిచెందగా, ఒక్కరు మాత్రమే ప్రాణాలతో బయటపడినట్లు సూడాన్ లిబరేషన్ మూవ్‌మెంట్ ఆర్మీ ఓ ప్రకటనలో తెలిపింది. శిథిలాల కింద ఉన్న మృతదేహాలను వెలికి తీయడానికి సహాయపడాలని ఐక్యరాజ్య సమితి, అంతర్జాతీయ సహాయక సంస్థలను అర్థించింది. స్థానిక అత్యవసర నెట్‌వర్క్ బృందాలు మంగళవారం తొమ్మిది మృతదేహాలను వెలికితీశాయి. అయితే ప్రతికూల వాతావరణ పరిస్థితులు, వనరుల కొరత కారణంగా సహాయక చర్యల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపాయి.

ఎస్-400ల కొనుగోలుకు రష్యాతో భారత్ చర్చలు!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: గగనతలాన్ని మరింత దుర్భేద్యం చేసే లక్ష్యంతో మనదేశం అడుగులు వేస్తోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు దడ పుట్టించిన ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థలను రష్యా నుంచి మరిన్ని కొనడానికి సిద్ధమైంది. ఈ కొనుగోళ్ల విషయంలో చర్చలు జరుగుతున్నాయని రష్యా మిలిటరీ-టెక్నికల్ కోఆపరేషన్ అధిపతి దిమిత్రీ షుగయేవ్ ధ్రువీకరించారు. టాస్ మీడియాతో ఆయన మాట్లాడుతూ "ఇప్పటికే భారత్ వద్ద ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. ఈ విషయంలో సహకారాన్ని మరింత పెంచుకునే అవకాశం ఉంది. అంటే మరిన్ని సరఫరా చేస్తాం. ప్రస్తుతానికి చర్చల దశలో ఉన్నాం" అని పేర్కొన్నారు. చైనాలో ఎస్‌సీఓ సదస్సులో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రధాని మోదీ భేటీ అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా, పాక్, చైనాల నుంచి వచ్చే ముప్పును ఎదుర్కోవడానికి 2018లోనే మన దేశం ఎస్-400 వ్యవస్థలను కొనుగోలు చేసింది. 5యూనిట్ల కోసం రూ.39 వేల కోట్లతో రష్యాతో ఒప్పందం కుదుర్చుకుంది. అయితే వాటి సరఫరా పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. 2021-23 మధ్య మూడు యూనిట్లు మన దేశానికి చేరాయి. వీటిని అదంపూర్ (పంజాబ్), తూర్పు సెక్టార్, పశ్చిమ సెక్టార్‌లో మోహరించారు. మరో రెండు రావాల్సి ఉంది. ఆ రెండింటిలో ఒకటి వచ్చే ఏడాది, మరోటి 2027లోనూ భారత్‌కు రష్యా అప్పగిస్తుందని అంచనా వేస్తున్నారు.

మహా ఆర్థిక శక్తి భారత్: పుతిన్

బీజింగ్, సెప్టెంబరు 3: భారత్ మహా ఆర్థిక శక్తి అని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసించారు. షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సులో పాల్గొన్న ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. బహుళ ధ్రువాలు ఉన్న ప్రస్తుత ప్రపంచంలో ఏ ఒక్కరి ఆధిపత్యం లేదని, అందరూ సమానమేనని తెలిపారు. బ్రిక్స్ వంటి కూటముల్లో భారత్, చైనా వంటి మహా ఆర్థిక శక్తులు ఉన్నా ప్రపంచ రాజకీయాలు, భద్రతపై ఆధిపత్యం వహించాలన్నదానిపై ఎప్పుడూ చర్చించలేదని అన్నారు. భారత్ మృత ఆర్థిక వ్యవస్థ అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శలు చేయడం, సుంకాలను పెంచడం నేపథ్యంలో పుతిన్ చేసిన ఈ వ్యాఖ్య ప్రాధాన్యం సంతరించుకొంది.

చైనా విశ్వరూపం

రాకాసి అణు క్షిపణులు.. లేజర్ ఆయుధాలు, అండర్ వాటర్ డ్రోన్లు.. ఐదోతరం యుద్ధ విమానాలు



మిలటరీ పరేడ్‌ను వీక్షించేందుకు వెళ్తున్న పుతిన్, జిన్‌పింగ్, కిమ్ జోంగ్, షెహబాజ్ షరీఫ్

» బీజింగ్ మిలిటరీ పరేడ్‌లో డ్రాగన్ ఆయుధ బల ప్రదర్శన

బీజింగ్, సెప్టెంబరు 3: భారీ అణు బాలిస్టిక్ క్షిపణులు, లేజర్ ఆయుధాలు, అండర్ వాటర్ డ్రోన్లు, ఐదో తరం యుద్ధ విమానాలు.. ఇలా ఒకటేమిటి ప్రపంచం ఎన్నడూ చూడని అత్యాధునిక ఆయుధ సంపత్తితో చైనా విశ్వరూపమే ప్రదర్శించింది. అమెరికా సుంకాల బెదిరింపుల వేళ.. తన సైనిక బలం ఏమిటో చూపించింది. బీజింగ్‌లో బుధవారం నిర్వహించిన విక్టరీ డే మిలిటరీ పరేడ్‌లో డ్రాగన్ తొలిసారిగా ప్రదర్శించిన రాకాసి అణు క్షిపణి డీఎఫ్-5సీ సహా.. పలు అత్యాధునిక ఆయుధాలను చూసి ప్రపంచదేశాలు విస్తుపోయాయి. ముఖ్యంగా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి డీఎఫ్-5సీ అందరి దృష్టినీ ఆకర్షించింది. ద్రవ ఇంధనంతో నడిచే ఈ భారీ అణు క్షిపణి రేంజి 20,000 కిలోమీటర్లకుపైనే ఉంటుందని అంచనా..! అంటే ఈ మిస్సైల్ భూగోళంపై ఎక్కడి లక్ష్యాన్నైనా ఛేదించగలదు. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ దురాక్రమణపై విజయం సాధించి 80 ఏళ్లవుతున్న సందర్భంగా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ) కవాతులో చైనా ఈ ఆయుధ ప్రదర్శనను ఏర్పాటు చేసింది. ఇందులో తొలిసారిగా అధునాతన యుద్ధ విమానాలు, ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు, ఎలక్ట్రానిక్ యుద్ధ సామగ్రిని ప్రదర్శించింది. ఈ కార్యక్రమానికి చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తోపాటు రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ సహా 26 దేశాల నేతలు హాజరయ్యారు. చైనాలో భారత రాయబారి ప్రదీప్ కుమార్ రావత్, పాకిస్థాన్ ప్రధాని షరీఫ్, నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలీ, మాల్దీవుల అధ్యక్షుడు మయిజ్జు కూడా పాల్గొన్నారు. ఈ పరేడ్‌ను 50వేల మంది ప్రజలు ప్రత్యక్షంగా వీక్షించారు.

మిస్సైళ్లలో బాహుబలి డీఎఫ్-5సీ

చైనా ఆయుధ ప్రదర్శనలో ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది డీఎఫ్-5సీ. ఇదొక బాహుబలి మిస్సైల్. దీన్ని ఒక్క వాహనంపై తరలించడం సాధ్యంకాదు. మూడు భాగాలుగా తరలించి.. ఆ తర్వాత అసెంబ్లింగ్ చేసి ప్రయోగిస్తారు. ఇది ధ్వని వేగం కంటే 10 రెట్ల వేగంతో ప్రయాణించగలదు. ఇందులో ఎంఐఆర్‌వీ వ్యవస్థను వినియోగించారు. ఇది ఒకేసారి పలు అణు, సంప్రదాయ వార్‌హెడ్‌లను మోసుకెళ్లగలదు. ఏకకాలంలో పది వేర్వేరు ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని దాడి చేయగలదు. ఈ పరేడ్‌లో డీఎఫ్-5సీ క్షిపణులతోపాటు ఎల్‌వై-1 అనే సరికొత్త లేజర్ ఆయుధం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎనిమిది చక్రాల సాయుధ ట్రక్ హెచ్‌జెడ్-155పై అమర్చిన ఈ లేజర్ ఆయుధం.. శత్రు ఆయుధాల్లోని ఆప్టికల్ సెన్సర్లను సమర్థంగా దెబ్బతీయగలదు. సముద్ర యుద్ధ నిబంధనలను ఇది కచ్చితంగా మార్చగలదని రక్షణ రంగ విశ్లేషకులు చెబుతున్నారు. లేజర్ యుద్ధాన్ని కొత్త సైనిక రంగంగా వారు పరిగణిస్తున్నారు.

- చైనా పరేడ్‌లో డాంగ్‌ఫెంగ్-61 ఖండాంతర క్షిపణిని కూడా ప్రదర్శించింది. దీని రేంజ్ 12వేల కిలోమీటర్లు. డీఎఫ్-41కు ఇది అడ్వాన్స్‌డ్ వెర్షన్.
- చైనా తొలిసారిగా ఐదో తరం యుద్ధ విమానాలను ప్రదర్శించింది. వైమానిక దళం కోసం రూపొందించిన జే-20, జే-20ఏ, జే-20ఎస్, జే-35ఏతోపాటు నేవీ కోసం జే-35 అనే ఐదు మోడళ్లను పరిచయం చేసింది. ఒక పరేడ్‌లో ఐదు మోడళ్ల అత్యాధునిక స్టెల్త్ ఫైటర్ జెట్లు కనిపించడం ప్రపంచంలో ఇదే తొలిసారని చైనా డైలీ తెలిపింది.



డాంగ్‌ఫెంగ్-61 ఖండాంతర క్షిపణి

మనిషి 150 ఏళ్లు బతకొచ్చు..!

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్.. అవయవ మార్పిడి, మనిషి దీర్ఘాయుష్షు గురించి మాట్లాడుకున్నారు. బీజింగ్‌లో జరిగిన సైనిక కవాతు సందర్భంగా జిన్‌పింగ్, పుతిన్ కలిసి నడుస్తూ మాట్లాడుకున్న ఈ మాటలు మైక్‌లో రికార్డయ్యాయి. "బయోటెక్నాలజీ రంగం అభివృద్ధి చెందుతోంది. మానవ అవయవాలను మార్పిడి చేయవచ్చు. మీరు ఎంత ఎక్కువకాలం జీవిస్తే.. అంత చిన్నవారు అవుతారు. అమరత్వాన్ని కూడా సాధించగలరు" అని పుతిన్ అనువాదకుడు చైనీస్ భాషలో చెప్పడం మైక్‌లో వినిపించింది. జిన్‌పింగ్ స్పందిస్తూ.. "ఈ శతాబ్దంలో మానవులు 150 సంవత్సరాల వరకు జీవించవచ్చని కొందరు అంచనా వేస్తున్నారు" అని చెప్పడం వినిపించింది.

ఐటీ రంగంపైనా.. ట్రంప్ సుంకాలు!

న్యూఢిల్లీ/వాషింగ్టన్, సెప్టెంబరు 3: అమెరికాకు భారత్ ఎగుమతి చేసే ఉత్పత్తులపై 50% సుంకాలను ప్రకటించిన ట్రంప్ సర్కారు దృష్టి ఇప్పుడు సమాచార సాంకేతిక(ఐటీ) రంగం, ఐటీఈఎస్, రిమోట్ వర్కర్లు, ప్రవాస భారతీయులు పంపే రెమిటెన్స్‌పై పడిందా? ఆయా సేవలపైనా సుంకాలు విధించేందుకు సిద్ధమవుతున్నారా? దీని వల్ల భారత దేశీయోత్పత్తి(జీడీపీ)లో అత్యంత కీలకమైన ఐటీ, సేవా రంగాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందా? ఈ ప్రశ్నలకు తాజా పరిస్థితులు అవుననే చెబుతున్నాయి. అమెరికా కన్జర్వేటివ్ పార్టీ ప్రతినిధి జాక్ పోసోబిక్ ఎక్స్‌లో చేసిన ఓ పోస్టును వైట్‌హౌస్‌లో శక్తిమంతమైన అధికారిగా ఉన్న వాణిజ్య, ఉత్పాదక విభాగాల సీనియర్ సలహాదారు పీటర్ నవారో రీట్వీట్ చేయడం ఈ వాదనలకు బలాన్ని చేకూరుస్తోంది. "అన్ని ఔట్‌సోర్సింగ్‌లపై సుంకం విధించాలి. విదేశాల నుంచి అమెరికాలోని కంపెనీలకు రిమోట్ సర్వీసుల(ఉద్యోగులు)పైనా ప్రివిలేజ్ కోసం సుంకాలు వేయాలి" అని పోసోబిక్ ట్వీట్ చేశారు. దాని నవారో వెంటనే రీట్వీట్ చేయడం గమనార్హం..! ఇది కార్యరూపం దాలిస్తే ఐటీతోపాటు.. ఐటీ ఆధారిత సేవారంగం(ఐటీఈఎస్), బిజినెస్ ప్రాసెస్ ఔట్‌సోర్సింగ్(బీపీవో) ద్వారా విదేశాల నుంచి రిమోట్‌గా పనిచేసే వర్కర్లు/ఉద్యోగులు, అమెరికాలోని భారతీయ ఐటీ కంపెనీల్లో పనిచేసే హెచ్-1బీ వీసాదారులు, భారత్‌కు రెమిటెన్స్ పంపే ప్రవాస భారతీయులపై తీవ్ర ప్రభావం పడుతుంది.

పుతిన్, జిన్‌పింగ్, కిమ్‌లపై ట్రంప్ ఫైర్

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉత్తరకొరియా నియంత కిమ్‌జోంగ్ ఉన్‌లపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆ ముగ్గురు అమెరికాకు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. చైనా మిలిటరీ పరేడ్‌లో జిన్‌పింగ్‌తో కలిసి కిమ్, పుతిన్, పాల్గొనడంపై ట్రంప్ నిప్పులు కురిపించారు. 'రెండో ప్రపంచయుద్ధంలో చైనా కోసం పోరాడిన అమెరికా సైనికుల త్యాగాలను జిన్‌పింగ్ గుర్తిస్తారా? లేదా? వారి త్యాగాన్ని జిన్‌పింగ్ గౌరవిస్తారని ఆశిస్తున్నాను" అన్నారు.

సైబర్ నేరాలకు వాడుతున్న 2 కోట్ల ఫోన్ కనెక్షన్లు బ్లాక్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: సైబర్ నేరాల కోసం ఉపయోగిస్తున్న 2కోట్ల ఫోన్ కనెక్షన్లను కేంద్ర టెలి కమ్యూనికేషన్స్ విభాగం(డీవోటీ)బ్లాక్ చేసింది. టెలికమ్యూనికేషన్స్ విభాగం కార్యదర్శి నీరజ్ మిత్తల్ ఈ విషయాన్ని వెల్లడించారు. బుధవారం గోవాలో నిర్వహించిన సైబర్ సెక్యూరిటీ సదస్సులో ఆయన వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు. సంచార్ సాథీ యాప్ వల్ల ఇది సాధ్యమైందన్నారు. సైబర్ నేరగాళ్లు చేసే స్పూఫ్ కాల్స్‌ను ఈ యాప్ సాయంతో 97శాతం తగ్గించామన్నారు. టెలి కమ్యూనికేషన్స్‌లో భద్రత కోసం డీవోటీ ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని, ప్రైవేటు సంస్థలతో కూడా కలిసి పనిచేస్తోందని వివరించారు.



ఖైరతాబాద్ గణేషుడి వద్ద రద్దీ

» దర్శన క్యూలైన్లలో తోపులాట.. స్పృహతప్పిన 12 మంది

» మహిళలు, వృద్ధులకు ఇబ్బందులు.. ప్రత్యేక దర్శనాలు బంద్

ఖైరతాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిమజ్జనోత్సవం దగ్గర పడుతుండడంతో ఖైరతాబాద్ గణేశుడిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. బుధవారం ఎక్కడ చూసినా గణపతి వద్దకు వచ్చే భక్తులే కనిపించారు. ఎంఎంటీఎస్, మెట్రో రైళ్లు వచ్చినపుడు అందులోంచి వందల మంది దిగి గణపతి వద్దకు వస్తుండడం కనిపించింది. వినాయకుడి దర్శనం కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. క్యూలైన్లలో రద్దీ విపరీతంగా ఉండడంతో తోపులాట జరిగింది. దర్శనానికి వీఐపీలు వచ్చిన సమయాల్లో క్యూలైన్లలో వస్తున్న భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రద్దీతో పాటు ఎండ ఎక్కువగా ఉండడంతో బుధవారం దాదాపు 12 మంది సొమ్మసిల్లి పడిపోయారు. పిల్లలు, మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. దీంతో పోలీసులు ప్రత్యేక దర్శనాలను నిలిపివేశారు.

రేపు రేషన్ దుకాణాలు బంద్

» తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం పిలుపు

పంజాగుట్ట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఈ నెల 5న రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ దుకాణాల బంద్‌కు పిలుపునిచ్చింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, సమస్యలను పరిష్కరించాలని డీలర్లు డిమాండ్ చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేశ్ బాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్ తమకు నెలకు రూ.5వేల కనీస గౌరవ వేతనం ఇస్తామని, కమీషన్ పెంచుతామని హామీ ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడి 21 నెలలు గడిచినా తమను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు పంపిణీ చేసిన కేంద్ర ప్రభుత్వ బియ్యం కమీషన్ బకాయిలతో పాటు పదేళ్లుగా పేరుకుపోయిన పాత బకాయిలను కూడా వెంటనే చెల్లించాలని కోరారు. రేషన్ డీలర్ల కుటుంబాలకు హెల్త్ కార్డులు, దుకాణాల అద్దె, బియ్యం దిగుమతి చార్జీలనూ ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు.

రుషికొండ ప్యాలెస్‌ను పిచ్చాసుపత్రిగా మారిస్తే మంచిది

» గోవా గవర్నర్ పూసపాటి అశోక్‌గజపతిరాజు

విశాఖపట్నం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): 'నగరంలోని రుషికొండపై రూ.వందల కోట్ల ఖర్చుతో నిర్మించిన భవనం వల్ల ఆదాయమేమీ రాదు. దానిని పిచ్చాసుపత్రి చేస్తే మంచిది' అని గోవా గవర్నర్ పూసపాటి అశోక్‌గజపతిరాజు అన్నారు. ఏపీలోని విశాఖలో సీతమ్మధార కల్యాణ మండపంలో బుధవారం క్షత్రియ సంక్షేమ సమితి సభ్యులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా అశోక్‌గజపతిరాజు మాట్లాడారు. 'రుషికొండ ప్యాలెస్‌ను ఏమి చేస్తే బాగుంటుంది? అని ప్రభుత్వం ప్రజాభిప్రాయం అడుగుతోంది కాబట్టి నేను ఉచిత సలహా ఇస్తున్నా. అక్కడ ఎవరిని బస చేయమన్నా నిద్ర కూడా పట్టదు. అందుకే పిచ్చి ఆస్పత్రిగా మార్చాలి. అన్ని రూ.కోట్లు పెట్టి నిర్మించిన భవనం పెచ్చులు ఊడిపోతున్నాయని తెలిసి బాధ కలిగింది. ఆ రూ.600 కోట్లు ఖర్చు చేస్తే ఉత్తరాంధ్రాకు అవసరమైన సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తయ్యేది. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన సైకో ముఖ్యమంత్రికి తప్పకుండా సముద్రపు గాలి తగులుతుంది' అని అన్నారు.

'నిన్ను.. నీ కుటుంబాన్ని చంపేస్తాం'

» త్రిపుర ఎమ్మెల్యేకు తెలంగాణ గవర్నర్ కుమారుడి బెదిరింపులు

అగర్తల, సెప్టెంబరు 3: తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కుమారుడు ప్రతీక్ దేవ్ వర్మ తనని, తన కుటుంబసభ్యులను చంపేస్తానని బెదిరించాడని ఆరోపిస్తూ త్రిపురకు చెందిన ఓ ఎమ్మెల్యే పోలీసులను ఆశ్రయించారు. త్రిపుర మోథ పార్టీ ఎమ్మెల్యే ఫిలిప్ కుమార్ రియాంగ్ ఈ ఫిర్యాదు చేశారు. రియాంగ్ ఫిర్యాదు ప్రకారం.. ఎమ్మెల్యే ఫిలిప్ కుమార్ రియాంగ్ తన కుటుంబసభ్యులతో ఓ చర్చలో ఉండగా ప్రతీక్ వర్మ సహా నలుగురు యువకులు అందులో జోక్యం చేసుకున్నారు. అక్కడి నుంచి వెళ్లిపోవాలని రియాంగ్ కోరగా దూషణలకు దిగి, బెదిరింపులకు పాల్పడ్డారు. రియాంగ్ గొంతు కోసి చంపేస్తామని, 400-500 మంది బీజేపీ కార్యకర్తలను తీసుకొచ్చి రియాంగ్, అతని కుటుంబసభ్యులను చంపేస్తామని బెదిరించారు. దీంతో రియాంగ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ప్రతీక్, ఇతర నిందితులు మంగళవారం రాత్రి పోలీసులకు లొంగిపోయారు. ఆ వెంటనే వారికి బెయిల్ మంజూరైంది.

ఎలుకలు కొరికి ఇద్దరు నవజాత శిశువుల మృతి

» ఇండోర్ ప్రభుత్వ ఆస్పత్రిలో దుర్ఘటన.. ఇద్దరు నర్సుల సస్పెన్షన్

ఇండోర్, సెప్టెంబరు 3: ఇండోర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఎలుకలు కొరికి ఇద్దరు నవజాత శిశువులు మరణించారు. గత నెల 30-31 తేదీల మధ్య రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. ఒకరి చేతిని, మరొకరి భుజాన్ని ఎలుకలు కొరికాయి. అందులో 1.2 కిలోల బరువు ఉన్న శిశువు మంగళవారం మరణించగా, మరొకరు బుధవారం మృతి చెందారు. అప్పటికే ఇన్‌ఫెక్షన్లు, ఇతర అనారోగ్యాలతో బాధపడుతున్న ఆ శిశువులను వెంటిలేటర్లపై ఉంచి చికిత్సలు అందిస్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. విషమ పరిస్థితిలో ఉన్న ఆ శిశువులను ఎలుకలు కరవడంతో వేగంగా ఆరోగ్యం క్షీణించిందని వైద్యులు అభిప్రాయపడ్డారు. దీనిపై ఎంజీఎం మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ అరవింద్ గంఘోరియా మాట్లాడుతూ ఆస్పత్రిలో భద్రత ప్రమాణాల ఉల్లంఘన జరిగిందని అంగీకరించారు. దీనిపై దర్యాప్తునకు ఉన్నత స్థాయి కమిటీని నియమించామని తెలిపారు. ఇందుకు బాధ్యులుగా గుర్తించి నైట్ డ్యూటీలో ఉన్న ఇద్దరు నర్సులను అధికారులు సస్పెండ్ చేశారు. ఎలుకలు తిరుగుతున్న విషయాన్ని వారు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురాలేదని పేర్కొన్నారు. నర్సింగ్ సూపరింటెండెంట్‌ను పదవి నుంచి తప్పించగా, ఇద్దరు నర్సింగ్ ఇన్‌ఛార్జులు, పెరిఆపరేటివ్ సర్జరీ విభాగం హెడ్‌కు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఎలుకల బెడదను నివారించాల్సిన కాంట్రాక్టు సంస్థకు రూ. లక్ష జరిమానా విధించారు.

భర్త, కుమార్తె దారుణ హత్య

ప్రియుడితో కలిసి మహిళ ఘాతుకం.. 2 నెలల క్రితం భర్తను చంపి అనారోగ్యంతో మృతిగా ప్రచారం

» ఈ నెల 2న కుమార్తె హత్య

» కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు

» వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నారనే దారుణాలు

» భూపాలపల్లి జిల్లాలో వెలుగులోకి ఘటనలు



నిందితుల అరెస్టు చూపుతున్న భూపాలపల్లి ఎస్పీ కిరణ్

కృష్ణకాలనీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తన వివాహేతర సంబంధానికి అడ్డొస్తోందని ప్రియుడితో కలిసి కన్న కూతురినే గొంతు నులిమి హత్య చేసింది ఓ మహిళ. రెండు నెలల క్రితం భర్తను కూడా ఇదే తరహాలో హత్య చేసి, అనారోగ్యం కారణంగానే అతడు మృతి చెందాడని నమ్మించింది. ఈ ఘటనలు భూపాలపల్లి జిల్లాలో ఒకేసారి వెలుగులోకి వచ్చాయి. ఆగస్టు 28న భూపాలపల్లి జిల్లాలో లభ్యమైన యువతి మృతదేహం విషయంలో పోలీసులు జరిపిన విచారణలో ఈ విస్తుపోయే విషయాలు వెల్లడయ్యాయి. భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే బుధవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. చిట్యాల మండలం ఒడితల గ్రామానికి చెందిన కప్పల కుమారస్వామి మొదటి భార్య మృతి చెందగా 24ఏళ్ల క్రితం మల్హర్ మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన కవితను రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు. చిన్న కుమార్తె హన్సిక పెళ్లి చేసుకొని ఇంట్లోంచి వెళ్లిపోగా పెద్ద కుమార్తె వర్షిణితో కుమారస్వామి, కవిత వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. ఐదేళ్ల క్రితం కుమారస్వామి పక్షవాతం బారిన పడి మంచానికి పరిమితమయ్యాడు. ఈ క్రమంలో కవితకు అదే గ్రామానికి చెందిన అవివాహితుడైన జంజర్ల రాజ్ కుమార్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరు తరచూ కలుసుకోవడాన్ని గమనించిన భర్త కుమారస్వామి భార్యను నిలదీశాడు. దీంతో కవిత అతడిని అంతమొందించేందుకు ప్రియుడు రాజ్‌కుమార్‌తో కలిసి ప్లాన్ వేసింది. జూన్ 25న కుమార్తె ఇంట్లో లేని సమయంలో కుమారస్వామిని కవిత కాళ్లు పట్టుకోగా రాజ్‌కుమార్ గొంతు నులిమాడు. దీన్ని కవిత సాధారణ మృతిగా చిత్రీకరించింది. అయితే తల్లి కవిత ప్రవర్తనను గమనిస్తూ వస్తున్న వర్షిణికి ఆమెపై అనుమానం వచ్చింది. తండ్రి అనారోగ్యంతో ఉన్నా ఆకస్మికంగా ఎలా మృతి చెందాడని కొన్ని రోజుల తర్వాత ప్రశ్నించింది. రాజ్‌కుమార్ ఇంటికి వస్తుండటంపైనా తల్లిని నిలదీసింది. దీంతో కవిత ఆమెను కూడా కడతేర్చాలని ప్రియుడితో కలిసి పథకం రచించింది. ఆగస్టు 2న అర్ధరాత్రి గాఢ నిద్రలో ఉన్న వర్షిణిని ఇద్దరు గొంతు నులిమి హత్య చేశారు. మృతదేహాన్ని గోనె సంచిలో వేసి ఒడితల గ్రామ శివారులో ప్రభుత్వ ఆస్పత్రి వెనుక చెట్ల పొదల్లో పడేశారు. ఆ తర్వాత తన కుమార్తె కనిపించడం లేదని కవిత చిట్యాల పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం ఆగస్టు 25న రాజ్‌కుమార్ తిరిగి శవాన్ని సంచిలో వేసుకొని బైక్‌పై తీసుకెళ్లి కాటారం జాతీయ రహదారి సమీపంలో పడేశాడు. శవంపై పసుపు, కుంకుమ చల్లి చుట్టూ ఇనుప మేకులు కొట్టాడు. క్షుద్ర పూజలు చేసి ఎవరో నరబలి ఇచ్చారని చిత్రీకరించే యత్నం చేశాడు. పోలీసులు శవం దగ్గర ఆధార్‌కార్డు ఆధారంగా తల్లి కవితకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న ఆమె తన బిడ్డను ఎవరో చంపేశారంటూ గుండెలు బాదుకుంటూ పోలీసులను పక్కదోవ పట్టించింది. పోలీసులు వివిధ కోణాల్లో విచారణ చేపట్టగా తల్లే కూతురిని ప్రియుడితో కలిసి హత్య చేసిందని తేలింది. కవిత, రాజ్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా.. రెండు హత్యలు తామే చేసినట్టు వారు అంగీకరించారు.

మొబైల్ గ్యాలరీలో ఆధార్, పాన్ ఫొటోలు ఉంచొద్దు

» పాస్‌వర్డ్‌లు బలంగా ఉండాలి

» ఫిక్కీ 'హ్యాక్ ప్రూఫ్'సదస్సులో సైబర్ సెక్యూరిటీ నిపుణులు రక్షిత్ టాండన్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్ గ్యాలరీల్లో ఆధార్, పాన్ కార్డుల ఫొటోలను ఉంచుకోవద్దని ప్రముఖ సైబర్ సెక్యూరిటీ నిపుణుడు రక్షిత్ టాండన్ సూచించారు. వ్యక్తిగత సమాచారానికి సంబంధించిన ముఖ్యమైన ఫొటోలు, సమాచారాన్ని డిజీలాకర్లలో భద్రపరుచుకోవాలని చెప్పారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్ఓ) ఆధ్వర్యంలో బుధవారం జరిగిన "హ్యాక్ ప్రూఫ్" సదస్సులో రక్షిత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రక్షిత్ మాట్లాడుతూ కొన్ని యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకునేటప్పుడు మొబైల్ గ్యాలరీ యాక్సెస్ తీసుకుంటాయని, అందువల్ల గ్యాలరీల్లో ఆధార్, పాన్ కార్డు ఫొటోలు ఉంచుకోవడం సురక్షితం కాదని తెలిపారు. అన్నింటికీ ఒకే పాస్‌వర్డ్ పెట్టుకోకూడదని, పాస్‌వర్డ్‌లు బలంగా ఉండాలని, పాస్‌వర్డ్‌లను ఎప్పటికప్పుడు మార్చుకోవాలని సూచించారు. అలాగే, మల్టీ ఫ్యాక్టర్ అథెంటికేషన్‌ను ఆన్ చేసుకోవాలని తెలిపారు. సైబర్ సెక్యూరిటీపై, సైబర్ నేరాలు ఎలా జరుగుతున్నాయి అనే అంశాలపై ప్రతి ఇంట్లో చర్చలు జరగాలని సూచించారు. కాగా, ఆన్‌లైన్‌లో ఎలా నడుచుకోవాలనే డిజిటల్ హైజీన్‌ను పిల్లలకు నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని రక్షిత్ టాండన్ స్పష్టం చేశారు. ఇక, ఈ కార్యక్రమంలో పాల్గొన్న సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు వినియోగించే ఫోన్ నెంబర్లకు ఇన్‌కమింగ్ సేవలు ఉండవని, కొత్త నెంబర్ల నుంచి వచ్చిన ఫోన్‌లను తీయకపోవడమే ఉత్తమం అని సూచించారు.

అప్పుడు హామీల జాతర.. ఇప్పుడు చెప్పుల జాతర!

» ఎన్నికల ముందు చెప్పి మరీ మోసం చేసిన రేవంత్

» కాళేశ్వరంతో నీటి ఇబ్బందుల్లేకుండా చేసిన కేసీఆర్: కేటీఆర్



గజ్వేల్/మర్కుక్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు హామీల జాతర చేశారని.. ఎన్నికలయ్యాక చెప్పుల జాతర మొదలైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 21 నెలల కాంగ్రెస్ ప్రభుత్వంలో అంతా అధ్వానంగా మారిందని, గతంలోనే బాగుండేదని అన్ని వర్గాల వారు అంటున్నారని చెప్పారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్‌లో భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా మణుగూరుకు చెందిన ఐఎన్‌టీయూసీ నాయకుడు ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు టీజీబీకేఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఎన్నికల ముందు హామీల జాతర.. ఎన్నికలు అయ్యాక చెప్పుల జాతరగా పాలన ఉందని రేవంత్‌రెడ్డి నిజాయితీగానే చెప్పాడన్నారు. నిజానికి గత ఎన్నికలకు తాము అతి విశ్వాసంతో వెళ్లామని, అందుకే నష్టపోయామని చెప్పారు. కేసీఆర్ అపర భగీరథుడిగా కాళేశ్వరం జలాలను 80 మీటర్ల ఎత్తు నుంచి 618 మీటర్ల ఎత్తుకు పోసి భవిష్యత్తులో తాగు, సాగునీటి ఇబ్బందులు లేకుండా చేశారని, పరిశ్రమలకు నీటిని ఇచ్చారని గుర్తుచేశారు. తెలంగాణలో కరువు వచ్చినా మేడిగడ్డ నుంచి నీళ్లు తీసుకోవచ్చన్న ఉద్దేశంతోనే కాళేశ్వరం కట్టారన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సీబీఐని మోదీ జేబు సంస్థ అని చెబితే.. రేవంత్ రెడ్డి కాళేశ్వరం కేసు విచారణను అదే సంస్థకు ఇచ్చాడని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కేసీఆర్‌పై జరుగుతున్న కుట్రలో చంద్రబాబు, మోదీ పాత్ర ఉందని ఆరోపించారు. ఖమ్మం జిల్లాలో ప్రతిసారి కేవలం ఒక్క సీటే గెలుస్తున్నామని, వచ్చే ఎన్నికల్లో అన్ని సీట్లూ గెలిచేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మన స్పర్థలను పక్కనపెట్టి తెలంగాణ ప్రజల కోసం కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

ఇందిరమ్మ ఇంటి బిల్లుకు 20వేలు లంచం

» ఏసీబీకి చిక్కిన మంచిర్యాల జిల్లా కర్ణమామిడి పంచాయతీ కార్యదర్శి

» ట్రేడ్ లైసెన్స్ జారీకి రూ.7వేలు లంచం

» రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన నిజామాబాద్ కార్పొరేషన్ ఆర్ఐ



పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి



నిజామాబాద్ కార్పొరేషన్ ఆర్ఐ శ్రీనివాసచారి

హాజీపూర్, నిజామాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి బిల్లుకు సంబంధించిన పనికి రూ.20 వేలు లంచం తీసుకున్న ఓ పంచాయతీ కార్యదర్శి, ట్రేడ్ లైసెన్స్ జారీకి రూ.7వేలు తీసుకున్న ఓ ఆర్ఐ ఏసీబీకి బుధవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. మంచిర్యాల జిల్లాలో జరిగిన ఘటనలో ఇందిరమ్మ ఇంటి మొదటి దఫా బిల్లు కోసం రూ.20వేలు లంచం వసూలు చేసిన మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని కర్ణమామిడి పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి ఏసీబీకి చిక్కారు. ఇందుకు సంబంధించి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు పునాది వరకు నిర్మాణం చేపట్టిన తర్వాత పంచాయతీ కార్యదర్శి ఫొటో తీసి ఉన్నతాధికారులకు పంపిస్తే మొదటి దఫా బిల్లు మంజూరు అవుతుంది. అయితే, ఫొటో తీసి దానిని పైఅధికారులకు పంపించేందుకు డొల్క నాగమణి అనే లబ్ధిదారు వద్ద కర్ణమామిడి పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి రూ.30 వేలు లంచం డిమాండ్ చేశారు. నాగమణి బ్రతిమలాడగా రూ.20వేలకు అంగీకరించాడు. అయితే, లంచం ఇవ్వడం ఇష్టం లేని నాగమణి ఏసీబీని ఆశ్రయించారు. ఈ క్రమంలో నాగమణి నివాసానికి వచ్చిన వెంకటస్వామి రూ.20 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వెంకటస్వామి ఏసీబీకి చిక్కాడనే విషయం తెలుసుకుని గ్రామానికి చెందిన పలువురు నాగమణి ఇంటి వద్దకు చేరుకున్నారు. వేర్వేరు పనుల కోసం వెంకటస్వామి తమ వద్ద కూడా లంచాలు తీసుకున్నాడని దాదాపు 30 మంది ఏసీబీ అధికారుల వద్ద వాపోయారు. ఆధారాలతో వస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు వారికి చెప్పారు. మరోపక్క, వెంకటస్వామి ఏసీబీకి పట్టుబడడంతో గ్రామంలో సంబురాలు జరుపుకున్నారు.

ట్రేడ్ లైసెన్స్‌కు రూ.7 వేలు లంచం

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ విభాగంలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్, ఇన్‌చార్జి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఆర్ఐ) శ్రీనివాసచారి ట్రేడ్ లైసెన్స్ జారీకి రూ.7000 లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. నిజామాబాద్‌కు చెందిన ఆర్మీ మాజీ జవాన్ ఒకరు ట్రేడ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోగా.. లైసెన్స్ మంజూరుకు శ్రీనివాసచారి రూ.10వేలు డిమాండ్ చేశారు. దీంతో ఆ మాజీ జవాను ఏసీబీని ఆశ్రయించాడు. ఈ క్రమంలో మాజీ జవాను నుంచి శ్రీనివాసచారి రూ.7వేలు లంచం తీసుకుంటుంగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. గతంలో బోధన్‌లో పని చేసిన శ్రీనివాసచారి అప్పట్లో రూ.25వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడినట్లు తెలిసింది.

అంగన్‌వాడీల్లో నైపుణ్యం పెంచాలి

» పిల్లల తొలి టీచర్ అంగన్‌వాడీ కార్యకర్తలే

» కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: అంగన్‌వాడీల్లో నిర్మాణాత్మక శిక్షణా విధానాన్ని మరింత మెరుగుపర్చాల్సి ఉందని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. ఇందుకోసం అంగన్‌వాడీలు తమ నైపుణ్యాలను పెంచుకోవాలని ఆయన సూచించారు. పిల్లల తొలి టీచర్ అయిన అంగన్‌వాడీ కార్యకర్తలు నిరంతరం మెరుగుపరుచుకోవడంపైనా, ఉన్నత విద్యాభ్యాసంపైనా దృష్టి పెట్టాలని కేంద్ర మంత్రి ఆకాంక్షించారు. ప్రాథమిక పాఠశాల ఆవరణల్లోనే అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి మార్గదర్శకాల విడుదల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్త్రీశిశు సంక్షేమ శాఖా మంత్రి అన్నపూర్ణా దేవితో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాలల్లోనే అంగన్‌వాడీల ఏర్పాటుకు సంబంధించి ఉపాధ్యాయులు, టీచర్లు ఉమ్మడిగా అమలు చేయాల్సిన ప్రణాళికలు, పాఠ్యాంశాలను రూపొందించుకోవడం, స్నేహపూర్వక అభ్యాసన పద్ధతులు పాటించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న 14 లక్షల అంగన్‌వాడీల్లో ఇప్పటికే 2.9 లక్షల కేంద్రాలు పాఠశాలల ఆవరణల్లోనే కొనసాగుతున్నాయి. అయితే, ఒకే ఆవరణ లోఉన్నా.. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల మధ్య ఎలాంటి పరస్పర సహకారమూ ఉండడం లేదని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ రెండిటి మధ్య పరస్పర సహకారానికి ఒక వ్యవస్థను నెలకొల్పాల్సి ఉంద న్నారు. అవకాశం ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలన్నింటిలో అన్ని వసతులూ కల్పించి ప్రాథమిక పాఠశాలల్లోకి మార్చేయడం, అలా మార్చడానికి వీలుకాని కేంద్రాలను సమీప పాఠశాలలకు అనుసంధానించడం అనే రెండు పద్ధతుల్లో దీనిని అమలు చేస్తారని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

» వెంట వచ్చిన ముగ్గురు పిల్లల అదృశ్యం



వెంకటేశ్వర్లు (ఫైల్), అదృశ్యమైన చిన్నారులు

వెల్దండ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ముగ్గురు పిల్లలతో కలిసి ఇంటి నుంచి బయలుదేరిన తండ్రి.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శ్రీశైలం-హైదరాబాద్ రహదారిపై జరిగింది. అతని వెంట వచ్చిన పిల్లల ఆచూకీ మిస్టరీగా మారింది. ఏపీలోని ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం బోయలపల్లి గ్రామానికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు(35), దీపిక భార్యాభర్తలు. వీరికి కూతుళ్లు మోక్షిత(8), వర్షిణి(6)లతో పాటు కుమారుడు శివధర్మ(4) ఉన్నారు. భార్యాభర్తల కలహాలతో ఆగస్టు 30న వెంకటేశ్వర్లు తన పిల్లల్ని తీసుకుని ఎవరికీ చెప్పకుండా బయలుదేరాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. వెంకటేశ్వర్లు శ్రీశైలం మీదుగా అచ్చంపేటలోని హాజీపూర్ వద్దకు చేరుకున్నాడని సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా గుర్తించారు. అనంతరం కొనేటిపురం వద్ద ఉన్న టోల్‌గేట్ వద్ద సీసీ కెమెరా పరిశీలించగా వాహనంపై తండ్రితో పాటు ఒక్క కూతురు మాత్రమే ఉన్నట్లు పోలీసులు గమనించారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం పెద్దాపూర్ సమీపంలో వెంకటేశ్వర్లు మృతదేహాన్ని గుర్తించారు. వెంట వచ్చిన ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుని జాడ తెలియలేదు.

రామచరితమానస్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు

» యూపీ మాజీ మంత్రి స్వామి ప్రసాద్ మౌర్యపై కేసు

వారాణసీ, సెప్టెంబరు 3: రామచరితమానస్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన ఉత్తరప్రదేశ్ మాజీ మంత్రి స్వామి ప్రసాద్ మౌర్యపై వారాణసీలో ఎఫ్ఐఆర్ నమోదైంది. స్థానిక కోర్టు ఆదేశాలమేరకు కంటోన్మెంట్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఇండియన్ పీనల్ కోడ్‌లోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. 2023 జనవరి 22న ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో పాల్గొన్న సందర్భంగా మౌర్య.. హిందూ గ్రంథం రామచరితమానస్ దాని రచయిత తులసీదాస్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్టు పిటిషనర్ న్యాయవాది అశోక్ కుమార్ పేర్కొన్నారు. 'కోట్లాది మంది దీనిని చదవరు. ఇదంతా అర్థంలేనిది. తన సంతోషం కోసం రామచరితమానస్‌ను తులసీదాస్ రాశారు' అని వ్యాఖ్యానించారన్నారు. గ్రంథంలోని అభ్యంతరకర భాగాలను తొలగించాలని లేదా దానిని పూర్తిగా నిషేధించాలని కూడా మౌర్య డిమాండ్ చేశారని కుమార్ పేర్కొన్నారు.

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు యూపీఎస్సీ నిర్ణయం

» శతాబ్ది వేడుకల సందర్భంగా నెలకొల్పే యోచన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: పోటీ పరీక్షల నిర్వహణలో అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను పదిలపరిచి, మరింతగా విస్తరించడం కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) ఏర్పాటు చేయాలని యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (యూపీఎస్సీ) నిర్ణయించింది. యూపీఎస్సీ, రాష్ట్రాల పబ్లిక్ సర్వీసు కమిషన్లకు విజ్ఞాన కేంద్రంగా పనిచేసేలా దీన్ని నెలకొల్పనుంది. ఉత్తమ విధానాలను సంరక్షించడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, ప్రామాణిక నిర్వహణ ప్రక్రియలను రూపొందించడం కోసం దీన్ని ఏర్పాటు చేయనుంది. యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈ కేంద్రాన్ని నెలకొల్పనున్నట్టు చైర్మన్ అజయ్ కుమార్ బుధవారం వెల్లడించారు. శతాబ్ది ఉత్సవాలపై యూపీఎస్సీ సభ్యులు దినేష్ దాస, అనురాధా ప్రసాద్‌లతో కలిసి రాష్ట్రాల పబ్లిక్ సర్వీసు కమిషన్ చైర్మన్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఈ కేంద్రం ఏర్పాటు ప్రతిపాదనను ప్రస్తావించారు. ఇందుకోసం సూచనలు ఇవ్వాలని కోరారు. 1926 అక్టోబరు 1న యూపీఎస్సీ ని నెలకొల్పారని తెలిపారు. 2025 అక్టోబరు 1 నుంచి 2026 అక్టోబరు 1 వరకు ఏడాది పాటు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

చేపల వేటకు వెళ్లి భార్యాభర్తల గల్లంతు

గద్వాల/మల్దకల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం తాటికుంట రిజర్వాయర్‌లో చేపల వేటకు వెళ్లిన భార్యాభర్తలు గల్లంతు అయ్యారు. తాటికుంట గ్రామానికి చెందిన బోయ దుబ్బోనిబాయి రాముడు (37), భార్య సంధ్య(33)లు ఉన్న కొద్దిపాటి భూమి రిజర్వాయర్‌లో పోవడంతో వారు చేపల వృత్తిని ఎంచుకొన్నారు. మంగళవారం సాయంత్రం రిజర్వాయర్‌లో వల వేయడానికి వారిద్దరూ పుట్టిలో వెళ్లారు. వల వేసే క్రమంలో ప్రమాదవశాత్తు రిజర్వాయర్‌లో పడిపోయారు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు రిజర్వాయర్ దగ్గరికి రాగా వారి మోటార్ బైక్, చెప్పులను గుర్తించారు. దీంతో వెంటనే రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. తెల్లారేలోపే రెండు ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు రిజర్వాయర్‌లోకి దిగాయి. వారితో పాటు గజ ఈతగాళ్లు దిగారు. కానీ బుధవారం సాయంత్రం వరకు వారి ఆచూకీ లభ్యం కాలేదు. ఈ సంఘటనపై జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ ఎప్పటికప్పుడు అధికారులతో పర్యవేక్షించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆపదలో అఫ్ఘాన్

కుంగదీసే పేదరికం, కనికరం లేని ప్రకృతి, ఆంక్షల కట్టడిలో పాలకులు... అఫ్ఘానిస్తాన్‌ను సదా విడీవిడవని విషాదాలు. విశాల ప్రపంచం ఒక దోసెడు తీరుబాటు చేసుకుని ఆపదలో ఉన్న అఫ్ఘాన్ పట్ల ఒక జానెడు సానుభూతి చూపవలసిన ఆపత్సమయమిది.

నాలుగు సంవత్సరాల క్రితం అఫ్ఘానిస్తాన్‌లో ప్రజాస్వామిక ప్రభుత్వం కూలిపోయింది. మతఛాందసులైన తాలిబన్లు మళ్లీ అధికారాన్ని కైవసం చేసుకున్నారు. రాజ్యాంగాన్ని రద్దు చేశారు. పౌర హక్కులను కాలరాచి వేశారు. ఇస్లామిక్ చట్టాలను ఔదలదాల్చారు. ప్రపంచ దేశాల నుంచి సహాయ సహకారాలు నిలిచిపోయాయి. డోనాల్డ్ ట్రంప్ మళ్లీ అధికారానికి వచ్చిన తరువాత అమెరికా నుంచి అందుతున్న మానవతాపూర్వక సహాయమూ పూర్తిగా నిలిచిపోయింది. అఫ్ఘాన్ ప్రజల ఆర్థిక అవస్థలు మరింతగా మిక్కుటమయ్యాయి. ముఖ్యంగా ఆరోగ్య భద్రతా సదుపాయాలు పూర్తిగా కూలబడ్డాయి. తాలిబన్ల పాలనకు న్యాయబద్ధత కల్పించకుండా అఫ్ఘాన్ ప్రజలను ఆదుకోవడమెలా అనే విషయమై అనేక దేశాలు తర్జనభర్జన పడుతున్న తరుణంలో ఆ దేశంపై ప్రకృతి మరొకసారి ఆగ్రహించింది.

ఆదివారం రాత్రి అఫ్ఘానిస్తాన్‌కు ఒక కాళరాత్రి. అఫ్ఘాన్ తూర్పు ప్రాంతంలో సంభవించిన భూ ప్రళయంలో వందలాది ప్రజలు చనిపోయారు. వేలాది జనులు గాయపడ్డారు. రిక్టర్ స్కేల్‌పై 6.3 తీవ్రతతో నమోదైన ఈ భూకంప ప్రభావిత ప్రదేశం మారుమూల, దుర్భేద్యమైన పర్వత శ్రేణుల మధ్య ఉండడంతో పాటు అక్కడి గృహాలు భూకంప తాకిడికి తట్టుకునేవి కాకపోవడంతో మృతుల సంఖ్య మరెంతో అధికంగా ఉండవచ్చు.

అఫ్ఘానిస్తాన్‌కు భూకంపాలు అరుదు కాదు. తరచుగా ప్రాణాంతక భూకంపాలు సంభవించే దేశమది. ముఖ్యంగా ఈశాన్య అఫ్ఘాన్ ఈ ప్రాకృతిక విపత్తులకు నెలవుగా ఉన్నది. రెండు భిన్న టెక్టానిక్ ప్లేట్లు కలిసే హిందూ కుష్ పర్వత ప్రాంతంలో ఉన్న కారణంగా ఈశాన్య అఫ్ఘాన్ భూకంపాల తాకిడికి తరచు గురవుతోంది. 2023 అక్టోబర్‌లో హెరాత్ రాష్ట్రంలో సంభవించిన పెను భూకంపమే అందుకొక తార్కాణం.

అప్పుడూ ఇప్పుడూ సంభవించిన ప్రాణనష్టం, ఆస్తినష్టం తక్కువేమీకాదు. అయితే అఫ్ఘాన్‌లో వలే పలు ఇతర దేశాలలో కూడా అంతే తీవ్రతతో సంభవిస్తున్న భూకంపాలలో ప్రాణ నష్టం, ఆస్తినష్టం తక్కువగా ఉంటోంది. అఫ్ఘాన్‌లో ఆ నష్టాలు భారీగా ఉండడానికి కారణమేమిటి?

'భూకంపాలు మనుషులను చంపవు, భవనాలు చంపుతాయి' అని అంటారు. భవనాల నిర్మాణ వైఫల్యం వల్లే భూకంపాల సమయంలో మనుషులు చనిపోవడం లేదా గాయపడడం జరుగుతుందనే వాదన భద్రతా నియమాలను పాటించకుండా నిర్మించిన భవనాలకు వర్తిస్తుంది. ఇది ఒక సరళీకృత వాదనే అయినప్పటికీ అది సూచిస్తున్న వాస్తవం కొట్టివేయలేనిది. ప్రస్తుత అఫ్ఘాన్ భూకంపం మాదిరిగానే 2011లో న్యూజీలాండ్‌లో అంతే తీవ్రతతో సంభవించిన భూ విపత్తులో కేవలం 185 మందే చనిపోయారు. ఆస్తినష్టమూ తక్కువే. ధరిత్రి దక్షిణ అంచున ఉన్న దక్షిణ అమెరికా దేశమైన చిలీలో సైతం రిక్టర్ స్కేల్‌పై 6కు మించిన తీవ్రతతో భూకంపాలు తరచు సంభవిస్తుంటాయి. అయినా ప్రాణనష్టం, ఆస్తినష్టం తక్కువగా ఉంటుంది. ప్రాణనష్టం అసలు ఉండని సందర్భాలే ఎక్కువ అని కూడా చెప్పవచ్చు. భవన నిర్మాణ నిబంధనలు కచ్చితంగా పాటించడం వల్లే ఆ ప్రమాదాలను సమర్థంగా ఎదుర్కోగలుగుతున్నారు. మరి అఫ్ఘాన్‌లో పరిస్థితి భిన్నంగా ఉండడానికి అక్కడి పేదరికమే కారణమని మరి చెప్పనవసరం లేదు.

ఆధునిక భవన నిర్మాణ సామగ్రిని ఉపయోగించుకోగల ఆర్థిక సామర్థ్యం అఫ్ఘాన్లకు లేదు. స్థానికంగా లభించే మట్టి, రాళ్లు, కలపను ఉపయోగించుకున్న గృహాలే అత్యధికంగా ఉంటాయి. ఈ కారణంగానే ఆదివారం రాత్రి భూకంపానికి వేలాది గృహలు నేలమట్టమయ్యాయి. ఆ గృహాలేవీ ఇంజనీర్లు రూపొందించిన ప్రణాళికల ప్రకారం నిర్మాణమయినవి కావు. భవన నిర్మాణ నిబంధనలకు విరుద్ధరీతుల్లో కట్టుకున్న ఇళ్లు అవి. మరి తక్కువ తీవ్రతతో సంభవించిన భూకంపానికి సైతం కూలిపోవడంలో ఆశ్చర్యం లేదు. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని వారి ఆర్థిక స్థితిగతులకు అనుకూలంగా ఉండే గృహ నిర్మాణ పద్ధతులను ప్రోత్సహించవలసిన అవసరమున్నది. ప్రస్తుత విపత్తు వేళ అఫ్ఘాన్‌కు మన దేశం అందించే సహాయంలో ఆ సులభ, సరళ సాంకేతికతలూ ఉండవలసిన అవసరమున్నది.


పేద ప్రజలకు ముఖ్యంగా భూకంపాల తాకిడి ఎక్కువగా ఉండే ప్రాంతాలలో భద్రమైన గృహ వసతి కల్పనకు వినూత్న పద్ధతులను అభివృద్ధిపరిచిన స్ట్రక్చరల్ ఇంజనీర్ ప్రొఫెసర్ ఆనంద్ స్వరూప్ ఆర్య (1931–2019)ను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవలసి ఉన్నది. అఫ్ఘాన్‌కు కానుకగా కాబూల్‌లో పార్లమెంటు భవనాన్ని నిర్మించిన భారత్, ఇప్పుడు భూకంప బాధిత ప్రాంతాలలో ప్రొఫెసర్ ఆనంద్ నిర్దేశించిన పద్ధతులలో వందలాది గృహాలు నిర్మించి అఫ్ఘాన్లను ఆదుకోవడం సముచితంగా ఉంటుంది.

రోహిత్ వేముల చట్టం ఎలా ఉండాలి?

ఒక విద్యార్థి విషాద మరణం ఉన్నత విద్యా వ్యవస్థలో లోతుగా పాతుకుపోయిన సంక్షోభాన్ని ఎత్తి చూపింది. అతని పేరు మీద ప్రతిపాదించబడిన ఒక కొత్త చట్టం ఉన్నత విద్యా వ్యవస్థలో కుల వివక్షను పరిష్కరించడానికి ఆశను కల్పిస్తోంది. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలలో పరిశీలనలో ఉన్న రోహిత్ వేముల చట్టాలు కుల వ్యవస్థపై పోరాటంలో గొప్ప ముందడుగు.

హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో రీసెర్చ్ స్కాలర్ అయిన రోహిత్ వలెనే, 2004 నుంచి ఉన్నత విద్యా సంస్థలలో 50మందికి పైగా విద్యార్థులు సామాజిక బహిష్కరణ, వివక్ష కారణంగా ఆత్మహత్య చేసుకున్నారు. దేశంలో ఇంకా కుల వివక్ష కొనసాగుతూనే ఉంది. 2018–2023 మధ్య ఎస్సీ ఎస్టీ ఓబీసీ వర్గాలకు చెందిన 13,600 మందికి పైగా విద్యార్థులు కేంద్ర ఉన్నత విద్యా సంస్థల నుంచి మధ్యలోనే చదువు మానేశారని పార్లమెంటులో తెలియజేశారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల (అత్యాచారాల నిరోధక) చట్టం, 1989, కుల ఆధారిత హింసను, వివక్షను నేరంగా పరిగణిస్తున్నది. అయితే, దీని పరిధి ప్రధానంగా బహిరంగంగా జరిగే అత్యాచారాలకు మాత్రమే పరిమితం. ఉన్నత విద్యలో సూక్ష్మ రూపాల్లో ఉండే వివక్షను ఇది పరిష్కరించలేదు.

రోహిత్ వేముల, పాయల్ తడ్వీల తల్లులు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంలో, భారత సుప్రీంకోర్టు ఏప్రిల్ 26, 2025న, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌కి 'యూజీసీ (ఉన్నత విద్యా సంస్థలలో సమానత్వ) నిబంధనలు–2025'ను నోటిఫై చేయడానికి అధికారం ఇచ్చింది. మొదటిసారిగా 'కుల–ఆధారిత వివక్షను నిర్వచించిన ఈ నిబంధనల ప్రకారం ఫిర్యాదులను స్వీకరించి, దిద్దుబాటు చర్యలను సిఫార్సు చేయడానికి సమానత్వ కమిటీలను ఏర్పాటు చేయాలి. బాధిత విద్యార్థుల కోసం ఆన్‌లైన్ ఫిర్యాదుల పోర్టల్, హెల్ప్ లైన్ కూడా ప్రతిపాదించబడ్డాయి.



తెలంగాణ రోహిత్ చట్టం కేవలం కర్ణాటక చట్టాన్ని అనుకరించకుండా, మరింత లోతైన, నిర్మాణాత్మక పరిష్కారాలను అందించాలి. ముఖ్యంగా, విశ్వవిద్యాలయాలలో కనిపించకుండా పాతుకుపోయిన 'ర్యాంక్ సంస్కృతి'పై దృష్టి పెట్టాలి. విద్యార్థులకు కుల గోప్యతా హక్కు కూడా కల్పించాలి. ప్రవేశాల కోసం, కుల ధ్రువీకరణ పత్రాలు, ర్యాంక్ వివరాలను అధ్యాపకులకు కనిపించని ప్రత్యేక పరిపాలనా విభాగం నిర్వహించాలి.

ఈ దిశగా కర్ణాటక, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలు ప్రతిపాదిస్తున్న రోహిత్ వేముల చట్టాలు కొత్త నమ్మకాన్ని కలిగిస్తున్నాయి. కర్ణాటక– రోహిత్ వేముల బిల్లు కుల వివక్షకు శిక్షలను ప్రతిపాదిస్తున్నది. అయితే, శిక్షలతో పాటు నివారణకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలి. చట్టం నిజమైన బలం శిక్షించడంలో లేదు. కుల వివక్షకు అవకాశం లేని విద్యా వ్యవస్థను సృష్టించడంలో ఉంది. భారతదేశంలో కులం ఎప్పుడూ కనిపించదు, వినిపిస్తుంది. ఇంటిపేర్లు, 'మీ ర్యాంక్ ఎంత?', 'మీ బ్యాక్‌గ్రౌండ్ ఏమిటి?' వంటి ప్రశ్నల ద్వారా కులం బయటపడుతుంది. ఈ సాధారణ పలకరింపులు శతాబ్దాల అణచివేతను మోసుకొస్తాయి. తరగతి గదులు, సర్టిఫికెట్లు, రోజువారీ సంభాషణలలో ప్రతిధ్వనిస్తాయి.

తెలంగాణ రోహిత్ చట్టం కేవలం కర్ణాటక చట్టాన్ని అనుకరించకుండా, మరింత లోతైన, నిర్మాణాత్మక పరిష్కారాలను అందించాలి. ముఖ్యంగా, విశ్వవిద్యాలయాలలో కనిపించకుండా పాతుకుపోయిన 'ర్యాంక్ సంస్కృతి'పై దృష్టి పెట్టాలి. భారతీయ విశ్వవిద్యాలయాలలో ర్యాంక్ సంస్కృతి ఒక క్లిష్టమైన సమస్య. జేఈఈ, నీట్, ఇతర పోటీ పరీక్షల ప్రవేశ పరీక్ష ర్యాంకులు జీవితకాల గుర్తింపుగా మారి, అంతరాలను శాశ్వతం చేస్తున్నాయి. అగ్ర ర్యాంకులు సాధించిన విద్యార్థులు వాటిని తమ ఆధిక్యతకు చిహ్నంగా భావిస్తారు. తక్కువ ర్యాంకులను రిజర్వేషనుతో ముడిపెడతారు. అడ్మిషన్లు పూర్తయిన తర్వాత ర్యాంకుల ప్రాముఖ్యత లేకపోయినా, అవి బహిరంగ చర్చలలో ఉంటాయి. అదేవిధంగా, నోటీసు బోర్డులు, హాజరు పట్టికలు లేదా సర్టిఫికెట్లపై ఇంటిపేర్ల ద్వారా కుల గుర్తింపులను బహిరంగంగా ప్రదర్శించడం కూడా తీవ్రమైన సమస్య. అడ్మిషన్ల తర్వాత ర్యాంకులను గోప్యంగా ఉంచాలని కొత్త చట్టాలు ఆదేశించాలి. విశ్వవిద్యాలయాలు వెబ్‌సైట్లలో, బ్రోచర్లలో, బహిరంగ వేదికలపైనా ర్యాంకులను ప్రకటించడం నిషేధించాలి. విద్యా ప్రాంగణాలలో అధికారిక, అనధికారిక సంభాషణలలో ర్యాంకుల ప్రస్తావన రాకూడదు. ఇది విద్యార్థులపై జీవితకాల ర్యాంకుల భారాన్ని తగ్గిస్తుంది.

ఈ చట్టం ద్వారా విద్యార్థులకు కుల గోప్యతా హక్కు కూడా కల్పించాలి. అన్ని కులాల విద్యార్థులకు బహిరంగ రికార్డుల నుంచి కులాన్ని సూచించే ఇంటిపేర్లను స్వచ్ఛందంగా తొలగించుకునే అవకాశం ఇవ్వాలి. డిజిటల్ వ్యక్తిగత డేటా ప్రొటెక్షన్ చట్టం, 2023కి అనుగుణంగా కఠినమైన డేటా గోప్యతా నిబంధనలు రూపొందించాలి. కులం, ర్యాంక్ వివరాలను సున్నితమైన వ్యక్తిగత సమాచారంగా పరిగణించి, వాటిని కేవలం రిజర్వేషన్ ప్రయోజనాల కోసం అధీకృత సిబ్బందికి మాత్రమే అందుబాటులో ఉంచాలి.

ప్రవేశాల కోసం, కుల ధ్రువీకరణ పత్రాలు, ర్యాంక్ వివరాలను అధ్యాపకులకు కనిపించని ప్రత్యేక పరిపాలనా విభాగం నిర్వహించాలి. విశ్వవిద్యాలయాలు యాక్సెస్ నియంత్రణలతో సురక్షిత డేటాబేస్‌లను అమలు చేయాలి, డేటా ఎన్‌క్రిప్ట్ చేయబడిందని నిర్ధారించుకోవాలి.

ప్రతిపాదిత రోహిత్ చట్టాలు– విద్యా సంస్థల్లో అన్ని కుల నేపథ్యాల విద్యార్థులకు సామాజిక అసమానతలు లేని సమాన అవకాశాలను అందించే భవిష్యత్తును సృష్టించాలి.

○ శ్రీనివాస్ మాధవ్
సమాచార హక్కు పరిశోధకులు

డిగ్రీలు చాలవు! నైపుణ్యాలే కీలకం!

ఉద్యోగాల్లో స్థిరపడాలని, ఉన్నత భవిష్యత్తుకు దారులు వేసుకోవాలని ఏటా కొన్ని లక్షల మంది పట్టభద్రులు కలలు కంటుంటారు. అయితే కళాశాలల నుంచి కార్యాలయాల వరకు ప్రస్థానం అంత తేలికగా జరగడం లేదు. వాస్తవం ఏమిటంటే– దేశంలో అటు ఉద్యోగాలూ ఉన్నాయి, ఇటు పట్టభద్రులైన ఆశావహులూ ఉన్నారు. కానీ ఈ రెండింటి మధ్య పొంతనే కుదరడం లేదు. భారతదేశంలో ఉన్నది నిరుద్యోగ సమస్య కాదు; ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు లేని సమస్య!

ఇటీవలే విడుదలైన 'ఇండియా స్కిల్స్ రిపోర్ట్ – 2025' ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. 2024 నివేదిక ప్రకారం మన పట్టభద్రుల్లో 51శాతం మంది మాత్రమే ఉద్యోగం చేసేందుకు అవసరమైన అర్హతలు కలిగి ఉన్నారు. ఆందోళనకరమైన అంశం ఏమిటంటే– 8.25 శాతం మంది మాత్రమే చదువుకున్న విషయాలకు సంబంధించిన ఉద్యోగాలు చేస్తున్నారు. మిగిలిన వారంతా విద్యార్హతలతో సంబంధం లేని పనుల్లో స్థిరపడుతున్నారు. లేదా తక్కువ వేతనాలతో రాజీ పడిపోతున్నారు. డిగ్రీలు ఉద్యోగాల దిశగా దారి చూపడం లేదు.

దేశంలో బాగా వృద్ధి చెందుతున్న రంగాల్లో ఉద్యోగాలకు కొదవ లేనేలేదు. 2030 నాటికి దేశీ ఫార్మా రంగం విలువ పది లక్షల కోట్ల రూపాయలకు చేరుతుంది. కానీ ఈ రంగం నిత్యం ప్రతిభావంతుల కొరతను కూడా ఎదుర్కొంటున్నది. ప్రొడక్షన్, డాక్యుమెంటేషన్, రెగ్యులేటరీ, కంప్యూటర్ పరిజ్ఞానం, హ్యాండ్స్ ఆన్ ల్యాబ్ లాంటి అంశాల్లో శిక్షణ పొందిన అభ్యర్థులు లేరని కంపెనీలు చెబుతున్నాయి. ఈ రంగాల్లో లక్షల మందికి ఉపాధి కల్పించేందుకు అవకాశం ఉన్నా 30శాతం వరకూ ఖాళీలు భర్తీ కాకుండా మిగిలిపోతున్నాయి.

బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగాల్లో మరీ ముఖ్యంగా డిజిటల్ బ్యాంకింగ్, కస్టమర్ అడ్వైజరీ, ఇన్స్యూరెన్స్ సేల్స్ ఉద్యోగాలకు భారీ ఎత్తున నియామకాలు జరుగుతున్నా 40శాతం మంది ఆశావహుల అర్హతలు ఈ ఉద్యోగ అవసరాలకు సరిపోవడం లేదు. డిగ్రీలు, మంచి అకడెమిక్ రికార్డు ఉన్నప్పటికీ చాలా మందికి ఆర్థిక వ్యవహారాలు, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్, సాఫ్ట్ స్కిల్స్ వంటి అంశాల్లో తగినంత అవగాహన ఉండటం లేదు. ఇదేదో కొందరికి ఉద్యోగాలు రాకుండా పోవడం అన్న సమస్య కాదు. ఇది ఒక నిశ్శబ్ద ఆర్థిక సంక్షోభం. ఈనాడు యువత నిరుద్యోగాన్ని ఎదుర్కోవడం అంటే, పరిశ్రమల్లో అవసరానికి తగ్గ ప్రావీణ్యం లేకపోవటంగా అర్థం చేసుకోవాలి.

ఈ సమస్యకు మూలాలు ఎక్కడ? దేశంలోని రెండవ మూడవ తరగతి నగరాల్లోని ఉన్నత విద్యా సంస్థలు వాస్తవిక జ్ఞానం కంటే సైద్ధాంతిక జ్ఞానానికే ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నాయి. పరిశ్రమలకు కావాల్సింది ఏమిటి– కమ్యూనికేషన్, అనలిటిక్స్ లేదా ఆయా రంగాలకు అవసరమైన అంశాలు. కానీ విద్యా సంస్థలు ఈ అంశాల్లో ఏ మాత్రం శిక్షణ ఇవ్వటం లేదు.



నేడు విద్యార్థులకు డిగ్రీ ఒక పునాది మాత్రమే. ఇంకా పైకి ఎదగాలంటే నైపుణ్యాలు అనే నిచ్చెన వాడాల్సిందే. విధానపరమైన మద్దతు ఉంటే నైపుణ్యాల వృద్ధిని విస్తృత స్థాయిలో చేపట్టవచ్చునని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే రుజువు చేసింది. అయితే ఇప్పుడు చొరవ కావాల్సింది యువ పట్టభద్రుల వైపు నుంచే. ఉద్యోగాల అన్వేషణతోపాటు, వాటికి తగ్గ నైపుణ్యాలు తమలో ఉన్నాయా అని కూడా వారు ఆలోచించడం మొదలుపెట్టాలి.



శోచనీయమైన అంశం ఏమిటంటే ఇక్కడ తెలివికి కొరత లేదు, కానీ మార్గదర్శనం మాత్రం తక్కువ. ఏ రంగాల్లో డిమాండ్ ఉంది, అవసరమైన నైపుణ్యాలు ఏమిటి, వేతనాలు ఎలా ఉన్నాయి... తదితర విషయాల పట్ల చాలా మంది పట్టభద్రులకు కూడా అవగాహన ఉండటం లేదు. ఇంకోలా చెప్పాలంటే ఏ నైపుణ్యాలు సమకూర్చుకుంటే తమకు ఉద్యోగం వస్తుందన్నది తెలియటం లేదన్నమాట.

నైపుణ్యలేమి సమస్యపై దేశంలోని పలు రాష్ట్రాలు ఇంకా ప్రణాళిక దశలోనే ఉన్న తరుణంలో తెలంగాణ ఈ సమస్యకు అసలైన పరిష్కారాన్ని అమలు చేస్తోంది. తొలుత ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో కృత్రిమ మేధను ఒక బోధనాంశంగా ప్రవేశపెట్టిన తొలి రాష్ట్రం తెలంగాణనే. ఫలితంగా పాఠశాల, ఇంటర్మీడియట్ దశల్లోనే విద్యార్థులు కృత్రిమ మేధకు సంబంధించిన ప్రాథమిక అంశాలు, తర్కం నేర్చుకునే వీలు ఏర్పడింది. టెక్ ఆధారిత ప్రపంచంలో ముందడుగు వేసే మార్గం ఇదే. టీ–ఫైబర్ ఇందులో ప్రముఖ పాత్ర పోషిస్తోంది.

తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో ఇప్పటికే 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. నైపుణ్యాల శిక్షణకు ప్రభుత్వ రంగంలో ఏర్పాటైన మొట్టమొదటి యూనివర్సిటీ ఇదే. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఇదొక కలల ప్రాజెక్టు. సీఎం కోరిక మేరకు ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా ఈ స్కిల్స్ యూనివర్సిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడం ఒక ఘన విజయంగా చెప్పుకోవాలి. పారిశ్రామిక రంగం సాయంతో విద్యుత్తు వాహనాలు, ఏవియేషన్, హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్, జ్యూయెలరీ డిజైన్, రోబోటిక్స్ ఫార్మా, లాజిస్టిక్స్ వంటి వేర్వేరు అంశాల్లో ఇక్కడ శిక్షణ దొరుకుతోంది. ఇక్కడ ట్రెయినింగ్ ఇచ్చేది కూడా పరిశ్రమకు చెందినవారే. టీసీఎస్ ఐయాన్ సంస్థ 20 వారాల 'ప్లేస్‌మెంట్ సక్సెస్ ప్రోగ్రామ్'ను జూలైలో ప్రారంభించింది. కోర్సు పూర్తి కాకముందే తొలి బ్యాచ్ విద్యార్థుల్లో 82 శాతం మందికి ఉద్యోగావకాశాలు ఖాయమయ్యాయి. సాంకేతిక అంశాల్లో క్షేత్రస్థాయి శిక్షణ అవసరమన్న అంచనాతో తెలంగాణ ప్రభుత్వం 'టాటా టెక్నాలజీస్' సాయంతో రాష్ట్రంలోని 65 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రెయినింగ్ సెంటర్లు (ఏటీసీ)గా అభివృద్ధి చేస్తున్నది. వీటిల్లో ఇప్పుడు మెకాట్రానిక్స్, ప్రిసిషన్ ఇంజినీరింగ్, సోలార్ ఎనర్జీ సిస్టమ్స్ వంటి ఇవ్వాల్టి ఇండస్ట్రీ అవసరాలకు తగిన అంశాల్లో కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. పరిశోధనశాలల్లో కాకుండా పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలన్నమాట.

టాస్క్ (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్) ద్వారా ప్రభుత్వం సాంకేతిక అంశాలతోపాటు సాఫ్ట్‌స్కిల్స్, కమ్యూనికేషన్, ఇంటర్వ్యూలలో ఆత్మవిశ్వాసంతో వ్యవహరించడం ఎలా అన్న విషయాలపై ఆన్‌లైన్, ప్రత్యక్ష శిక్షణను ఇస్తోంది. రాష్ట్రంలోని 147 ఇంజనీరింగ్ కాలేజీలు, 447 డిగ్రీ, పీజీ కళాశాలలు, 96 పాలిటెక్నిక్‌లు, 56 ఫార్మసీ, 25 బిజినెస్ మేనేజ్‌మెంట్ కాలేజీలు నైపుణ్య శిక్షణ కోసం టాస్క్ సేవలను అందిస్తోంది.

ఫార్మా, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాల్లోని అపారమైన అవకాశాలను అందిపుచ్చుకునేందుకు యువత సిద్ధమవ్వాలి. ఎందుకంటే వారు డిగ్రీలున్న వారి కోసం చూడటం లేదు. నైపుణ్యాలున్న వారి కోసం చూస్తున్నారు. నేడు విద్యార్థులకు డిగ్రీ ఒక పునాది మాత్రమే. ఇంకా పైకి ఎదగాలంటే నైపుణ్యాలు అనే నిచ్చెన వాడాల్సిందే. దేశంలోనే మొదటిసారి బీఎఫ్ఎస్ఐ కన్సార్టియం (BFSI) ఏర్పాటు చేసింది తెలంగాణ ప్రభుత్వం. బీకాం, బీఏ, బీబీఏ కళాశాలల్లో బీఎఫ్ఎస్ఐ పాఠ్యాంశాలను రెండో సంవత్సరంలో ప్రవేశపెట్టాం. ఇంజనీరింగ్‌లో మూడో సంవత్సరం కరిక్యులమ్ మొదలవుతుంది. దీన్ని విజయవంతంగా పూర్తిచేసిన విద్యార్థులకు బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ రంగాల్లో ఇంటర్న్‌షిప్ దొరుకుతుంది. ఆయా సంస్థలు వారిని తర్వాత ఉద్యోగాల్లో చేర్చుకుంటున్నాయి. ఈ ప్రక్రియ మొత్తంలో సీఎం రేవంత్‌రెడ్డి చొరవను ప్రత్యేకంగా ప్రశంసించాలి. దేశంలో 2030 నాటికి ఈ రంగంలో 2.5 లక్షలమంది ప్రతిభావంతుల అవసరం ఉంది. బీఎఫ్ఎస్ఐలో ఉద్యోగ ఖాళీల సంఖ్య ఏటా 10శాతం చొప్పున పెరుగుతున్నది. సైబర్ సెక్యూరిటీ ఆఫ్ ఎక్సలెన్స్ లేదా ఇంకో ప్రభుత్వ ప్లాట్‌ఫామ్ కావచ్చు. విధానపరమైన మద్దతు ఉంటే నైపుణ్యాల వృద్ధిని విస్తృత స్థాయిలో చేపట్టవచ్చునని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే రుజువు చేసింది. అయితే ఇప్పుడు చొరవ కావాల్సింది యువ పట్టభద్రుల వైపు నుంచే. ఉద్యోగాల అన్వేషణతోపాటు, వాటికి తగ్గ నైపుణ్యాలు తమలో ఉన్నాయా అని కూడా వారు ఆలోచించడం మొదలుపెట్టాలి.

● దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
తెలంగాణ ఐటీ, పరిశ్రమలు, శా.వ్యవహారాల మంత్రి

ధైర్యం, నిబద్ధతకు ప్రతీక

నిజాయితీ, ధైర్యం, ప్రజాసేవ– ఇవే ఉమేశ్ చంద్ర వారసత్వం. చిన్న వయసులోనే దివికేగినా ఆయన గాథ నేటి పోలీస్ అధికారులకు, యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది. ప్రజాసేవే పరమ ధర్మమని ఆయన జీవితం చాటి చెప్పింది. "నిజాయితీతో నిలిచినవారు మరణించినా, వారి పేరు ఆచంద్రార్కం నిలుస్తుంది."

1966 మార్చి 29న గుంటూరు జిల్లా పెదపూడి గ్రామంలో జన్మించిన ఉమేశ్ చంద్ర చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, సత్యనిష్ఠకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. హైదరాబాదు పబ్లిక్ స్కూల్‌లో విద్యనభ్యసించి, నిజాం కాలేజీలో ఎకనమిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. ఆ తరువాత ఉస్మానియా యూనివర్సిటీలో ఎకనమిక్స్‌లో మాస్టర్స్ పూర్తి చేసి యూనివర్సిటీ టాపర్‌గా నిలిచారు. విద్యలో అగ్రగామిగా ఉన్న ఆయన, ప్రజలకు సేవ చేయాలనే తపనతో 1991లో ఇండియన్ పోలీస్ సర్వీస్‌కు ఎంపికయ్యారు.



నేషనల్ పోలీస్ అకాడమీ శిక్షణ దశలోనే ఆయన కఠిన శ్రమ, ధైర్య స్వభావం అందరినీ ఆకట్టుకుంది. తరువాతి దశలో ఎక్కడ పనిచేసినా వినిపించిన ఒకే ఒక్క మాట– 'ఉమేశ్ చంద్ర అంటే ధైర్యానికి పర్యాయపదం'. వరంగల్‌లో ఏఎస్పీగా పనిచేస్తూ నక్సలైట్ల ఉనికిని సవాల్‌గా తీసుకున్నారు. తరువాత కడప ఎస్పీగా పని చేసి ఫ్యాక్షన్ కలహాలను అణచివేసి 'కడప సింహం'గా పేరుగాంచారు. కరీంనగర్‌లో నక్సలైట్లను అణచి శాంతి స్థాపనలో కీలక పాత్ర పోషించారు. చివరగా ఏఐజీ (క్రీడలు, సంక్షేమం)గా సేవలందించారు.

ప్రజల సమస్యలను స్వయంగా వినడం, పోలీస్ స్టేషన్లను ప్రజలకు అండగా మార్చడం ఉమేశ్ చంద్ర ప్రత్యేకత. సాధారణ ప్రజల పట్ల మమకారం చూపుతూ, నేరస్థుల విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించారు. కడపలో ఆయనను 'ప్రజల పోలీస్' అని పిలిచేవారు. ఆయన బదిలీ వార్త తెలిసి ప్రజలు రోడ్డెక్కి కన్నీరు మున్నీరయ్యారు. రోడ్డుపై బారులు తీరి, వాహనం వెంబడి పరుగులు పెడుతూ తమ కుటుంబసభ్యునికే దూరం జరుగుతున్నంతగా ఆందోళన చెందారు. పోలీసు చరిత్రలో ఓ అధికారికి అలాంటి వీడ్కోలు లభించటం అత్యంత అరుదైన గౌరవం.

1999 సెప్టెంబర్ 4– హైదరాబాద్‌లో ఇంటి నుంచి కారులో పోలీసు హెడ్ క్వార్టర్స్‌కు వెళుతున్న ఉమేశ్ చంద్రపై ఎస్.ఆర్. నగర్ సెంటర్ వద్ద నక్సలైట్లు కాల్పులు జరిపారు. ఈ దాడి రాష్ట్రాన్ని కుదిపేసింది. ప్రతి తెలుగువాడిని ఉలిక్కిపడేలా చేసింది. అకస్మాత్తుగా దాడి జరిగినా, ఆయన ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు. చేతిలో ఆయుధం లేకపోయినా ధైర్యంగా ఎదురు తిరిగారు. దుండగులను నిలువరించడానికి ప్రయత్నించారు. వాహనంపై కాల్పులు మొదలైన క్షణం నుంచే ఆయన ఎదురు దాడి చేయడానికి యత్నించారు. రక్తస్రావం జరుగుతున్నా, క్షణం ఆలస్యం చేయకుండా సహచరులను రక్షించే ప్రయత్నం చేశారు. క్షణాల వ్యవధిలో గన్‌మాన్ రామచంద్రారెడ్డి, డ్రైవర్ సత్యనారాయణ బలయ్యారు. అయినా ఉమేశ్ చంద్ర వెనుకంజ వేయలేదు. చివరి శ్వాసవరకూ పోరాడుతూనే ఉన్నారు. చేతిలో తుపాకీ లేనప్పటికీ కారు దిగిన ఆయన, నక్సలైట్ల వెంటపడి వారిని కొంత దూరం తరిమారు. అయితే ఉమేష్ చంద్ర వద్ద రివాల్వర్ లేదని గుర్తించిన నక్సలైట్లు ఎదురు తిరిగి బుల్లెట్ల వర్షం కురిపించారు. అవి ఆయన శరీరాన్ని ఛిద్రం చేశాయి. రక్తపు మడుగులో ఆయన కుప్పకూలిపోయారు. కేవలం మృత్యువు మాత్రమే ఆయన సాహసాన్ని నిలువరించగలిగింది. ఆ క్షణాలు పోలీస్ చరిత్రలో అమరగాథగా నిలిచాయి.

ఉమేష్ చంద్ర మరణం రాష్ట్రాన్ని కదిలించింది. ప్రజలు విగ్రహాలు ప్రతిష్ఠించారు. 2000 సంవత్సరంలో సంజీవరెడ్డినగర్ కూడలిలో ఆయన విగ్రహం ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం ఆయన వర్ధంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు శాఖ నివాళులు అర్పించడం మంచి సంప్రదాయంగా మారింది. పోలీస్ శిక్షణా శిబిరాల్లో ఆయన జీవితం పాఠ్యాంశంగా బోధిస్తున్నారు. కడప, హైదరాబాద్, తెనాలిలో ఆయన పేరుతో ఏర్పాటైన రహదారులు, విగ్రహాలు నిరంతర స్ఫూర్తికి చిహ్నాలుగా నిలుస్తున్నాయి.

● రవికుమార్ బొప్పన
సీనియర్ పాత్రికేయులు

(నేడు ఉమేష్ చంద్ర 26వ వర్ధంతి)

తల్లడిల్లిన తోటి తల్లుల మాటేమిటి?

'నాన్నా నిన్ను చివరి చూపు చూస్తానా' అంటూ స్నేహలత మల్ల రాసిన వ్యాసం (ఆంధ్రజ్యోతి – ఆగస్టు 8) చదివాక అన్యాయంగా నక్సల్స్ చేత చంపబడ్డ వందలాదిమంది బిడ్డల తల్లుల హృదయాలు జ్ఞప్తికి వచ్చాయి. నక్సల్స్‌కు ఏదన్నా జరిగినప్పుడు పదుల సంఖ్యలో గొంతులు 'వసంత మేఘా'ల్లా గర్జిస్తాయి. కానీ అదే నక్సల్స్ చేతుల్లో చనిపోయిన ప్రజలు, రక్షణ దళాల సభ్యుల తరఫున ఒక్క గొంతు కూడా పెగలదు.

ఇంకా తన తండ్రి సజీవంగా ఎక్కడో ఉన్నాడన్న సమాచారం తెలిసి కూడా స్నేహలత అంత మథనపడుతున్నదే! మరి సమాజంలో అందరి మధ్యా రాజ్యాంగబద్ధ, చట్టబద్ధ పాలనలో బతుకుతున్న తమ బిడ్డల్ని అకారణంగా తుపాకీ తూటాలతో కాల్చి చంపితే, ఇక తమ బిడ్డలు లేరనీ, రారనీ తెలిసిన ఆ తల్లుల బాధ ఇంకెంత తీవ్రంగా ఉంటుంది? యుద్ధంలో తన తండ్రి క్షేమాన్ని కోరుతున్న స్నేహలత ఆ వ్యాసంలో తన తండ్రి చేత చంపబడ్డ వారి విషయాన్ని మాత్రం కనీసం తలచుకోలేదు, ఆమెకు ఆ విషయంలో ఏ పశ్చాత్తాపమూ లేదు. పోనీ ఒక బిడ్డగా తన తండ్రిని తిరిగి రమ్మనో, మాతో మా కుటుంబంతో కలిసి ఉండాలనో రాస్తారేమో అనుకొని వ్యాసాన్ని ఆసాంతం చదివినా గానీ అలాంటి మాటలు కూడా ఎక్కడా కనపడలేదు. సరికదా తండ్రి తన యుద్ధంలో విజయం సాధించాలని రాశారు. అంటే ఇంకా వందలాదిమందిని పొట్టన పెట్టుకొని వందలాదిమంది తల్లులు తల్లడిల్లేలా రక్తం ఏరులై పారాలని ప్రోత్సహిస్తున్నట్టే కదా!

వందలాదిమంది విద్యార్థులని, పోలీసుల్ని, అమాయకపు పౌరుల్ని మట్టుపెట్టిన నక్సల్స్ నేతపై కూతురిగా స్నేహలతకు ప్రేమ ఉండొచ్చు కానీ దాన్ని బహిరంగంగా వ్యక్తం చేసి వందల మంది తల్లుల శోకాన్ని మళ్లీ తట్టిలేపటం క్రూరత్వమే అవుతుంది. అంతేగాక, రాజ్యాంగ వ్యతిరేకశక్తులకు, చట్టవిరుద్ధ భావజాలానికి వత్తాసు పలుకుతూ, కీర్తిస్తూ ఇంకా ఎంతోమంది యువతను ఆ సిద్ధాంతం వైపు ప్రేరేపించటం ఏ మాత్రం మంచి విషయం కాదు.



కరడుకట్టిన మృగాలుగా క్యాంపస్ హాస్టళ్లపైనా, గ్రామాలపైనా పడి క్రూరంగా చిత్రహింసలు పెట్టి కొంతమందినీ, విచక్షణా రహితంగా తుపాకులతో కాల్చి ఎంతో మందినీ చంపిన నక్సల్స్ ముఠా నాయకుడు తన తండ్రి అయినందుకు పశ్చాత్తాపం ఏ మాత్రం చూపించకపోగా, ఆమె ఇలా తన తండ్రిపై అవ్యాజమైన ప్రేమను సమాజానికి చాటి చెప్పటం ద్వారా ఎలాంటి సందేశం ఇవ్వాలనుకున్నారు? కనీసం తన తండ్రి నమ్మిన కాలం చెల్లిన సిద్ధాంతం నేటి ఆధునిక సమాజానికి సరిపోదని, తిరిగి జన జీవన స్రవంతిలో కలవమనీ చెపితేనన్నా బాగుండేది. అలాగాక, అదొక యుద్ధం అంటూ మళ్ళీ దానికి అందమైన పేరొకటి పెట్టి నరహంతక ముఠా నాయకులను సమాజానికి హీరోలుగా చూపించే ప్రయత్నం చేశారు.

ఆమె తండ్రి మూడోవంతు జీవితాన్ని ఏ సమాజహితానికి అంకితం చేశారు? ఏ అభివృద్ధికి, ఏ దేశ నిర్మాణానికి త్యాగం చేశారు? వివరిస్తే బాగుండేది. సంఘ విచ్ఛిన్నకర నక్సల్ నాయకుడిని స్వాతంత్ర్య వీరులతో, దేశోద్ధారకులతో పోల్చడం నిజంగా ఆ స్వాతంత్ర్య వీరులని అవమానించడమే అవుతుంది. ఆ మాటకొస్తే శ్రీకాకుళం రైతాంగ పోరాటం నుంచి తెలంగాణ సాయుధ పోరాటం వరకు జరిగిన కమ్యూనిస్టుల అకృత్యాలు మొదలుకొని, నక్సల్‌బరి నుంచి నేటి మావోయిస్టు ఉద్యమం వరకు జరిగిన మైదాన పోరాటాలు, అజ్ఞాత పోరాటాల చరిత్ర సమస్తం రక్తసిక్తమే! మైదాన ప్రాంతాల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో రాజకీయాల్లో పాల్గొనే కమ్యూనిస్టు నాయకులు కొన్నిసార్లు అజ్ఞాతంలోని తమ సోదరులకు అండదండలుగా ఉంటూ వారి ఎదుగుదలకు సహకరిస్తూ రెండు రకాలుగానూ సమాజానికి తీవ్ర నష్టం చేశారు. ఈ దేశానికి, ఈ కాలానికి అనువుగాని, సరితూగని సిద్ధాంతాన్ని బలవంతంగా, క్రూరంగా ఈ దేశ ప్రజలపై రుద్దేందుకు విఫల యత్నం చేస్తూనే వచ్చారు. శ్రీకాకుళ ప్రాంతం నుంచి తెలంగాణ వరకు తెలుగు నేలపై జమీందారీ, భూస్వామ్య, పెట్టుబడిదారీ వర్గ నిర్మూలన పేరిట అమాయకుల తలలను నరికి ఉట్లపై పెట్టి, రచ్చబండపై వేలాడతీసి ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేయటం, ప్రజా కోర్టులో శిక్షలు అంటూ నడి ఊరిలో భార్యా బిడ్డల ముందే సజీవంగా కాల్చి చంపడం, విప్లవం పేరిట సమాజ నిర్మాణం అంటూ, భూమి, భుక్తి, విముక్తి అంటూ... ఇలా లెక్కకు మిక్కిలిగా వారు సాగించిన దురాగతాలను, నరమేధాన్ని చరిత్రపుటల్లో చేర్చాల్సిన అవసరం ఉంది.

భవిష్యత్తులో ఆచరణ సాధ్యం అవుతుందో లేదో తెలియని మార్క్స్ అనే గతి తార్కిక మేధావి వల్లె వేసిన మాటల్ని నిజం చేయాలన్న తపనలో లక్షల కోట్ల ప్రజాధనాన్ని తగలబెట్టి; వందల మంది అమాయకుల్ని, దేశ రక్షణ కోసం పనిచేసే భద్రతా దళాలను కిరాతకంగా చంపుతూ; తమ దుశ్చర్య ఎంత అమానుషంగా విజయవంతం అయితే తమ సిద్ధాంతం అంత విజయవంతం అవుతుందని భావించే తండ్రినీ, దేశంపై ఆయన చేసున్న యుద్ధాన్నీ కీర్తిస్తూ రాయటం ఆ కూతురికి మాత్రమే ఆనందాన్ని మిగల్చగలదు. గోరుముద్దలు, చందమామ కథలు, అమ్మ ఒడి అంటూ ఆమె పేర్చిన పదాల కూర్పును వందలాది అమ్మలకు ఎందుకు అన్వయించరు?

తెలుగు రాష్ట్రాల్లో, ముఖ్యంగా ఉస్మానియా, కాకతీయ, ఆర్ఈసీలలో 70వ దశకం నుండి 90వ దశకం చివరి వరకు సాగిన నక్సల్స్ విధ్వంసకాండ, వారు సాగించిన మారణహోమం గురించి ఇప్పటికీ కథలుగా చెప్తారు. ఎంతోమంది జాతీయవాదుల్ని, ఏబీవీపీ, ఆరెస్సెస్ నాయకుల్ని బహిరంగంగా కాల్చి చంపిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. కృష్ణ వర్ధన్, సామ జగన్మోహన్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, పూజారి మాణిక్యం, ఏచూరి శ్రీనివాస్, మధుసూదన్‌గౌడ్, మేరెడ్డి చంద్రారెడ్డి లాంటి ఎంతోమంది విద్యార్థి నాయకులు నక్సలైట్ల నరమేధానికి బలయ్యారు. ఆ కుటుంబాల్ని కదిలిస్తే కన్నీళ్లు ఇప్పటికీ ఏరులై పారుతాయి. పాతికేళ్ళ నవ యువకులైన తమ బిడ్డల్ని కళ్ళ ముందు బహిరంగంగా, అకారణంగా కాల్చి చంపితే ఆ తల్లుల బాధ ఎలా ఉంటుందో సాటి తల్లులకే తెలుస్తుంది. చదువుకునేందుకు వెళ్లిన కొడుకు శవంగా మారి ఇంటికి వస్తే తల్లడిల్లిన ఆ గుండెకే ఆ బాధ అర్థం అవుతుంది. అలాంటి వందలాదిమంది విద్యార్థులని, పోలీసుల్ని, అమాయకపు పౌరుల్ని మట్టుపెట్టిన నక్సల్స్ నేతపై కూతురిగా ఆమెకు ప్రేమ ఉండొచ్చు కానీ దాన్ని బహిరంగంగా వ్యక్తం చేసి, వందల మంది తల్లుల శోకాన్ని మళ్లీ తట్టిలేపటం క్రూరత్వమే అవుతుంది. అంతేగాక, రాజ్యాంగ వ్యతిరేకశక్తులకు, చట్టవిరుద్ధ భావజాలానికి వత్తాసు పలుకుతూ, కీర్తిస్తూ ఇంకా ఎంతోమంది యువతను ఆ సిద్ధాంతం వైపు ప్రేరేపించటం ఏ మాత్రం మంచి విషయం కాదు. నక్సల్స్ చేతిలో బిడ్డల్ని కోల్పోయిన తల్లులు కూడా మీలాంటి బిడ్డలే.

■ డా. దొంతగాని వీరబాబు
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ

గ్రేటర్ వరంగల్‌లో ట్రాఫిక్ మళ్లింపు



- గణపతి నిమజ్జనం దృష్ట్యా పోలీసుల ఆంక్షలు
- రేపు మధ్యాహ్నం నుంచి 7వ తేదీ మధ్యాహ్నం వరకు
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వెల్లడి

6

రేపు జీపీవోలకు నియామకపత్రాలు జారీ

కలెక్టర్‌లతో వీసీలో వెల్లడించిన సీసీఎల్ఏ లోకేష్‌కుమార్

హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబర్3 (ఆంధ్రజ్యోతి): జీపీఓ పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 5వతేదీన సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రుల చేతుల మీదుగా నియామకపత్రాలు అందజేయనున్నట్లు సీసీఎల్ఏ, రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్ వెల్లడించారు. నియామకపత్రాలను హైదరాబాద్‌లో అందజేయనున్న సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై అన్ని జిల్లాల కలెక్టర్‌లతో బుధవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా లోకేష్‌కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్‌కుమార్ మాట్లాడుతూ.. భూభారతి చట్టం అమలులో భాగంగా జీపీఓల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఈ నెల 5వ తేదీన హైటెక్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రుల చేతుల మీదుగా గ్రామ పరిపాలన అధికారుల(జీపీవో)కు నియామక పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. అన్ని జిల్లాల్లో పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు సమాచారం అందించాలని కలెక్టర్‌లకు సూచించారు. అభ్యర్థులను హైదరాబాద్‌కు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సమాచారాన్ని ఆయా జిల్లాల్లోని మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యేలకు కలెక్టర్లు సమాచారం ఇవ్వాలన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. జిల్లాలో 107మంది ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. ఈనెల 5వ తేదీన జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుంచి అభ్యర్థులకు హైదరాబాద్‌కు తరలిస్తామన్నారు. అభ్యర్థుల తరలింపునకు జిల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డిని నోడల్ ఆఫీసర్‌గా నియమించామని, హైదరాబాద్‌కు తరలివెళ్లే అభ్యర్థులకు తగు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వరంగల్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాకు సంబంధించి 165 మంది గ్రామ పరిపాలన అధికారులుగా ఎంపికయ్యారని, వారికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌వో విజయలక్ష్మీ, కలెక్టరేట్ ఏవో విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విభేదాల గులాబీ

ఓరుగల్లు బీఆర్ఎస్ నేతలపై కవిత హాట్ కామెంట్స్



- కేసీఆర్, కేటీఆర్ వర్గాలుగా విడిపోయారని తీవ్ర వ్యాఖ్యలు
- ఎమ్మెల్సీ పోచంపల్లి వ్యాపారాలపై ఆరోపణలు
- పల్లా - పోచంపల్లి విభేదాలపై ఆసక్తికర ముచ్చట్లు
- నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలపై కీలక వ్యాఖ్యలు
- ఓరుగల్లు గులాబీ నేతల్లో కవిత వ్యాఖ్యల కలకలం
- పార్టీలో ఇటీవలి పరిణామాలకు బలం చేకూర్చాయంటున్న శ్రేణులు

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఓరుగల్లు గులాబీ నేతలు కేసీఆర్, కేటీఆర్ వర్గాలుగా విడిపోయారని బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్ వేటుకు గురైన కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిల మధ్య విభేదాలను ప్రస్తావిస్తూ కవిత చేసిన వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో దుమారం రేపుతున్నాయి. నిజంగా ఓరుగల్లులో కేసీఆర్, కేటీఆర్ వర్గాలుగా పార్టీ నేతలు విడిపోయారా? అనేది చర్చనీయాంశంగా మారింది. ఇదిలా వుండగా, చాలాకాలంగా పార్టీలో జరుగుతున్న పరిణామాలు ఈ వ్యాఖ్యలకు బలం చేకూరుతున్నాయి. గత ఏప్రిల్ 27న జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ, నియోజకవర్గాల ఇన్‌చార్జి బాధ్యతల విషయంలోనూ నేతలు రెండు వర్గాలుగా విడిపోయారనే విమర్శలు వెల్లువెత్తాయి. వరంగల్ జిల్లా కమిటీకి కార్యవర్గాన్ని కూడా నియమించకపోవడానికి కారణం కూడా పార్టీ నేతల మధ్య ఆధిపత్య పోరే అనే ప్రచారం జరుగుతోంది.

కవిత వ్యాఖ్యల కలకలం

బీఆర్ఎస్ నుంచి వేటుకు గురైన కల్వకుంట్ల కవిత బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఓరుగల్లు గులాబీ నేతలపై హాట్ కామెంట్స్ చేశారు. సంతోష్‌రావు క్లాస్‌మేట్ కావటం వల్లనే ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి వేల కోట్ల వ్యాపారాలు చేస్తున్నారని కవిత ఆరోపించారు. మోకిలాలలో రూ.750కోట్ల విల్లా ప్రాజెక్టు చేస్తున్నారని చెప్పారు. శ్రీనివాస్‌రెడ్డికి ఇంత డబ్బు ఎక్కడిదని, సంతోష్‌రావు క్లాస్‌మేట్ కావటమే ఆయనకున్న అర్హతని విమర్శించారు. ఈ విషయం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డే చెప్పారని కవిత బాంబు పేల్చారు. ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డిని టార్గెట్ చేసిన కవిత.. పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కూడా లాగటంతో గులాబీ శ్రేణుల్లో కలకలం రేగుతోంది.

జనగామలో ఏం జరిగింది?

అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పట్లో జనగామ ఎమ్మెల్యే టికెట్ కోసం ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. అదే సమయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంపై కన్నేసిన పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఇక్కడ వాతావరణం అనుకూలంగా లేకపోవటంతో జనగామ టికెట్ రేసులోకి వచ్చారు. అప్పటికే సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిని పక్కన పెడుతున్నారనే ప్రచారంతో రంగంలోకి దిగిన ఎమ్మెల్సీ పోచంపల్లికి పల్లా రూపంలో చెక్ పడింది. దీంతో కేటీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న పోచంపల్లిని కాదని కేసీఆర్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్న పల్లాకు టికెట్ వచ్చిందనే ప్రచారం జరిగింది. అయితే ఎన్నికలు పూర్తయి రెండేళ్లు కావొస్తున్న క్రమంలో కవిత ఈ వివాదంపై చేసిన వ్యాఖ్యలు పార్టీలో కలకలం రేపుతున్నాయి.

వర్ధన్నపేట ఇన్‌చార్జిలో..

వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ (మిగతా 6లో..)

రజతోత్సవ సభలో విభేదాలు

గత ఏప్రిల్ 27న ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జనసమీకరణ బాధ్యతలపై విభేదాలు భగ్గుమన్నట్లు అప్పట్లో కార్యకర్తలు చర్చించుకున్నారు. ఈ సభ నిర్వహణకు సంబంధించి మాజీ మంత్రి ఎర్రబెల్లి ఆధ్వర్యంలో తొలుత ఉనికిచర్ల వద్ద స్థల పరిశీలన చేశారు. దీంతో కేటీఆర్‌తో సన్నిహితంగా ఉండే నేతల ఒత్తిడితో ఎర్రబెల్లిని బాధ్యతలకు దూరంగా ఉంచటంతో పాటు సభావేదికను కూడా ఎల్కతుర్తికి కేటీఆర్ వర్గం నేతలు మార్చారనే ప్రచారం జరిగింది.





సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రులు సురేఖ, సీతక్క, లక్ష్మణ్‌కుమార్

మేడారం ఖ్యాతి ఖండాంతరాలు దాటాలి

- తెలంగాణ ఆత్మగౌరవవానికి నిదర్శనం మహాజాతర
- శాశ్వత నిర్మాణాలు పటిష్టంగా ఉండాలి
- సమీక్షలో మంత్రులు సురేఖ, సీతక్క లక్ష్మణ్‌కుమార్

ములుగు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకలైన మేడారం సమ్మక్క-సారక్క వనదేవతల జాతర ఖ్యాతి ఖండాంతరాలు దాటాలని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలోని దేవాదాయ మంత్రిత్వ శాఖ కార్యాలయంలో మేడారం మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష బుధవారం సమీక్షను నిర్వహించారు. మేడారం దేవాలయం నూతన డిజైన్లను మంత్రులు పరిశీలించారు. డిజైన్లలో చేయాల్సిన మార్పులపై సమాలోచన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మేడారం మహా జాతరను గతంలో కంటే ఈసారి ఘనంగా జరుపుకోవాలన్నారు. పలుమార్లు కుంభామేళా నిర్వహించిన సంస్థకు మేడారం మాస్టర్ ప్లాన్ నిర్వహణ బాధ్యతలను అప్పగించామన్నారు. మేడారం నిర్వహణ పనులను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు (మిగతా 6లో..)



గోదావరి జలాలకు పూజ చేస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి

దేవాదుల ప్రాజెక్టుతో సస్యశ్యామలం

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- మల్లన్నగండి కుడి కాలువ ప్రారంభం
- త్వరలోనే ఎడమ కాలువ పనులకు శ్రీకారం

6

పారిశుధ్య పనులపై దృష్టి సారించాలి

- వరంగల్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్
- శానిటేషన్ అధికారులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని 66 డివిజన్‌లలో శానిటేషన్ సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ కోరారు. బుధవారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో శానిటేషన్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి కమిషనర్ మాట్లాడారు. ప్రతీ డివిజన్‌లో చెత్త సమస్య, డ్రైనేజీ సమస్యలు రాకుండా చూడాలని, ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి చర్యలు చేపట్టండి

వరంగల్ నగరంలో బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఎన్ఐఏయూ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ ఎఫైర్) సెక్రెటరీ నితేష్ అనిరుత కోరారు. బుధవారం ఢిల్లీ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వరంగల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెక్రెటరీ మాట్లాడుతూ.. కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ (సీబీజీ) ఏర్పాటు కోసం డిటెయిల్ డీటైల్ ప్రాజెక్ట్ రిపోర్టు (డీపీఆర్)తయారు చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించిన సమగ్ర అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా చెత్త పరిమాణాన్ని లెక్కించడం, తదితర అంశాలపై కమిషనర్‌లకు సెక్రెటరీ పలు సూచనలు చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్ పాల్గొన్నారు.

కేసీఆర్ కుటుంబాన్ని బహిష్కరించాలి..

- తెలంగాణ ప్రజలు ఈ మేరకు ఉద్యమించాలి
- కవిత రూపంలో వాళ్ల పాపాలు పండుతున్నాయి..
- వరంగల్ బీఆర్ఎస్ నేతల అక్రమాల చిట్టా విప్పుతా...
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని దొంగల్లా దోచుకుతిన్న కేసీఆర్ కుటుంబాన్ని, బీఆర్ఎస్ నేతలను తెలంగాణ నుంచి బహిష్కరించాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ కుటుంబం పాపాలు ఎమ్మెల్సీ కవిత రూపంలో బయటపడుతున్నాయన్నారు. కుటుంబంలో దోపిడీ సొమ్ము పంపకాలు బెడిసికొట్టి పాపాలు బట్టబయలవుతున్నాయన్నారు. తొలి నుంచి కాంగ్రెస్ పార్టీ కేసీఆర్ దోపిడీ పాలనపై ఉద్యమిస్తూనే వచ్చిందన్నారు. ఉద్యమం, తెలంగాణ పేరుతో కేసీఆర్ కుటుంబం, బీఆర్ఎస్ నేతలు ప్రజలను నమ్మిస్తూ వచ్చారన్నారు. కాంగ్రెస్‌వి కక్ష్యసాధింపు చర్యలంటూ ప్రజలను పక్కదారి పట్టించారన్నారు. ఇప్పుడు స్వయంగా కేసీఆర్ కూతురు కవితే ఆ పార్టీ నేతల అక్రమాల బండారం బహిర్గతం చేస్తున్నారన్నారు. కాళేశ్వరం పేరుతో హరీశ్‌రావు కోట్లు దండుకున్నారని, సంతోష్‌తో పాటు మిగతా నేతల దోపిడీల చిట్టా కవిత బట్టబయలు చేస్తున్నారన్నారు. దోచిన ప్రతీ పైసా బీఆర్ఎస్ నేతలు చెల్లించాల్సిందేనని కరాఖండిగా చెప్పారు. బినామీల పేరిట కేసీఆర్ కుటుంబం లక్షల కోట్ల ప్రజాసొమ్మును కాజేసిందని ఆరోపించారు. పదేళ్ల కిందట కేసీఆర్ కుటుంబం ఆస్తులకు, ఇప్పటి ఆస్తులకు పొంతనే లేదన్నారు. లక్షల్లో దోపిడీ చేశారని రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ కోసం ఉద్యమించిన ప్రజలు రాష్ట్రాన్ని దోచుకుతిన్న కేసీఆర్ కుటుంబం, ఆ పార్టీ నేతలను రాష్ట్రం నుంచి బహిష్కరించేందుకు ఉద్యమించాలని రాజేందర్‌రెడ్డి (మిగతా 6లో..)

పొనకల్‌లో అభివృద్ధి భేష్

- ఉత్తరప్రదేశ్ స్థానిక ప్రజాప్రతినిధుల కితాబు
- గ్రామంలో పలు పనుల పరిశీలన



పొనకల్ గ్రామంలో పర్యటిస్తున్న ఉత్తర ప్రదేశ్ లోకల్ బాడీ బృందం

దుగ్గొండి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని పొనకల్ గ్రామాన్ని బుధవారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు సందర్శించారు. అభివృద్ధి పనులను పరిశీలన చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన లోకల్‌బాడీ సభ్యులు 29 మంది సందర్శించి గ్రామంలో నిర్వహిస్తున్న స్థానిక పనుల తీరు వాటిని అమలు పరుస్తున్న విధానాన్ని పరిశీలన చేశారు. ప్రధానంగా మహిళా సంఘాల పని తీరు, బ్యాంక్ రుణాలు, జాతీయ ఉపాధి పనుల తీరును, పాఠశాలలో విద్యా బోధన పరిశీలన చేశారు. శానిటేషన్ అమలు దానికి అధికారులు తీసుకుంటున్న చర్యలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉత్తర ప్రదేశ్ లోకల్ బాడీ సభ్యుల వెంట హైదరాబాద్, రాజేంద్రనగర్‌కు చెందిన సీడీపీఏ సీఈవో కె.అనిల్‌కుమార్, వరంగల్ జడ్పీకి చెందిన డీటీఎం కర్ణాకర్, నర్సంపేట డీపీవో రాజీవ్‌కుమార్, ఎంపీడీవో అరుంధతి, ఎంపీవో శ్రీధర్‌గౌడ్, కార్యదర్శులు కవిత, యాదగిరి, వేణుప్రసాద్, శ్రీనివాస్‌లు ఉన్నారు.

యూరియా ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం

- కక్షసాధింపు చర్యలపై ఉన్న శ్రద్ధ.. రైతులపై లేదు..
- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



మాందారిపేట జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

శాయంపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా అందించలేని అసమర్థులు రాష్ట్రాన్ని పాలిస్తున్నారని, వారు వెంటనే దిగిపోవాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. యూరియా కొరత, కాళేశ్వరం కేసు సీబీఐకి అప్పగించడంపై నిరసనగా బుధవారం హనుమకొండ జిల్లా శాయంపేట మండలం మాందారిపేట వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి, ధర్నా చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ షాపు వద్ద రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ క్రమంలో హుస్సేన్‌పల్లికి చెందిన దేవేంద్ర అనే మహిళా రైతు బలవంతులకే యూరియా బస్తాలు ఇస్తున్నారని, తనకు ఇవ్వడంలేదని కన్నీరు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. రైతులకు యూరియా పంపిణీ చేసే పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అని, సమస్య చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రైతులను ఇబ్బందులు పెట్టడమేనా మార్పు అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేకు సమస్యలు కనబడడంలేదా అని ప్రశ్నించారు. రైతులకు అండగా బీఆర్ఎస్ ఉంటుందని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం సాగిస్తామన్నారు. కేవలం కేసీఆర్‌ను నిందించడానికే కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పి, సీబీఐ విచారణను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వంగాల నారాయణరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ దైనంపెల్లి సుమన్, యూత్ అధ్యక్షుడు మారపెల్లి మోహన్, పాక్స్ వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతిరెడ్డి, యూత్ నాయకుడు బేరుగు రాకేష్, వలుపదాసు చంద్రమౌళి, దాసి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

యూరియా కోసం జాగారం

రామలింగయ్యపల్లెలో 12గంటల ముందే బారులు



రామలింగయ్యపల్లె రైతువేదిక వద్ద బుధవారం రాత్రి 8గంటల సమయంలో క్యూలో నిల్చున మహిళా రైతులు

ఖానాపురం, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని బుధరావుపేట గ్రామపంచాయతీ పరిధి రామలింగయ్యపల్లె, ధర్మరావుపేటలో యూరియా కోసం బుధవారం రాత్రి నుంచే రైతులు పడిగాపులు కాస్తున్నారు. సొసైటీ ఎరువుల గోదాములకు గురువారం పంపిణీ చేయడానికి యూరియా వచ్చింది. విషయం తెలుసుకున్న రైతులు రామలింగయ్యపల్లె రైతు వేదిక వద్ద టోకెన్ల కోసం బుధవారం రాత్రి 8 గంటల నుంచే రైతులు బారులు తీరారు. మహిళా రెతులు సైతం పెద్ద ఎత్తున క్యూలో నిల్చున్నారు. తెల్లవార్లు రైతువేదిక వద్దే ఉండాల్సి వస్తుందని రైతులు తమ వెంట దుప్పట్లు, చాపలు తెచ్చుకుని క్యూ లైన్లోనే పడుకున్నారు. దోమలతో పాటు పాములు, తేళ్ల వంటి విష సర్పాలు కుట్టే ప్రమాదమున్నప్పటికీ రైతులు యూరియా కోసం తెగించి రాత్రి రైతు వేదిక వద్దే వేచిచూస్తున్నారు. ఎప్పుడు తెల్లవారుతుందో టోకెన్లు దొరుకుతాయో లేదోనని బెంగపడుతున్నారు. అదేవిధంగా ధర్మరావుపేటలో సొసైటీ వద్ద రైతులు చెప్పలు, సీసాలు, డబ్బాలు ఏది ఉంటే అది క్యూ లైన్లో పెడుతున్నారు.

విభేదాల గులాబీ

(5వ పేజీ తరువాయి)

బీజేపీలో చేరటంతో ఈ స్థానానికి ఇన్‌చార్జి బాధ్యతలపై మాజీ మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్సీ పోచంపల్లి మధ్య పోరు నడిచింది. ప్రస్తుతం ఎస్సీ రిజర్వుడు స్థానంగా ఉన్నప్పటికీ డీలిమిటేషన్‌లో జనరల్ స్థానంగా మారుతుందని భావిస్తున్న నేతలు.. ఇన్‌చార్జి బాధ్యతలు వస్తే వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీకి దిగవచ్చునని అంచనాలతో బాధ్యతల కోసం పోటీ పడ్డారని చర్చ జరిగింది. అయితే కేసీఆర్ ఎర్రబెల్లి వైపు మొగ్గుచూపటంతో పోచంపల్లి సర్దుకుపోవాల్సి వచ్చిందనే ప్రచారం జరిగింది.

మానుకోట, భూపాలపల్లి, పశ్చిమలోనూ..

మహబూబాబాద్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి బాధ్యతలను మాజీ మంత్రి సత్యవతిరాథోడ్‌కు అధిష్ఠానం అప్పగించింది. అయితే నియోజకవర్గంలో కేడర్‌ను సమన్వయం చేయటంలో సత్యవతిరాథోడ్ వైఫల్యం చెందారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు పార్టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెట్టి విమర్శించటంతో మానుకోట గులాబీలో విభేదాలు రచ్చకెక్కాయి. ఇక భూపాలపల్లి నియోజకవర్గంలోనూ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి, వచ్చే ఎన్నికల్లో టికెట్ రమణారెడ్డికేనని భూపాలపల్లిలోనే కార్యకర్తల సమక్షంలో కేటీఆర్ ప్రకటించి వచ్చారు.అయినప్పటికీ ఎమ్మెల్సీ సిరికొండమధుసూదనాచారి నియోజ కవర్గంలో పర్యటించటం ఏమిటనే చర్చ జరుగుతోంది. వరంగల్ పశ్చి మ నియోజకవర్గంలో మాజీఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌కు చెక్ పట్టేందుకు ఇటీవల బీఆర్ఎస్‌లో చేరిన ఓ యువనేతను కేసీఆర్‌తో సన్నిహితం గా ఉండే మరో ప్రజాప్రతినిధి ప్రోత్సహిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

విభేదాలతో వరంగల్ కమిటీకి బ్రేక్..

అంతర్గత విభేదాలతో బీఆర్ఎస్ వరంగల్ జిల్లా కమిటీని కూడా నియమించటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న అరూరి రమేష్ బీజేపీలో చేరటంతో పదవిఖాళీ అయింది. ఏడా ది దాటినా ఇప్పటి వరకు నూతన అధ్యక్షుడిని నియమించటంతో నేతల మధ్య విభేదాలు అడ్డు వస్తున్నాయనే చర్చ జరుగుతోంది.

మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్‌తో పాటు జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, తదితర నేత లు జిల్లా అధ్యక్ష పదవిని చేపట్టేందుకు సుముఖంగా ఉన్నప్పటికీ అధిష్ఠానంపై వ్యతిరేక శిబిరం ఒత్తిడి తెస్తుండటంతో అధ్యక్షుడు లేకుండానే స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కోవాల్సి వస్తోందనే చర్చ జరుగుతోంది. కాగా, మొత్తంగా ఓరుగల్లు గులాబీ నేతలపై కవిత చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. వరంగల్ నేతలు కేసీఆర్, కేటీఆర్ వర్గాలు విడిపోయారని ఆమె చేసిన వ్యాఖ్యలు గులాబీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారాయి.

మేడారం ఖ్యాతి ఖండాంతరాలు దాటాలి

(5వ పేజీ తరువాయి)

చేపట్టాలన్నారు. సమ్మక్క- సారలమ్మ పూజారులతో చర్చించి వారి అభిప్రాయం మేరకు ఆధునీకరణ పనులు చేపట్టాలని సూచించారు. భక్తుల దర్శనార్థం అమ్మవార్ల గద్దెల ఎత్తు పెంచాలని పూజారులు ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంతో తగిన మేర డిజైన్ల మార్పు చేపట్టాలన్నారు. గత జాతర అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మరిన్ని ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీల సంస్కృతీ సంప్రదాయాలకు అనుగుణంగా మేడారం పరిసరాలను తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. మేడారం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.150కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు. అవసరమైతే ఇతర శాఖల సహాయంతో మరిన్ని నిధులు కేటాయిస్తామన్నారు. జాతర నిర్వహణ ఏర్పాట్లు, మాస్టర్ ప్లాన్ డిజైన్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆయన అనుమతితో ముందుకు వెళ్తామన్నారు. మేడారం అభివృద్ధిలో పూజారులను భాగస్వామ్యులను చేస్తామన్నారు. సమ్మక్క-సారక్కల ఔన్నత్యాన్ని మరింత చాటి చెప్పేలా మేడారం ఆలయ ప్రాంగణాన్ని సిద్ధం చేస్తామన్నారు. జాతర విజయవంతం కావడం రహదారులపై ఆధారపడి ఉందని, దీంతో మేడారం-ఊరట్టం, మేడారం-కన్నెపల్లితో పాటు మరో నాలుగు మార్గాల విస్తరణ పనులు చేపడుతున్నామని తెలిపారు. డిసెంబరు వరకు పనులు ఎంతమేరకు పూర్తవుతాయో చెప్పాలని అధికారులను కోరారు. మాస్టర్ ప్లాన్ మొత్తం రెండు విడతలుగా స్థానికంగా అభివృద్ధి పనులు చేపడతామని మంత్రులు పేర్కొన్నారు.

గద్దెల అభివృద్ధికి రూ.58.2కోట్లు, గద్దెల వద్ద కళాకృతి పనులకు రూ.6.8కోట్లు, జంపన్న వాగు అభివృద్ధికి రూ.39కోట్లు, భక్తుల వసతి కోసం రూ.50కోట్లు, రోడ్ల అభివృద్ధి నిమిత్తం రూ. 52.5 కోట్లు, మిగిలిన నిధులు ఇతర పనుల కోసం వెచ్చిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ములుగు కలెక్టర్ దివాకర తదితరులు పాల్గొన్నారు.

‘ఫార్మసీ’కి గోల్డెన్ జూబ్లీ

- 50వ వసంతోత్సవంలోకి అడుగుపెడుతున్న కేయూ ఫార్మసీ కళాశాల
- ప్రపంచంలో కేయూ ఫార్మసీ కళాశాలకు ప్రత్యేక గుర్తింపు



కేయూ ఫార్మసీ కళాశాలలో ఏర్పాట్లు

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ విద్యకు కేరాఫ్‌గా కాకతీయ యూనివర్సిటీ ప్రఖ్యాతి గాంచింది. ఆసియా ఖండంలోనే నెంబర్-1 ఫార్మసీ కళాశాలగా గుర్తింపు పొందింది. 1974-75లో హైదరాబాద్ ఉస్మానియా వర్సిటీకి అనుబంధంగా కేయూలో ఫార్మసీ కళాశాల ప్రారంభమైనది. 1976లో కేయూలో పూర్తిస్థాయిలో నడుస్తోంది. కేయూ ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీ, ఎంఫార్మసీతో పాటు పీహెచ్‌డీ, పీడీఎఫ్ డిగ్రీలను అందిస్తోంది. ఫార్మసీ కళాశాలలో పనిచేసిన ప్రొఫెసర్లు 8మంది రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డులు పొందారు. యూఎస్ఏ, అమెరికా, జర్మనీ, అస్ట్రేలియా, యూకే, ఇటలీ దేశాల్లోనూ ప్రతిష్ఠాత్మకమైన ఫార్మసీ రంగ పరిశోధనలు చేశారు.

కళాశాలకు పూర్వ విద్యార్థులు

కేయూఫార్మసీ కళాశాలకు పూర్వవిద్యార్థులు కలుసుకునేందుకు సెప్టెంబరు 4న పూర్వ విద్యార్థుల సమ్మేళనం, అల్యూమినీ మీట్‌ను ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఫార్మసీ రంగ నిపుణులు, యూరో మెడికల్ ఇంటర్నేషనల్ సీఎండీ రాజమౌళి నేతృత్వంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను పురస్కరించుకుని దశాబ్దాల తర్వాత తమ కళాశాలలో కలుసుకునేందుకు విద్యార్థులందరూ ఉత్సాహంగా తరలిరానున్నారు.

370 మందికి డాక్టరేట్‌లు

కేయూ ఫార్మసీ కళాశాలలో 370 మంది అభ్యర్థులు వివిధ అంశాలపై అమూల్యమైన పరిశోధనలు చేసి 370కి మంది డాక్టరేట్ డిగ్రీలు సాధించారు. మరో 5గురు దేశంలోనే అత్యున్నత పోస్టు డాక్టరల్ డిగ్రీలను సాధించారు. వీటితో పాటు ఫార్మసీ కళాశాల అధ్యాపకులు విలువైన పరిశోధనలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన పలుసంస్థల నుంచి పేటేంట్ హక్కులను సాధించారు.

గోల్డెన్ జూబ్లీ షెడ్యూల్ ఇదే..

కేయూ సెనెట్ హాల్‌లో ఈ నెల 4వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు గోల్డెన్ జూబ్లీ వేడుకల ప్రారంభ సమావేశం నిర్వహిస్తారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రిన్సిపాల్ జె.కృష్ణవేణి, బీఓఎస్ చైర్మన్ ప్రొఫెసర్ వై.నరసింహారెడ్డి హాజరుకానున్నారు. అలాగే హైదరాబాద్‌లోని యూరో మెడికల్ ఇంటర్నేషనల్ సీఎండీ రాజమౌళిలు హాజరుకానున్నారు.

కల్చరల్ ప్రోగ్రామ్

కేయూ ఫార్మసీ కళాశాల అవరణలో గురువారం సాయంత్రం కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుగుతుంది. తర్వాత కల్చరల్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నారు. ఉత్సాహంగా పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు సంబురాల్లో పాల్గొని డ్యాన్స్‌లతో హోరెత్తించనున్నారు. ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 700 మందికి పైగా అల్యూమీని సభ్యులు, విద్యార్థులు హాజరుకానున్నారు. గోల్డెన్‌జూబ్లీ ఉత్సవాలను పురస్కరించుకుని కేయూ ఫార్మసీ కళాశాల రిటైర్డు ప్రొఫెసర్లను ఘనంగా సన్మానిస్తారు. పూర్వ విద్యార్థుల అపూర్వ పరిచయ వేదికను నిర్వహిస్తారు.

గోల్డెన్ జూబ్లీ వేడుకలను సర్వం సిద్ధం



కేయూ ఫార్మసీ కళాశాల 50 ఏళ్ల గోల్డెన్‌జూబ్లీ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. దేశ, విదేశాల నుంచి ఫార్మసీ రంగంలో పేరు ప్రఖ్యాతులు గాంచిన శాస్త్రవేత్తలు హాజరుకానున్నారు. కేయూ ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థులు హాజరవుతున్నారు. పూర్వ విద్యార్థులు, ప్రస్తుత ఫార్మసీ విద్యార్థులకు జీవిత అనుభవాలను నేర్పించి భవిష్యత్‌లో స్థిరపడేందుకు మార్గదర్శనం చేస్తారు.

- ప్రొఫెసర్ గాదె సమ్మయ్య,
ఫార్మసీ డీన్, ప్రోగ్రామ్ కన్వీనర్

ఏర్పాట్లు పరిశీలించిన వీసీ



గోల్డెన్ జూబ్లీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రంలు

కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలలో గురువారం జరిగే ఫార్మసీ కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకల ఏర్పాట్లను బుధవారం సాయంత్రం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర వల్లూరి రామచంద్రంలు పరిశీలించారు. కేయూ ఫార్మసీ విభాగం డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రిన్సిపాల్ జె.కృష్ణవేణి, ప్రొఫెసర్ ఎస్.ప్రసాద్‌లతో వేడుకల ఏర్పాట్లపై సమీక్షించారు. ఇబ్బందులు తలెత్తకుండా తగిన సౌకర్యాలను కల్పించాలని సూచించారు. వేడుకలకు వచ్చే అతిథులు, పూర్వ విద్యార్థులకు భోజనాలు, ఇతరత్రా సౌకర్యాలపై సూచనలు చేశారు.

క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందిస్తాం..

కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో విద్యార్థులకు క్రీడల్లో అంతర్జాతీయ, జాతీయస్థాయిల్లో సత్తా చాటేలా తగిన ప్రోత్సాహాన్ని అందిస్తామని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం కేయూ సెనెట్ హాల్‌లో కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య అధ్యక్షతన ఫిజికల్ డైరెక్టర్స్ మీట్-2025 సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పీడీలు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు.

క్రీడల అభివృద్ధికి నిబంధనల మేరకు నిధులు కేటాయిస్తామని చెప్పారు. ఏడాదిలో స్పోర్ట్స్ బోర్డు మీటింగ్‌లు, బడ్జెట్ మీటింగ్, వార్షిక ప్రణాళిక సమావేశం నిర్వహిస్తామన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామ చంద్రం మాట్లాడుతూ.. క్రమశిక్షణతో క్రీడా కార్యక్రమాలను నిర్వహిం చాలని సూచించారు. దశల వారిగా నిధుల కొరతతోపాటు ఇతర సమస్యలను అధిగమిస్తామని చెప్పారు. క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులక్రీడా నైపుణ్యాలను పెంపొందించాలని అన్నారు. సమావేశం లో పీడీలు మౌలిక సదుపాయాలు కల్పించాలని, నిధులు పెంచాలని కోరారు. కేయూ ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ హబీబుద్దీన్, రమేశ్‌రెడ్డి, సోమన్న, వెంకన్న, మట్టెడ కుమార్, మహ్మద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి ఇంటర్ కళాశాల టోర్నమెంట్లు

ఈనెల 12 నుంచి కాకతీయ యూనివర్సిటీ ఇంటర్ కళాశాల టోర్నమెంట్లు నిర్వహిస్తామని కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య ప్రకటించారు. కేయూ క్యాంపస్‌లోని యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహిస్తామన్నారు. అలాగే వుమెన్స్ కబడ్డీ పోటీలు వాగ్దేవి కళాశాల బొల్లికుంటలో సెప్టెంబరు 13, 14 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. కేయూలో సెప్టెంబరు 18,19,20 తేదీల్లో వుమెన్స్ టోర్నమెంట్లు నిర్వహిస్తామని, సెప్టెంబరు 16,17,18 తేదీల్లో కేయూలో మెన్ మొదటి ఫేజ్, 23,24,25 తేదీల్లో మెన్‌రెండో దఫా ఎంపికలు నిర్వహిస్తామన్నారు. సెప్టెంబరు 30,31 తేదీల్లో అథ్లెటిక్స్ మెన్స్ ఎంపికలు నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి కలిగిన క్రీడా విద్యార్థులందరూ సెప్టెంబరు 10వ తేదీ వరకు కేయూ స్పోర్ట్స్ బోర్డు కార్యాలయంలో వివరాలను అందచేయాలని కోరారు. డిసెంబరు రెండో వారంలో జోనల్ ఇంటర్ క్రికెట్ పోటీలు ప్రభుత్వ ఎస్ఆర్ఎస్ కళాశాలలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కేయూ స్పోర్ట్స్ బోర్డులో సంప్రదించాలని కోరారు.

గ్రేటర్ వరంగల్‌లో ట్రాఫిక్ మళ్లింపు



- గణపతి నిమజ్జనం దృష్ట్యా పోలీసుల ఆంక్షలు
- రేపు మధ్యాహ్నం నుంచి 7వ తేదీ మధ్యాహ్నం వరకు
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వెల్లడి

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): గణపతి నిమజ్జనం దృష్ట్యా ఈనెల 5వ తేదీ మధ్యాహ్నం నుంచి 7వ తేదీ మధ్యాహ్నం 1 గంట వరకు గ్రేటర్ వరంగల్‌లో ట్రాఫిక్ మళ్లించనున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట (ట్రైసిటీ) పరిధిలో గణపతి శోభయాత్ర జరుగుతున్న సమయంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు పేర్కొన్నారు. భారీ వాహనాల యాజమానులు, వాహన చోదకులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని సూచించారు. శోభయాత్ర జరిగే మార్గాల్లో ప్రజలు ఎలాంటి వాహనాలు పార్కింగ్ చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

భారీ వాహనాలు వెళ్లాల్సిన మార్గాలు

- ములుగు, భూపాలపల్లి నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు అరెపల్లి వద్ద ఔటర్ రోడ్డు మీదుగా వెళ్లాలి. అదే విధంగా ఆ రూట్‌లో వచ్చే వాహనాలు ఖమ్మం వెళ్లాలంటే ఔటర్ మీదుగానే వెళ్లి కరుణాపురం, వెంకటాపురం, పున్నేల్ క్రాస్ రోడ్డు మీదుగా ఖమ్మం రోడ్డు ఎక్కాలి
- భూపాలపల్లి, పరకాల నుంచి నర్సంపేట వైపు వెళ్లాల్సిన వాహనాలు కొత్తపేట, రెడ్డిపాలెం, జాన్‌పీరీలు, గొర్రెకుంట నుంచి వెళ్లాలి.
- కరీంనగర్ నుంచి ఖమ్మం వైపు వెళ్లే భారీ వాహనాలు చింతగట్టు ఓఆర్ఆర్ వద్ద యూటర్న్ తీసుకొని కరుణాపురం, వెంకటాపూర్, ఐనవోలు, పున్నేల్ క్రాస్ మీదుగా వెళ్లాలి. ఖమ్మం నుంచి కరీంనగర్ వైపు వచ్చే భారీ వాహనాలు సైతం ఇదే మార్గంలో రావాలి. హైదరాబాద్ నుంచి ఖమ్మం వైపు వెళ్ల వాహనాలు సైతం ఇదే మార్గాని అనుసరించాలి.
- హైదరాబాద్ నుంచి నర్సంపేట వైపు వెళ్లే వాహనాలు కరుణాపురం దగ్గర ఓఆర్ఆర్ ఎక్కి ఆరెపల్లి వద్ద దిగి కొత్తపేట, రెడ్డిపాలెం, జాన్‌పీరీలు, గొర్రెకుంట మీదుగా వెళ్లాలి. అదే విధంగా నర్సంపేట నుంచి హైదరాబాద్ వెళ్లే భారీ వాహనాలు ఇదే మార్గాన్ని అనుసరించాలి.
- ములుగు, పరకాల నుంచి హనుమకొండ బస్టాండ్‌కు వచ్చే బస్సులు పెద్దమ్మగడ్డ, కేయూసీ, పోలీస్ హెడ్‌క్వార్టర్, అంబేద్కర్ జంక్షన్, శ్రీదేవి ఏషియన్ మాల్ నుంచి బస్టాండ్‌కు చేరుకోవాలి. బస్టాండ్ నుంచి కరీంనగర్, ములుగు వైపు బస్సులు ఇదే మార్గాన్ని అనుసరించాలి.
- హనుమకొండ బస్టాండ్ నుంచి నర్సంపేట, మహబూబాబాద్, ఖమ్మం వైపు వెళ్లే బస్సులు బాలసముద్రం, అదాలత్, హంటర్‌రోడ్డు మీదుగా వెళ్లాలి. వరంగల్ బస్టాండ్ నుంచి హనుమకొండకు వచ్చే బస్సులు చింతల్ బ్రిడ్జి, నాయుడు పెట్రోల్ పంపు, ఉర్సుగుట్ట, హంటర్‌రోడ్డు, బాలసముద్రం మీదుగా రావాలి.
- కాజీపేట నుంచి వచ్చే చిన్నవాహనాలు, కార్లు ఫాతిమాబ్రిడ్జి, వడ్డెపల్లి చర్చి, కేయూ క్రాస్, ములుగురోడ్డు, పోతన జంక్షన్, అండర్‌బ్రిడ్జి, పోస్టాఫీసు, వరంగల్ బస్టాండ్, వెంకట్రామ జంక్షన్‌కు వెళ్లాలి. అదే విధంగా వరంగల్ నుంచి కాజీపేట వెళ్లే కార్లు, ఇతర వాహనాలు ఇదే మార్గాన్ని అనుసరించాలి.

శోభయాత్ర వాహనాల మార్గాలు

- సిద్ధేశ్వరం గుండంలో నిమజ్జనమైన తర్వాత వాహనాలు న్యూశాయంపేట వైపు వెళ్లాలి. శాయంపేట నుంచి నిమజ్జనానికి వచ్చే వాహనాలు హంటర్‌రోడ్డు, అదాలత్, హనుమకొండ చౌరస్తా మీదుగా సిద్ధేశ్వర గుండంకు రావాలి.
- ఎక్సైజ్ కాలనీ, రెవెన్యూ కాలనీలోని విగ్రహాలన్నీ కాజీపేట బంధం చెరువులో నిమజ్జనం చేయాలి
- చిన్నవడ్డెపల్లి చెరువుల్లో నిమజ్జనం చేసిన వాహనాలన్నీ ఏనుమాముల రోడ్డు నుంచి నర్సంపేట రోడ్డు వైపుకు వెళ్లాలి.

మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు3: (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా మూడు రోజులు సెలవులు ప్రకటించారు. శుక్రవారం ఈద్ మిలాద్‌ఉన్‌నబి పండుగ సెలవు, శనివారం వారాంతపు యార్డు బంద్, ఆదివారం వారాంతపు సెలవు ఉన్నందున తిరిగి సోమవారం నుంచి మార్కెట్‌లో యథావిధిగా క్రయవిక్రయాలు కొనసాగుతాయి. రైతులు, వ్యాపారులు, కార్మికులు ఈ విషయాన్ని గమనించి మార్కెట్ కమిటీకి సహకరించాలని కార్యదర్శి గుగులోతు రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

కేయూ లా సెమిస్టర్ పరీక్షల రీషెడ్యూల్

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి):కాకతీయ యూనిర్సిటీ పరిధిలో సెప్టెంబరు 6శనివారం జరగాల్సిన కేయూ మూడేళ్ల న్యాయశాస్త్ర పరీక్షల రెండో సెమిస్టర్ మూడో పేపర్, ఆరో సెమిస్టర్ మూడో పేపర్ సెప్టెంబరు 12వ తేదీ శుక్రవారానికి వాయిదా వేసినట్లు కేయూపరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అధనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆసీం ఇక్బాల్ బుధవారం తెలిపారు. పరీక్షలకు సంబంధించిన పరీక్షల కేంద్రాలు, సమయాల్లో ఎటువంటి మార్పులు ఉండవని తెలిపారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

కేసీఆర్ కుటుంబాన్ని బహిష్కరించాలి..

(5వ పేజీ తరువాయి)

పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నేతలను గ్రామాలకు రానివ్వొద్దన్నారు. అమరుల పేరు చెప్పి బీఆర్ఎస్ నేతలు లక్షల కోట్లు కొల్లగొట్టారని, రాష్ట్రాన్ని దగా చేశారన్నారు. కేసీఆర్ కుటుంబ మోసాలపై ఉద్యమకారులు, ప్రజలు ఒక్కటవ్వాలని, తెలంగాణ నుంచి వారిని తరిమికొట్టేందుకు ఉద్యమించాలని పునరుద్ఘాటించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బీఆర్ఎస్ నేతల అక్రమాల చిట్టా కూడా త్వరలోనే ఆధారాలతో పాటు ప్రజలు ముందు ఉంచుతానని రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. దోచిన ప్రతీ పైసాను కక్కిస్తామన్నారు. హరీశ్‌రావు, సంతోష్ వెనకాల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారని కవిత ఆరోపించడం అర్థరహితమన్నారు. బీఆర్ఎస్ నేతలు రేవంత్‌రెడ్డిని చంద్రబాబు శిష్యుడంటూ కూడా అర్థం లేని వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. నగర ప్రజల అభీష్టం మేరకు పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా రహదారుల విస్తరణ చేపడుతున్నట్లు వెల్లడించారు. నగరంలో గుర్తించిన ప్రధాన రహదారుల విస్తరణ త్వరలోనే ఉంటుందన్నారు. ఈ సమావేశంలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్, డాక్టరు పులి అనిల్‌కుమార్, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, శ్రీమాన్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళతో పాటు బంక సంపత్, అజీజ్, రాజ్‌కుమార్, అంబేద్కర్ రాజు, నాయిని లక్ష్మారెడ్డి, పులి రాజు, మోహన్‌రెడ్డి, నసీం జహాన్, రహీమున్నీసా, శ్వేత తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

దేవాదుల ప్రాజెక్టుతో సస్యశ్యామలం

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- మల్లన్నగండి కుడి కాలువ ప్రారంభం
- త్వరలోనే ఎడమ కాలువ పనులకు శ్రీకారం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): దేవాదుల ప్రాజెక్టుతో జనగామ జిల్లా సస్యశ్యామలంగా మారిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం మండలంలోని తాటికొండ గ్రామ పరిధిలో రూ.29 కోట్లతో నిర్మించిన మల్లన్నగండి కుడి కాలువను ఎంపీ కడియం కావ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో శ్రీహరి మాట్లాడారు. కుడి కాలువ నిర్మాణం అద్భుతమన్నారు. త్వరలోనే మల్లన్న గండి ఎడమ కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు. కాలువ పనులు ప్రారంభించి 20వేల ఎకరాలకు సాగు నీరందిస్తామన్నారు. అంతకముందు ఈ ప్రాంతం తీవ్ర కరువుతో ఉండేదన్నారు. రాష్ట్రంలో నేడు జనగామ జిల్లా అత్యధిక వరి ధాన్యం పండిస్తున్న జిల్లాగా మారిందన్నారు. గత ప్రభుత్వం దేవాదులను పట్టించుకోలేదని విమర్శించారు. దేవాదుల ఫేజ్-3, ప్యాకేజీ-6 పనులు పూర్తి చేయాలని తద్వారా ఘన్‌పూర్, పాలకుర్తి, వర్ధన్నపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని 78 వేల ఎకరాలకు సాగు నీరందుతుందని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. దీంతో సీఎం స్పందించి రూ.1,015 కోట్ల నిధులకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఏడాది లోపు ప్యాకేజీ-6 పనులు పూర్తి చేయిస్తానని తెలిపారు. ఏడాదిన్నర కాలంలోనే నియోజకవర్గానికి రూ.1000 కోట్ల నిధులు తీసుకువచ్చానని తెలిపారు. కొందరు నాయకులు 15 ఏళ్ల అధికారంలో ఉండి ఏం చేశారో ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. వ్యక్తిగత స్వార్థం కోసం రాజకీయాలు చేసేవారిని ప్రజలు మరిచిపోతారని తెలిపారు. సంపాదన కోసం రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ జెండాను ఎగురవేయడానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి విశేష కృషి చేస్తున్నారని ఎంపీ కావ్య అన్నారు. ఏడాదిన్నరలో నియోజకవర్గానికి రూ.800 కోట్ల నిధులు తీసుకువచ్చిన ఘనత ఎమ్మెల్యేదన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా తన వద్దకు రావొచ్చన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను ప్రతీ గ్రామంలో ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకన్న, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ చైర్ పర్సన్ లావణ్య, చిలుపూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్లు నరేందర్ రెడ్డి, కరుణాకర్‌రావు, పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్‌రెడ్డి, నాయకులు నాగరబోయిన శ్రీరాములు, రాపోలు మధుసూదన్‌రెడ్డి, బెలిదె వెంకన్న, చల్లా సుధీర్ రెడ్డి, జేతి జైపాల్ రెడ్డి, కొలిపాక సతీష్, నాగరబోయిన యాదగిరి, సారంగపాణి, వరలక్ష్మి, రాపోలు చరణ్‌రెడ్డి, సురేష్, చాడ రాజ్‌కుమార్, వక్కల రాజు, ఇరిగేషన్ ఎస్ఈ సుధీర్, ఈఈ వినయ్‌బాబు, డీఈ సంపత్, ఏఈ యాసర్ తదితరులు పాల్గొన్నారు.

మన్‌దీప్ గోల్‌తో గట్టెక్కింది!

కొరియాతో భారత్ మ్యాచ్ డ్రా

ఆసియా కప్ హాకీ

రాజ్‌గిర్ (బిహార్): ఆట ముగిసేందుకు మరో ఎనిమిది నిమిషాలే ఉంది. స్కోరు చూస్తే భారత్ 1-2తో కొరియాతో సూపర్ ఫోర్ తొలి మ్యాచ్‌లో వెనుకంజలో ఉంది. దాంతో ఆసియా కప్ హాకీ టోర్నీలో ఆతిథ్య భారత్‌కు తొలి పరాజయం తప్పదేమో అనిపించింది. కానీ ఈ దశలో ఫార్వర్డ్ మన్‌దీప్ సింగ్ మాయ చేశాడు. లెఫ్ట్ ఫ్లాంక్ నుంచి హర్మన్‌ప్రీత్ అందించిన రివర్స్ పాస్‌ను సుఖ్‌జీత్ సింగ్..మన్‌దీప్ వైపు కొట్టాడు. బంతిని అందుకున్న మన్‌దీప్ నలుగురు కొరియా డిఫెండర్లను బోల్తాకొట్టిస్తూ గోల్‌పోస్ట్‌లోకి పంపాడు. అంతే.. స్కోరు 2-2తో సమం. భారత ఫ్యాన్స్‌లో ఆనందం. సూపర్-4లో భాగంగా కొరియాతో బుధవారం జరిగిన మ్యాచ్‌ను భారత్ డ్రా చేసింది. దాంతో టోర్నమెంట్‌లో అపజయమెరుగని రికార్డును ఆతిథ్య జట్టు కొనసాగించింది. ఎనిమిదో నిమిషంలోనే హార్దిక్ సింగ్ గోల్ చేసి భారత్‌ను ఆధిక్యంలో నిలిపాడు. యాంగ్ జిహున్ (12) గోల్‌తో స్కోరు సమం చేసిన కొరియా..కొద్ది సేపటికే కిమ్ (14) సాధించిన గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లింది. డ్రా దరిమిలా రెండు జట్లు చెరో పాయింట్ దక్కించుకున్నాయి. మరో సూపర్ ఫోర్ పోరులో మలేసియా 2-0తో చైనాను చిత్తు చేసింది. ఇక గురువారం జరిగే సూపర్-4 రెండో మ్యాచ్‌లో మలేసియాను భారత్ ఢీకొంటుంది.



మన్‌దీప్ సింగ్

జోకో.. జోరు

యూఎస్ ఓపెన్



సబలెంక

సెమీస్‌కు నొవాక్, సబలెంక

న్యూయార్క్: 25వ గ్రాండ్‌స్లామ్ వేటలో ఉన్న సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్, మహిళల డిఫెండింగ్ చాంప్ అరియానా సబలెంక యూఎస్ ఓపెన్ సెమీస్‌కు దూసుకెళ్లారు. గతేడాది రన్నరప్, లోకల్ స్టార్ టేలర్ ఫ్రిట్జ్‌తో ముఖాముఖి పోరులో ఏడో సీడ్ జొకో తన రికార్డును 11-0తో మరింతగా మెరుగుపర్చుకొన్నాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో జొకో 6-3, 7-5, 3-6, 6-4తో నాలుగో సీడ్ ఫ్రిట్జ్‌పై సునాయాసంగా గెలిచాడు. ఈ క్రమంలో 53వసారి గ్రాండ్‌స్లామ్ సెమీస్ చేరిన నొవాక్.. అమెరికా లెజెండ్ క్రిస్ ఎవర్ట్ 52సార్లు సెమీస్ చేరిన రికార్డును బద్దలుకొట్టాడు. సెమీస్‌లో అల్కారజ్‌తో జొకో అమీతుమీ తేల్చుకోనున్నాడు. తొలి సెట్‌లో నొవాక్ అలవోకగా నెగ్గినా.. రెండో సెట్‌లో ఫ్రిట్జ్ నుంచి పోటీ ఎదురైంది. అయితే, 5-5 వద్ద తనదైన దూకుడు ప్రదర్శించిన నొవాక్ సెట్‌ను సొంతం చేసుకొని 2-0 ఆధిక్యంలోకి వెళ్లాడు. కానీ, మూడో సెట్‌లో ఫ్రిట్జ్ పోరాడి గెలిచినా.. ఆ తర్వాతి సెట్‌లో జొకో జోరు ముందు నిలవలేక పోయాడు. 2003లో చివరిసారి అమెరికా ఆటగాడు ఆండీ రాడిక్ న్యూయార్క్‌లో టైటిల్ నెగ్గాడు. ఈసారి ఫ్రిట్జ్ ఆ లోటు తీరుస్తాడను కొంటే.. జొకో అడ్డుపడ్డాడు. కాగా, టాప్‌సీడ్ సబలెంకకు క్వార్టర్స్‌లో వాకోవర్ లభించింది. ప్రత్యర్థి మార్కెటా వొండ్రుసోవా (చెక్) ప్రాక్టీస్ చేస్తుండగా మోకాలికి గాయమైంది. దీంతో ఆమె బరిలోకి దిగలేక పోయింది. శుక్రవారం జరిగే సెమీస్‌లో గతేడాది ఫైనలిస్ట్ పెగులతో స బలెంక తలపడనుంది.

భాంబ్రి తొలిసారి..: యుకీ భాంబ్రి కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ క్వార్టర్స్‌కు చేరుకొన్నాడు. డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో భాంబ్రి-మైకేల్ వీనస్ (న్యూజిలాండ్) జంట 6-4, 6-4తో జర్మనీకి చెందిన కెవిన్ క్రవీట్జ్-టిమ్ ప్యూట్జ్‌పై గెలిచింది.

నొవాక్ 'సోడా పాప్' సంబరాలు


మ్యాచ్ గెలిచిన తర్వాత జొకోవిచ్ 'కె-పాప్ డీమన్ హంటర్స్' సినిమాలోని 'సోడా పాప్' పాట డ్యాన్స్‌తో సంబరాలు చేసుకొన్నాడు. జొకో కుమార్తె తారకు 'కె-పాప్ డీమన్ హంటర్స్' అంటే ఎంతో ఇష్టం. కాగా, తార పుట్టిన రోజు కావడంతో.. ఆ డ్యాన్స్ మూమెంట్స్ ద్వారా కుమార్తెకు జొకో శుభాకాంక్షలు తెలిపాడు.

సినర్‌పై రూ. 2.64 కోట్ల పందెం

ఈ ఏడాది యూఎస్ ఓపెన్ టైటిల్‌ను డిఫెండింగ్ చాంప్ యానిక్ సినర్ నిలబెట్టుకొంటాడని కెనడా ర్యాపర్, సింగర్ డ్రేక్ భారీగా బెట్టింగ్ పెట్టాడు. ఇటలీ టాప్ సీడ్ ప్లేయర్‌పై డ్రేక్ రూ. 2.64 కోట్లు పందెం కాశాడు. ఒకవేళ సినర్ విజయం సాధిస్తే.. డ్రేక్‌కు రూ. 4.46 కోట్లు దక్కనున్నాయి.

నిఖత్‌పై అందరి దృష్టి!

నేటినుంచి ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్



లివర్‌పూల్ (ఇంగ్లండ్): ప్రతిష్ఠాత్మక వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్ గురువారం ఇక్కడ ఆరంభం కానున్నాయి. ప్రపంచ బాక్సింగ్ కొత్త పాలక మండలి..'వరల్డ్ బాక్సింగ్' ఆధ్వర్యంలో తొలిసారి ఈ పోటీలు జరగనున్నాయి. ఈ చాంపియన్‌షిప్స్‌ను పురుషులు, మహిళల విభాగాలలో కలిపి ఒకేసారి నిర్వహిస్తుండడం విశేషం. ఇక..భారత్‌కు సంబంధించిన తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్, టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బోర్గొహైన్‌పై అందరి దృష్టి నిలిచింది. రెండుసార్లు ప్రపంచ చాంపియన్ నిఖత్ వరుసగా మూడో వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో మూడు వేర్వేరు బరువు విభాగాలలో తలపడుతుండడం గమనార్హం. 2022లో 52కి. విభాగంలో విశ్వవిజేతగా నిలిచిన నిఖత్.. 2023లో 50కి. కేటగిరీలో టైటిల్ దక్కించుకుంది. ఇక ఈసారి 51 కి. విభాగంలో తలపడుతోంది. మారిన బరువు విభాగంలో నిఖత్ ఎలా రాణిస్తుందన్నది ఆసక్తికరం. పారిస్ ఒలింపిక్స్‌లో రెండో రౌండ్‌లోనే ఓటమి చవిచూసిన జరీన్.. ఏడాది తర్వాత అంతర్జాతీయ పోటీల బరిలో దిగుతోంది. పారిస్ క్రీడల తర్వాత నిఖత్‌తో పాటు లవ్లీనా ఒక దేశవాళీ ఈవెంట్‌లో మాత్రమే పాల్గొన్నారు. ఇద్దరికీ తొలి రౌండ్లలో కఠిన ప్రత్యర్థులు ఎదురు కానున్నారు. 65 దేశాల నుంచి 550మంది బాక్సర్లు ఈ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో తలపడుతున్నారు. భారత్ నుంచి పురుషుల, మహిళల విభాగాల్లో చెరి పదేసి మంది బాక్సర్లు పోటీపడుతున్నారు.

రోహిత్, గిల్ అండ్ కోకు 'బ్రాంకో టెస్ట్' లేనట్టే..



న్యూఢిల్లీ: భారత జట్టు ఆటగాళ్లకు బీసీసీఐ సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ)లో ఫిట్‌నెస్ టెస్ట్‌లు నిర్వహిస్తూంటుంది.. ఇది రొటీన్‌గానే జరిగేదే అయినా.. సరికొత్తగా 'బ్రాంకో టెస్ట్‌ను ప్రవేశపెడుతున్నారని కొద్ది రోజుల క్రితం వచ్చిన వార్త కారణంగా అందరి దృష్టినీ ఆకర్షించింది. రగ్బీ ఆటగాళ్లకు నిర్వహించే ఈ కఠిన పరీక్షను రోహిత్ శర్మను బయటకు పంపేందుకే ప్రవేశపెడుతున్నారంటూ విమర్శలు కూడా వినవచ్చాయి. తాజా సీజన్ నేపథ్యంలో రోహిత్, శుభ్‌మన్ గిల్, బుమ్రా సహా మరికొందరు కాంట్రాక్ట్ ప్లేయర్లు సీవోఈలో ఫిట్‌నెస్ పరీక్షకు హాజరయ్యారు. అయితే, వీరెవరికీ బ్రాంకో టెస్ట్ నిర్వహించలేదని తెలుస్తోంది. ఈ నూతన టెస్ట్‌ను ఇంకా ఫిట్‌నెస్ పరీక్షల్లో భాగం చేయలేదట. అందుకే పాతపద్ధతిలో యో-యో టెస్ట్ ద్వారానే ఫిట్‌నెస్‌ను పరీక్షించిందట. పైగా బోర్డు కూడా బ్రాంకో టెస్ట్‌ను ప్రవేశపెడుతున్నట్టు అధికారికంగా కూడా ప్రకటించలేదు.

బెంగాల్‌పై పుణెరి గెలుపు



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రో కబడ్డీ లీగ్-12 తొలి అంచెలో భాగంగా బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 45-36 స్కోరుతో బెంగాల్ వారియర్స్‌ను ఓడించింది. ఆట ప్రారంభం నుంచి పల్టన్ ఆటగాళ్లు దూకుడుగా ఆడి వారియర్స్‌పై ఒత్తిడి పెంచారు. ప్రథమార్థం 26-22 స్కోరుతో ముగిసింది. ద్వితీయార్థంలో పుంజుకునేందుకు యత్నించిన బెంగాల్ వారియర్స్‌ను పుణెరి డిఫెండర్లు నిలువరించారు. వారియర్స్ కెప్టెన్, స్టార్ రైడర్ దేవంక్ పలుమార్లు ప్రత్యర్థి డిఫెండర్లకు చిక్కడంతో మ్యాచ్‌పై పట్టు కోల్పోయారు. పుణెరి జట్టులో అస్లాం ఇనాందార్, ఆదిత్య షిండే చెరో 11 పాయింట్లు సాధించారు. హరియాణా స్టీలర్స్-యు ముంబా జట్ల మ్యాచ్ 36-36తో టైగా ముగిసింది. అయితే షూటౌట్‌లో హరియాణా విజయం సాధించింది.

శ్రీలంకదే తొలి టీ20

హరారే: జింబాబ్వేతో తొలి టీ20లో శ్రీలంక గెలుపొందింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత జింబాబ్వే 20 ఓవర్లలో 175/7 చేసింది. దుష్మంత చమీర 3 వికెట్లు తీశాడు. ఛేదనలో శ్రీలంక 19.1 ఓవర్లలో 177/6 స్కోరు చేసి గెలుపొందింది. నిస్సాంక (55), కమిందు మెండిస్ (41 నాటౌట్) రాణించారు.

కబడ్డీ విజేత జోగులాంబ లయన్స్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): యువ తెలంగాణ కబడ్డీ లీగ్ ట్రోఫీని జోగులాంబ లయన్స్ జట్టు కైవసం చేసుకుంది. బుధవారం ఎల్బీ స్టేడియంలో జరిగిన ఫైనల్లో లయన్స్ 35-21 స్కోరుతో భద్రాద్రి బ్రేవ్స్ జట్టుపై నెగ్గింది. లీగ్ ఉత్తమ రైడర్‌గా జి.రాజు, డిఫెండర్‌గా నవీన్, ఆల్‌రౌండర్‌గా లక్ష్మణ్‌కు ప్రత్యేక అవార్డులు లభించాయి. ఐపీఎస్ అధికారి రాహుల్ హెగ్డే, తెలంగాణ కబడ్డీ సంఘం అధ్యక్షుడు కాసాని వీరేష్, కార్యదర్శి మహేందర్ విజేతలకు ట్రోఫీ ప్రదానం చేశారు.

తిప్పేసిన నితిన్



చెన్నై: బుచ్చిబాబు ఆలిండియా క్రికెట్ టోర్నమెంట్ రెండో సెమీ ఫైనల్లో హరియాణాను 99 పరుగులతో ఓడించి హైదరాబాద్ జట్టు ఫైనల్‌లో ప్రవేశించింది. బుధవారం తమ రెండో ఇన్నింగ్స్‌లో హరియాణా 272 పరుగుల లక్ష్యంతో ఛేదన ప్రారంభించగా, హైదరాబాద్ లెఫ్టార్మ్ స్పిన్నర్ నితిన్ సాయి యాదవ్ (7/44) దెబ్బకు 62.4 ఓవర్లలో 181కు ఆలౌటై పరాజయం పాలైంది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 225, హరియాణా 208కు, రెండో ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 254కు ఆలౌటయ్యాయి. హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో 91 పరుగులతో రాణించిన వరుణ్ గౌడ్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

ఇకపై మరింత బాధ్యతగా ఉంటాం

'చిన్నస్వామి' ఘటనపై కోహ్లీ



న్యూఢిల్లీ: బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో గత జూన్ నాలుగున జరిగిన తొక్కిసలాటపై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ ఎట్టకేలకు స్పందించాడు. 'అది.. మా ఫ్రాంచైజీ చరిత్రలో ఓ సంతోషకరమైన ఘట్టం కావాల్సింది. కానీ విషాదంగా మారింది. ఆ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన, గాయపడిన మా అభిమానుల గురించి ఆలోచిస్తున్నా. వారి గురించి ప్రార్థిస్తున్నా. ఇకపై జాగ్రత్తగా, బాధ్యతగా, గౌరవంగా ముందుకు సాగుతాం' అని కోహ్లీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ సీజన్ ఐపీఎల్ టైటిల్‌ను ఆర్‌సీబీ గెలుచుకున్న సందర్భంగా చిన్నస్వామి స్టేడియంలో ఏర్పాటు చేసిన విజయోత్సవంలో తొక్కిసలాట జరిగి 11 మంది క్రికెట్ ఫ్యాన్స్ మరణించగా, మరో 71 మంది గాయపడ్డారు.

వృద్ధి, ఉద్యోగాల కల్పనకు ఊతం

జీఎస్‌టీ సంస్కరణలపై హర్షాతిరేకాలు



ప్రభుత్వం బుధవారం ప్రకటించిన జీఎస్‌టీ సంస్కరణలు ఆర్థిక వృద్ధికి, ఉపాధికల్పనకు ఊతం ఇచ్చేలా ఉన్నాయి. ఒక పక్క భౌగోళిక, రాజకీయ పరిస్థితుల ప్రభావంతో దేశీయ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సవాలును ఎదుర్కొంటోంది. మరోపక్క అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పోటు ఎగుమతుల రంగానికి తీరని కాటుగా పరిణమించింది. గత కొద్ది కాలంగా ఎగుమతుల రంగం భారీ తిరోగమనంలో ఉంది. సుంకాల ప్రభావం వల్ల రాబోయే కాలంలో ఎగుమతులు భారీగా పడిపోవచ్చునన్న భయాలు కూడా సర్వత్రా నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య దేశీయ వినియోగాన్ని గణనీయంగా పెంచుతుందని, తద్వారా ఎగుమతుల నష్టాన్ని భర్తీ చేస్తుందని విశ్లేషకులంటున్నారు. దీనికి తోడు దేశంలో పండుగల సీజన్ ప్రారంభమవుతోంది. ఈ సీజన్‌లో వస్తు సేవల వినియోగం పెరిగి ఆర్థిక వ్యవస్థ ఉత్తేజితం కావడానికి ఈ చర్య దోహదపడుతుందన్నది వారి అభిప్రాయం. దేశంలో జీఎస్‌టీ ప్రవేశపెట్టిన తర్వాత తొలి భారీ ప్రక్షాళన ఇదే. ఈ చర్యల ఫలితంగా ప్రభుత్వం పన్నుల రూపేణ ఆదాయాన్ని నష్ట పోయినా, దేశీయ వినియోగం భారీగా పెరిగి ఆర్థిక వ్యవస్థ సుంకాల పోటు నుంచి చాలా వరకు బయట పడుతుందని ఆర్థిక నిపుణుల అంచనా. దీంతో ఇప్పటి వరకు నీరసించిన ప్రైవేటు పెట్టుబడులు సైతం ఊపందుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. అదే జరిగితే జీడీపీ వృద్ధి రేటుకూ ఢోకా ఉండదని అంచనా. ఇప్పటివరకు ఉన్న శ్లాబ్‌లను రెండు శ్లాబ్‌లకు కుదించడం ద్వారా సగటు మనిషి వినియోగించే అనేక వస్తువులు 5 శ్లాబ్‌లోకి జారుకుని సగటు జీవికి ఉపశమనం కలుగుతుంది. దీన్ని దేవీ నవరాత్రులు, దీపావళి ముందు ప్రభుత్వం ప్రకటించిన బొనాంజాగా నిపుణులు, పరిశీలకులు అభివర్ణిస్తున్నారు. ఈ సంస్కరణలు సగటు జీవిపైనే కాకుండా రైతాంగం, చిన్న వ్యాపారులపై కూడా భారాన్ని గణనీయంగా తగ్గిస్తాయన్నది వారి అభిప్రాయం. ఇది సగటు జీవికి అసలైన పండుగ అని ప్రభుత్వాధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

పురోగామి చర్య : ఎంట్రీ లెవల్ టూ వీలర్లు, కార్లపై విధించే జీఎస్‌టీని 28 శాతం నుంచి 18 శాతానికి కుదించడంపై ఆటోమొబైల్ పరిశ్రమ హర్షం వ్యక్తం చేసింది. 'జీఎస్‌టీ రేట్లను హేతుబద్ధం చేయాలని మేము ఎప్పటి నుంచో కోరుతున్నాం. ప్రభుత్వం ఎట్టకేలకు మా మొర ఆలకించింది' అని మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ని ఆయన సరైన సమయంలో తీసుకున్న పురోగామి చర్యగా అభివర్ణించారు.ఈ చర్య తప్పకుండా దేశంలో కార్ల డిమాండ్‌ను పెంచుతుందన్నారు. అన్ని రకాల ఆటోమొబైల్ విడి భాగాలను 28 శాతం జీఎస్‌టీ నుంచి 18 శాతం జీఎస్‌టీ శ్లాబులోకి మార్చడంపై ఆ కంపెనీలకు ప్రాతినిధ్యం వహించే ఆటోమోటివ్ కంపోనెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఏసీఎంఏ) ప్రశంసించింది. ఎప్పటి నుంచో అడుగుతున్న తమ ఈ కోరికను ప్రభుత్వం ఇన్నాళ్లకు మన్నించిందని ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ విన్నీ మెహతా తెలిపారు.

స్టాక్ మార్కెట్ పరుగే

జీఎస్‌టీ నిర్ణయం గురువారం స్టాక్‌మార్కెట్‌కు పెద్ద ఉత్తేజం కావచ్చునని మార్కెట్ నిపుణులంటున్నారు. ఇటీవల కాలంలో ఈక్విటీ, ఫారెక్స్ మార్కెట్లు భారీ ఆటుపోట్లు ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో మార్కెట్ తాత్కాలికంగా ఊపిరి తీసుకోవడం ఖాయమని, గురువారం మార్కెట్ సానుకూలంగా స్పందించవచ్చునని పరిశీలకులన్నారు.

చిన్న కార్ల ధరలు ఎంత తగ్గొచ్చు..?

4మీటర్లలోపు వాహనాల విభాగంలో 1200 సీసీ వరకు పెట్రోల్ కార్లపై ప్రస్తుతం 28 శాతం జీఎస్‌టీతోపాటు ఒక శాతం సెస్సు కూడా చెల్లించాల్సి ఉంటుంది. 1500 సీసీ వరకు డీజిల్ కార్లపై కేంద్రం 28 శాతం జీఎస్‌టీతోపాటు 3 శాతం సెస్సు వసూలు చేస్తోంది. ఈ విభాగ కార్లను తాజాగా 18 శాతం శ్లాబులో చేర్చారు. దీంతో చిన్న, హ్యాచ్‌బ్యాక్ మోడళ్ల ధరలు 8-10 శాతం వరకు తగ్గవచ్చని అంచనా వేసింది. మారుతి సుజుకీ చిన్న కారు ఆల్టో కే10 ఎక్స్‌షోరూమ్ ధర రూ.4..23 లక్షల నుంచి రూ.3.89 లక్షలకు తగ్గే అవకాశం ఉంది. హ్యుండయ్ హ్యాచ్‌బ్యాక్ మోడల్ గ్రాండ్ ఐ10 మోడల్ రేటు రూ.5.98 లక్షల నుంచి రూ.5.51 లక్షలకు దిగిరావచ్చు. రెనో క్విడ్ ఎక్స్ షోరూమ్ ధర కూడా రూ.40,000 వరకు తగ్గవచ్చని అంచనా.

ఎగుమతిదారుల హర్షం: ఇక నుంచి వారం రోజుల్లోనే జీఎస్‌టీ రిఫండ్స్ ప్రక్రియ పూర్తి కానుంది. ఇది ఎగుమతిదారుల నిధుల కొరత సమస్యనూ తీరుస్తుందని భారత ఎగుమతి సంఘాల సమాఖ్య (ఫియో) డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1,000 వరకు ఉన్న జీఎస్‌టీ రిఫండ్‌లను అనుమతించడం ఇ-కామర్స్ ఎగుమతిదారులకు పెద్ద ఊరట అన్నారు.

ద్రవ్యోల్బణం కట్టడికి దోహదం: జీఎస్‌టీ రేట్ల తగ్గింపు వస్తు, సేవల వినియోగం భారీగా పెరగడంతోపాటు ద్రవ్యోల్బణం కట్టడి, ఆర్థిక వృద్ధి, ఉద్యోగాల కల్పనకూ ఊతమివ్వనుందని ఇండస్ట్రీ వర్గాలంటున్నాయి. మరింత సరళమైన, పారదర్శకమైన, సమగ్ర పన్ను వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు తాజా సంస్కరణలు దోహదపడనున్నాయని మహీంద్రా గ్రూప్ సీఈఓ, ఎండీ డాక్టర్ అనిశ్ షా అన్నారు.

రియల్టీ, మౌలిక రంగాలకు బూస్ట్ : సిమెంట్, స్టీల్‌పై జీఎస్‌టీని 28 శాతం నుంచి 18 శాతం తగ్గించడం రియల్ ఎస్టేట్, మౌలిక రంగాల నిర్మాణ వ్యయాలను గణనీయంగా తగ్గించనుందని నరెడ్కో జాతీయ అధ్యక్షుడు, హీరానందిని గ్రూప్ చైర్మన్ నిరంజన్ హీరానందిని అన్నారు. ముఖ్యంగా అందుబాటు గృహ ప్రాజెక్టులకు లబ్ధి చేకూరనుందని, నిర్మాణ వ్యయం తగ్గితే కొనుగోలుదారులకు ఈ గృహాలు మరింత తక్కువ ధరకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యానికి తోడ్పాటు: 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశాల సరసన చేర్చాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం జీడీపీ ఏటా 7 శాతానికి పైగా వృద్ధిని నమోదు చేయాల్సిన అవసరం ఉంది. ట్రంప్ 50 శాతం సుంకాలతో ఎగుమతి ఆధారిత రంగాల వ్యాపారంపై ప్రభావం చూపనున్న తరుణంలో జీఎస్‌టీ రేట్ల తగ్గింపు దేశీయంగా వినియోగాన్ని పెంచి వృద్ధి రేటుకు అండగా నిలవనుందని హీరానందాని అన్నారు.

బంగారం @ రూ.1.07 లక్షలు

వరుసగా 8 రోజుల్లో రూ.6,900 అప్



పసిడి సరికొత్త జీవనకాల పతాక స్థాయికి ఎగబాకింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర మరో రూ.1,000 పెరిగి రూ.1,07,070కి చేరింది. 99.5% స్వచ్ఛత గల బంగారం రేటు కూడా అదే స్థాయిలో ఎగబాకి రూ.1,06,200కి చేరుకుంది. కిలో వెండి మాత్రం ఎలాంటి మార్పు లేకుండా రూ.1,26,100 పలికింది. బంగారం ధరలు పెరగడం వరుసగా ఇది ఎనిమిదో రోజు. గడిచిన 8 రోజుల్లో తులం బంగారం రూ.6,900 పెరిగింది. అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ ఈ నెలలో ప్రామాణిక వడ్డీరేట్లను మరో 0.25% తగ్గించవచ్చన్న అంచనాలతోపాటు అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతలు, వాణిజ్య అనిశ్చితులు బంగారం, వెండి ధరలకు ఆజ్యం పోస్తున్నాయి. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర రేటు తొలిసారిగా 3,600 డాలర్ల మైలురాయిని దాటింది. ఒకదశలో 3,622 డాలర్ల వద్ద ఆల్‌టైం ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. సిల్వర్ 41.35 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. అంతర్జాతీయంగా వీటి ధరలు మున్ముందు మరింత ఎగబాకవచ్చని బులియన్ నిపుణులు భావిస్తున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

4 తేదీ



హైదరాబాద్	535	విజయవాడ	570
వరంగల్	537	గోదావరి	570
చిత్తూరు	578	విశాఖపట్నం	575
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	98	విజయవాడ	127
వరంగల్	98	గుంటూరు	115
కరీంనగర్	98	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	98	చిత్తూరు	90
కర్నూలు	98	నెల్లూరు	95
విశాఖపట్నం	131	అనంతపురం	95
గోదావరి	127		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,06,970 ▲	98,050 ▲	1,37,000 ▲
విజయవాడ	1,09,000 ▲	1,03,000 ▲	1,26,700 ▲
విశాఖపట్నం	1,09,430 ▲	97,250 ▲	1,37,000 ▲
రాజమండ్రి	1,06,960 ▲	98,050 ▲	1,26,400 ▼
ప్రొద్దుటూరు	1,07,200 ▲	98,620 ▲	1,26,000 ▲
ముంబై	1,06,020 ▲	97,120 ▲	1,23,220 ▲

మారుతి కొత్త కారు విక్టోరిస్

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద కార్ల విక్రయ కంపెనీ మారుతి సుజుకీ ఇండియా తన స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్ (ఎస్‌యూవీ) పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించింది. ఈ విభాగంలో బ్రెజ్జా, ఫ్రాంక్స్, జిమ్నీ, గ్రాండ్ విటారా వంటి మోడళ్లను విక్రయిస్తున్న కంపెనీ.. విక్టోరిస్ పేరుతో మరో కాంపాక్ట్ ఎస్‌యూవీని బుధవారం ఆవిష్కరించింది. హ్యుండయ్ క్రెటా, కియా సెల్టోస్, హోండా ఎలివేట్, టయోటా హైరైడర్, టాటా కర్వ్, స్కోడా కుషాక్, ఫోక్స్‌వేగన్ టైగున్‌కు పోటీగా ఈ కారును మార్కెట్లోకి ప్రవేశపెడుతోంది. 1.5 లీటర్ పెట్రోల్, సీఎన్‌జీ, హైబ్రిడ్ ఇంజన్ ఆప్షన్లతో కూడిన ఈ కారును అరెనా షోరూమ్స్ ద్వారా విక్రయించనున్నట్లు కంపెనీ తెలిపింది. మొత్తం ఆరు వేరియంట్లు, పది రంగుల్లో లభించనున్న ఈ కారులో మారుతి పలు ఆధునిక ఫీచర్లను అందుబాటులోకి తెచ్చింది. రూ.11,000తో బుకింగ్ సౌకర్యాన్ని ప్రారంభించిన కంపెనీ.. కారు ధరను త్వరలోనే ప్రకటించనుంది. దీని ప్రారంభ ధర రూ.9.75 లక్షల స్థాయిలో ఉండవచ్చని అంచనా. భద్రతకు సంబంధించి ఈ కారుకు 5-స్టార్ భారత్ ఎన్‌క్యాప్ సేఫ్టీ రేటింగ్ లభించినట్లు సంస్థ తెలిపింది.

సెన్సెక్స్ 410 పాయింట్లు అప్

తొలుత తడబాటు.. ఆఖర్లో జోరు

ముంబై: స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం ట్రేడింగ్‌లో మధ్యాహ్నం వరకు లాభనష్టాల మధ్య ఊగిసలాడినప్పటికీ, ఆఖరి గంటలో భారీగా పుంజుకున్నాయి. దాంతో సెన్సెక్స్ 409.83 పాయింట్ల వృద్ధితో 80,567.71 వద్ద, నిఫ్టీ 135.45 పాయింట్ల పెరుగుదలతో 24,715.05 వద్ద ముగిశాయి. జీఎస్‌టీ మండలి సమావేశంలో తీసుకోబోయే నిర్ణయాలపై ఆశాభావంతోపాటు మెటల్ షేర్లలో ర్యాలీ ఇందుకు దోహదపడ్డాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 21 రాణించాయి. టాటా స్టీల్ షేరు 5.90 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.90% శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.63% ఎగబాకాయి. రంగాలవారీ సూచీల్లో మెటల్ 3.08 శాతం పుంజుకోగా.. కమోడిటీస్, హెల్త్‌కేర్ ఒక శాతానికి పైగా పెరిగాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు మరో రూ.1,666.46 కోట్ల నికర అమ్మకాలకు పాల్పడగా.. దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు నికరంగా రూ.2,495.33 కోట్ల కొనుగోళ్లు జరిపారు. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి ఆల్‌టైం కనిష్ఠ స్థాయి నుంచి కాస్త కోలుకుంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 9 పైసలు పెరిగి రూ.88.06 వద్ద ముగిసింది.

హైదరాబాద్-ఆమ్‌స్టర్‌డామ్ మధ్య డైరెక్ట్ విమాన సర్వీసు

కేఎల్ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నెదర్లాండ్ కేంద్రంగా పని చేసే కేఎల్ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్ మన దేశంలో తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం హైదరాబాద్ నుంచి నెదర్లాండ్స్ రాజధాని ఆమ్‌స్టర్‌డామ్‌కు డైరెక్ట్ విమాన సర్వీసులు ప్రారంభించింది. వారానికి మూడు రోజులు ఈ సర్వీసులు నడుస్తాయని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మార్టెన్ స్టీనెన్ చెప్పారు. బెంగళూరు, ఢిల్లీ, ముంబై తర్వాత భారత్‌లో హైదరాబాద్ తమకు నాలుగో ప్రవేశ ద్వారమని తెలిపారు. ప్రస్తుతం ఈ నాలుగు నగరాల నుంచి ఆమ్‌స్టర్‌డామ్ వారానికి 24 విమాన సర్వీసులు నడుపుతోంది. వింటర్ సీజన్‌లో ఈ సర్వీసులను 27కు పెంచనున్నట్టు మార్టెన్ స్టీనెన్ చెప్పారు. ఫార్మా, ఐటీ కంపెనీలకు కేంద్రంగా ఎదిగిన హైదరాబాద్ నుంచి సరుకు రవాణాకు అద్భుత అవకాశం ఉందన్నారు. బోయింగ్ 777-200ఈఆర్ విమానాలతో ప్రారంభించిన హైదరాబాద్-అమెస్టర్‌డ్యామ్ విమాన సర్వీసులో వివిధ తరగతుల్లో 288 మంది ప్రయాణించ వచ్చని కేఎల్ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్ అధికారులు చెప్పారు.

హైదరాబాద్‌లో యునిస్పేస్ మెగాస్టోర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : నిర్మాణ, నిర్మాణ పరికరాల రంగంలోని అపర్ణా ఎంటర్‌ప్రైజెస్ (ఏఈఎల్) హైదరాబాద్‌లోని మియాపూర్‌లో యునిస్పేస్ మెగాస్టోర్‌ను ప్రారంభించింది. ఇది ఆసియాలోనే అతి పెద్ద స్టోర్ అని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అశ్విన్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. తమ రిటైల్ విస్తరణలో భాగంగా బెంగళూరు, ఢిల్లీ, ముంబై నగరాల్లో కూడా ఇదే తరహా స్టోర్లు ప్రారంభించాలనుకుంటున్నట్టు చెప్పారు. భవన నిర్మాణంలో ఉపయోగించే 20 రకాల వస్తువులకు ఇది వన్ స్టాప్ సొల్యూషన్‌గా ఉంటుందని కంపెనీ వైస్ ప్రెసిడెంట్ శ్రేయాస్ త్రివేది వెల్లడించారు. కస్టమర్లకు ఇంటి డిజైన్, నిర్మాణం, ఆధునీకరణ వంటి సేవలన్నీ ఒకే ఛత్రం కింద అందించాలన్నది తమ కాన్సెప్ట్ అని ఆయన చెప్పారు. ఇది కస్టమర్లకు సరికొత్త అనుభూతిని అందిస్తుందని ఆయన అన్నారు.

వాగ్దేవి డిగ్రీ సెకండ్ సెమిస్టర్ ఫలితాలు విడుదల

రాంనగర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) సెకండ్ సెమిస్టరీ ఫలితాలను బుధవారం విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్, చీఫ్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ శేషాచలం తెలిపారు. మొత్తం విద్యార్థులు 1,515 మంది పరీక్షలకు హాజరు కాగా, 947 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. బీబీఏలో 63.74, బీకాంలో 59.82, బీఎస్సీ లైఫ్ సైన్సెస్‌లో 65.56, బీఎస్సీ ఫిజికల్ సైన్సెస్ 59.12, బీసీఏలో 68.04 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

ఘనంగా మాచర్ల యేసోబు వర్ధంతి

మడికొండ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు అగ్రనేత మాచర్ల యేసోబు ప్రథమ వర్ధంతి సభ బుధవారం కాజీపేట మండలం టేకులగూడెం గ్రామంలో ఘనంగా జరిగింది. యేసోబు చిత్రపటానికి ప్రముఖ న్యాయవాది మాచర్ల మహేష్ చంద్ర పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నమ్మిన సిద్ధాంతం కోసం కడదాక పోరాడిన విప్లవయోధుడు మాచర్ల యేసోబు అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, బంధు మిత్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



హసన్‌పర్తి పెద్ద చెరువు పరిసరాలను పరిశీలిస్తున్న కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి

నిమజ్జనంలో ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి

హసన్‌పర్తి, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జన ఏర్పాట్లలో ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి పోలీసు సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని హసన్‌పర్తి పెద్ద చెరువు కట్టపై వినాయక నిమజ్జన ఏర్పాట్లను ఏసీపీ బుధవారం స్థానిక ఇన్ స్పెక్టర్ వట్టి చేరాలుతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వినాయక నిమజ్జన వేడుకల్లో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చెరువు కట్ట వెంట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. చెరువు కట్టపై ప్రమాదాలు జరగకుండా బారికేడ్లను ఏర్పాటు చేసే విధంగా అధికారులకు సూచనలు చేయాలని సూచించారు. క్యూ పద్ధతిలో వినాయక నిమజ్జనం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంట ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలుతో పాటు ఎస్సైలు దేవేందర్, శీలం రవిందర్, సుజిత్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన డీఎంహెచ్‌వో

గణేష్ నిమజ్జన ఏర్పాట్లలో భాగంగా హనుమకొండ జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య బుధవారం హసన్‌పర్తి పెద్ద చెరువు కట్టపై వైద్య శిబిరాల ఏర్పాట్లను స్వయంగా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వెంట డాక్టర్ నవిన్, హెల్త్ అసిస్టెంట్ కందుకూరి సంతోష్, ఇంద్రారెడ్డి తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గురువారం బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని లష్కర్ బజార్ మెయిన్ రోడ్డు, లష్కర్ బజార్ ఏరియాలో గురువారం ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 2గంటల వరకు, నక్కలగుట్ట సబ్ స్టేషన్ పరిధిలోని చోటీ మసీదు, కేఎల్ఎన్‌రెడ్డి కాలనీ, సుబేదారి ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా జరుగదని హనుమకొండ టౌన్ డీఈ సాంబారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

● హసన్‌పర్తి: హసన్‌పర్తి ఫీడర్ మరమ్మతులలో భాగంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాల్లో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శిరీష్‌కుమార్ తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

6న ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆదేశాల మేరకు ఈ నెల 6న సివిల్ సర్వీసెస్ పేరుతో హనుమకొండ జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న పురుష, మహిళ ఉద్యోగులకు ఒక్క రోజు పాటు క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, క్యారమ్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్, పవర్‌లిఫ్టింగ్, వెయిట్‌లిఫ్టింగ్, రెజ్లింగ్, బెస్ట్ ఫిజిక్ యోగా, ఖోఖో, స్విమ్మింగ్, క్రీడాంశాల్లో పురుషులకు, మహిళలకు సంయుక్తంగా నిర్వహిస్తమన్నారు. అదే విధంగా క్రికెట్, చెస్, హాకీ క్రీడలు పురుషులకు మాత్రమే నిర్వహించనున్నామన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన ఉద్యోగులు ఈ నెల 9, 10వ తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి, అర్హత కలిగి, జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు ఈ నెల 6న ఉదయం 8గంటలకు జేఎన్ క్రీడా మైదానంలోని డీఎస్ఏ కార్యాలయంలో సంప్రదించాలని అశోక్‌కుమార్ కోరారు. మరిన్ని వివరాలకు డీఎస్ఏ అథ్లెటిక్స్ కోచ్ శ్రీమన్నారాయణ సెల్ 9441086556 నెంబర్‌లో సంప్రదించాలని డీవైఎస్‌వో అశోక్‌కుమార్ సూచించారు.

7న ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7న హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి చెస్ టోర్నీ నిర్వహించనున్నట్లు క్రీడా పోటీల నిర్వాహణ కార్యదర్శి కన్నా ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-15 బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న ఉమ్మడి జిల్లాస్థాయి టోర్నీలో పాల్గొనే విద్యార్థులు 1జనవరి 2010 సంవత్సరం తరువాత జన్మించిన వారు క్రీడా పోటీల్లో పాల్గొనడానికి అర్హులన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 4గురు బాలురు, 4బాలికలను అక్టోబరు నెలలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చెస్ టోర్నీలో జిల్లా తరుఫున ప్రాతినిథ్యం వహిస్తారని కన్నా వెల్లడించారు. ఆసక్తి. అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 7న ఉదయం 8గంటలకు టీటీడీ కల్యాణ మండపంలో రిపోర్టు చేయాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 9059522986 నెంబర్‌లో సంప్రదించాలని కన్నా సూచించారు.

ఆర్ఐ తీరుతో ఉద్యోగాన్ని కోల్పోయాను..

ఓ హోంగార్డు ఆవేదన

వరంగల్ క్రైం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): హోంగార్డ్స్ రిజర్వుడ్ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) తీరుతో తన ఉద్యోగాన్ని కోల్పోయి రోడ్డున పడాల్సి వచ్చిందని హోంగార్డు మేకల గోపి ఆవేదన వ్యక్తం చేశారు. తన తండ్రికి, ఓ వ్యక్తికి ఉన్న వివాదంలో తనను అన్యాయంగా ఇరికించి, సదరు వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారన్నాడు. ఈ విషయంలో హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో తప్పుడు కేసు నమోదు కాగా, ఉన్నతాధికారులకు నివేదిక అందించడంలో ఆర్ఐ చంద్రశేఖర్ వాస్తవాలను చెప్పకుండా తప్పుడు నివేదికలను అందిచేస్తూ తన ఉద్యోగాన్ని కోల్పోయేలా చేశాడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికే పలు మార్లు ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేసినప్పటికీ వారిని తప్పుదోవ పట్టిస్తున్నాడని ఆరోపించాడు. ఆర్ఐ వాస్తవాలను ఉన్నతాధికారుల దృష్టికితీసుకుపోకపోవడంతో సీడబ్ల్యూసీ సంబధించిన గోదాములలో పనిచేస్తున్న సమయంలో 30 జూలై 2024న తనను విధుల్లో నుంచి తొలగించాడని వాపోయాడు. ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలు తెలుసుకుని తనకు వచ్చేలా చూడాలని ప్రాధేయపడ్డాడు.

మోదీ చేతిలో పావుగా ఎన్నికల కమిషన్

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ బద్ధమైన ఎన్నికల కమిషన్‌ను ప్రధాని నరేంద్రమోదీ పావుగా వాడుకుంటున్నారని బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జి బొట్ల మనోహర్ ఆరోపించారు. బుధవారం కేయూ మొదటి గేటు వద్ద బీఎస్ఎఫ్ నేతృత్వంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ.. ఓట్ల చోరీతో బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. 2024 ఎన్నికల్లో బీజేపీకి ఓటర్ల విశ్వసనీయత రాలేదని, చోరీతోనే గెలిచిందన్నారు. రాజ్యాంగ బద్ధ సంస్థలను తమ స్వలాభంకోసం దుర్వినియోగం చేస్తోందన్నారు. ఒకే ఇంటి నెంబర్లతో ఓట్ల నమోదు చేపట్టారని ఆరోపించారు. పార్లమెంటును రద్దుచేసి బ్యాలెట్‌తో ఎన్నికలు నిర్వహించి నిజాయితీ నిరూపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ నాయకులు కడదారపు నవీన్, దాసరి భరత్, సతీశ్, వరుణ్, రమ్య, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఆదిదేవా నమోనమహః

- గణపయ్యకు భక్తజన నీరాజనం
- 8వ రోజుకు చేరుకున్న వేడుకలు



శ్రీరామ టవర్స్‌లోని వినాయక విగ్రహం దగ్గర జరిగిన సరస్వతి పూజలో పాల్గొన్న విద్యార్థులు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మహానగరంలో ప్రతిష్ఠించిన గణనాథులు భక్త జనులచే అపూర్వ నీరాజనాలు అందుకుంటు న్నాయి. ఎక్కడ చూసిన అన్నదానాల సందడి, రాత్రివేళల్లో సాంస్కృతిక సందడి పూజా కార్యక్రమాల తంతుతో నగర మంతామైకుల్లో గణేషుడిభక్తిపాటలు ప్రతిధ్వనిస్తున్నాయి. హనుమకొండలోని ప్రసిద్ధ వేయి స్తంభాల ఆలయంలో 8వ రోజుకు చేరుకున్న వేడుకల పర్వంలో భాగంగా బుధవారం మూల గణ పతి నారసింహగణపతిగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి మహానివేదన సమర్పించారు. వద్దిరాజు వెంకటేశ్వర్లు దంపతులు పూజల్లో పాల్గొన్నారు. చం దుపట్ల సత్యపాల్‌రెడ్డి సౌజన్యంతో ఆలయంలో మధ్యాహ్నం మహన్నదానం నిర్వహించారు. సాయం త్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పిండి సుభాషిణి శిష్య బృందంచే నృత్యాలు, కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు.



కొత్తూరు జెండా వద్ద జై హనుమాన్ గజానన మండలి ఆధ్వర్యంలో..

● వడ్డేపల్లి: హనుమకొండలోని వివిధ డివిజన్లలో వినాయక నవ రాత్రి ఉత్సవాలు 8వ రోజు మండపాలలో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. 57వ డివిజన్ గోకుల్ నగర్‌లో గోకుల్ గజానన మండలి అధ్యక్షుడు బంక సతీష్ యాదవ్, ప్రతినిధులు వేల్పుల లక్ష్మణ్, బొల్లు భాస్కర్ ఆధ్వర్యంలో మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్న వితరణను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్, విద్యావేత్త మూగల కుమార్ యాదవ్‌తోపాటు భక్తులు పాల్గొన్నారు. గోకుల్ నగర్ గజానన మండలి ఆధ్వర్యంలో మహిళలు గణపతిని స్తుతిస్తూ కోలాటంతో పాటు ఆలాపించిన భజన కీర్తనలతో లంబోదరుడి నామస్మరణ మార్మోగింది. హనుమకొండ 56వ డివిజన్ గోపాల్‌పూర్ దేవరాజ్ కాలనీలో మాజీ ఎంపీటీసీ దూలం నీరజ రాజుగౌడ్ ఆధ్వర్యంలో మండపం వద్ద దూలం శ్రీనివాస్- రవీంద్రాదేవి, వీరేషం - సరస్వతి దంపతులతోపాటు ఎనిమిది జంటలు లక్ష్మి గణపతి హోమాన్ని నిర్వహించారు. హనుమకొండ 58వ డివిజన్ ఎన్జీవోస్ కాలనీ రాఘవేంద్రనగర్ ఫేస్ -2లో ఫిషర్‌మెన్ కాంగ్రెస్ స్టేట్ డైరెక్టర్ మండల సమ్మయ్య ముదిరాజ్ ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఐలి తేజస్విని- కరుణాకర్‌గౌడ్ దంపతులు, సీనియర్ కాంగ్రెస్ నేత జనగాం శ్రీనివాస్‌గౌడ్, మండల సంధ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన అన్నదాన వితరణను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సతీమణి నాయిని నీలిమారెడ్డి ప్రారంభించారు.

● మడికొండ: మడికొండలోని మెట్టు రామన్న కాలనీ అధ్యక్షుడు పైడిపాల రవీందర్ ఆధ్వర్యంలో 108 రకాల నైవేద్యాలను వినాయకుడికి మహిళలు సమర్పించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అన్న ప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు సత్యనారాయణ, గోవిందరెడ్డి, సుధాకర్, రాజు, వేమన, యాకన్న, సురేష్‌కుమార్, చంద్రన్న, చంద్రమౌళి, మహేష్‌తోపాటు మహిళలు పాల్గొని విఘ్నాదిపతిని కొలిచారు.

● న్యూశాయంపేట : హనుమకొండ హంటర్‌రోడ్డులోని 31వ డివిజన్ అభయాంజనేయ స్వామి కాలనీలో ఉన్న పీవీఆర్ శ్రీరామ టవర్స్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద బుధవారం మహిళలు, విద్యార్థులు, భక్తుల ఘనంగా సరస్వతి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిన్నింటి వెంకటేశ్వర్‌రావు, మార్నేని లక్ష్మణ్‌రావు, సుంకరి మల్లేశం, నలివెల రాజ్‌కుమార్, వేణుగోపాల్‌రావు, సత్యనారాయణ, సీతారాంరెడ్డి, ధనరాం, భక్తులు పాల్గొన్నారు.



సింహగణపతిగా రుద్రేశ్వరాలయ మూలగణపతి



గౌతమ్ నగర్‌లో కుంకుమ పూజలో..

ఎస్సార్‌యూలో అంతర్జాతీయ ఉన్నత విద్యా మేళా

హసన్‌పర్తి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయం ఎస్సార్ఐఎక్స్ ఆడిటోరియంలో బుధవారం అంత ర్జాతీయ ఉన్నత విద్యా మేళా-2025 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సార్‌యూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ మేళాను ప్రారంభించారు. ఈ మేళాలో అమెరికా, యూకే, యూరప్, కెనడా, న్యూజిలాండ్ తదితర దేశాలకు చెందిన 30కిపైగా ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొన్నారు. యూనివర్సిటీ హబ్, అబకాస్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ అడ్వైజర్స్ సంయుక్తంగా నిర్వహించిన ఈ మేళాకు 2500 మందికి పైగా విద్యార్థులు పాల్గొని ఉన్నత విద్యా అవకాశాలు, స్కాలర్‌షిప్స్, గ్లోబల్ కెరీర్ మార్గాల గురించి తెలుసుకున్నారు. ప్రముఖ విశ్వవిద్యాలయాలలో నార్త్ ఈస్ట ర్న్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్ లండన్, యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిస్, సిటీ యూనివర్సిటీ, జావియర్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ వైకాటో, యూనివర్సిటా కాటోలికా డెల్ సాక్రో కుఓర్, డబ్ల్యూపీఐ, గానన్ యూనివర్సిటీ, రేవన్స్‌బోర్న్ యూనివర్సిటీ లండన్, ఓఎంఎన్ఈఎస్ ఎడ్యుకేషన్, గ్రూప్ ఇజెన్సియా, ఈఎస్‌డీఈఎస్ బిజినెస్ స్కూల్ వంటి విశ్వవిద్యాలయాల ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు. విద్యార్థులు ప్రత్యక్షంగా విశ్వవిద్యాలయ ప్రతినిధులతో మాట్లాడి అడ్మిషన్లు, స్కాలర్‌షిప్స్, వీసా ప్రక్రియలపై విలువైన సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఎస్సార్ యూనివర్సిటీ అధికారులు మాట్లాడుతూ ఈ మేళా అంతర్జాతీయ విద్యా అవకాశాలను కోరుకునే విద్యార్థులకు ఒక వేదికగా నిలిచిందన్నారు.

బార్ షాపు అనుమతి రద్దు చేయాలి

వడ్డేపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ వడ్డేపల్లి చర్చి జంక్షన్‌లో బార్ అండ్ రెస్టారెంట్‌కు అనుమతిని రద్దు చేయాలని వడ్డేపల్లి దళిత వెల్ఫేర్ కమిటీ ప్రతినిధులు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌ను కోరారు. బుధవారం హనుమకొండలోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఆయన మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి దళిత వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్ (జేకే), ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి ప్రవీణ్‌కుమార్, కోశాధికారి నల్ల ఆశీర్వాదం మాట్లాడుతూ.. వడ్డేపల్లిచర్చి ప్రాంతానికి మంజూరైన బార్ అండ్ రెస్టారెంట్‌ను నివాసాల మధ్య కాకుండా వేరే ప్రాంతానికి మార్చాలని అన్నారు. చర్చి ప్రాంతంలో బార్ అండ్ రెస్టారెంట్‌కు అనుమతిస్తే శాంతి భద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఐదు చర్చీలతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ అండ్ పీజీ మహిళా కళాశాలలు ఉన్నాయని అన్నారు. చర్చి ప్రాంతంలో బార్ షాపు నెలకొల్పితే మహిళలు, విద్యార్థినులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందనీ ఆవేదన వ్యక్తం చేశారు.

బీసీ రిజర్వేషన్లకు రాజకీయ పార్టీల మోకాలడ్డు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్

బాలసముద్రం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల పెంపునకు అగ్రకుల ఆధిపత్య రాజకీయ పార్టీలు మోకాలడ్డుతున్నాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుకు నోటితో మద్దతు చెబుతూ నొసటితో వెక్కిరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన బీసీ గణనలో 56 శాతం బీసీలు ఉన్నట్లు తేలిందని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని రాహుల్ గాంధీ సమక్షంలో ప్రకటించారని గుర్తు చేశారు. 20నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల కోసం పాటుపడుతుందని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రకారంగా రిజర్వేషన్లు ఉన్నాయని, జనాభాలో 60శాతం ఉన్న బీసీలకు కనీసం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా రాజకీయ పార్టీలు ఎందుకు ముందుకు రావడం లేదన్నారు. పార్లమెంట్‌లో చట్టం చేసేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పూనుకోవాలని, ప్రతిపక్షంలో ఉన్న ఇండియా కూటమి రిజర్వేషన్ల కోసం డిమాండ్ చేయాలని అన్నారు. రాష్ట్రం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న బీజేపీ నాయకులు కేంద్రానికి కనీసం వినతిపత్రం కూడా ఇవ్వలేదని, వారి కుట్రను బీసీలు అర్థం చేసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీకి ఎన్నికల సమయంలోనే తాను బీసీనని గుర్తుకు వస్తుందని, నిజానికి ఆయనకు చిత్తశుద్ధి ఉంటే బీసీల 42శాతం బిల్లుకు చట్టబద్ధత కల్పించేందుకు పూనుకోవాలన్నారు. మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం తీసుకువచ్చిన నరేంద్రమోదీ బీసీ మహిళలకు రిజర్వేషన్లు ఎందుకు కల్పించలేదన్నారు. బీసీ ప్రధాన మంత్రిగా ఉన్న ఆయన అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు కల్పించి చరిత్ర సృష్టించారన్నారు. రాజకీయ పార్టీలన్ని బీసీ రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇచ్చి గవర్నర్, రాష్ట్రపతి వద్దకు వెళ్లి బిల్లుకు ఆమోదం తెలపాలని కోరాలని, అలా అయితేనే వివిధ పార్టీలు బతికిబట్టకడతాయని, లేకుంటే బీసీ పార్టీ పెట్టి తామే అధికారంలోకి వస్తామన్నారు.

ఈ విలేకరుల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి బీమనగాని యాదగిరి, ఇంటెలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సంగాని మల్లేశ్వర్, బీసీ కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వరంగల్ శ్రీనివాస్, బీసీ యువజన సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పాండవుల సురేష్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తమ్మల శోభారాణి, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు మాడిశెట్టి అరుంధతి తదితరులు పాల్గొన్నారు.



హన్మకొండలో ఎంపీ రాజేందర్‌తో అరూరి రమేష్, బీజేపీ నాయకులు

అరూరి తేనేటి విందుకు హాజరైన ఈటల

వరంగల్ క్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ప్రశాంత్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ ఇంటికి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ బుధవారం రాత్రి చేరుకున్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలో జరుగుతున్న బీఎంఎస్ మీటింగులో పాల్గొని తిరిగి హైదరాబాద్‌కు వెళ్తుండగా అరూరి రమేష్ ఇచ్చిన తేనేటి విందులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులతో కాసేపు ముచ్చటించారు.

వడ్డెరల సంక్షేమానికి సర్కారు పెద్ద పీట

వడ్డేపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వడ్డెర కులస్తుల సంక్షేమానికి సర్కారు పెద్ద పీట వేస్తూ ప్రత్యేక రాయితీ పథకాలను రూపొందించి అమలు చేస్తుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన గండికోట సంపత్ బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం ఇచ్చి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ వడ్డెర కులస్తులకు బీసీ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక రుణ సహాయాన్ని అందించడంతోపాటు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో తగిన ప్రాధాన్యత కల్పిస్తామని అన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వడ్డెర సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లపు మల్లికార్జున్, అర్బన్ అధ్యక్షుడు కంది శ్రీనివాస్, కాజీపేట మండల అధ్యక్షుడు కంది రాజు, యూత్ అధ్యక్షుడు పల్లపు నవీన్, ఐనవోలు మండల అధ్యక్షుడు వల్లెపు నాగరాజు తదితరులు ఉన్నారు.

కేయూ ఉద్యోగాల్లో ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయాలి

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో చేపట్టబోయే అన్ని ఉద్యోగాలు, సీట్ల కేటాయింపులో ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కేయూ మాదిగ నిరుద్యోగ నేతలు, స్టూడెంట్స్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని తన చాంబర్‌లో కలిసి ఎస్సీ వర్గీకరణ జీవోలను అమలు చేయాలని వినతిపత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో కేయూ మాదిగ నిరుద్యోగ యువత, స్టూడెంట్స్ నేతలు డాక్టర్ మంద వీరాస్వామి, డాక్టర్ పాలమాకుల కొమురయ్య, ఎంఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జి డాక్టర్ వడ్డేపల్లి మధు, అధ్యక్షుడు కుమ్మరి శ్రీనాథ్, డాక్టర్ పుల్లా కుమార్, డాక్టర్ నరసింహ, డాక్టర్ ధర్మవరపు నాగయ్య, కలకోట సుమన్, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్‌పై నిరుద్యోగ యువత ప్రశ్నించాలి

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికలకు వచ్చే నాయకులను నిరుద్యోగ యువత జాబ్ క్యాలెండర్‌పై ప్రశ్నించాలని, ఉద్యోగాలను నోటిఫికేషన్లు సాధించుకోవాలని స్వేరోస్ స్టూడెంట్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ అన్నారు.

బుధవారం కేయూ గెస్ట్‌హౌస్ ఎదుట స్వేరోస్ స్టూడెంట్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల హామీ జాబ్‌క్యాలెండర్‌పై నిరుద్యోగ యువత ప్రశ్నించాలని అన్నారు. ఈ సమావేశంలో స్వేరో స్టూడెంట్ యూనియన్ నేతలు ప్రతాప్, అజయ్, వెంకటేశ్, చౌదరి, శ్రీకాంత్, మహాదేవ్, టీకాజీ, గణేశ్, శివ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

యువ ఆపద మిత్ర కోసం శిక్షణ

దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నేషనల్ డిజా స్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ, మేరా యువ భారత్ సంయు క్తాధ్వర్యంలో యువ ఆపదమిత్ర కార్యక్రమంలో భాగంగా సామాజిక స్పృహ కలిగిన యువతకు శజిక్షణ ఇవ్వనున్నట్లు వరంగల్ మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సమాజంలో వరదలు, కరువు, భూకంపాలు, కరోనా వంటి విపత్కర సమయాల్లో సహాయక చర్యలు చేపట్టడానికి భద్రతా దళాలకు అండగా ఉండటానికి యువతను సుశిక్షితులను చేసే అద్భుతమైన కార్యక్రమం ఇదని ఆయన పేర్కొన్నారు. వారం పాటు హనుమకొండ, వరంగల్‌లో జరిగే శిక్షణ శిబిరం నిర్వహణకు అన్ని ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని, ఆపత్కాలంలో ఉపయోగకరంగా ఉండే ఒక ఎమర్జెన్సీ కిట్‌తో పాటు శిక్షణ పొందినట్లు ప్రభుత్వం సర్టిఫికెట్ కూడా ఇస్తుందని తెలిపారు.

అర్హతలు:

ప్రభుత్వం జారీచేసిన అడ్రెస్‌ప్రూఫ్‌తో వరంగల్, హనుమకొం డ జిల్లాలకు చెందినవారై ఉండాలి. వయసు 18 నంచి 40 ఏళ్ల మధ్యలో ఉండాలి. విద్యార్హత కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలి. మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలి. దరఖాస్తుకు ఈనెల 6 చివరి తేదీ. గ్రామాల్లోని యువత, విద్యార్థులు, యువజన సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున నమోదు చేసుకోవాలని అన్వేష్ పిలుపునిచ్చారు. పూర్తి వివరాల కోసం హనుమకొండ బస్‌స్టాండ్ సమీపంలోని మై భారత్ కార్యాలయంలో (నెహ్రూ యవ కేంద్రం)లో సంప్రదించవచ్చు. ఫోన్ నెం 0870-2958776.

తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూసేకరణ) శాఖ
ఫారం-6
ప్రాథమిక ప్రకటన

(తెలంగాణ సవరణ చట్టం 2016 లోని చాప్టర్ III ఎ లోని 10 ఎ అనుసరించి)
(చట్టంలోని సెక్షన్-11 క్రింద దీనిలో 10ఎ మినహాయింపు కలదు)
(నిబంధన 6/12 చూడుము)

గెజిట్ నెం./64 /2025 తేది: 29.08.2025
జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి ఫైల్ నెం. బి/1332/2025 తేది: 29.08.2025
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (LA) యాదాద్రి భువనగిరి ఫైల్ నెం. ఎ/12/2025 తేది: 08.2025

జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారు యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామములో విస్తీర్ణం ఎ.616-05 గుంటల భూమి ప్రజా ప్రయోజనార్థం నిమిత్తం అనగా, కాళేశ్వరం ప్రాజెక్ట్ క్రింద గంధమల్ల జలాశయము నిర్మాణము కొరకు తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారు అవసరమైయున్నదని భావించినందున సదరు భూసేకరణకై ఇట్టి ప్రకటన జారీచేయనైనది.

ప్రభుత్వము ఉత్తర్వుల నెం. 35 I&CAD (LA.R&R/A2) శాఖ తేది: 30.06.2017 ద్వారా కాళేశ్వరం ప్రాజెక్ట్ కొరకు భూసేకరణ నష్టపరిహారం మరియు పునరుపాధి కల్పన (పారదర్శకత మరియు న్యాయబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు) చట్టం- 2013 లోని చాప్టర్-II (సామాజిక ప్రభావ అంచనా అధ్యయనం) మరియు చాప్టర్-III (ఆహార భద్రత పరిరక్షణ) వర్తింపు నుండి మినహాయింపు ఇవ్వనైనది.

ఇట్టి ప్రాజెక్టుకు పునరావాసం మరియు పునరుపాధి కల్పనకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) యాదాద్రి భువనగిరి గారిని కార్యనిర్వాహకునిగా (అడ్మినిస్ట్రేటర్)గా నియమించనైనది.

కావున, పైన తెలిపిన గంధమల్ల జలాశయము నిర్మాణ నిమిత్తం యాదాద్రి భువనగిరి జిల్లా, తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామములో విస్తీర్ణం ఎ.616.05 గుంటల యొక్క వివరములు ఈ దిగువ చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీ చేయనైనది.

షెడ్యూల్

జిల్లా : యాదాద్రి భువనగిరి మండలం : తుర్కపల్లి గ్రామం : గంధమల్ల
ప్రాజెక్ట్: కాళేశ్వరం ప్రాజెక్ట్ క్రింద గంధమల్ల జలాశయ నిర్మాణము

క్ర.సం.	సర్వే నెం.	భూమి రకము (పట్టా/ఇనాం)	భూమి స్వభావం (తరి/ఖుష్కి)	మొత్తం విస్తీర్ణం	పట్టాదారుని పేరు (తండ్రి/భర్త పేరు)	అనుభవదారుని పేరు (తండ్రి/భర్త పేరు)	విస్తీర్ణం	భూమిలో ఉన్న నిర్మాణాలు (బోర్లు/చెట్లు/బావులు మొ||)	తూ	ప	ఉ	ద
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13
1	266	ఇనాం	తరి	4.3800	రాగుల మల్లయ్య (సోమయ్య)	రాగుల మల్లయ్య (సోమయ్య)	0.2500	-	255	259	258	256
					రాగుల లక్ష్మీనర్సయ్య (సోమయ్య)	రాగుల లక్ష్మీనర్సయ్య (సోమయ్య)	2.2400	బోర్-2 పైప్ లైన్-1 గొర్ల షెడ్-1				
					రాగుల సత్తయ్య (సోమయ్య)	రాగుల సత్తయ్య (సోమయ్య)	0.2400	-				
					ఐల్నేని నర్సయ్య (భోజయ్య)	ఐల్నేని నర్సయ్య (భోజయ్య)	0.2500	-				
					రాగుల సత్తమ్మ (సత్తయ్య)	రాగుల సత్తమ్మ (సత్తయ్య)	0.1900	-				
2	269	పట్టా	తరి	2.1900	బూర్గు ముత్తయ్య (ఎల్లయ్య)	బూర్గు ముత్తయ్య (ఎల్లయ్య)	0.3200	-	255	258	131	257
					బూర్గు మల్లయ్య (ఎల్లయ్య)	బూర్గు మల్లయ్య (ఎల్లయ్య)	0.3200	బోర్-1				
					బూర్గు నర్సింహులు (కొమురయ్య)	బూర్గు నర్సింహులు (కొమురయ్య)	0.1600	-				
					బూర్గు శ్రీశైల (భర్త కొమురయ్య)	బూర్గు శ్రీశైల (భర్త కొమురయ్య)	0.1600	-				
3	272	పట్టా	తరి	2.3000	దేశబోయిన చంద్రయ్య (లక్ష్మయ్య)	దేశబోయిన చంద్రయ్య (లక్ష్మయ్య)	0.1300	-	310	305	256	307
					చింతకింది చిత్తారి (చింతకింది చిన్నపతి)	చింతకింది చిత్తారి (చింతకింది చిన్నపతి)	0.0950	-				
					క్యాగర్ల కనకయ్య (యాదగిరి)	క్యాగర్ల కనకయ్య (యాదగిరి)	0.0800	బోర్-1 తుమ్మ చెట్టు-1				
					క్యాగర్ల మల్లేశం (యాదగిరి)	క్యాగర్ల మల్లేశం (యాదగిరి)	0.0600	బోర్-1				
					క్యాగర్ల పరమేష్ (యాదగిరి)	క్యాగర్ల పరమేష్ (యాదగిరి)	0.0600	-				
					దేశమైన కనకాయ (ఆగయ్య)	దేశమైన కనకాయ (ఆగయ్య)	0.0400	బోర్-1				
					క్యాగర్ల వెంకటేశం (లింగమయ్య)	క్యాగర్ల వెంకటేశం (లింగమయ్య)	0.1800	-				
					దేశమైన రాములు (బాలమల్లు)	దేశమైన రాములు (బాలమల్లు)	0.0400	-				
					దేశబోయిన నాగేష్ (బాలమల్లు)	దేశబోయిన నాగేష్ (బాలమల్లు)	0.0400	-				
					దేశమైన ఎల్లయ్య (బాలమల్లు)	దేశమైన ఎల్లయ్య (బాలమల్లు)	0.0400	-				
					దేశమేని హంస (దేశమేని జలరాయ)	దేశమేని హంస (దేశమేని జలరాయ)	0.0800	-				
					నక్కల వెంకటేష్ (నక్కల సత్తయ్య)	నక్కల వెంకటేష్ (నక్కల సత్తయ్య)	0.0750	-				
					బోదా దయానంద్ (బోరబాల నరసయ్య)	బోదా దయానంద్ (బోరబాల నరసయ్య)	0.0200	-				
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]

(మిగతా 10వ పేజీలో)

సౌర వ్యవస్థలో వింత ఖగోళ పదార్థం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: 3ఐ/అట్లాస్ అనే ఖగోళ పదార్థం ఒకటి సౌర కుటుంబ వ్యవస్థలోకి ప్రవేశించిందని, ఇతర అంతరిక్ష పదార్థాలతో పోలిస్తే పూర్తి భిన్నంగా ఉన్న అది గ్రహాంతరవాసుల నౌక కావొచ్చని హార్వర్డ్ వర్సిటీకి చెందిన ఖగోళ శాస్త్రవేత్త అవీ లోయెబ్ అభిప్రాయపడ్డారు. 20కిలోమీటర్ల వెడల్పు ఉన్న ఈ ఖగోళ పదార్థానికి ఆస్టరాయిడ్, తోకచుక్కల లక్షణాలు లేవన్నారు. సౌర వ్యవస్థలో గ్రహాలు, ఉల్కలు, ఉపగ్రహాలు తిరిగే దిశలో కాకుండా ఇది వ్యతిరేక దిశలో తిరుగుతోందని చెప్పారు. అయితే, అది గ్రహాంతరవాసుల నౌక అనేది కేవలం తన ఊహ మాత్రమేనని వివరించారు. 3ఐ/అట్లాస్ కక్ష్య, భూ కక్ష్యకు 5డిగ్రీల కోణంలో తిరుగుతోందని, అందువల్ల ఇది భూమిని తాకే అవకాశం 2శాతం మాత్రమేనని పేర్కొన్నారు.

వరదలతో పంజాబ్ అతలాకుతలం

చండీగఢ్, సెప్టెంబరు 3: భారీ వర్షాలు, వరదల కారణంగా పంజాబ్ అతలాకుతలమయింది. వరదల్లో చిక్కుకొని 37 మంది ప్రాణాలు కోల్పోయారు. 1988లో వచ్చిన వరదల తరువాత మళ్లీ 37 ఏళ్ల అనంతరం అంతటి భారీ విపత్తు సంభవించింది. రాష్ట్రంలోని మొత్తం 23 జిల్లాలు వరదలకు గురికాగా, 1,655 గ్రామాల్లోని 3.7 లక్షల మందిపై ప్రభావం పడిందని అధికార వర్గాలు తెలిపాయి. 1.48 లక్షల ఎకరాల్లోని పంటలు దెబ్బతిన్నాయి. భారీ వర్షాల కారణంగా సట్లెజ్, రావి, బియాస్ నదులతో పాటు జమ్మూ-కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌లోని వాగులు పొంగిపొర్లుతుండడంతో ఆ ప్రభావం పంజాబ్‌పై పడింది. కొన్ని చోట్ల పొలాలు 8 నుంచి 10 అడుగుల లోతు ఉన్న చెరువుల్లా తలపిస్తున్నాయి. నీరు నిలబడడంతో ప్రజలు బోట్లు మీద ప్రయాణించాల్సి వస్తోంది. గురుదాస్‌పూర్, పఠాన్‌కోట్, ఫిరోజ్‌పూర్, కాపుర్తలా, హోషియార్‌పూర్, తరన్‌తారన్, అమృత్‌సర్ జిల్లాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. చాలా చోట్ల ప్రజలు ఇళ్ల పైకప్పులపైనే ఉంటున్నారు. ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ ఫిరోజ్‌పూర్ జిల్లాలో పర్యటించారు. బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. దేశం సంక్షోభంలో ఉన్నప్పుడు పంజాబ్ సాయపడిందని, ఇప్పుడు పంజాబ్ సంక్షోభంలో ఉందని, దేశం మొత్తం అండగా నిలబడాలని కోరారు. అన్ని విద్యాసంస్థలకు ఈ నెల ఏడో తేదీ వరకు సెలవులు ప్రకటించారు.

46	327	ఖరారు	తరి	0.2300	ఆలేటి బలరాం (మల్లయ్య)	ఆలేటి బలరాం (మల్లయ్య)	0.1100	-	521	533	543	536
					ఆలేటి చంద్రయ్య (నర్సయ్య)	ఆలేటి చంద్రయ్య (నర్సయ్య)	0.0100	-				
					ఆలేటి గోపాల్ (బాలనర్సయ్య)	ఆలేటి గోపాల్ (బాలనర్సయ్య)	0.0100	-				
					ఆలేటి రాందాసు (బాలనర్సయ్య)	ఆలేటి రాందాసు (బాలనర్సయ్య)	0.0050	-				
					ఆలేటి బాల్ నారాయణ(నర్సయ్య)	ఆలేటి బాల్ నారాయణ(నర్సయ్య)	0.0300	-				
					ఆలేటి బాలకిష్టయ్య (సత్తయ్య)	ఆలేటి బాలకిష్టయ్య (సత్తయ్య)	0.0200	-				
					ఆలేటి ఆనంద్ (మల్లయ్య)	ఆలేటి ఆనంద్ (మల్లయ్య)	0.0300	-				
					ఆలేటి శ్రీశైలం (సుదర్శన్)	ఆలేటి శ్రీశైలం (సుదర్శన్)	0.0050	-				
					బురుజు బృంద అలియాస్ ఆలేటి ప్రకాశ్ (సుదర్శన్)	బురుజు బృంద అలియాస్ ఆలేటి ప్రకాశ్ (సుదర్శన్)	0.0050	-				
					ఆలేటి శ్రీనివాస్ (సుదర్శన్)	ఆలేటి శ్రీనివాస్ (సుదర్శన్)	0.0050	-				

రష్యాలో రామాయణ చిత్రరూప ఆవిష్కరణ

వ్లాదివోస్టోక్ ఆర్ట్ గ్యాలరీలో చిన్నారుల ప్రదర్శన

వ్లాదివోస్టోక్(రష్యా), సెప్టెంబరు 3: రామాయణానికి రష్యన్ బాలలు చిత్ర రూపాన్ని ఇచ్చారు. వ్లాదివోస్టోక్‌లో నిర్వహించిన ఈ చిత్రకళా ప్రదర్శన రెండు దేశాల సంస్కృతుల మధ్య ఏకత్వానికి ప్రతీకగా నిలిచింది. రష్యాలోని 5 నుంచి 16 ఏళ్ల వయస్సు కలిగిన చిన్నారులు రామాయణంలోని సార్వజనీన విలువలను ప్రేరణగా తీసుకుని రూపొందించిన చిత్రకళాఖండాలు ఈ ప్రదర్శనలో పాలుపంచుకున్నాయి. భారత ప్రధాని 'మన్‌కీ బాత్' 125 ఎడిషన్‌లో చెప్పిన 'రాముడు కేవలం భారతీయులకు మాత్రమే చెందిన వాడు కాదు... అందరికీ చెందిన వాడు' అన్న మాటలు ఈ చిత్ర ప్రదర్శనకు స్ఫూర్తిగా నిలిచాయి. భారత్-రష్యా క్లబ్, ప్రిమోర్యే స్టేట్ ఆర్ట్ గ్యాలరీల సహకారంతో భారత దౌత్య కార్యాలయం దీనిని నిర్వహించింది. రామాయణ కథల ద్వారా భారతీయ సాంస్కృతిక వారసత్వం ప్రపంచ వేదికపై చిన్నారుల కుంచెలతో ఆవిష్కృతమయింది. వ్లాదివోస్టోక్ తీవ్ర చలిగాలలకు ప్రసిద్ధి. ఇక్కడ ఉష్ణోగ్రతలు -20 డిగ్రీల సెల్సియస్ నుంచి - 30 డిగ్రీల సెల్సియస్ వరకూ వెళ్తాయి. అంతటి గడ్డకట్టించే చలిలోనూ రామాయణ స్ఫూర్తి, భారతీయ సంస్కృతి ఆర్ట్ గ్యాలరీలో చిక్కటి వెచ్చదనాన్ని పంచింది. 125వ మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, 'రామాయణం పట్ల ఉన్న ప్రేమ, భారత సంస్కృతిపట్ల ప్రంపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆసక్తి ఎంతో ఆనందకరం. వ్లాదివోస్టోక్‌లో జరిగిన ప్రదర్శన దీనికి చక్కటి ఉదాహరణ' అని పేర్కొన్నారు.

నాగ్‌పూర్ జైలు నుంచి గ్యాంగ్‌స్టర్ అరుణ్ గావ్లీ విడుదల

ముంబయి, సెప్టెంబరు 3: సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో గ్యాంగ్‌స్టర్-మాజీ ఎమ్మెల్యే అరుణ్ గావ్లీ (76) బుధవారం నాగ్‌పూర్ సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు. 17 ఏళ్ల పాటు జైలు జీవితం అనుభవించడం, శిక్షపై ఆయన చేసిన అప్పీలు ఇంకా పెండింగ్‌లో ఉండడంతో గత నెల 28న ఆయనకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. 2007లో ముంబయికి చెందిన శివసేన కార్పొరేటర్‌ను హత్య చేసిన కేసులో ఆయనకు ట్రయల్ కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది.

(మిగతా 11వ పేజీలో)

					చింతకింది కిష్టయ్య (CH పెద్దలు)	చింతకింది కిష్టయ్య (CH పెద్దలు)	0.0100	-				
					వేర్పుల జహంగీర్ (లక్ష్మయ్య)	వేర్పుల జహంగీర్ (లక్ష్మయ్య)	0.1500	-				
67	384	పట్టా	తరి	1.0000	దాకు నర్సింహులు (దాశయ్య)	దాకు నర్సింహులు (దాశయ్య)	0.0200	-	497	350	340	352
					దాకు యాదగిరి (రామయ్య)	దాకు యాదగిరి (రామయ్య)	0.0400	-				
					దాకు వెంకటేశం (లక్ష్మయ్య)	దాకు వెంకటేశం (లక్ష్మయ్య)	0.0150	-				
					వేర్పుల దాశయ్య (మల్లయ్య)	వేర్పుల దాశయ్య (మల్లయ్య)	0.0300	-				
					వేర్పుల అఖిల (జనలయ్య)	వేర్పుల అఖిల (జనలయ్య)	0.0100	-				
					తోకేటి మల్లేశం (మల్లయ్య)	తోకేటి మల్లేశం (మల్లయ్య)	0.0200	-				
					దాకు రాజయ్య (దాశయ్య)	దాకు రాజయ్య (దాశయ్య)	0.0200	-				
					దాకు జయమ్మ (రామయ్య)	దాకు జయమ్మ (రామయ్య)	0.0200		-			
					దాకు నగేష్ (రామయ్య)	దాకు నగేష్ (రామయ్య)	0.0200		-			
					వేర్పుల జనమ్మ (నర్సింహులు)	వేర్పుల జనమ్మ (నర్సింహులు)	0.0100	-				
					తోకేటి అందమ్మ (యాదగిరి)	తోకేటి అందమ్మ (యాదగిరి)	0.0100	-				
					దాకు రమేశ్ (డి.లక్ష్మయ్య)	దాకు రమేశ్ (డి.లక్ష్మయ్య)	0.0150	-				
					దాకు నాగేష్ (డి.లక్ష్మయ్య)	దాకు నాగేష్ (డి.లక్ష్మయ్య)	0.0100	-				
					దాకు వెంకటయ్య (పేర్నయ్య)	దాకు వెంకటయ్య (పేర్నయ్య)	0.0500	-				
					వేర్పుల జహంగీర్ (లక్ష్మయ్య)	వేర్పుల జహంగీర్ (లక్ష్మయ్య)	0.0200	-				

పాకిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి

3 వేర్వేరు ఘటనల్లో 25మంది మృతి

ఇస్లామాబాద్, సెప్టెంబర్ 3: పాకిస్థాన్‌లో మంగళవారం జరిగిన మూడు వేర్వేరు దాడుల్లో 25 మంది మృతి చెందారు. బలూచిస్తాన్ నేషనల్ పార్టీ (బీఎన్‌పీ)వ్యవస్థాపకుడు అతావుల్లా మెంగల్ వర్ధంతి సందర్భంగా బలోచ్ రాజధాని క్వెట్టాలో ఆ పార్టీ మద్దతుదారులు నిర్వహించిన బహిరంగసభ లక్ష్యంగా చేసుకుని మొదట ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ ఘటనలో 14మంది ప్రాణాలు కోల్పోగా 35మంది గాయపడ్డారు. బీఎన్‌పీ నేత అఖ్తర్ మెంగల్‌ను లక్ష్యంగా చేసుకుని దుండగులు ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. అయితే, ఈ ప్రమాదం నుంచి ఆయన సురక్షితంగా బయటపడ్డారు. ఈ దాడి జరిగిన కొన్ని గంటలకే, బలూచ్-ఇరాన్ సరిహద్దు వద్ద జరిగిన బాంబు దాడిలో ఐదుగురు పారామిలిటరీ సిబ్బంది మృతిచెందగా, నలుగురు గాయపడ్డారు. మరో ఘటన, వాయవ్య ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సులోని బన్నులో జరిగింది. ఫ్రంటియర్ కోర్ప్(ఎఫ్‌సీ) కార్యాలయం లక్ష్యంగా జరిగిన ఆత్మాహుతి దాడిలో ఆరుగురు సైనికులతో పాటు ఆరుగురు ఉగ్రవాదులు మరణించారు. ఈ దాడుల్ని బలూచిస్తాన్ ముఖ్యమంత్రి సర్ఫరాజ్ బుగ్తి ఖండించారు.

నిఘా కోసం ఇజ్రాయెల్ ఉపగ్రహం

జెరూసలేం, సెప్టెంబరు 3: పశ్చిమాసియా దేశాలపై నిఘాను మరింత విస్తృతం చేసే ఉద్దేశంతో ఇజ్రాయెల్ తాజాగా ఓ గూఢచారి ఉపగ్రహాన్ని ప్రయోగించింది. ఇది తమ దేశ భద్రతకు వ్యూహాత్మకంగా కీలకమైందని, రాబోయే సంవత్సరాల్లో పశ్చిమాసియా అంతటా నిఘా సామర్థ్యాలను గణనీయంగా పెంచుతుందని రక్షణ అధికారులు వెల్లడించారు. ఈ ఉపగ్రహాన్ని మంగళవారం ప్రయోగించినట్లు రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ తెలిపారు. ఇది ఇజ్రాయెల్ నిఘా సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తుందని, ఈ ఏడాది ప్రారంభంలో ఇరాన్‌పై 12 రోజుల యుద్ధంలో సేకరించిన 12,000 చిత్రాల వంటి కీలక సమాచారాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. ఈ ఉపగ్రహ ప్రయోగం తమ శత్రువులందరికీ ఒక సందేశం వంటిదని, వారు ఎక్కడ దాక్కున్నా తాము గమనిస్తూనే ఉంటామని కాట్జ్ హెచ్చరించారు. ఒఫెక్ 19 అని పిలిచే ఈ ఉపగ్రహం పశ్చిమాసియా అంతటా నిఘా ఉంచేందుకు చేపట్టిన విస్తృత ప్రయత్నంలో భాగమని మేజర్ జనరల్ అమీర్ బారామ్ తెలిపారు.

(మిగతా 12వ పేజీలో)

(11వ పేజీ తరువాయి)

					దాకు రాజయ్య దాకు నర్సింహులు (దానయ్య)	దాకు రాజయ్య దాకు నర్సింహులు (దానయ్య)	0.2725					
91	436	పట్టా	తరి	1.1525	పల్లబోయిన శంకరయ్య (సిద్ధయ్య)	పల్లబోయిన శంకరయ్య (సిద్ధయ్య)	0.0050	గోర్-1				
					పల్లబోయిన చంద్రయ్య (సిద్ధయ్య)	పల్లబోయిన చంద్రయ్య (సిద్ధయ్య)	0.0450	గోర్-3 జోర్-1 చింత చెట్టు-1				
					బసిరెడ్డి శోభ (యాదగిరి రెడ్డి)	బసిరెడ్డి శోభ (యాదగిరి రెడ్డి)	0.1275	తుమ్మ చెట్టు 1				
					పెద్దమల్ల రామకిష్టయ్య (మల్లయ్య)	పెద్దమల్ల రామకిష్టయ్య (మల్లయ్య)	0.3750	బావి, వేప చెట్టు8				
92	417	పట్టా	తరి	2.0600	రాగుల వెంకయ్య రాగుల నర్సయ్య (ఇస్తారి నర్సయ్య)	రాగుల వెంకయ్య రాగుల నర్సయ్య (ఇస్తారి నర్సయ్య)	0.2100	-	322	290	280	290
					రాగుల నర్సయ్య (నర్సయ్య)	రాగుల నర్సయ్య (నర్సయ్య)	0.1900	-				
					రాగుల వెంకటయ్య (ఇస్తారి)	రాగుల వెంకటయ్య (ఇస్తారి)	0.1800	-				
					బైతి యాదగిరి (రంగయ్య)	బైతి యాదగిరి (రంగయ్య)	0.2800	-				
93	418	పట్టా	తరి	1.3550	ఉప్పప పోశమ్మ (బరామయ్య)	ఉప్పప పోశమ్మ (బరామయ్య)	1.3550	-	292	290	292	292
					కాయితి శ్రీనివాస్ (రాజయ్య)	కాయితి శ్రీనివాస్ (రాజయ్య)		-				
					కాయితి శ్రీనివాస్ (రాజయ్య)	కాయితి శ్రీనివాస్ (రాజయ్య)		-				
					కాయితి నర్సింహులు (రాజయ్య)	కాయితి నర్సింహులు (రాజయ్య)		-				
					కయితి రవీందర్ (రాజయ్య)	కయితి రవీందర్ (రాజయ్య)		-				
					కయితి యాదగిరి (రాజయ్య)	కయితి యాదగిరి (రాజయ్య)		-				
					బైతి బాల లక్ష్మి (రాజు)	బైతి బాల లక్ష్మి (రాజు)		-				
					బైతి సుదాకర్ (సత్తయ్య)	బైతి సుదాకర్ (సత్తయ్య)		-				
94	420	పట్టా	తరి	12.1950	కాయితి రాములు (రాజయ్య)	కాయితి రాములు (రాజయ్య)	0.2850	-	290	283	290	286
					కాయితి శ్రీనివాస్ (రాజయ్య)	కాయితి శ్రీనివాస్ (రాజయ్య)	0.0900	-				
					కాయితి శ్రీనివాస్ (రాజయ్య)	కాయితి శ్రీనివాస్ (రాజయ్య)	0.1000	-				
					కాయితి శ్రీనివాస్ (రాజయ్య)	కాయితి శ్రీనివాస్ (రాజయ్య)	1.0500	-				
					కాయితి నర్సింహులు (రాజయ్య)	కాయితి నర్సింహులు (రాజయ్య)		-				
					ఉస్తేపు లక్ష్మి (ముత్తయ్య)	ఉస్తేపు లక్ష్మి (ముత్తయ్య)	0.3975	-				
					కయితి రవీందర్ (రాజయ్య)	కయితి రవీందర్ (రాజయ్య)	1.2475	-				
					కయితి యాదగిరి (రంగయ్య)	కయితి యాదగిరి (రంగయ్య)	2.0675	-				
					ఉన్నపు జహంగీర్ (ఉస్తేపు బాల్ నర్సయ్య)	ఉన్నపు జహంగీర్ (ఉస్తేపు బాల్ నర్సయ్య)	0.0100	-				
					ఉన్నపు కృష్ణ (ఉస్తేపు బాల్ నర్సయ్య)	ఉన్నపు కృష్ణ (ఉస్తేపు బాల్ నర్సయ్య)	0.1075	-				
					ఉన్నపు కనకయ్య (ఉస్తేపు బాల్ నర్సయ్య)	ఉన్నపు కనకయ్య (ఉస్తేపు బాల్ నర్సయ్య)	0.1075	-				
					మునిగంటి సాయి కాంత్ (లక్ష్మణచారి)	మునిగంటి సాయి కాంత్ (లక్ష్మణచారి)	0.1200	-				
					గొడుగు శివన్ (రాములు)	గొడుగు శివన్ (రాములు)	0.1200	-				
					బైతి బాల లక్ష్మి (రాజు)	బైతి బాల లక్ష్మి (రాజు)	0.1350	-				
					బైతిజన్నత్(రాజు)	బైతిజన్నత్(రాజు)		0.1350	-			
					స్టెలిపేట అనిల్ కుమార్ (నర్సా గౌడ్)	స్టెలిపేట అనిల్ కుమార్ (నర్సా గౌడ్)	0.0250	-				
					ద్యావ కార్తీక్ (ప్రేమ కుమార్)	ద్యావ కార్తీక్ (ప్రేమ కుమార్)	0.0950	-				
					బైతి అశోక్ (రాజయ్య)	బైతి అశోక్ (రాజయ్య)	2.0525	-				
95	415	పట్టా	తరి	13.2100	పెద్దమల్ల రాంకిష్టయ్య (మల్లయ్య)	పెద్దమల్ల రాంకిష్టయ్య (మల్లయ్య)	0.3800	-	324	293	322	345
					యండపల్లి రవీందర్ రెడ్డి (యండ్రపల్లి నర్సింహారెడ్డి)	యండపల్లి రవీందర్ రెడ్డి (యండ్రపల్లి నర్సింహారెడ్డి)	1.3500	-				
					డి లావణ్య రెడ్డి (మోహన్ రెడ్డి)	డి లావణ్య రెడ్డి (మోహన్ రెడ్డి)	2.3550	-				
					బొమ్మిడి సూర్య కరణ్ రెడ్డి (బొమ్మిడి శంకర్ రెడ్డి)	బొమ్మిడి సూర్య కరణ్ రెడ్డి (బొమ్మిడి శంకర్ రెడ్డి)	1.0825	-				
					వంగ లింగ రెడ్డి (చంద్ర రెడ్డి)	వంగ లింగ రెడ్డి (చంద్ర రెడ్డి)	1.2700	-				
					నల్లా భాస్కర్ రెడ్డి (రమాపతి రెడ్డి)	నల్లా భాస్కర్ రెడ్డి (రమాపతి రెడ్డి)	1.2700	-				
					గడసు పల్లవి రెడ్డి (జి. జగదీశ్వర్ రెడ్డి	గడసు పల్లవి రెడ్డి (జి. జగదీశ్వర్ రెడ్డి	1.2825	-				
					మోహన్ రెడ్డి దాసరి (గోపాల్ రెడ్డి)	మోహన్ రెడ్డి దాసరి (గోపాల్ రెడ్డి)	1.2400	-				
96	416	పట్టా	తరి	0.1200	ఇతరులు	ఇతరులు	0.1200	-				
97	411	పట్టా/ సీలింగ్	మెట్ట	3.1200	ఇతరులు	ఆకుల యాదగిరి కొంపల్లి మల్లేష్ కొంపల్లి రాజు	2.1600	గోర్-3 చింత చెట్టు-1 తడి చెట్టు-5 వేప-22 జోర్-2 బావి-1	328	326	328	342
					బిమ్మరి ఐలమ్మ (యాదగిరి)	బిమ్మరి ఐలమ్మ (యాదగిరి)	0.3800	వేప-17 బావి-1				
98	410	పట్టా/ సీలింగ్	మెట్ట	1.3500	మేదబోయిన కమలమ్మ (వెంకటయ్య)	మేదబోయిన కమలమ్మ (వెంకటయ్య)	0.2025	జోర్-1 పైప్ లైన్	326	325	320	342
					ఇతరులు	బీమారి ఐలమ్మ (యాదగిరి)	0.2025	-				
					ఇతరులు	ఆకుల యాదగిరి కొంపల్లి మల్లేష్ కొంపల్లి రాజు	0.3450	-				
99	409	పట్టా/ సీలింగ్	మెట్ట	0.0500	కలకుంట్ల హన్మంత రావు (రాగునాద రావు)	కలకుంట్ల హన్మంత రావు (రాగునాద రావు)	0.0500	-				
100	413	పట్టా/ సీలింగ్	మెట్ట	5.3175	ఆకుల యాదగిరి (యాదగిరి) కొంపల్లి మల్లేష్ (నర్సయ్య) కొంపల్లి రాజు (నర్సయ్య)	ఆకుల యాదగిరి (యాదగిరి) కొంపల్లి మల్లేష్ (నర్సయ్య) కొంపల్లి రాజు (నర్సయ్య)	4.1000	-	326	324	321	344
					కలకుంట్ల హన్మంతరావు (రాగునాదరావు)	కలకుంట్ల హన్మంతరావు (రాగునాదరావు)	0.1800	-				
					బీమారి నర్సింహులు (మల్లయ్య)	బీమారి నర్సింహులు (మల్లయ్య)	1.0375	-				
101	406	పట్టా/ సీలింగ్	మెట్ట	1.1800	కలకుంట్ల హన్మంత రావు (రాగునాద రావు)	కలకుంట్ల హన్మంత రావు (రాగునాద రావు)	1.1800	-	335	293	318	322
					తిప్పరెడ్డి లక్ష్మరెడ్డి (వెంకట్ రెడ్డి)	తిప్పరెడ్డి లక్ష్మరెడ్డి (వెంకట్ రెడ్డి)		-				
					బోయిని పల్లి వేణుగోపాల్ (విక్రం రావు)	బోయిని పల్లి వేణుగోపాల్ (విక్రం రావు)		-				
					మునగి మహేశ్వర్ రెడ్డి (బ్రహ్మ రెడ్డి)	మునగి మహేశ్వర్ రెడ్డి (బ్రహ్మ రెడ్డి)		-				
102	399	పట్టా	తరి	1.1850	కలకుంట్ల హన్మంత రావు (రాగునాదరావు)	కలకుంట్ల హన్మంత రావు (రాగునాదరావు)	1.1850	-	319	320	317	320
					తిప్పరెడ్డి లక్ష్మరెడ్డి (వెంకట్ రెడ్డి)	తిప్పరెడ్డి లక్ష్మరెడ్డి (వెంకట్ రెడ్డి)		-				
					బోయిని పల్లి వేణుగోపాల్ (విక్రం రావు)	బోయిని పల్లి వేణుగోపాల్ (విక్రం రావు)		-				
					మునగి మహేశ్వర్ రెడ్డి (బ్రహ్మ రెడ్డి)	మునగి మహేశ్వర్ రెడ్డి (బ్రహ్మ రెడ్డి)		-				
103	398	పట్టా	తరి	0.3100	కలకుంట్ల హన్మంత రావు (రాగునాద రావు)	కలకుంట్ల హన్మంత రావు (రాగునాద రావు)	0.3100	-	320	318	317	320
					తిప్పరెడ్డి లక్ష్మరెడ్డి (వెంకట్ రెడ్డి)	తిప్పరెడ్డి లక్ష్మరెడ్డి (వెంకట్ రెడ్డి)		-				
					బోయిన పల్లి వేణుగోపాల్ (విక్రం రావు)	బోయిన పల్లి వేణుగోపాల్ (విక్రం రావు)		-				
					మునగి మహేశ్వర్ రెడ్డి (బ్రహ్మ రెడ్డి)	మునగి మహేశ్వర్ రెడ్డి (బ్రహ్మ రెడ్డి)		-				
104	400	పట్టా	తరి	0.0400	కలకుంట్ల హన్మంత రావు (రాగునాద రావు)	కలకుంట్ల హన్మంత రావు (రాగునాద రావు)	0.0400	-				
					తిప్పరెడ్డి లక్ష్మరెడ్డి (వెంకట్ రెడ్డి)	తిప్పరెడ్డి లక్ష్మరెడ్డి (వెంకట్ రెడ్డి)		-				
					బోయిన పల్లి వేణుగోపాల్ (విక్రం రావు)	బోయిన పల్లి వేణుగోపాల్ (విక్రం రావు)		-				
					మునగి మహేశ్వర్ రెడ్డి (బ్రహ్మ రెడ్డి)	మునగి మహేశ్వర్ రెడ్డి (బ్రహ్మ రెడ్డి)		-				
105	397	పట్టా	తరి	17.0500	బీమరి నర్సయ్య (ఐలయ్య)	బీమరి నర్సయ్య (ఐలయ్య)	0.0650	-	339	328	337	328
					బీమరి నర్సయ్య (మల్లయ్య)	బీమరి నర్సయ్య (మల్లయ్య)	0.0500	-				
					బీమరి నర్సయ్య (మల్లయ్య)	బీమరి నర్సయ్య (మల్లయ్య)	0.0500	-				
					బీమరి నర్సయ్య (మల్లయ్య)	బీమరి నర్సయ్య (మల్లయ్య)	0.1000	-				
					బీమరి నర్సింహులు (ముత్తయ్య)	బీమరి నర్సింహులు (ముత్తయ్య)	0.1400	-				
					చింతకింది బాలయ్య (మల్లయ్య)	చింతకింది బాలయ్య (మల్లయ్య)	0.2000	-				
					చింతకింది యాదగిరి (ముత్తయ్య)	చింతకింది యాదగిరి (ముత్తయ్య)	0.0700	-				
					బీమరి మల్లయ్య (నర్సయ్య)	బీమరి మల్లయ్య (నర్సయ్య)	0.1000	-				
					బీమరి మల్లయ్య (నర్సయ్య)	బీమరి మల్లయ్య (నర్సయ్య)	1.0000	-				
					బీమరి మల్లయ్య (నర్సయ్య)	బీమరి మల్లయ్య (నర్సయ్య)	0.1300	-				
					బీమరి శివయ్య (ముత్తయ్య)	బీమరి శివయ్య (ముత్తయ్య)	0.2800	-				
					బీమరి శివయ్య (ముత్తయ్య)	బీమరి శివయ్య (ముత్తయ్య)	0.0800	-				
					బీమరి రామయ్య (రామయ్య)	బీమరి రామయ్య (రామయ్య)	0.2400	-				
					చింతకింద చిన్నమల్లయ్య (ఆగయ్య)	చింతకింద చిన్నమల్లయ్య (ఆగయ్య)	0.0000	-				
					చింతకింది కనకమ్మ (నర్సింహులు)	చింతకింది కనకమ్మ (నర్సింహులు)	0.0200	-				
					చింతకింది కనకమ్మ (నర్సింహులు)	చింతకింది కనకమ్మ (నర్సింహులు)	0.0900	-				
					చింతకింది కనకమ్మ (నర్సింహులు)	చింతకింది కనకమ్మ (నర్సింహులు)	0.0800	-				
					బీమరి సత్తయ్య (నర్సయ్య)	బీమరి సత్తయ్య (నర్సయ్య)	0.2700	-				
					బీమరి సత్తయ్య (నర్సయ్య)	బీమరి సత్తయ్య (నర్సయ్య)	0.1000	-				
					బీమరి సత్తయ్య (నర్సయ్య)	బీమరి సత్తయ్య (నర్సయ్య)	0.1000	-				
					బీమరి యాదగిరి (బాలయ్య)	బీమరి యాదగిరి (బాలయ్య)	0.1000	-				
					బీమరి శ్రీను (బాలయ్య)	బీమరి శ్రీను (బాలయ్య)	0.1000	-				
					బీమరి యేల్లయ్య (మలయ్య)	బీమరి యేల్లయ్య (మలయ్య)	0.2200	-				
					బీమరి యేల్లయ్య (మలయ్య)	బీమరి యేల్లయ్య (మలయ్య)	0.3050	-				
					బీమరి యేల్లయ్య (మలయ్య)	బీమరి యేల్లయ్య (మలయ్య)	0.2900	-				
					చింతకింద యాదగిరి (ఎల్లయ్య)	చింతకింద యాదగిరి (ఎల్లయ్య)	0.0600	-				
					చింతకింద మల్లయ్య (ఎల్లయ్య)	చింతకింద మల్లయ్య (ఎల్లయ్య)	0.0600	-				
					చింతకింద నర్సింహులు (ఎల్లయ్య)	చింతకింద నర్సింహులు (ఎల్లయ్య)	0.0800	-				
					చింతకింద నర్సయ్య (పెద్దలు)	చింతకింద నర్సయ్య (పెద్దలు)	0.0050	-				
					బీమారి లక్ష్మి (యాదగిరి)	బీమారి లక్ష్మి (యాదగిరి)	1.0400	-				
					చింతకింద పెద్దమల్లయ్య (ఆగయ్య)	చింతకింద పెద్దమల్లయ్య (ఆగయ్య)	0.0800	-				
					చింతకింద నర్సింహులు (ఎల్లయ్య)	చింతకింద నర్సింహులు (ఎల్లయ్య)	0.0600	-				
					చింతకింద యాదగిరి (మల్లయ్య)	చింతకింద యాదగిరి (మల్లయ్య)	0.2000	-				
					చింతకింద యాదగిరి (మల్లయ్య)	చింతకింద యాదగిరి (మల్లయ్య)	0.0100	-				
					చింతకింద కిష్టయ్య (CH పెద్దలు)	చింతకింద కిష్టయ్య (CH పెద్దలు)	0.0050	-				
					చింతకుంది యాదగిరి (కె మల్లేష్)	చింతకుంది యాదగిరి (కె మల్లేష్)	0.0050	-				
					చింతకుంది వెంకటేష్ (కె మల్లేష్)	చింతకుంది వెంకటేష్ (కె మల్లేష్)	0.0200	-				
					చింతకుంది స్వామి (కె మల్లేష్)	చింతకుంది స్వామి (కె మల్లేష్)	0.0250	-				
					బీమారి వెంకటేష్ (నర్సింహులు)	బీమారి వెంకటేష్ (నర్సింహులు)	0.1900	-				
					బీమారి స్వప్న (వెంకటేష్)	బీమారి స్వప్న (వెంకటేష్)	0.1300	-				
					బీమారి స్వప్న (వెంకటేష్)	బీమారి స్వప్న (వెంకటేష్)	0.0800	-				
					చింతకింది రాజు (యాదగిరి)	చింతకింది రాజు (యాదగిరి)	0.0400	-				
					చింతకింది విజ్ఞపతి (దివంగత నర్సయ్య)	చింతకింది విజ్ఞపతి (దివంగత నర్సయ్య)	0.1800	-				
					ఆకారం సాయి కిరణ్ (ఆకారం మాధవి దారి)	ఆకారం సాయి కిరణ్ (ఆకారం మాధవి దారి)	0.2100	-				
					ఆకారం సాయి కిరణ్ (ఆకారం మాధవి దారి)	ఆకారం సాయి కిరణ్ (ఆకారం మాధవి దారి)	0.0800	-				
					చింతకింది వెంకటేష్ (నర్సింహులు)	చింతకింది వెంకటేష్ (నర్సింహులు)	0.0800	-				
					చింతకింది అఖిల (మల్లేశం)	చింతకింది అఖిల (మల్లేశం)	0.0900	-				
					చింతకింది అఖిల (మల్లేశం)	చింతకింది అఖిల (మల్లేశం)	0.0800	-				
					చింతకింది అఖిల (మల్లేశం)	చింతకింది అఖిల (మల్లేశం)	0.0200	-				
					బీమారి ప్రశాంత్ (బీమారి బాలయ్య)	బీమారి ప్రశాంత్ (బీమారి బాలయ్య)	0.0550	-				
					బీమారి నరసింహ (బి ఐలయ్య)	బీమారి నరసింహ (బి ఐలయ్య)	0.0325	-				
					బీమారి గణేష్ (బీమారి జహంగీర్)	బీమారి గణేష్ (బీమారి జహంగీర్)	0.0525	-				
					వెలసల దేవేందర్ (వెలసల సాయి బాబా)	వెలసల దేవేందర్ (వెలసల సాయి బాబా)	0.2000	-				
					గుండాల కుమార్ (గుండాల నాగయ్య)	గుండాల కుమార్ (గుండాల నాగయ్య)	0.2700	-				
					గుండాల కుమార్ (గుండాల నాగయ్య)	గుండాల కుమార్ (గుండాల నాగయ్య)	0.1400	-				
					బీమారి రాజమ్మ (లేట్ బాలయ్య)	బీమారి రాజమ్మ (లేట్ బాలయ్య)	0.2100	-				
					ఇతరులు	ఇతరులు	0.0100	-				
106	391	పట్టా	తరి	3.3100	రావుల కిష్టయ్య (బాలయ్య)	రావుల కిష్టయ్య (బాలయ్య)	0.3300	జోర్-1	334	335	333	328
					రావుల భూమయ్య (ముత్తయ్య)	రావుల భూమయ్య (ముత్తయ్య)	0.2000	జోర్-1				
					రావుల భూమయ్య (ముత్తయ్య)	రావుల భూమయ్య (ముత్తయ్య)	0.2100	-				
					రావుల ఐలయ్య (బాలయ్య)	రావుల ఐలయ్య (బాలయ్య)	1.0900	జోర్-1				
					రావుల ఐలయ్య (వెంకయ్య)	రావుల ఐలయ్య (వెంకయ్య)	0.2500					
					పెద్దరాగుల రామవ్వ (పెద్ద రాగుల ఎల్లయ్య)	పెద్దరాగుల రామవ్వ (పెద్ద రాగుల ఎల్లయ్య)	0.2800	జోర్-1				
					పీతల మంజుల (పీతల యాదగిరి)	పీతల మంజుల (పీతల యాదగిరి)	0.2100	-				
					రాగుల మైసయ్య (మల్లయ్య)	రాగుల మైసయ్య (మల్లయ్య)	0.1000	-				
					రాగుల మైసయ్య (మల్లయ్య)	రాగుల మైసయ్య (మల్లయ్య)	0.1200	-				
					రాగుల కనకయ్య (మల్లయ్య)	రాగుల కనకయ్య (మల్లయ్య)	0.1000	-				
					రాగుల కనకయ్య (మల్లయ్య)	రాగుల కనకయ్య (మల్లయ్య)	0.1200	-				
					రాగుల కుమార్ (రామయ్య)	రాగుల కుమార్ (రామయ్య)	1.2600	జోర్-1				
					రాగుల ఎల్లమ్మ (లేట్ రాగుల నర్సయ్య)	రాగుల ఎల్లమ్మ (లేట్ రాగుల నర్సయ్య)	1.3800	జోర్-1				
107	392	పట్టా	తరి	11.3300	రావుల నర్సయ్య (నర్సయ్య)	రావుల నర్సయ్య (నర్సయ్య)	0.0500	-	321	329	332	335
					రావుల బాలయ్య (రామయ్య)	రావుల బాలయ్య (రామయ్య)	0.3300	జోర్-1				
					రావుల అంజయ్య (రామయ్య)	రావుల అంజయ్య (రామయ్య)	0.0100	-				
					రావుల కిష్టయ్య (బాలయ్య)	రావుల కిష్టయ్య (బాలయ్య)	0.3900	జోర్-1				
					రావుల భూమయ్య (ముత్తయ్య)	రావుల భూమయ్య (ముత్తయ్య)	0.0700	-				
					రావుల భూమయ్య (ముత్తయ్య)	రావుల భూమయ్య (ముత్తయ్య)	0.1150	-				
					రావుల భూమయ్య (ముత్తయ్య)	రావుల భూమయ్య (ముత్తయ్య)	0.2900	జోర్-1				
					రావుల మల్లయ్య (ముత్తయ్య)	రావుల మల్లయ్య (ముత్తయ్య)	0.0100	-				
					రావుల ఐలయ్య (బాలయ్య)	రావుల ఐలయ్య (బాలయ్య)	0.3400	జోర్-1				
					రావుల ఐలయ్య (బాలయ్య)	రావుల ఐలయ్య (బాలయ్య)	0.2500	-				
					పీతల మంజుల (పీతల యాదగిరి)	పీతల మంజుల (పీతల యాదగిరి)	0.1200	-				
					పీతల మంజుల (పీతల యాదగిరి)	పీతల మంజుల (పీతల యాదగిరి)	0.0700	-				
					రాగుల మైసయ్య (మల్లయ్య)	రాగుల మైసయ్య (మల్లయ్య)	0.0350	-				
					రాగుల మైసయ్య (మల్లయ్య)	రాగుల మైసయ్య (మల్లయ్య)	0.1500	జోర్-1				
					రాగుల మైసయ్య (మల్లయ్య)	రాగుల మైసయ్య (మల్లయ్య)	0.0500	-				
					రాగుల మైసయ్య (మల్లయ్య)	రాగుల మైసయ్య (మల్లయ్య)	0.0650	-				
					రాగుల కనకయ్య (మల్లయ్య)	రాగుల కనకయ్య (మల్లయ్య)	0.0350	-				
					రాగుల కనకయ్య (మల్లయ్య)	రాగుల కనకయ్య (మల్లయ్య)	0.1500	జోర్-1				
					రాగుల కనకయ్య (మల్లయ్య)	రాగుల కనకయ్య (మల్లయ్య)	0.0500	-				
					రాగుల కనకయ్య (మల్లయ్య)	రాగుల కనకయ్య (మల్లయ్య)	0.0850	-				
					రాగుల కుమార్ (రామయ్య)	రాగుల కుమార్ (రామయ్య)	1.0800	జోర్-1, పైప్ లైన్				
					రాగుల యాదమ్మ (ముత్యాలు)	రాగుల యాదమ్మ (ముత్యాలు)	0.0250	-				
					రాగుల కృష్ణుడు (ఆర్ నర్సయ్య)	రాగుల కృష్ణుడు (ఆర్ నర్సయ్య)	0.1000	-				
					రాగుల పాపయ్య (ఆర్ నర్సయ్య)	రాగుల పాపయ్య (ఆర్ నర్సయ్య)	0.1000	-				
					కటుకోజ్వాలా కృష్ణ చారి (కటుకోజ్వాల సూర్య నారాయణ)	కటుకోజ్వాలా కృష్ణ చారి (కటుకోజ్వాల సూర్య నారాయణ)	0.2000	-				
					రాగుల ఎల్లమ్మ (లేట్ రాగుల నర్సయ్య)	రాగుల ఎల్లమ్మ (లేట్ రాగుల నర్సయ్య)	2.3800	జోర్-1				
108	393	పట్టా	తరి	6.0600	పిట్టల లక్ష్మణ్ (నారయ్య)	పిట్టల లక్ష్మణ్ (నారయ్య)	0.1025	-	543	329	330	333
					పిట్టల లక్ష్మణ్ (నారయ్య)	పిట్టల లక్ష్మణ్ (నారయ్య)	0.1025	-				
					పిట్టల అంజనేయులు (నారయ్య)	పిట్టల లక్ష్మణ్ అంజనేయులు (నారయ్య)	0.1025	-				
					పిట్టల అంజనేయులు (నారయ్య)	పిట్టల లక్ష్మణ్ అంజనేయులు (నారయ్య)	0.1025	-				
					తిపిరెడ్డి లక్ష్మా రెడ్డి (వెంకటరెడ్డి)	తిపిరెడ్డి లక్ష్మా రెడ్డి (వెంకటరెడ్డి)	0.1025	-				
					పిట్టల కటమయ్య (లక్ష్మి నర్సయ్య)	పిట్టల కటమయ్య (లక్ష్మి నర్సయ్య)	1.0100	-				
					రామిడి రాంరెడ్డి (ఆర్ రామచంద్రారెడ్డి)	రామిడి రాంరెడ్డి (ఆర్ రామచంద్రారెడ్డి)	0.1000	-				
					రామిడి రాంరెడ్డి (ఆర్ రామచంద్రారెడ్డి)	రామిడి రాంరెడ్డి (ఆర్ రామచంద్రారెడ్డి)	0.1000	-				
					మునిగంటి సాయికాంత్ (లక్ష్మణ చారి)	మునిగంటి సాయికాంత్ (లక్ష్మణ చారి)	0.0025	-				
					మునిగంటి సాయికాంత్ (లక్ష్మణ చారి)	మునిగంటి సాయికాంత్ (లక్ష్మణ చారి)	0.0025	-				
					పిట్టల ఐలమ్మ (రాములు)	పిట్టల ఐలమ్మ (రాములు)	0.1400	-				
					పిట్టల ఐలమ్మ (రాములు)	పిట్టల ఐలమ్మ (రాములు)	0.1350	-				
					పిట్టల కిష్టయ్య (భూమయ్య)	పిట్టల కిష్టయ్య (భూమయ్య)	0.1350	-				
					పిట్టల కిష్టయ్య (భూమయ్య)	పిట్టల కిష్టయ్య (భూమయ్య)	0.1350	-				
					పిట్టల వెంకటేష్ (భూమయ్య)	పిట్టల వెంకటేష్ (భూమయ్య)	0.1350	-				
					పిట్టల వెంకటేష్ (భూమయ్య)	పిట్టల వెంకటేష్ (భూమయ్య)	0.1400	-				
					పిట్టల ఐలయ్య (పిట్టల కనకయ్య)	పిట్టల ఐలయ్య (పిట్టల కనకయ్య)	1.0100	-				
					పిట్టల కొండమ్మ (పిట్టల వెంకటయ్య)	పిట్టల కొండమ్మ (పిట్టల వెంకటయ్య)	0.1025	-				
109	395	పట్టా	తరి	9.0800	పిట్టల నర్సయ్య (నారాయణ)	పిట్టల నర్సయ్య (నారాయణ)	1.2000	జోర్-1	331	329	2	332
					పిట్టల లక్ష్మణ్ (నారయ్య)	పిట్టల లక్ష్మణ్ (నారయ్య)	0.2575	జోర్-1				
					పిట్టల అంజనేయులు (నారయ్య)	పిట్టల అంజనేయులు (నారయ్య)	0.2575	జోర్-1				
					పిట్టల కటమయ్య (లక్ష్మి నర్సయ్య)	పిట్టల కటమయ్య (లక్ష్మి నర్సయ్య)	1.1100	జోర్-1				
					రామిడి రాంరెడ్డి (ఆర్ రామచంద్రారెడ్డి)	రామిడి రాంరెడ్డి (ఆర్ రామచంద్రారెడ్డి)	0.2000	-				
					మునిగంటి సాయికాంత్ (లక్ష్మణ చారి)	మునిగంటి సాయికాంత్ (లక్ష్మణ చారి)	0.0575	-				
					పిట్టల ఐలమ్మ (రాములు)	పిట్టల ఐలమ్మ (రాములు)	0.3450	జోర్-1				
					పిట్టల కిష్టయ్య (భూమయ్య)	పిట్టల కిష్టయ్య (భూమయ్య)	0.3400	జోర్-1				
					పిట్టల వెంకటేష్ (భూమయ్య)	పిట్టల వెంకటేష్ (భూమయ్య)	0.3450	జోర్-1				
					పిట్టల ఐలమ్మ (పిట్టల కనకయ్య)	పిట్టల ఐలమ్మ (పిట్టల కనకయ్య)	1.1100	జోర్-1 పైప్ లైన్				
					పిట్టల కొండమ్మ (పిట్టల వెంకటయ్య)	పిట్టల కొండమ్మ (పిట్టల వెంకటయ్య)	0.2575	జోర్ 1				
110	396	పోరంబోకు	కుంట	2.1000	నీటిపారుదల - శిఖం (జలాలు)	నీటిపారుదల - శిఖం (జలాలు)	2.1000	-	332	317	314	328
111	268	పట్టా	తరి	3.2400	బోళ్ల మల్లయ్య (బాలరాజ్)	బోళ్ల మల్లయ్య (బాలరాజ్)	1.0000	జోర్-1	312	257	131	310
					బొర్ల జగదాంబ (ముత్తయ్య)	బొర్ల జగదాంబ (ముత్తయ్య)	1.2000	-				
					బొల్లా చంద్రయ్య (బాలరాజు)	బొల్లా చంద్రయ్య (బాలరాజు)	1.0400	జోర్-1 సీక్సలో ఉన్నది				
112	267	పట్టా	తరి	2.1850	కుంభం సత్తయ్య	కుంభం సత్తయ్య (నర్సయ్య)	0.0550	- (నర్సయ్య)	311	257	257	306
					కుంభం మల్లయ్య (నర్సయ్య)	కుంభం మల్లయ్య (నర్సయ్య)	0.0900	-				
					కుంభం సాయి కుమార్	కుంభం సాయి కుమార్	0.2450	జోర్-1 సీక్సలో ఉన్నది				
					కుంభం మహేష్ (యాదగిరి)	కుంభం మహేష్ (యాదగిరి)	0.2450	-				
					కుంభం వెంకటేశం (ఐలయ్య)	కుంభం వెంకటేశం (ఐలయ్య)	0.1750	-				
113	265	పట్టా	తరి	2.1550	బోళ్ల మల్లయ్య (బాలరాజ్)	బోళ్ల మల్లయ్య (బాలరాజ్)	2.1550	-	254	253	252	257
					రాగుల వరలక్ష్మి (రాగుల అంజనేయులు	రాగుల వరలక్ష్మి (రాగుల అంజనేయులు		-				
					రాగుల కళ్యాణి (రాగుల నవీన్)	రాగుల కళ్యాణి (రాగుల నవీన్)		-				
114	263	పట్టా	తరి	1.3950	కుకట్ల జన్నయ్య (కొమురయ్య)	కుకట్ల జన్నయ్య (కొమురయ్య)	1.0300	-				
					కుకట్ల నర్సయ్య (కొమురయ్య)	కుకట్ల నర్సయ్య (కొమురయ్య)		-				
					కుకట్ల మల్లయ్య (కొమురయ్య)	కుకట్ల మల్లయ్య (కొమురయ్య)		-				
					కుకటల్ అనిత (ఐలయ్య)	కుకటల్ అనిత (ఐలయ్య)		-				
					కుకట్ల ఐలయ్య (ఓజయ్య)	కుకట్ల ఐలయ్య (ఓజయ్య)	0.3650	-				
[illegible]												

బెయిల్ పొందే విదేశీయులు పరారీ కాకుండా చూడండి

కేంద్రానికి సుప్రీం కోర్టు సూచన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: వివిధ కేసుల్లో అరెస్టయిన విదేశీయులు బెయిల్ పొందిన తరువాత కనపడకుండా పరారీ కావడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. నేరం చేసే విదేశీయులు చట్టం నుంచి తప్పించుకోలేరని తెలిపింది. ఇలా జరగకుండా విధానాన్ని రూపొందించాలని కేంద్రప్రభుత్వానికి సూచించింది. మోసం, ఇతర ఆరోపణలపై నైజీరియాకు చెందిన అలెక్స్ డేవిడ్‌ను ఝార్ఖండ్ పోలీసులు అరెస్టు చేయగా, అక్కడి హైకోర్టు అతడికి బెయిల్ మంజూరు చేసింది. బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఝార్ఖండ్ ప్రభుత్వం చేసిన వినతిపై సుప్రీం కోర్టు విచారణ జరిపింది. ప్రభుత్వ వాదనతో ఏకీభవించి బెయిల్‌ను రద్దు చేసింది. అయితే బెయిల్ పొందిన తరువాత నిందితుడు కనపడకుండా పోయిన సంగతి కోర్టు దృష్టికి వచ్చింది. భారత్-నైజీరియాల మధ్య నేరగాళ్ల మార్పిడి ఒప్పందం లేకపోవడంతో విచారణ నిమిత్తం అతడిని ఆ దేశం అప్పగించే అవకాశాలు కూడా లేవు. ఇలాంటి పరిస్థితి ఆ దేశానికి ఎదురయితే సహకరిస్తామని నైజీరియా అధికారులకు హామీ ఇచ్చి నిందితుడిని తీసుకొచ్చేందుకు విదేశీ వ్యవహారాల శాఖ ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో మరోసారి ఇలాంటి పరిస్థితులు ఎదురుకాకుండా స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి సూచించింది.

ఉక్రెయిన్‌పై 500 డ్రోన్లు, క్షిపణులతో రష్యా దాడి

మాస్కో, కీవ్, సెప్టెంబరు 3: ఇంధన కేంద్రాలు, మౌలిక వసతులే లక్ష్యంగా తమపై 500 డ్రోన్లు, క్షిపణులతో రష్యా దాడి చేసిందని ఉక్రెయిన్ ఆరోపించింది. పశ్చిమ, సెంట్రల్ ఉక్రెయిన్‌లో ఈ దాడులు జరిగాయని వెల్లడించింది. అటు రష్యా ఎయిర్‌ఫోర్స్ కూడా తాము 158 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చామని తెలిపింది. తాజా దాడుల నేపథ్యంలో రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలను కోరారు. బుధవారం పారిస్‌లో ఉన్న ఆయన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మ్యాక్రాన్‌తో సమావేశం కానున్నారు. గురువారం ఈయూ దేశాధినేతలతో జెలెన్‌స్కీ చర్చలు జరిపే అవకాశం ఉంది. మరోవైపు రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌తో కలిసి బీజింగ్‌లో జరిగిన చైనా విక్టరీ డే మిలిటరీ పరేడ్‌లో పాల్గొన్నారు.

(మిగతా 13వ పేజీలో)

					మాసోజి రామరాజు (బనార్దన్ రాజు)	మాసోజి రామరాజు (బనార్దన్ రాజు)	0.0400	-				
					తెల్లా అంకిత్ (లేట్ గోవర్ధన్)	తెల్లా అంకిత్ (లేట్ గోవర్ధన్)	0.0230	-				
					గాజుల గణేష్ (వెంకటయ్య)	గాజుల గణేష్ (వెంకటయ్య)	0.0225	-				
					ఆదెపు కృష్ణ కిరీటి (ఎ వి ఎస్ వి ప్రసాద్)	ఆదెపు కృష్ణ కిరీటి (ఎ వి ఎస్ వి ప్రసాద్)	0.0500	-				
					గాజుల రమేష్ (వెంకటయ్య)	గాజుల రమేష్ (వెంకటయ్య)	0.0225	-				
					కాశీశ్వరయ్య శీరం (శ్రీ రాములు)	కాశీశ్వరయ్యశీరం (శ్రీ రాములు)	0.0250	-				
					బిల్లకంటి హరినాథ బాబు (రామనాథం)	బిల్లకంటి హరినాథ బాబు (రామనాథం)	0.0125	-				
					గట్ల మహేశ్ యాదవ్ (గట్ల కిష్టయ్య)	గట్ల మహేశ్ యాదవ్ (గట్ల కిష్టయ్య)	0.0250	-				
					గుజాల సువర్ణ (దివంగత కిరణ్ వర్మ)	గుజాల సువర్ణ (దివంగత కిరణ్ వర్మ)	0.0125	-				
					సాయం హరి ప్రసాద్ (సాయం గణేష్)	సాయం హరి ప్రసాద్ (సాయం గణేష్)	0.0250	-				
					శ్రీలు కస్తూరి (లేట్ శ్రీరాములు)	శ్రీలు కస్తూరి (లేట్ శ్రీరాములు)	0.0250	-				
					వెంకట సునీల్ కుమార్ దొసనమల (నరసింహారావు)	వెంకట సునీల్ కుమార్ దొసనమల (నరసింహారావు)	0.0250	-				
					బోస్నాన్ భరత్ (లేట్ అగాపే)	బోస్నాన్ భరత్ (లేట్ అగాపే)	0.0250	-				
					కె రమేష్ కుమార్ (రాము స్వామి)	కె రమేష్ కుమార్ (రాము స్వామి)	0.0250	-				
					మాల్యమ్మర్ సుదర్శ్ (లేట్ రామ్ చందర్)	మాల్యమ్మర్ సుదర్శ్ (లేట్ రామ్ చందర్)	0.0250	-				
					కొండి మహేశ్వర్ (అంజయ్య)	కొండి మహేశ్వర్ (అంజయ్య)	0.0250	-				
					మన్నె శ్రీనివాస్ రావు (నాగేశ్వర)	మన్నె శ్రీనివాస్ రావు (నాగేశ్వర)	0.0540	-				
					జె లావణ్య (రాము)	జె లావణ్య (రాము)	0.1000	-				
					సకిలం రాజేష్ (శివయ్య)	సకిలం రాజేష్ (శివయ్య)	0.0500	-				
					యశోద ఎం పెనెప్ (మంగేష్ పెనెప్)	యశోద ఎం పెనెప్ (మంగేష్ పెనెప్)	0.0250	-				
					బొలుగు అమృత (సాయినాథ్)	బొలుగు అమృత (సాయినాథ్)	0.0250	-				
					గుండపల్లి ప్రకాశ్ గౌడ్ (జి హరి కృష్ణ గౌడ్)	గుండపల్లి ప్రకాశ్ గౌడ్ (జి హరి కృష్ణ గౌడ్)	0.0250	-				
					మద్ది నరసింహారావు (మాల కొండయ్య)	మద్ది నరసింహారావు (మాల కొండయ్య)	0.0250	-				
					దేమిశె అర్చన (ప్రకాష్)	దేమిశె అర్చన (ప్రకాష్)	0.0500	-				
					చిక్కాల మంజులత (రాజేష్ కుమార్)	చిక్కాల మంజులత (రాజేష్ కుమార్)	0.0330	-				
					నందం గాయత్రి (నందం సుధాకర్)	నందం గాయత్రి (నందం సుధాకర్)	0.0250	-				
					చేర్యాల జహంగీర్ (లక్ష్మయ్య)	చేర్యాల జహంగీర్ (లక్ష్మయ్య)	0.1200	-				
					చేవెళ్ల శ్రీనివాసరావు (రామారావు)	చేవెళ్ల శ్రీనివాసరావు (రామారావు)	0.0250	-				
					వెన్నపూస విశ్వనాథ రెడ్డి (చిన్న రెడ్డి)	వెన్నపూస విశ్వనాథ రెడ్డి (చిన్న రెడ్డి)	0.0500	-				
					గీత దాచిరెడ్డి అలియాస్ దాచిరెడ్డి గీత (శ్రీచరణ్ రెడ్డి)	గీత దాచిరెడ్డి అలియాస్ దాచిరెడ్డి గీత (శ్రీచరణ్ రెడ్డి)	0.1375	-				
					గీత దాచిరెడ్డి అలియాస్ దాచిరెడ్డి గీత (శ్రీచరణ్ రెడ్డి)	గీత దాచిరెడ్డి అలియాస్ దాచిరెడ్డి గీత (శ్రీచరణ్ రెడ్డి)	0.1125	-				
					పెంటల రాజ్ కుమార్ (పెంటయ్య)	పెంటల రాజ్ కుమార్ (పెంటయ్య)	0.0250	-				
					గుండి లక్ష్మీ బాలా (సోము శేఖర్)	గుండి లక్ష్మీ బాల (సోము శేఖర్)	0.0250	-				
					మన్యం శేఖర్ బాబు (మన్యం వెంకటేశ్వర రావు)	మన్యం శేఖర్ బాబు (మన్యం వెంకటేశ్వర రావు)	0.1550	-				
					మన్యం శేఖర్ బాబు (మన్యం వెంకటేశ్వరరావు)	మన్యం శేఖర్ బాబు (మన్యం వెంకటేశ్వరరావు)	0.1850	-				
					శత్రుఘన్ సింగ్ (భరోగా సింగ్)	శత్రుఘన్ సింగ్ (భరోగా సింగ్)	0.0125	-				
					సుష్మా కుమారి (శత్రుఘన్ సింగ్)	సుష్మా కుమారి (శత్రుఘన్ సింగ్)	0.0125	-				
					అర్జెమ్ అంజయ్య (లేట్ లక్ష్మయ్య)	అర్జెమ్ అంజయ్య (లేట్ లక్ష్మయ్య)	0.0250	-				
					కొరివింటి S R S V S నరసింహ రాజు (సోము రాజు)	కొరివింటి S R S V S నరసింహ రాజు (సోము రాజు)	0.0250	-				
					వేముల్లపల్లి పద్మ కళ్యాణి (వి సత్యనారాయణ)	వేముల్లపల్లి పద్మ కళ్యాణి (వి సత్యనారాయణ)	0.0100	-				
					షేక్ షాబాజు అన్సారి (సలీం షేక్)	షేక్ షాబాజు అన్సారి (సలీం షేక్)	0.0450	-				
					రుహీనా బేగం (మంజుర్ షేక్)	రుహీనా బేగం (మంజుర్ షేక్)	0.0250	-				
127	368	పల్లా	తరి	3.8000	వెంచర్	వెంచర్	2.2025	-	490	504	476	481
					ఇతరులు	ఇతరులు	1.1175					
128	365	పల్లా	తరి	2.1050	వెంచర్	వెంచర్	0.0735	-	481	478	475	479
					ఇతరులు	రాపోలు రాజమ్మ	0.3975	-				
					రాపోలు ధనుంజయ (చిన్న మల్లయ్య)	రాపోలు ధనుంజయ (చిన్న మల్లయ్య)						
					రాపోలు నరేష్ (చిన్న మల్లయ్య)	రాపోలు నరేష్ (చిన్న మల్లయ్య)	1.0300	-				
					రాపోలు వెంకటేశం (రామచంద్రయ్య)	రాపోలు వెంకటేశం (రామచంద్రయ్య)	0.0700	-				
129	364	పల్లా	తరి	0.1650	ఇతరులు	రాపోలు వెంకటేశం	0.1650	-	478	476	507	477
130	414	పల్లా	తరి	7.2775	దాసు వెంకటయ్య (పెద్దయ్య)	దాసు వెంకటయ్య (పెద్దయ్య)	2.2275	-	286	278	287	281
					దాసు రాజయ్య (దాశయ్య)	దాసు రాజయ్య (దాశయ్య)	0.2050	-				
					దాసు నర్సింహులు (దాశయ్య)	దాసు నర్సింహులు (దాశయ్య)	0.2050	-				
					దాసు నరేష్ (రామయ్య)	దాసు నరేష్ (రామయ్య)	0.2050	-				
					దాసు రమేష్ (యాదగిరి)	దాసు రమేష్ (యాదగిరి)	0.2050	-				
					దాసు నరేష్ (యాదగిరి)	దాసు నరేష్ (యాదగిరి)	0.2050	-				
					చేర్యాల కనకమ్మ (నర్సింహులు)	చేర్యాల కనకమ్మ (నర్సింహులు)	0.3400	-				
					చేర్యాల జహంగీర్ (లక్ష్మయ్య)	చేర్యాల జహంగీర్ (లక్ష్మయ్య)	0.3400	-				
					చేర్యాల అఖిల (కనకయ్య)	చేర్యాల అఖిల (కనకయ్య)	0.3450	-				
131	429	పల్లా	తరి	1.2500	దాసు రమేష్ (డి లక్ష్మయ్య)	దాసు రమేష్ (డి లక్ష్మయ్య)		-	285	[illegible]	281	283
					దాసు నరేష్ (డి లక్ష్మయ్య)	దాసు నరేష్ (డి లక్ష్మయ్య)	0.8000					
					దాసు వెంకటేశం (లక్ష్మయ్య)	దాసు వెంకటేశం (లక్ష్మయ్య)		-				
					మల్లెపు గంగమ్మ (గాలయ్య)	మల్లెపు గంగమ్మ (గాలయ్య)	0.1000	-				
					ఇతరులు	ఇతరులు	0.2800					
132	274	పల్లా	తరి	9.0800	బాదిని సుదర్శన్ (వెంకటయ్య)	బాదిని సుదర్శన్ (వెంకటయ్య)	1.0000	బోర్-1	203	200	209	232
					బాదిని బాలయ్య (వెంకటయ్య)	బాదిని బాలయ్య (వెంకటయ్య)	1.0000	బోర్-1				
					బాదిని పెదనర్సింహులు (వెంకటయ్య)	బాదిని పెదనర్సింహులు (వెంకటయ్య)	0.2150	బోర్-1 చెట్లలో ఉన్నది				
					కుంభం నర్సింహులు (లక్ష్మయ్య)	కుంభం నర్సింహులు (లక్ష్మయ్య)	0.2850	-				
					కుంభం సత్తయ్య (లక్ష్మయ్య)	కుంభం సత్తయ్య (లక్ష్మయ్య)	0.2850	బోర్-1, బావి				
					కోళ్ళ నర్సింహులు (బాలయ్య)	కోళ్ళ నర్సింహులు (బాలయ్య)	1.0400	-				
					బాదిని లక్ష్మి (చిన్న నర్సింహులు)	బాదిని లక్ష్మి (చిన్న నర్సింహులు)	0.0050	-				
					బాదిని స్వామి (పోచయ్య)	బాదిని స్వామి (పోచయ్య)	0.2700	-				
					కలకుంట్ల అలియాస్ గడెల మహేష్ (సాయిలు)	కలకుంట్ల అలియాస్ గడెల మహేష్ (సాయిలు)	0.1400	-				
					కలకుంట్ల కృష్ణ (కె లక్ష్మయ్య)	కలకుంట్ల కృష్ణ (కె లక్ష్మయ్య)	0.0725	-				

తెలంగాణలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) పోస్టుల భర్తీకి ఈనెల 12 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. మొత్తం 118 పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తారు.

					కలకుంట్ల దీపిక (కృష్ణుడు)	కలకుంట్ల దీపిక (కృష్ణుడు)	0.0725	-				
					బొంగోని పల్లవి (బి వెంకటేష్ గౌడ్)	బొంగోని పల్లవి (బి వెంకటేష్ గౌడ్)	0.0500	-				
					కలకుంట్ల అంజనేయులు (లక్ష్మయ్య)	కలకుంట్ల అంజనేయులు (లక్ష్మయ్య)	0.0200	-				
					హర్యాల సంధ్య (హర్యాల శ్యామ్ రావు)	హర్యాల సంధ్య (హర్యాల శ్యామ్ రావు)	0.0750	-				
					బదిని అంజనేయులు (బదిని నర్సింహులు)	బదిని అంజనేయులు (బదిని నర్సింహులు)	0.2000	-				
					బాదిని అశోక్ గౌడ్ (లేట్ బదిని నర్సింలు)	బాదిని అశోక్ గౌడ్ (లేట్ బదిని నర్సింలు)	0.2000	-				
					సుంకరి వెంకటేష్ (సుంకరి సిద్ధయ్య)	సుంకరి వెంకటేష్ (సుంకరి సిద్ధయ్య)	1.0300	-				
133	359	పల్లా	తరి	1.1850	మల్లెపు గంగమ్మ (గాలయ్య)	మల్లెపు గంగమ్మ (గాలయ్య)	0.2750	-	494	436	494	495
					మల్లెపు సత్యలక్ష్మి (నర్సింహులు)	మల్లెపు సత్య లక్ష్మి (నర్సింహులు)	0.0775	-				
					మల్లెపు ఎల్లయ్య (హనుమయ్య)	మల్లెపు ఎల్లయ్య (హనుమయ్య)	0.0775	-				
					మల్లెపు మహిపాల్ (నర్సయ్య)	మల్లెపు మహిపాల్ (నర్సయ్య)	0.0775	-				
					మల్లెపు చంద్రయ్య (హనుమయ్య)	మల్లెపు చంద్రయ్య (హనుమయ్య)	0.0775	-				
134	276	పల్లా	తరి	6.1800	కోళ్ల బాలమ్మ (నర్సింహ్మా)	కోళ్ల బాలమ్మ (నర్సింహ్మా)	1.0000	-	313	308	310	290
					కోళ్ళ యాదగిరి (వెంకయ్య)	కోళ్ళ యాదగిరి (వెంకయ్య)	2.3400	చింత చెట్లు-1 తుమ్మ చెట్లు-3 బోర్ 2				
					కోళ్ళ నర్సమ్మ (యాదగిరి)	కోళ్ళ నర్సమ్మ (యాదగిరి)	1.0000	తుమ్మ చెట్లు-3				
					కోళ్ళ నర్సింహులు (బాలయ్య)	కోళ్ళ నర్సింహులు (బాలయ్య)	2.5000	-				
					కలకుంట్ల అలియాస్ గడెల మహేష్ (సాయిలు)	కలకుంట్ల అలియాస్ గడెల మహేష్ (సాయిలు)	0.1150	-				
					కలకుంట్ల కృష్ణ (కె లక్ష్మయ్య)	కలకుంట్ల కృష్ణ (కె లక్ష్మయ్య)	0.0350					
					కలకుంట్ల దీపిక (కృష్ణుడు)	కలకుంట్ల దీపిక (కృష్ణుడు)	0.0350					
					బొంగోని పల్లవి (బి వెంకటేష్ గౌడ్)	బొంగోని పల్లవి (బి వెంకటేష్ గౌడ్)	0.0600	-				
					హర్యాల సంధ్య (హర్యాల శ్యామ్ రావు)	హర్యాల సంధ్య (హర్యాల శ్యామ్ రావు)	0.0350					
135	356	పల్లా	తరి	0.3500	ఎర్రమంట్ల వేణుగోపాల్ (కిష్టమూర్తి)	ఎర్రమంట్ల వేణుగోపాల్ (కిష్టమూర్తి)	0.2900	-	501	340	491	497
					దాసు యాదగిరి తండ్రి రామయ్య దాసు రాజయ్య తండ్రి దాసయ్య దాసు నాగేష్ తండ్రి రామయ్య దాసు లక్ష్మయ్య తండ్రి రామయ్య	దాసు యాదగిరి తండ్రి రామయ్య దాసు రాజయ్య తండ్రి దాసయ్య దాసు నాగేష్ తండ్రి రామయ్య దాసు లక్ష్మయ్య తండ్రి రామయ్య	0.0600	-				
136	357	పల్లా	తరి	0.0500	వెన్నపూస విశ్వనాథం రెడ్డి (చిన్న రెడ్డి)	వెన్నపూస విశ్వనాథం రెడ్డి (చిన్న రెడ్డి)		-	501	351	496	496
					దాచిరెడ్డి గీత (శ్రీ చరణ్ రెడ్డి)	దాచిరెడ్డి గీత (శ్రీ చరణ్ రెడ్డి)	0.0500	-				
					మన్యం శేఖర్ బాబు (వెంకటేశ్వర్ రావు)	మన్యం శేఖర్ బాబు (వెంకటేశ్వర్ రావు)		-				
137	419	శిఖం	కుంట శిఖం	1.8600	నీటిపారుదల - శిఖం (జలాలు)	నీటిపారుదల - శిఖం (జలాలు)	136.0		506	298	296	296
138	367	పల్లా	తరి	11.1900	రాపోలు బక్క యాదగిరి (రాజయ్య)	రాపోలు బక్క యాదగిరి (రాజయ్య)	0.1000	-	481	482	480	483
					రాపోలు శంకరమ్మ (బక్క రాజయ్య)	రాపోలు శంకరమ్మ (బక్క రాజయ్య)	0.2600	బావి-1 పైప్ లైన్				
					రాగుల రామ చంద్రయ్య (రామయ్య)	రాగుల రామ చంద్రయ్య (రామయ్య)	1.0075	బావి-1				
					రాపోలు చిన్న మల్లయ్య (నర్సయ్య)	రాపోలు చిన్న మల్లయ్య (నర్సయ్య)	2.3375	-				
					రాపోలు రాజమ్మ (రామయ్య)	రాపోలు రాజమ్మ (రామయ్య)	1.1575	బావి-1 పైప్ లైన్, వేప చెట్లు-1				
					రాపోలు మల్లయ్య (బాలయ్య)	రాపోలు మల్లయ్య (బాలయ్య)	0.1000	-				
					రాగుల వెంకటేశ్ (రామచంద్రయ్య)	రాగుల వెంకటేశ్ (రామచంద్రయ్య)	1.0200	బోర్-1				
					రాగుల బక్క కవిత (బక్కా వెంకటేష్)	రాగుల బక్క కవిత (బక్కా వెంకటేష్)	0.2100	బావి-1 పైప్				
					రాగుల బక్క స్వామి (బక్క రామయ్య)	రాగుల బక్క స్వామి (బక్క రామయ్య)	0.2100	లైన్				
					రాగుల నాగమణి (రాజయ్య)	రాగుల నాగమణి (రాజయ్య)	0.2100					
					రాగుల రాజయ్య (యాదగిరి)	రాగుల రాజయ్య (యాదగిరి)	0.1450	-				
					రాగుల బక్క గాయత్రి (యాదగిరి)	రాగుల బక్క గాయత్రి (యాదగిరి)	0.1450	-				
					బసవయ్య రాములు (రాజయ్య)	బసవయ్య రాములు (రాజయ్య)	0.0975	-				
					రాగుల యాదమ్మ (రాజయ్య)	రాగుల యాదమ్మ (రాజయ్య)	0.1725	-				
					రాగుల మహేష్ (రాజయ్య)	రాగుల మహేష్ (రాజయ్య)	0.1200	-				
					రాముల రాజయ్య (లేట్ మల్లయ్య)	రాముల రాజయ్య (లేట్ మల్లయ్య)	0.1475	-				
					రాగుల సత్యనారాయణ (లేట్ మల్లయ్య)	రాగుల సత్యనారాయణ (లేట్ మల్లయ్య)	0.1900	-				
						Total	533.7150					
139					Vaagu/ Haddirastha	Vaagu/ Haddirastha	82.3350					
						Grand Total	616.05					

భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్టపరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (చట్టం 21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్టపరిహారాన్ని పొందే హక్కు 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11 (1) యొక్క నిబంధనలను అనుసరించి సంబంధిత వ్యక్తులందరికీ తెలియజేయుటకు గాను ఈ ప్రకటన జారీచేయడమైనది. భూమి యొక్క ప్లాన్ ఏదైనా పనిదినమున మరియు పనివేళలలో జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి మరియు ప్రత్యేక ఉప-కలెక్టర్ (భూ.సే), ఆర్ అండ్ ఆర్, విభాగము-1, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా, వారి కార్యాలయంలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/ జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి వారు, ప్రత్యేక ఉప-కలెక్టర్ (భూ.సే), విభాగము-1, యాదాద్రి భువనగిరి జిల్లా వారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించిన సెక్షన్ 12 ప్రకారం పైన తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశంలో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇతర పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి వారి అనుమతి లేకుండా ఇట్టి ప్రకటన జారీ చేసిన తేదీ నుండి నోటిఫికేషన్‌లో ప్రకటించబడిన భూములకు సంబంధించి ఎవరూ ఎటువంటి లావాదేవీలు / తాకట్టు మొదలగు చర్యలు చేపట్టరాదు.

సదరు చట్టంలోని సెక్షన్ (15) అనుసరించి ప్రతిపాదిత భూసేకరణపై ఏవైనా అభ్యంతరాలు గాని, ఆక్షేపణలు గాని ఉన్నట్లయితే, సేకరణలో ఉన్న భూమితో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైనా, పరిహార నిర్ణయం కొరకు జరిపే సంప్రదింపుల వలన ప్రభావితులయ్యే వారెవరైనా ఇట్టి ప్రకటన జారీచేయబడిన తేదీ నుండి 60 (అరవై) దినములలోగా జిల్లా కలెక్టర్/ అధీకృత అధికారికి వారి అభ్యంతరములు వ్రాతపూర్వకముగా తెలియజేయవచ్చును.

సం/- ప్రత్యేక ఉప-కలెక్టర్ (భూ.సే)
ఆర్ అండ్ ఆర్, విభాగము-1, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా

సం/- అదనపు కలెక్టర్
యాదాద్రి భువనగిరి

సం/- జిల్లా కలెక్టర్
యాదాద్రి భువనగిరి

DIPR RO.NO:559/LA-PP/ADVT/PUBLICATION/2025-26




అల్పాహార సమయంలో బచ్చల నరసమ్మ మనవరాలు పాన్యశ్రీ వెన్నికకు గారె తినిపిస్తున్న సీఎం; బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల అభివాదం

ఆ చెత్తగాళ్ల వెనుక నేనెందుకుంటా?

(మొదటి పేజీ తరువాయి)

మీద పడ్డట్టు.. వాళ్ల కొట్టుకుని మా పేర్లు తీసుకొస్తున్నారు. 2023 డిసెంబరులోనే బీఆర్ఎస్ అనే కాలనాగును తెలంగాణ ప్రజలు కొట్టి చంపారు. ఆనాడే చచ్చిన దాన్ని మళ్లీ నేను చంపాల్సిన అవసరం లేదు" అని వ్యాఖ్యానించారు.

తాను ఎవరి వెనుక ఉండనని, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజల ముందు ఉంటానని రేవంత్‌రెడ్డి చెప్పారు. కల్వకుంట్ల కుటుంబ పంచాయతీలోకి తమను లాగవద్దన్నారు. బీఆర్ఎస్ కాలం చెల్లిన వెయ్యి రూపాయల నోటు వంటిదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఏ పార్టీనీ బతకనీయకూడదనే ఉద్దేశంతో ఎంతో మంది నాయకులను జైలుకు పంపి ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. ప్రకృతి చాలా గొప్పదని, ఎన్నో పాపాలు చేసిన బీఆర్ఎస్ ఇప్పుడు కాలగర్భంలో కలిసిపోతోందని వ్యాఖ్యానించారు.

గతంలో పాలమూరు జిల్లా పేదరికాన్ని, కరువును ఇతర దేశాల వారికి ఒక ఎగ్జిబిషన్‌గా చూపించేవారని సీఎం రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు పాలమూరు బిడ్డకు సీఎంగా అవకాశం వచ్చిందని, పాలమూరును అభివృద్ధి ప్రదర్శనకు వేదికగా మార్చుతామని ప్రకటించారు. దేవరకద్రలో ఒక డ్రైపోర్టు నిర్మాణ ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని, ఇప్పటికే బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటు కోసం రక్షణ శాఖ పరిశీలన జరిపిందని తెలిపారు. హైదరాబాద్- బెంగళూరు జాతీయ రహదారిని డిఫెన్స్ కనెక్టింగ్ కారిడార్‌గా అభివృద్ధి చేస్తామని చెప్పారు. పాలమూరు ప్రాజెక్టులకు గ్రీన్ చానల్ ద్వారా నిధులు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో మంత్రులు జూపల్లి, వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, మేఘారెడ్డి, అనిరుధ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కామారెడ్డి వరద ప్రభావిత ప్రాంతాలకు సీఎం

ఇటీవల అతిభారీ వర్షాలతో అతలాకుతలమైన కామారెడ్డి జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి గురువారం పర్యటించనున్నారు. దెబ్బతిన్న పంటలు, రహదారులు, నీటమునిగిన జనావాసాలను పరిశీలించి, వరద బాధితులను పరామర్శిస్తారు. సీఎం హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయల్దేరి తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్ శివారులో ల్యాండ్ అవుతారు. రోడ్డు మార్గంలో ప్రయాణించి.. లింగంపేట మండలంలో కుర్దు వద్ద తెగిపోయిన ఆర్అండ్‌బీ బ్రిడ్జిని, బుడిగిద్ద గ్రామంలో దెబ్బతిన్న పంటలను, కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వరద ప్రభావిత కాలనీలను పరిశీలిస్తారు. తర్వాత కామారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తారు. కాగా, భారీ వర్షాల కారణంగా జిల్లాలో జరిగిన నష్టంపై అధికార యంత్రాంగం ఒక నివేదికను సిద్ధం చేసింది. కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలో రూ.210 కోట్లకుపైగా నష్టం జరిగిందని, అందులో అత్యవసరంగా చేపట్టాల్సిన పనుల కోసం రూ.38కోట్లు అవసరమవుతాయని గుర్తించింది. ఇక 334 గ్రామాల్లోని 49,984 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, సోయా, పత్తి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయని.. 37,267 మంది రైతులకు నష్టం జరిగిందని వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా వేసింది.

సొంతింట్లోకి వెళ్లినట్టు ఉంది: రేవంత్

భద్రాద్రికొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడు గిరిజన గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గృహ ప్రవేశాలు చేయించారు. బచ్చల రమణ ఇంటిని సీఎం రేవంత్, బచ్చల నర్సమ్మ ఇంటిని పొంగులేటి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందించారు. వారితో కలిసి గారెలు, పరమాన్నం స్వీకరించారు. బచ్చల నర్సమ్మను సీఎం కుశల ప్రశ్నలు అడిగి ఆమె ఒడిలో ఉన్న మనవరాలు పాన్యశ్రీ వెన్నికకు గారెలు తినిపించారు. రమణ కుమార్తె రాజేశ్వరిని పలకరించారు. 'అందరూ బాగున్నారా.... మంచిగా ఉన్నారా.. కాంగ్రెస్ ప్రభుత్వంలో మీ గ్రామంలో 312 ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, రేషన్ కార్డులు ఇచ్చాం.. మీరంతా సంతోషమే కదా' అని లబ్ధిదారులను అడిగారు. గ్రామంలో అందరూ పిల్లల్ని చదివించాలని, వారికి పెళ్లిళ్లు చేసిన అనంతరం వారికి కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. గ్రామంలో బొడ్డురాయికి పూజలు చేశారు. సీఎం పర్యటనతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. మూరుమూల గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా స్వీకరించడం గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం దామరచర్ల గ్రామంలో జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్ మాట్లాడారు. పేదరికాన్ని తరిమికొట్టాలన్న లక్ష్యంతోనే ఇందిరమ్మ ఇళ్ల పథకం చేపట్టామని చెప్పారు. పేదలు గృహప్రవేశం చేస్తుంటే తన సొంత ఇంట్లో గృహప్రవేశం చేస్తున్నంత సంతోషంగా అనిపించిందని చెప్పారు. రాష్ట్రంలో పదేళ్లు ఇందిరమ్మ రాజ్యమే ఉంటుందన్నారు.

కేసీఆర్ దత్తత గ్రామంలోనూ ఇందిరమ్మ ఇళ్లే: పొంగులేటి

కేసీఆర్ తన ఫామ్‌హౌజ్‌కు వెళ్లేందుకుదారి వెడల్పు చేసుకుని యాదాద్రి జిల్లా వాసాలమర్రి గ్రామాన్ని దత్తత తీసుకున్నారని.. ఓ అవ్వ ఇంట్లో భోజనం చేసి, ఆమెతోపాటు గ్రామస్తులకు ఇల్లు కట్టిస్తానని మాటిచ్చి, తర్వాత పట్టించుకోలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. కానీ ఇప్పుడు ఆ అవ్వతోపాటు వాసాలమర్రిలో 119 కుటుంబాలకు సీఎం రేవంత్‌రెడ్డి ఇళ్ల మంజూరు చేశారని చెప్పారు. తల తాకట్టు పెట్టయినా అందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి తీరుతామన్నారు. కాగా, కేసీఆర్ అరాచక పాలనను కూకటి వేళ్లతో పెకిలించి ఇందిరమ్మ రాజ్యం తెచ్చామని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ఇక సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అందరివాడు అని, ఆవేశమున్నా ఎక్కడ తగ్గాలో, ఎక్కడ నెగ్గాలో తెలిసినవారని కొనియాడారు.

కట్టుదిట్టంగా 'సొరంగం' పనుల పునరుద్ధరణ

2028 జనవరిలోగా 'ఎస్ఎల్‌బీసీ' పూర్తి కావాలి

- అత్యంత సురక్షిత పద్ధతులు అనుసరించండి
- అధికారులతో సమీక్షలో మంత్రి ఉత్తమ్
- సొరంగాల నిపుణుడు హర్పాల్ సింగ్ బాధ్యతల స్వీకరణ
- నేడు ప్రాజెక్టుపై సమీక్షించనున్న సీఎం రేవంత్

హైదరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం తవ్వకం పనులను పునరుద్ధరించేందుకు కట్టుదిట్టమైన ప్రణాళిక రూపొందించాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అత్యంత సురక్షితమైన పద్ధతిలో సొరంగం తవ్వకం పనులను పునఃప్రారంభించాలని చెప్పారు. మరో ప్రమాదాన్ని ఊహించలేమని, రెట్టింపు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 2028 జనవరిలోగా పనులు పూర్తి చేయాలన్నారు. నీటి పారుదల శాఖ గౌరవ సలహాదారుడిగా సొరంగాల నిపుణుడు, లెఫ్టినెంట్ జనరల్ హర్పాల్ సింగ్ బుధవారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంత్రి ఉత్తమ్ ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పనుల పునరుద్ధరణపై సమీక్ష నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. రెండు వైపుల నుంచి సొరంగం తవ్వకం జరపాలని, రోజూ కనీసం 7 మీటర్ల మేర తవ్వకం పనులు జరగాలని మంత్రి ఆదేశించారు. మూడు షిఫ్టుల్లో పనులు జరగాలని, ప్రతి షిఫ్టుకు ఇన్‌చార్జిగా జూనియర్ ఇంజనీర్లను నియమించాలన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు పూర్తి కాకపోవడంతో నీళ్లను పంపింగ్ చేసుకోవడానికి ఏటా రూ.500 కోట్ల విద్యుత్ బిల్లులను చెల్లిస్తున్నామన్నారు. 43.931 కి.మీ. సొరంగం తవ్వాల్సి ఉండగా, ఇప్పటికే 35 కి.మీ. మేర పనులు పూర్తయ్యాయని, మిగిలిన 9.57 కి.మీ. మేర తవ్వాల్సి ఉందని అధికారులు తెలిపారు. కొన్నాళ్ల కిందట సొరంగం కూలిన ప్రదేశం నుంచి 15-20 మీటర్లు మినహా మిగిలిన ప్రాంతంలో తవ్వకాలకు అనువైన పరిస్థితులు ఉన్నాయని వివరించారు.

ఎమ్మార్పీఎస్ చలో హైదరాబాద్ వాయిదా

ఉప రాష్ట్రపతి ఎన్నిక ఉన్నందునే: మంద కృష్ణ



పంజాగుట్ట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని ఉప రాష్ట్రపతి ఎన్నికల నేపథ్యంలో వాయిదా వేస్తున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ తెలిపారు. రాష్ట్రంలో వికలాంగులు, చేయూత పింఛన్ దారులకు ఇచ్చే పింఛన్ వెంటనే పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం తలపెట్టామన్నారు. సెప్టెంబరు నెలంతా ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటానికి సిద్ధం కావాలని నిర్ణయించామని తెలిపారు. అక్టోబరు మొదటి లేదా రెండో వారంలో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటించారు. అక్టోబరు 7 నుంచి 11వ తేదీ మధ్య లక్షలాది మంది వికలాంగులు, చేయూత పెన్షన్ దారులతో చలో హైదరాబాద్ కార్యక్రమం ఉంటుందని ఆయన చెప్పారు.

మేడారం ఖ్యాతి ఖండాంతరాలు దాటాలి

మహాజాతరకు ముందే పనులు పూర్తి చేయాలి

- ఒకే వరుసలో సమ్మక్క, సారలమ్మ పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలు
- మేడారం మాస్టర్ ప్లాన్‌పై మంత్రుల సమీక్ష



మేడారం మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష నిర్వహిస్తున్న లక్ష్మణ్, సురేఖ, సీతక్క

హైదరాబాద్/ములుగు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకలైన మేడారం సమ్మక్క, సారలమ్మ వనదేవతల జాతర ఖ్యాతి ఖండాంతరాలు దాటాలని, ఈ మేరకు మహాజాతరను నిర్వహించనున్నట్లు మంత్రులు మంత్రి కొండా సురేఖ, ధనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. జాతర ఏర్పాట్లు, ప్రాంగణంలో శాశ్వత నిర్మాణాలపై మంత్రులు సచివాలయంలో దేవాదాయ శాఖ మంత్రి చాంబర్‌లో బుధవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, ములుగు కలెక్టర్ దివాకర్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేడారం పూజారుల సూచనల మేరకు వనదేవతల ప్రాంగణ నూతన డిజైన్‌ను మంత్రులు పరిశీలించారు. డిజైన్లలో చేయాల్సిన మార్పులపై సూచనలు చేశారు. మేడారం నిర్వహణ పనులను మహాజాతరలోపు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులు, నిర్మాణ సంస్థను మంత్రులు ఆదేశించారు. భక్తుల సందర్శనార్థం వనదేవతల గద్దెల ఎత్తు పెంచాలని పూజారులు మంత్రుల దృష్టికి తీసుకురాగా.. తగిన మేరకు డిజైన్లు మార్చాలనీ సూచించారు. భక్తుల సందర్శనార్థం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు గోవిందరాజుల గద్దెలు ఒకే వరుస క్రమంలో ఉండేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తద్వారా ఎలాంటి జాప్యం లేకుండా వనదేవతలను భక్తులు దర్శించుకునేందుకు అనువుగా ఉంటుందని మంత్రులు చెప్పారు. గత జాతర అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మరిన్ని ఏర్పాట్లు చేయాలని, జాతర సమయంలో భక్తులకు సహాయపడేందుకు వాలంటీర్లను నియమించాలని సూచించారు. ఆదివాసి సంస్కృతి సంప్రదాయాలకనుగుణంగా మేడారం పరిసరాలను తీర్చిదిద్దాలన్నారు. ఈసారి మహాజాతరకు ప్రభుత్వం రూ.150 కోట్లు కేటాయించిందని మంత్రులు తెలిపారు. జాతరకు వెళ్లే మార్గాల్లో ఇందిరా మహిళా క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని అధికారులకు మంత్రులు సూచించారు. ఈ క్యాంటీన్ల ద్వారా భక్తులకు అవసరమైన తినుబండారాలు అందేలా చూడాలన్నారు. అవసరమైతే అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తల ద్వారా సేవలందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రూ.236.2 కోట్లతో మాస్టర్ ప్లాన్

- గద్దెల అభివృద్ధికి రూ. 58.2 కోట్లు
- గద్దెల వద్ద కళాకృతి పనులకు రూ.6.8 కోట్లు
- జంపన్న వాగు అభివృదికి రూ.39 కోట్లు.
- భక్తుల వసతి ఏర్పాట్లకు రూ.50 కోట్లు
- రోడ్ల అభివృద్ధి పనులకు రూ.52.5 కోట్లు
- మిగతా నిధులు ఇతరత్రా పనులు, ఖర్చుల నిమిత్తం వెచ్చించనున్నారు.

వాళ్లు ఆపేశారు.. వీళ్లు మొదలు పెట్టలేదు!


కోడిగుడ్ల సరఫరాలో గందరగోళం

- ఇంకా 8 జిల్లాల్లో పూర్తికాని టెండర్ ప్రక్రియ
- పూర్తయిన జిల్లాల్లో వర్క్ ఆర్డర్లు ఇవ్వని కలెక్టర్లు

హైదరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): "ఆగస్టు 21లోపు అన్ని జిల్లాల కలెక్టర్లు కోడిగుడ్ల టెండర్లు పూర్తిచేసి.. ఎంపికైన కాంట్రాక్టర్లకు వెంటనే వర్క్ ఆర్డర్లు ఇచ్చి సెప్టెంబరు 1 నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ సంస్థలకు గుడ్ల సరఫరా మొదలు పెట్టాలి. గుడ్డు ధర రూ.6.30లకు మించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి" అని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కానీ, ఇవి అమలుకు నోచుకోలేదు. టెండర్ల ద్వారా కొత్తగా ఎంపికైన కాంట్రాక్టర్లు ఈ నెల 1 నుంచి గుడ్లు సరఫరా చేయాలని ప్రభుత్వ ఆదేశాలున్నా.. రాష్ట్రంలో ఎక్కడా సరఫరా ప్రారంభమవలేదు. ఇప్పటికీ 8 జిల్లాల్లో పూర్తిస్థాయిలో టెండర్ల ప్రక్రియ పూర్తికాలేదు. టెండర్లు పూర్తయిన చాలా జిల్లాల్లో కలెక్టర్లు కాంట్రాక్టర్లకు వర్క్ ఆర్డర్లు ఇవ్వలేదు. వర్క్ ఆర్డర్లు పొందిన కాంట్రాక్టర్లు కూడా గుడ్లు సరఫరా చేయలేదు. దీంతో కొన్ని కేంద్రాల్లో గత నెలలో మిగిలిపోయిన గుడ్లను సర్దుబాటు చేస్తున్నారు. అలా లేని చోట్ల గుడ్ల పంపిణీ నిలిచిపోయింది. గుడ్డు ధర ఎట్టి పరిస్థితుల్లో రూ.6.30 కంటే మించొద్దని ప్రభుత్వం ఆదేశించినా కొందరు కలెక్టర్లు అంతకంటే ఎక్కువ ధరకు ఇవ్వడం విమర్శలకు దారితీసింది. కామారెడ్డి, భువనగిరి జిల్లాల్లో మంగళవారమే టెండర్ ప్రక్రియ పూర్తికాగా.. నిర్మల్‌లో ఇంకా కాంట్రాక్టర్లతో ధరపై బేరమాడుతూనే ఉన్నారు. హనుమకొండ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో వర్క్ ఆర్డర్లు ఇవ్వలేదు. 8 జిల్లాల్లో టెండర్ ప్రక్రియ పూర్తి కాలేదు. కొత్త టెండర్లు పూర్తయ్యే వరకు పాత కాంట్రాక్టర్లే సరఫరా చేయాలనే నిబంధనల మేరకు గత నెల వరకు వాళ్లే గుడ్లు అందజేశారు. పెంచిన ధర పాతవాళ్లకు ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో వాళ్లెవరూ ఇప్పుడు సరఫరా చేయడానికి ముందుకు రావడం లేదు. కాగా, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, గద్వాల, నాగర్‌కర్నూలు జిల్లాల కలెక్టర్లు ఏకంగా గుడ్డు ధర రూ.6.40 చొప్పున కాంట్రాక్టర్లకు కట్టబెట్టారు. ఇక వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో రూ.6.39, ఆదిలాబాద్ జిల్లాలో రూ.6.36, నాగర్‌కర్నూలులో రూ.6.35 చొప్పున కాంట్రాక్టర్లకు అప్పగించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధర కంటే ఎక్కువకు ఇచ్చారు. మరోవైపు వరంగల్ జిల్లాలో రూ.5.26, జయశంకర్ భూపాలపల్లిలో రూ.5.88లకే కాంట్రాక్టు ఇచ్చారు. గుడ్లు పక్కదారి పట్టకుండా ఉండడానికి గాను అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్లు గతంలో 15 రోజులకోసారి వేర్వేరు రంగులు వేసి, గుడ్లను సరఫరా చేసేవాళ్లు. కొత్త నిబంధనల ప్రకారం.. జిల్లాకో కాంట్రాక్టర్ ఆయా జిల్లాలోని కేంద్రాలన్నింటికీ గుడ్లు సరఫరా చేయాల్సి ఉంది. అంటే.. ఇప్పుడు ఎక్కువ గుడ్లు సరఫరా చేయాల్సి ఉండడం, వాటన్నింటికీ వేర్వేరుగా రంగులు వేయాలని పేర్కొనడం సమస్యగా మారింది. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే గుడ్లకు ఎలాంటి రంగులు వేయాలో ఇప్పటికే మహిళా శిశు సంక్షేమశాఖ స్పష్టం చేసింది. అయితే, గుడ్లకు వేర్వేరు రంగులు వేయడానికి కాంట్రాక్టర్లు అంగీకరించడం లేదని తెలిసింది.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

కళ్లు చెదిరే ధరకు ఓజీ టికెట్



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ తెరకెక్కిస్తున్న గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా 'ఓజీ'పై ప్రేక్షకుల్లో ఏ రేంజ్‌లో అంచనాలు ఉన్నాయో తెలిసిందే. ఈ నెల 25న విడుదలవుతున్న ఈ సినిమా టికెట్ కళ్లు చెదిరే మొత్తానికి అమ్ముడవ్వడం ఇప్పుడు టాక్ ఆఫ్ ద టౌన్‌గా మారింది. పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా తొలి టికెట్‌కు ఆయన అభిమానులు ఆన్‌లైన్‌లో వేలం నిర్వహించారు. ఈ టికెట్‌ను రూ.5 లక్షలకు నార్త్ అమెరికా పవన్‌కల్యాణ్ టీమ్ దక్కించుకుంది. ఈ మొత్తాన్ని జనసేన పార్టీకి విరాళంగా ఇవ్వనుంది.

అభిమానులకు డబుల్ బొనాంజా...

'ఓజీ'లో ఓజాస్ గంభీర అనే శక్తిమంతమైన పాత్రను పవన్‌కల్యాణ్ పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. ప్రియాంక అరుళ్‌మోహన్ కథానాయిక. పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి ఓ ప్రత్యేక పోస్టర్‌తో పాటు 'లవ్ ఓమీ' అనే గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇవి చూసిన అభిమానులు వింటేజ్ పవన్‌ను చూశామని ఖుషీ అవుతున్నారు.

అవమానానికి గురయ్యాం

● పరువు నష్టం దావా కేసులో నాగార్జున తుది వాంగ్మూలం



తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖపై వేసిన పరువు నష్టం దావాలో అక్కినేని నాగార్జున తుది వాంగ్మూలం ఇచ్చారు. బుధవారం నాగార్జున తన కొడుకు నాగచైతన్యతో కలసి నాంపల్లిలోని ప్రత్యేక జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఎక్సైజ్ కోర్టులో విచారణకు హాజరయ్యారు. సురేఖ తమ కుటుంబంపై చేసిన అభ్యంతరకర, నిరాధార వ్యాఖ్యలతో తమకు తీవ్రమైన అవమానం జరిగిందని, మనోవేదనకు లోనయ్యామని నాగార్జున పేర్కొన్నారు. తన వాంగ్మూలంలో పేర్కొన్న విషయాలకు సంబంధించి ఛానెల్స్‌లో ప్రసారమైన వీడియోలు, పత్రికల్లో వచ్చిన కథనాలను నాగార్జున కోర్టులో సమర్పించారు. ఈనెల 24 నుంచి ఈ కేసు ట్రయల్ ప్రారంభమవనుంది. తదుపరి విచారణలో నాగార్జునను క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)

శీలావతిగా గుర్తుండిపోతాను



అనుష్క

"ఘాటి'లో చేసిన పాత్రను నేను ఇప్పటివరకూ చేయలేదు. నా కంఫర్ట్ జోన్ దాటి చేసిన సినిమా ఇది. అరుంధతి, రుద్రమదేవి, బాహుబలి తర్వాత మళ్లీ ఈ సినిమాలో అంతటి బలమైన పాత్రను చేశాను. శీలావతి పాత్ర ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది. క్రిష్‌గారు నా పాత్రను బలంగా తీర్చిదిద్దారు' అని హీరోయిన్ అనుష్క అన్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం ఈ నెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా 'ఘాటి' విశేషాలను అనుష్క మీడియాతో పంచుకున్నారు.

- 'వేదం' తర్వాత క్రిష్‌తో సినిమా చేయాలనే కోరిక ఈచిత్రంతో తీరింది. నాపైన నమ్మకం ఉంచి ఈ చిత్రాన్ని గ్రాండియర్‌గా నిర్మించిన నిర్మాతలు రాజీవ్‌రెడ్డి, యువీ క్రియేషన్స్ వారికి ధన్యవాదాలు. నేను రెండేళ్లుగా కుటుంబంతోనే ఎక్కువ గడుపుతున్నాను. ఖాళీ దొరికితే విహార యాత్రలకు వెళ్తుంటాను. పుస్తకాలు బాగా చదువుతాను. ప్రస్తుతం భైరప్ప గారి రచన 'పర్వ' చదువుతున్నాను.
- సినిమాల పరంగానే అయినా అనుష్క టాపిక్ వచ్చిన ప్రతిసారీ ప్రభాస్ పేరు కూడా వినిపిస్తుందని అనడం వెనుక కొంతమందికి ఉన్న ఉద్దేశాన్ని నేను అర్థం చేసుకోగలను. మేమిద్దరం నటించిన సినిమాల్లోని కథ, పాత్రలను దర్శకులు మలచిన తీరే అందుకు ప్రధాన కారణం. రాజమౌళి గారితో ఛత్రపతి చేసినప్పటి నుంచి ప్రభాస్ నాకు తెలుసు. అప్పటి నుంచి మేమిద్దరం స్నేహితులం. అందువల్ల నటించేటప్పుడు కొంచెం సౌకర్యంగా ఉంటుంది. అయితే మంచి పాత్ర చిత్రణ లేకుండా ఏం చేసినా తెరపైన కెమిస్ట్రీ పండదు.

రాజ్ తరుణ్‌పై లావణ్య మరో ఫిర్యాదు



నటుడు రాజ్‌తరుణ్‌పై ఆయన మాజీ ప్రియురాలు లావణ్య మరో ఫిర్యాదు చేశారు. రాజ్ తరుణ్ తన అనుచరులను పంపి తనపై దాడిచేయించాడని, తన పెంపుడు కుక్కలను చంపాడని, కోర్టులో కేసు పెండింగ్ ఉండగా, ఖాళీ సీసాలు, గాజు పెంకులతో దాడి చేశారని ఆమె నార్సింగ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నార్సింగ్ పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

నార్సింగ్ (ఆంధ్రజ్యోతి)

దీపావళికి నవ్వుల టపాసులు



ప్రియదర్శి, విష్ణు ఓయ్, రాగ్‌మయూర్, నిహారిక ఎన్ ఎమ్ ప్రధాన పాత్రల్లో విజయేందర్ ఎస్ తెరకెక్కిస్తున్న చిత్రం 'మిత్ర మండలి'. కల్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా.విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాను అక్టోబరు 16న విడుదల చేస్తున్నట్లు ప్రకటించి, ఓ పోస్టర్‌ను, వీడియోను విడుదల చేశారు మేకర్స్. ఈ దీపావళికి థియేటర్లలో నవ్వుల టపాసులకు సిద్ధం కండి అని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: పీకే, సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ్ ఎస్‌జే, సంగీతం: ఆర్ ఆర్ ధ్రువన్.

ప్రజాభీష్టమే సర్వోన్నతం

గవర్నర్లు, రాష్ట్రపతి ఇష్టాయిష్టాలకు అది లోబడి ఉండరాదు

- చట్టాల రాజ్యాంగబద్ధతను తేల్చాల్సింది న్యాయస్థానాలే
- చట్టాల విషయంలో పార్లమెంటుకు ఎలాంటి సార్వభౌమాధికారం ఉందో రాష్ట్రాలకూ అలాగే ఉంది
- సుప్రీంలో కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్, పశ్చిమబెంగాల్ వాదనలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: రాష్ట్ర ప్రభుత్వాలు పంపే బిల్లులకు గవర్నర్ల ఆమోదం కేసులో కేంద్ర ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానానికి సమర్పించిన వాదనలు చూస్తుంటే.. రాజ్యాంగ మూలసూత్రాలనే కేంద్రం పరోక్షంగా రద్దు చేయాలనుకుంటున్నట్టుగా కనిపిస్తోందని కర్ణాటక, పశ్చిమబెంగాల్, హిమాచల్‌ప్రదేశ్ ఆందోళన వ్యక్తం చేశాయి. రాష్ట్రాలను మునిసిపాలిటీల మాదిరిగా చూడకూడదని వాదించాయి. "బిల్లుల రూపంలోని ప్రజాభీష్టం ఎప్పుడూ కార్యనిర్వాహక వ్యవస్థ (గవర్నర్లు, రాష్ట్రపతి) ఇష్టాయిష్టాలకు లోబడి ఉండరాదు. శాసనప్రక్రియలో కార్యనిర్వాహక జోక్యాన్ని రాజ్యాంగం నిషేధించింది. ప్రజాస్వామ్యానికి అధిపతి అయిన ప్రజల అభీష్టమే సర్వోన్నతం" అని తేల్చిచెప్పాయి. బుధవారం ఈ కేసు విచారణలో భాగంగా కాంగ్రెస్ పాలిత కర్ణాటక సర్కారు తరఫున వాదనలు వినిపించిన సీనియర్ అడ్వొకేట్ గోపాల్ సుబ్రమణియం.. మంత్రివర్గ ఆధారిత ప్రజాస్వామ్య ప్రభుత్వం రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో ప్రధాన భాగమని గుర్తుచేశారు. గవర్నర్లకు ఎలాంటి శాసనాధికారమూ ఉండదని ఆయన స్పష్టం చేశారు. హిమాచల్‌ప్రదేశ్ తరఫున వాదనలు వినిపించిన అడ్వొకేట్ ఆనంద్ శర్మ.. చట్టాలు చేయడంలో గవర్నర్లకు, రాష్ట్రపతికి పాత్ర ఉండదని స్పష్టం చేశారు. గవర్నర్లేమీ వైస్రాయ్‌లు, గవర్నర్‌జనరళ్లు కారని.. వారు మంత్రి మండలి సలహాసూచనలకు కట్టుబడి ఉండాలని తెలిపారు. ప్రజల అభీష్టాన్ని వమ్ము చేయడానికి గవర్నర్ కార్యాలయాలను ఉపయోగించుకోరాదంటూ కేంద్రంపై విమర్శలు చేశారు.

రాజ్యాంగం సజీవ పత్రం..

పశ్చిమ బెంగాల్ తరఫున వాదనలు వినిపించిన మరో సీనియర్ అడ్వొకేట్ కపిల్ సిబల్.. "రాజ్యాంగం ఒక సజీవ పత్రం. దాని ఆరంభం గతంలో ఉన్నా దాని విధేయత భవిష్యత్తుకే. ఆ భవిష్యత్తు మీరే (న్యాయమూర్తులు). ఎందుకంటే.. రాజ్యాంగాన్ని విశ్లేషించి చెప్పేది మీరే. రాజ్యాంగం అమలులో గవర్నర్లను అడ్డంకిగా మార్చేందుకు పన్నిన ఉచ్చుకు మనం చిక్కుకోకూడదు" అని పేర్కొన్నారు. ఒకవేళ శాసనసభలు ఆమోదించే బిల్లులు శాసనాధికార పరిధికి అనుగుణంగా లేకపోయినా గవర్నర్లు వాటికి ఆమోదం తెలపాలా? ఆ బిల్లుల చట్టబద్ధతను కోర్టుల్లో సవాల్ చేయవచ్చా అని ధర్మాసనం ప్రశ్నించగా.. ప్రజాసంకల్పానికి కార్యనిర్వాహక వ్యవస్థ ఎట్టిపరిస్థితుల్లోనూ అడ్డంకిగా ఉండరాదని.. చట్టాల రాజ్యాంగబద్ధతను తేల్చాల్సింది కోర్టులే తప్ప కార్యనిర్వాహక వ్యవస్థ కాదని సిబల్ స్పష్టం చేశారు. దీనికి సుప్రీం ధర్మాసనం.. "ఒకవేళ రాష్ట్రం చేసే బిల్లు కేంద్ర చట్టానికి వ్యతిరేకంగా ఉంటే గవర్నర్ దానికి ఆమోదం తెలపకుండా నిలిపి ఉంచగలరా?" అని ప్రశ్నించగా.. అలాంటి సందర్భాలు అత్యంత అరుదుగా మాత్రమే ఉంటాయని సిబల్ బదులిచ్చారు. ప్రజాభీష్టం ఎప్పుడూ గవర్నర్ల ఇష్టాయిష్టాలకు లోబడి ఉండకూడదని తేల్చిచెప్పారు. బిల్లుల ఆమోదంపై రాష్ట్రపతికి, గవర్నర్లకు గడువు విధించడం రాజ్యాంగ సవరణతో సమానమన్న వాదనను తిరస్కరించారు.



అలా కుదరదు..

బిల్లుకు ఆమోదం తెలపాలా? వద్దా? అనే విషయమై గవర్నర్‌కు వ్యక్తిగత నిర్ణయాధికారం ఇస్తే అప్పుడు గవర్నర్ ఎవరికీ జవాబుదారీగా ఉండరని సిబల్ ఆందోళన వెలిబుచ్చారు. గవర్నర్ అలా సొంత నిర్ణయాలు తీసుకుని.. 'నేను ఈ బిల్లును ఆమోదించను (లేదా) పెండింగ్‌లో పెడుతున్నాను' అంటే.. అప్పుడు రాజ్యాంగంలోని 361 కింద లభించే రక్షణ (ఈ ఆర్టికల్ ప్రకారం.. రాష్ట్రపతి/గవర్నర్ తమ విధినిర్వహణలో భాగంగా చేసిన పనులకు వారిపై వ్యక్తిగత బాధ్యత ఉండదు. వాటిని న్యాయస్థానాల్లో ఎవరూ ప్రశ్నించలేరు) గవర్నర్లకు వర్తిస్తుందా? అని ప్రశ్నించారు. ఆర్టికల్ 361 ప్రకారం గవర్నర్ ఎవరికీ జవాబుదారీ కాదంటూనే.. ఆర్టికల్ 200 కింద బిల్లులను ఆపే శక్తి ఇస్తామంటే కుదరదని వాదించారు. చట్టాలు చేసే విషయంలో పార్లమెంటు సార్వభౌమాధికారం ఎంత ముఖ్యమైనదో.. రాష్ట్రాల సార్వభౌమాధికారం కూడా అంతే ముఖ్యమైనదని పేర్కొన్నారు. కాగా.. ఈ కేసు తదుపరి విచారణ 9వ తేదీన కొనసాగనుంది.

సీఏఏ కటాఫ్ తేదీ పొడిగింపు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: పాకిస్థాన్, అఫ్ఘానిస్తాన్, బంగ్లాదేశ్‌లలో మతపరమైన హింసకు గురై లేదా, అలాంటి భయంతో 2024 డిసెంబరు 31లోపు భారతదేశంలోకి ప్రవేశించిన హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. వారంతా పాస్‌పోర్టు, వీసా, మరే ఇతర పత్రాలు లేకపోయినా దేశంలో ఉండొచ్చని ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా అమల్లోకి వచ్చిన వలసలు మరియు విదేశీయుల చట్టం-2025 కింద ఈ ఉత్తర్వులను జారీ చేశారు. ప్రత్యేకించి 2014 తర్వాత పెద్ద సంఖ్యలో పాకిస్థాన్ నుంచి దేశంలోకి వచ్చిన హిందువులకు ఇది భారీగా ఉపశమనం కలిగించనుంది. వారంతా ఇప్పటివరకు తమ భవితవ్యం గురించి ఆందోళనలో ఉన్నారు. కాగా, గతేడాది అమల్లోకి వచ్చిన పౌరసత్వ(సవరణ) చట్టం(సీఏఏ) మేరకు ఆయా దేశాల్లో హింసకు గురైన మతపరమైన మైనారిటీలు 2014 డిసెంబరు 31లోపు భారతదేశంలోకి ప్రవేశిస్తే వారికి భారత పౌరసత్వాన్ని మంజూరు చేస్తారు. ఇదిలా ఉండగా, నేపాల్, భూటాన్ పౌరులు పాస్‌పోర్టు, వీసా లేకుండానే భారతదేశంలోకి ప్రవేశించేందుకు అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. వారు రోడ్డు లేదా వాయు మార్గాలలో తమ దేశాల సరిహద్దులు దాటి భారతదేశంలోకి ప్రవేశించేందుకు పాస్‌పోర్టు, వీసా అవసరం లేదని కేంద్ర హోంశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే, వారు భారతదేశంలోకి ప్రవేశించాలంటే ఏ ఏ పత్రాలు అవసరమో తెలియజేస్తూ ఒక జాబితాను విడుదల చేసింది. ఆయా దేశాల పాస్‌పోర్టు లేదా పౌరసత్వ సర్టిఫికెట్, ఆ దేశాల ఎన్నికల కమిషన్లు జారీ చేసిన ఓటరు గుర్తింపు కార్డు, భారత్‌లోని ఆ దేశాల రాయబార కార్యాలయాలు, ఎంబసీలు జారీ చేసిన ఫొటో గుర్తింపు సర్టిఫికెట్‌లను ఈ జాబితాలో పొందుపరిచింది.

నాన్నా.. జాగ్రత్త..!

(మొదటిపేజీ తరువాయి)

హరీశ్‌రావు, సంతోష్‌రావు ఇళ్లల్లో బంగారం ఉంటే సరిపోతుందా? అని ప్రశ్నించారు. "నాన్నా.. జాగ్రత్త. మన కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసి, బీఆర్ఎస్ పార్టీని ఆక్రమించేందుకు కుట్రలు జరుగుతున్నాయి. మీ చుట్టూ ఏం జరుగుతుందో ఓసారి చూసుకోండి" అంటూ తండ్రి కేసీఆర్‌ను హెచ్చరించారు. బీఆర్ఎస్ నుంచి కవితను సస్పెండ్ చేసిన నేపథ్యంలో బుధవారం జాగృతి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా హరీశ్, సంతోష్‌ల అవినీతిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి, హరీశ్ ఒకే విమానంలో ప్రయాణం చేసిన విషయం నిజం కాదా..? అని కవిత ప్రశ్నించారు. ఆ రోజే వాళ్లిద్దరి మధ్య బంధం పెరిగిందని, తాను చెప్పేది తప్పయితే హరీశ్ స్పందించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌కు హరీశ్ సరెండరైన తర్వాతే తనపై కుట్రలు మొదలయ్యాయన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి చేసిన రాజీనామా లేఖను కేసీఆర్‌కు, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా లేఖను మండలి చైర్మన్‌కు పంపుతున్నట్లు కవిత ప్రకటించారు. పార్టీలో ఉంటూ కేవలం డబ్బు సంపాదించుకోవాలనే ఆలోచన ఉన్నవాళ్లు, వ్యక్తిగత లబ్ధి పొందాలనుకునే వాళ్లు తాను, కేసీఆర్, కేటీఆర్ కలిసి ఉండకూడదని కుట్రలు చేశారని ఆరోపించారు. తమ కుటుంబం విచ్ఛిన్నమైతే బీఆర్ఎస్ పార్టీని హస్తగతం చేసుకోవాలని హరీశ్‌రావు, సంతోష్‌రావు కుట్రలు చేస్తున్నారని చెప్పారు. అందులో భాగంగానే మొదట తనను బయటకు పంపారని, రేపు రామన్నకూ ఇదే పరిస్థితి వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. "ఆరడుగుల బుల్లెట్టు స్వార్థం వల్లే ఈ రోజు నాకు గాయమైంది. రేపు రామన్నకు, మరో రోజు నాన్నకూ ప్రమాదం తప్పదు" అని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ట్రబుల్ షూటర్ కాదు.. బబుల్ షూటర్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీతో మాట్లాడి రెండో అభ్యర్థిని పెట్టాలని హరీశ్‌రావు ప్రతిపాదించారని.. ఆ విషయం బీజేపీ ఎమ్మెల్యే ఒకరు తనకు చెబితే, కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లానని కవిత వెల్లడించారు. ట్రబుల్స్ ఆయనే క్రియేట్ చేసి.. తర్వాత తానే పరిష్కరిస్తున్నట్లు నటించడం హరీశ్ నైజం అన్నారు. "హరీశ్‌కు పాల వ్యాపారం ఉండేది. అధికారంలోకి రాగానే హాస్టళ్లకు పాలు సరఫరా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. రూ.లక్ష కోట్ల కుంభకోణం జరిగిందని రేవంత్‌రెడ్డి అంటారు. కానీ, ఆయనపై ఎటువంటి కేసులుండవు. అదే కేటీఆర్‌ను పనికిరాని కేసులు పెట్టి, పదేపదే విచారణకు పిలుస్తున్నారు. ఇప్పుడు కాళేశ్వరం అంశంలో కేసీఆర్‌ను టార్గెట్ చేశారు. ఆయనపై సీబీఐ విచారణకు కారణం హరీశ్, సంతోష్‌లే. హరీశ్‌పై మొదటి రోజు ఆరోపణలు వస్తాయి. రెండో రోజు నుంచి ఆయన పేరు కనిపించదు. రేవంత్‌రెడ్డి గురించి హరీశ్ ఏనాడూ మాట్లాడలేదు. మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందనడానికి ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలి? హరీశ్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని రేవంత్‌ను నిలదీస్తున్నా. తెలంగాణ ఉద్యమంలో మొదటి నుంచి హరీశ్‌రావు లేరు. పార్టీ పెట్టిన 10 నెలల తర్వాత వచ్చారు. గతంలో పార్టీకి కొంచెం చెడ్డపేరు రాగానే హరీశ్ వెళ్లి వైఎస్‌ని కలవలేదా?" అని కవిత ప్రశ్నించారు.


భర్త, కుమారుడితో జాగృతి కార్యాలయానికి వస్తున్న కవిత

హరీశ్‌ను నమ్ముకున్న ఎందరో బీఆర్ఎస్‌ను వీడారు

హరీశ్‌రావును నమ్ముకున్న ఈటల రాజేందర్, జగ్గారెడ్డి, విజయశాంతి, విజయరామారావు.. ఇలా ఎందరో బీఆర్ఎస్ పార్టీని వీడారని కవిత చెప్పారు. "కాళేశ్వరం నివేదికపై అర్ధరాత్రి దాకా అసెంబ్లీలో చర్చ జరిగింది. హరీశ్‌రావు బ్రహ్మాండంగా మాట్లాడారని పొగడ్తలు గుప్పిస్తున్నారు. కానీ, ఆ ఆరడుగుల బుల్లెట్టు నాకు గాయం చేసింది. ఆ తర్వాత మీవంతే రామన్నా. జాగ్రత్తగా ఉండండి" అని కేటీఆర్‌కు సూచించారు.

రామన్నా.. బుజ్జగించి అడుగుతున్నా..

"నేను రామన్న (కేటీఆర్)ను గడ్డం పట్టుకొని, బుజ్జగించి అడుగుతున్నా. ఒక చెల్లిని, మహిళా ఎమ్మెల్సీని అయిన నాపై కుట్రలు జరుగుతున్నాయని గతంలో తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టి చెప్పా. మీరు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఏం జరిగిందో నాకు ఫోన్ చేసి కనీసం అడగరా? నేను ప్రెస్‌మీట్ పెడితేనే న్యాయం జరగలేదంటే.. మామూలు మహిళా కార్యకర్తకు పార్టీలో అన్యాయం జరిగితే స్పందిస్తారా? సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్ ఎప్పుడో లొంగిపోయారు. ఆయన్ను గమనించుకో రామన్నా. కేసీఆర్ ఆరోగ్యాన్ని, పార్టీని కాపాడుకో. శరీరం బీఆర్ఎస్ అయితే.. జాగృతి ఆత్మ లాంటిది. తెలంగాణ సంస్కృతి, చరిత్రను కాపాడేందుకు కృషి చేశా. పార్టీ అభివృద్ధిలో నా పాత్ర లేదా? మేకవన్నె పులులను పార్టీలో ఉంచుకుంటే ఎలా ఉంటుందో బీఆర్ఎస్ పెద్దలు ఆలోచించాలి. నేను కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతా. వాళ్లు ఇంతకు అంత అనుభవించే రోజు వస్తుంది" అని కవిత హెచ్చరించారు. కేసీఆర్‌పై ఒత్తిడి ఉండడం వల్లే తనను సస్పెండ్ చేయాల్సి వచ్చిందని భావిస్తున్నానని చెప్పారు. ఆయన ఎప్పుడూ ఆడబిడ్డల చెడు కోరుకోరన్నారు. కుటుంబంలో ఎన్నో అవమానాలు జరిగాయని, అవన్నీ బయటకు చెప్పుకోలేనని అన్నారు. అందుకే పార్టీ పరంగా ఉన్న సమస్యల గురించి మాత్రమే మాట్లాడానని, నిజాయితీని నిరూపించుకునేందుకే రాజీనామా చేశానని చెప్పారు. పార్టీ నుంచి బయటకు వెళ్తున్నందుకు బాధగా లేదన్నారు. రాజకీయంగా పొరపచ్చాలు ఇవ్వాళ ఉంటాయి, రేపు పోతాయని చెప్పారు. కానీ, తన తల్లికి దూరంగా ఉండాల్సి రావడమే బాధిస్తోందని కవిత ఉద్వేగానికి గురయ్యారు.

సంతోష్‌రావుకు ధనదాహం ఎక్కువ..!

"సంతోష్‌రావు.. చెప్పులో రాయి, చెవిలో జోరీగ లాంటోడు. అతనికి ధనదాహం ఎక్కువ. పెద్ద సార్ తెలంగాణ బాగు కోసం హరితహారం పేరిట మంచి కార్యక్రమం చేపడితే.. గ్రీన్ చాలెంజ్ అంటూ సంతోష్‌రావు నకిలీ ప్రోగ్రాం పెట్టి, సినీనటులతో ఫొటోలకు పోజులిప్పిస్తారు. దాని వెనక ఉన్న కుట్ర ఏంటంటే.. సంతోష్ కోసం వెంటనే ప్రభుత్వం నుంచి జీవో అమెండ్‌మెంట్ అవుతది. 10 శాతం ఆదాయం ఎవరైనా ఇస్తే.. అడవులను అమ్యూజ్‌మెంట్ పార్కులకు ఇస్తారు. చిరంజీవి, ప్రభాస్ వంటి సినిమా నటులను మోసం చేసి వాళ్లను తీసుకెళ్లి.. ఫొటోలకు పోజులిచ్చి, ఫారెస్టులను కొట్టేయాలని ఆయన ప్లాన్. ఈ సంతోషన్నకు ఇద్దరు ముగ్గురు మనుషులుంటారు. వాళ్లను సంప్రదించి.. అటవీ పరిరక్షణ పేరుతో వాళ్ల ఫొటోలు తీయించి, అడవులను కొట్టేయాలని చూశారు. రామన్న నియోజకవర్గం నేరెళ్లలో ఇసుక లారీ గుద్ది, దళిత బిడ్డ చనిపోతే నిరసన చేపట్టిన ఏడుగురు దళితులపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించి విపరీతంగా కొట్టారు. పోలీసులకు ఫోన్ చేసి చెప్పి కొట్టించింది సంతోష్ అయితే, రాజకీయంగా బద్నామ్ అయింది మాత్రం రామన్న. ఇక పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి సామాన్య కుటుంబానికి చెందిన వ్యక్తి. ఆయన్ను ఇప్పుడు శ్రీమంతుడని అక్కడి ప్రజలు పిలుస్తున్నారు. నాకు పల్లా రాజేశ్వర్‌రెడ్డి చెప్పిన సమాచారం ప్రకారం.. ఓ కంపెనీతో కలిసి ఇదే పోచంపల్లి మోకిలలో రూ.750 కోట్లతో విల్లా ప్రాజెక్టులు చేస్తున్నారు. అవినీతి డబ్బులు కావా? ఆయనెవరు? సంతోష్‌రావు క్లాస్‌మేట్. ఆయనకు ఎమ్మెల్సీ పదవి వస్తుంది. కాంట్రాక్టులు వస్తాయి. అదేవిధంగా నవీన్‌రావు అనే ఎమ్మెల్సీ మామూలుగా 'నాకు ఎమ్మెల్సీ ఇచ్చింది కేసీఆరే అయినా. నా దేవుడు సంతోష్‌రావు' అని అంటారు. ఈయనపై భూకబ్జా కేసులుంటే అవి కూడా వదిలేశారు. నా దగ్గరున్న సమాచారాన్ని బయటపెడితే బీఆర్ఎస్ నేతలందరూ ఇబ్బంది పడాల్సి వస్తుంది. భవిష్యత్తుపై ఎలాంటి ప్రణాళికలు లేవు. ఏ పార్టీలో చేరను. ముఖ్యులతో సంప్రదించి త్వరలో నిర్ణయం ప్రకటిస్తా" అని కవిత చెప్పారు.

నాడు సమీక్షించుకుంటే..

"ఓ వైపు సంతోష్‌రావు, హరీశ్‌రావు గ్యాంగ్.. కాంగ్రెస్ పార్టీతో, పైన ఉన్న బీజేపీతో సమన్వయం చేసుకుంటూ బీఆర్ఎస్‌ను జలగల్లాగా పట్టి పీడిస్తున్నారు. ఎంత దారుణానికి ఒడిగడుతున్నారంటే.. నా ఓటమితోనే అది ప్రారంభమైంది. నా ఓటమికి కుట్రలు చేస్తే సమీక్షించుకోలేదు. కామారెడ్డిలో కేసీఆర్ ఓడిపోవడంతో పాటు మూడోసారి అధికారం కోల్పోయే పరిస్థితికి చేరింది. గెలిచిన, ఓడిన వారందరినీ పిలిపించి మీరు మాట్లాడండి. సంతోష్‌రావు బాధితులు నాకు మామూలుగా ఫోన్లు చేయడం లేదు. బ్లూఫిన్ మోకిల.. ఇంత స్పష్టమైనవి నేను ఇస్తున్నా.. రేవంత్‌రెడ్డిని చాలెంజ్ చేస్తున్నా.. ఎందుకు మీ ఏసీబీ వాళ్లకు వీళ్ల ఇంటి అడ్రస్‌లు దొరకడం లేదా? మీ మధ్య అండర్‌స్టాండింగ్ లేకపోతే మీరు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నా. నాకు 27 ఏళ్లు ఉన్నప్పుడు తెలంగాణ ఉద్యమం కోసం వచ్చా. 20 ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడ్డా. ఇప్పుడు సస్పెండ్ చేస్తే చాలా బాధపడ్డా. సంతోష్ వల్లే మాకు సంబంధించిన టీవీ, పేపర్లలోనూ నా వార్తలు రావడం లేదు. సంతోష్, హరీశ్ గ్యాంగులు కాంగ్రెస్ ప్రభుత్వంతో కుమ్మక్కయ్యాయి. వారిని పక్కన పెడితేనే పార్టీ బతుకుతుంది" అని కవిత పేర్కొన్నారు.

'రామన్న'.. మాట వెనుక మతలబేంటి!

- గతంలో కేటీఆర్‌పై పలు ఆరోపణలు
- ఇప్పుడు రామన్న అంటూ కవిత ప్రస్తావన
- నాన్న కేసీఆర్‌ను బాగా చూసుకోవాలంటూ జాగ్రత్తలు.. దీనిపై రాజకీయ వర్గాల్లో చర్చ
- రెండ్రోజుల్లో జిల్లాల వారీగా జాగృతి నేతలు, కార్యకర్తలతో భేటీలు
- కేసీఆర్ ఫొటోతో సొంత పార్టీ దిశగా కవిత పయనం!

హైదరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గతంలో కేసీఆర్ చుట్టూ దయ్యాలున్నాయంటూ కవిత అన్నారు. అప్పుడు ఆ వాఖ్య సంచలనంగా మారింది. ఆ దయ్యాల్లో కేటీఆర్ కూడా ఉన్నారని కొన్ని పత్రికలు రాశాయి. సోషల్ మీడియాలోనూ వార్తలు వచ్చాయి. టీవీ చానళ్లల్లోనూ చర్చ జరిగింది. అయితే ఆ రాతలను, చర్చలను ఎప్పుడూ, ఎక్కడా కవిత ఖండించలేదు. కేటీఆర్‌ను ఉద్దేశించి ఆరోపణలూ చేశారు. బీఆర్ఎస్ నుంచి తన సస్పెన్షన్ జరిగిన తరువాత బుధవారం విలేకరుల సమావేశంలో మాత్రం కేటీఆర్‌ను 'రామన్న' అంటూ కవిత సంబోధించారు. హరీశ్, సంతోష్‌రావులపై తీవ్ర ఆరోపణలు చేసిన ఆమె కేటీఆర్‌పై ఎలాంటి ఆరోపణలు చే యకపోవడం గమనార్హం. తండ్రి కేసీఆర్‌ను బాగా చూసుకోవాలంటూ జాగ్రత్తలు చెప్పారు. కవిత చేసిన ఈ వాఖ్యలపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే అన్ని విషయాలను ఇప్పుడే బయటపెట్టేస్తే ఇంతటితో చల్లారిపోతుందని అనుకున్నారా? లేదంటే కవిత మాటల వెనుక ఇంకా పెద్ద మతలబు ఏమైనా ఉందా? అన్న దానిపై చర్చ నడుస్తోంది. కాగా సొంత పార్టీ ఏర్పాటు దిశగా కవిత ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. సొంత పార్టీ పెట్టినా తన తండ్రి కేసీఆర్ ఫొటోను మాత్రం పార్టీ కార్యకలాపాల్లో వాడనున్నారని తెలుస్తోంది. రెండ్రోజుల తరువాత జాగృతి నాయకులు, కార్యకర్తలతో కవిత జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహించనున్నారు. అలాగే బహుజన నాయకులు, మేధావులతోనూ మాట్లాడనున్నారు. సమావేశాల్లో వచ్చిన అభిప్రాయాల మేరకు పార్టీ ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. 'సామాజిక తెలంగాణ' నినాదంతో ముందుకెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ప్రధానంగా గడిచిన పదేళ్లలో బీఆర్ఎస్ హయాంలో విస్మరణకు గురయ్యా మని బాధపడుతున్న తెలంగాణ ఉద్యమకారులు, అమరుల కుటుంబాలను భాగస్వామ్యం చేయాలని కవిత నిర్ణయించుకున్నట్లు సమాచారం.

హరీశ్‌పై కవిత వ్యాఖ్యలు బాధాకరం: ప్రశాంత్‌రెడ్డి

బీఆర్ఎస్‌కు గొప్ప సంపద హరీశ్: నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉద్యమం అయినా, పాలన అయినా కేసీఆర్ వెన్నంటే ఉంటూ 25 సంవత్సరాలుగా నిస్వార్థంగా బీఆర్ఎస్ కోసం పని చేస్తున్న హరీశ్‌రావుపై కవిత వ్యాఖ్యలు చేయడం బాధాకరం అని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ అభివృద్ధికి, ప్రజల సంక్షేమం కోసం, పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న వ్యక్తి హరీశ్‌రావు అని బుధవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. చరిత్రలో వీరబ్రహ్మానికి.. సిద్ధయ్యలాగా.. కేసీఆర్ ఏది చెబితే.. హరీశ్‌రావు ఆ విధంగా పనిచేస్తుంటారని.. పార్టీకి ఆయన గొప్ప సంపద.. అని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎవరికో బలం చేకూర్చడానికి కొంతమంది హరీశ్‌రావును టార్గెట్ చేసి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.

కేటీఆర్ సిబ్బంది ఫోన్లు కూడా..

తన వద్ద పనిచేసే సిబ్బంది ఫోన్లను కూడా హరీశ్‌రావు, సంతోష్‌రావు, శ్రవణ్‌రావు ట్యాపింగ్ చేశారని కవిత ఆరోపించారు. అదే బ్యాచ్ కేటీఆర్‌కు సంబంధించిన వారి ఫోన్లను కూడా ట్యాపింగ్ చేసిందన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తమ కుటుంబంలోని నలుగురికి నోటీసులు వచ్చాయని.. హరీశ్, సంతోష్‌రావుకు మాత్రం రాలేదని చెప్పారు. కేసీఆర్‌కు తాను రాసిన లేఖను బహిర్గతం చేసింది కూడా సంతోష్‌రావే అని, ఓ టీవీ ఛానెల్‌కు, కాంగ్రెస్ నేతలకూ ఆయన లీక్ చేశారని తెలిపారు. ఈ గ్యాంగ్ గురించి కేసీఆర్‌కు గతంలో తాను స్వయంగా చెప్పానని.. బీఆర్ఎస్‌లో ఉండి ఇంతకాలం అంతర్గతంగా పోరాడానని, ఇప్పుడు బయటకు వచ్చి పోరాడతానని కవిత వెల్లడించారు.

ఇవన్నీ.. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలా?

అక్రమ కేసుల్లో అరెస్టయి, తిహాడ్ జైల్లో ఐదున్నర నెలలు ఉండి వచ్చాక గత ఏడాది నవంబరు 23 నుంచి ప్రజాక్షేత్రంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టానని కవిత చెప్పారు. గురుకులాల్లో జరుగుతున్న అక్రమాల గురించి మాట్లాడానని, బీసీ రిజర్వేషన్లు, మహిళలకు రూ.2500 ఆర్థిక సాయం అందించాలని పోస్టు కార్డు ఉద్యమం చేశామని తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహ స్వరూపాన్ని మార్చినప్పుడు గళమెత్తి నినదించామన్నారు. సీఎం సొంత జిల్లాలో భూ నిర్వాసితులకు అండగా ఉన్నామన్నారు. పార్టీ శ్రేణులు హాజరయ్యేలా చూడాలని తెలంగాణ భవన్ కార్యాలయ కార్యదర్శి రావుల చంద్రశేఖర్‌రెడ్డి ద్వారా ఆయా నియోజకవర్గాల్లోని పార్టీ నాయకులకు సమాచారం ఇప్పించినట్లు ఆమె వెల్లడించారు. ఇవన్నీ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలా? అని ప్రశ్నించారు. ఈ అంశంపై బీఆర్ఎస్ పెద్దలు పునరాలోచించాలన్నారు.

పనిగట్టుకొని తప్పుడు ప్రచారం

పనిగట్టుకొని తనపై తప్పుడు ప్రచారం చేశారని.. తాజా పరిణామాలు తనను ఎంతో బాధ పెట్టాయని కవిత అన్నారు. "ఎన్నో జన్మల పుణ్యముంటే కేసీఆర్‌కు కూతురిగా పుట్టా. కేసీఆర్‌ను, పార్టీని నేనెందుకు ఇబ్బంది పెట్టాలనుకుంటా? అధికారంలో ఉన్నప్పటికీ నన్ను ప్రతిపక్ష ఎంపీగానే చూశారు. పార్టీ భవిష్యత్తు గురించి, కుట్రదారుల వల్ల తనకు జరిగిన అన్యాయం గురించి మాట్లాడా. కనీసం నా వివరణ కూడా తీసుకోకుండానే పార్టీ నుంచి సస్పెండ్ చేయడం వెనక కుట్రదారులు ఉన్నారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీసీ అంశంపై మాట్లాడుతుంటే పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్నానని ప్రచారం చేశారు. సామాజిక తెలంగాణకు కట్టుబడి ఉన్నానని చెబితే దాన్ని కూడా వక్రీకరించి దుష్ప్రచారం చేశారు. కేసీఆర్ చిటికెన వేలు పట్టుకొని ఓనమాలు నేర్చుకున్నా. ఆయన స్ఫూర్తితోనే సామాజిక తెలంగాణ అని మాట్లాడా. స్వతంత్ర భారతంలో దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పిన గొప్ప నాయకుడు కేసీఆర్. ఆయన చెప్పింది చెప్పినట్లు చేశారు. అది సామాజిక తెలంగాణ కాదా? నేను తప్పు మాట్లాడానా? సామాజిక తెలంగాణ బీఆర్ఎస్‌కు అవసరం లేదా?" అని కవిత వ్యాఖ్యానించారు.

రాజీనామా లేఖల అందజేత

ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తూ కల్వకుంట్ల కవిత రాసిన లేఖను జాగృతి నాయకులు బుధవారం చైర్మన్ కార్యాలయ ఓఎస్డీకి అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి చేసిన రాజీనామా లేఖను తెలంగాణభవన్ కార్యదర్శి రావుల చంద్రశేఖర్‌రెడ్డికి అందజేశారు. కాగా, నిజం మాట్లాడినందుకు తనను పార్టీ నుంచి తొలగించారని.. ఇదే మూల్యం అయితే, తెలంగాణ ప్రజల కోసం వంద రెట్లు చెల్లించుకునేందుకు సిద్ధమని కవిత ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'సత్యమేవ జయతే.. జై తెలంగాణ' అని పేర్కొన్నారు.


కరీంనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న రాంచందర్‌రావు

అవినీతి సొమ్ము పంచుకోవడంలో విభేదాలతోనే కవిత సస్పెన్షన్

- అవినీతిపరులను బీజేపీలో చేర్చుకునేదే లేదు: రాంచందర్‌రావు
- కాళేశ్వరం ప్రపంచంలోనే అతిపెద్ద కుంభకోణం: బండి సంజయ్

కరీంనగర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాళేశ్వరంలోని అవినీతి సొమ్మును పంచుకోవడంలో వచ్చిన విభేదాలతోనే కవితను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేశారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. అవినీతిపరులను బీజేపీలో చేర్చుకునేది లేదని స్పష్టం చేశారు. బుధవారం కరీంనగర్‌లో నిర్వహించిన బీజేపీ బూత్ అధ్యక్షులు, కార్యదర్శుల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని కేసీఆర్ కుటుంబసభ్యులే బయటపెడుతున్నారని చెప్పారు. కాళేశ్వరంపై ఏమీ తేల్చకుండా 20నెలలు తాత్సారం చేసి కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్‌కు తప్పించుకునే అవకాశం కల్పించిందని రాంచందర్‌రావు అన్నారు. అవినీతిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అన్నదమ్ముల్లాంటివని విమర్శించారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థ ఎన్నికల వాయిదా కోసం హైకోర్టులో పిటిషన్ వేసిందని ఆయన ఎద్దేవా చేశారు. ఇదే కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రపంచంలోనే అతిపెద్ద కుంభకోణమని వ్యాఖ్యానించారు. కాళేశ్వరంపై సీబీఐ దర్యాప్తు కోసం అసెంబ్లీలో తీర్మానం చేసిన కాంగ్రెస్, హైకోర్టులో బలమైన వాదనలు వినిపించకుండా బీఆర్ఎస్‌కు సహకరిస్తోందన్నారు. బీఆర్ఎస్ స్కాంలను నిరూపించడంలో కాంగ్రెస్ లీగల్ టీం పూర్తిగా విఫలమైందన్నారు. కాళేశ్వరంతో పాటు ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ కేసు, గొర్రెల పంపిణీలో స్కాం కేసులను కూడా సీబీఐ దర్యాప్తునకు అప్పగించాలన్నారు. ఇటీవలి వరదల్లో కామారెడ్డితో పాటు బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం కాంగ్రెస్ ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్ కూడా కొట్టుకుపోయిందని సంజయ్ అన్నారు. స్థానిక ఎన్నికల్లో గెలిచే బీజేపీ అభ్యర్థుల్లో.. ఎంపీటీసీలకు రూ.5 లక్షలు, జడ్పీటీసీలకు రూ.10 లక్షల చొప్పున అందజేస్తామన్నారు. ఇప్పటి వరకు పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు సైకిళ్లు అందించామని, స్థానిక ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే వచ్చే ఏడాది తొమ్మిదో తరగతి విద్యార్థులకు కూడా సైకిళ్లు అందిస్తామన్నారు.

ఆ పంచాయితీల్లోకి మేము వెళ్లం

- కవిత చాలా చిన్న విషయాలే చెప్పారు
- ఎన్నో జీవోల గురించి చెప్పాలి: రఘునందన్‌రావు



హైదరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ కుటుంబ, అవినీతి పంచాయితీల్లోకి తాము వెళ్లబోమని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు చెప్పారు. మోకిలా ప్రాజెక్టు తప్ప కవిత కొత్తగా చెప్పిన విషయం ఏమీ లేదని అన్నారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కవిత చాలా చిన్న విషయాలు మాత్రమే చెప్పారని, ఇంకా ఎన్నోజీవోల గురించి ఆమె చెప్పాల్సి ఉందన్నారు. బీఆర్ఎస్ నేతల అవినీతి, కుటుంబ పాలన పట్ల వ్యతిరేకత వల్లే ప్రజలు దుబ్బాక ఉప ఎన్నికల్లో తనను గెలిపించారని అన్నారు. గత ఏడాది మార్చి 22న రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు ఒకే విమానంలో ప్రయాణించడం ద్వారా తనను మెదక్‌లో ఓడించడానికి కుట్ర చేస్తున్నారని తాను అప్పట్లో చెప్పినట్లు వెల్లడించారు. పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, నవీన్‌రెడ్డిల అవినీతిపైన ముఖ్యమంత్రి, ఏసీబీ స్పందించాలని, వారు చేసిన పాపపు పనులపై విచారణ చేపట్టాలని ఆయన కోరారు.

కవిత.. కేసీఆర్ విడిచిన బాణం

- ప్రజల్ని మభ్యపెట్టేందుకే కొత్త నాటకం
- కేటీఆర్‌పై ఎక్కుపెట్టిన బాణం..హరీశ్ వైపునకు

ఎందుకు మళ్లింది? :మహేశ్ గౌడ్



హైదరాబాద్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కవిత.. కేసీఆర్ విడిచిన బాణమేనని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ప్రజల్ని మభ్యపెట్టేందుకు కేసీఆర్ కుటుంబం ఆడుతున్న కొత్త నాటకమిదన్నారు. కవిత అమెరికా వెళ్లి తిరిగి రాగానే తన స్టాండ్‌ను ఎందుకు మార్చారని.. అంతకుముందు కేటీఆర్‌పైకి ఎక్కుపెట్టిన బాణం.. హరీశ్‌రావుపైకి ఎందుకు మళ్లిందని ప్రశ్నించారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీకి కవిత రాజీనామా చేయడం శుభ పరిణామమని, అయితే ఆమె ఐదేళ్ల ముందే ఈ రాజీనామా చేసుంటే ప్రజలు అంగీకరించి ఉండేవారన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్ణయాలు చేసేవారిలో కవిత కూడా ఒకరని, ఆమె భాగస్వామ్యం లేకుండానే అవినీతి జరిగిందా అని ప్రశ్నించారు. వాటాల పంపకాల్లో తేడాల వల్లే కవిత కొట్లాడుతోందని ఆరోపించారు. హరీశ్‌రావు, సంతోష్‌రావుల వెనక ఉండాల్సిన ఖర్మ తమకు లేదని, తాము ప్రజల వెంట ఉంటామని పేర్కొన్నారు.

కవిత ఎపిసోడ్.. కుటుంబ డ్రామా: సీతక్క

- అది కేసీఆర్ కుటుంబ పంచాయితీ: అడ్లూరి
- కాళేశ్వరంపై కాంగ్రెస్ చెప్పిందే కవిత చెప్పింది: ఆది శ్రీనివాస్



హైదరాబాద్/హనుమకొండ సిటీ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కవిత ఎపిసోడ్ కుటుంబ రాజకీయ డ్రామా అంటూ మంత్రి సీతక్క కొట్టిపారేశారు. తెలంగాణ జాతిపితగా చెప్పుకునే కేసీఆర్.. నలుగురు కుటుంబ సభ్యులను కూర్చోపెట్టి మాట్లాడి సర్దుబాటు చేయలేని బలహీన పరిస్థితికి చేరుకున్నారా అని ప్రశ్నించారు. అవినీతి, అక్రమ సంపాదన పంపకాల్లో వచ్చిన తేడా వల్లే కేసీఆర్ కుటుంబ సభ్యులు గొడవలు పడుతున్నారన్నారు. కేటీఆర్‌ను కవిత వెనకేసుకు రావడమూ పెద్ద డ్రామా అని ఆమె విమర్శించారు. హరీశ్ వెనుక సీఎం రేవంత్‌ఉంటే.. కాళేశ్వరం అవినీతిపైన విచారణ కమిషన్‌ను ఎందుకు నియమిస్తారని, ఆ కేసును లోతైన విచారణ కోసం సీబీఐకి ఎందుకు అప్పగిస్తారని మంత్రి అడ్లూరి లక్ష్మణకుమార్ ప్రశ్నించారు. కాళేశ్వరంలో అవినీతి బయటపడ్డాక కేసీఆర్ కుటుంబంలో పంచాయితీ మొదలైందన్నారు. మంత్రితో ముఖాముఖీ కార్యక్రమంలో భాగంగా బుధవారం గాంధీభవన్‌లో ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి ఆయన వినతిపత్రాలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ నాయకుడని, ఆయన వెనకుండి ఎవరినీ నడిపించరని.. ఆయన వెనకే అందరూ ఉంటారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కాళేశ్వరం అవినీతి సొమ్ముతో హరీశ్‌రావు, సంతోష్‌రావు బంగారం కొన్నట్లుగా కవిత చెబుతోందని, ఆ బంగారం ఎక్కడుందో చెబితే సీఎం రేవంత్‌కి చెప్పి విచారణ చేయిస్తామని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు అన్నారు. రాష్ట్రాన్ని దొంగల్లా దోచుకుతిన్న కేసీఆర్ కుటుంబాన్ని, బీఆర్ఎస్ నేతలను తెలంగాణ నుంచి తరిమికొట్టాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హనుమకొండ అన్నారు.

బీజేపీ-బీఆర్ఎస్ దోస్తీ కోసమే కవిత సస్పెన్షన్: విజయశాంతి

"కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ మొదలైతే బీజేపీని మేనేజ్ చేసుకోవడం బీఆర్ఎస్‌కు చాలా అవసరం. రెండు పార్టీల మధ్య భవిష్యత్తులో జరగబోయే రహస్య ఒప్పందాలకు అడ్డనే కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు" అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఇవీ ఇమిగ్రేషన్ పోస్టులు..

వీటిద్వారానే అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకలు.. ఏపీలో విజయవాడ, విశాఖ,తిరుపతి ఎయిర్‌పోర్టులు, కాకినాడ, విశాఖ, కృష్ణపట్నం సీపోర్టుల గుర్తింపు.. తెలంగాణలో శంషాబాద్ ఎయిర్‌పోర్టు కూడా...

దేశవ్యాప్తంగా 37 ఎయిర్‌పోర్టులు, 34 సీపోర్టులు, 37 రైల్వే పోస్టుల పేర్లు ప్రకటించిన కేంద్ర హోంశాఖ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3 : అంతర్జాతీయ ప్రయాణికులు రాకపోకలు సాగించడానికి వీలుగా ఇమిగ్రేషన్ పోస్టుల పేర్లను కేంద్ర హోంశాఖ ప్రకటించింది. ఎయిర్‌పోర్టులు, ఓడరేవులు, రైల్వేస్టేషన్ల పరిధిలో ఈ పోస్టులు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖ, తిరుపతి ఎయిర్‌పోర్టులను ఈ జాబితాలో చేర్చారు. ఓడరేవుల్లో విశాఖ, కాకినాడ, కృష్ణపట్నం చోటు సంపాదించుకున్నాయి. తెలంగాణలో శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఎంపికైంది. దేశవ్యాప్తంగా.. 37 ఎయిర్‌పోర్టులు, 34 సముద్ర, నదీ రేవులు, 37 అంతర్జాతీయ ల్యాండ్ క్రాసింగ్ పాయింట్ల పేర్లను ప్రకటిస్తూ గజిట్ నోటిఫికేషన్‌ను కేంద్ర హోంశాఖ విడుదల చేసింది. తాజా ఆదేశాలు ఈ నెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. భారత్-పాక్, భారత్-బంగ్లా సరిహద్దుల పరిధిలో ఆరు రైల్వేస్టేషన్లను ఇమిగ్రేషన్ పోస్టులుగా గుర్తించారు. ఎయిర్‌పోర్టుల జాబితాలో.. అహ్మదాబాద్, లఖనవూ, అమృత్‌సర్, వారణసీ, బెంగళూరు, భువనేశ్వర్, భోపాల్, కాలికట్, చండీగఢ్, చెన్నై, కొచ్చిన్, కోయంబత్తూరు, ఢిల్లీ, గయా, గువాహటి, ఇండోర్, జైపూర్, కోల్‌కతా, మంగళూరు, ముంబై, నాగ్‌పూర్, పట్నా, పుణె, శ్రీనగర్, సూరత్, తిరువనంతపురం తదితరాలు ఉన్నాయి. ఇక.. సముద్ర రేవుల్లో.. భావ్‌నగర్, కాలికట్, చెన్నై, కడలూర్, కోల్‌కతా, కాండ్లా, ముంద్రా, ముంబై, న్యూ మంగళూరు, నాగపట్నం, పారాదీప్, పోర్‌బందర్, పోర్ట్ బ్లెయిర్ తదితరాలు ఉన్నాయి. ల్యాండ్ పోర్టుల్లో.. అట్టారీ రోడ్, హరిదాస్‌పూర్, హిల్, లాల్‌గోలాఘాట్, మహదీపూర్, ఫూల్‌బరీ, రాణిగంజ్, అగర్తలా, దలయ్‌ఘాట్ తదితరులు ఉన్నాయి. రైల్వే పాయింట్లలో.. మునాబావ్, అట్టారీ, గోడే రైల్వే అండ్ రోడ్ చెక్‌పోస్ట్, న్యూ జల్పాయిగురి, హరిదాస్‌పూర్, పెట్రాపోల్ /చిత్‌పూర్ తదితరాలు ఉన్నాయి.

వరద ప్రభావిత రాష్ట్రాలకు ప్యాకేజీని ప్రకటించండి: రాహుల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: భారీ వర్షాలు, వరదలతో తీవ్రంగా ప్రభావితమైన జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు ఆర్థిక సాయం కింద వెంటనే ప్యాకేజీని ప్రకటించాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీని కోరారు. ఆయా రాష్ట్రాల్లో సహాయ చర్యలను కూడా వేగవంతం చేయాలన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. ఉత్తరాదిలో వర్ష బీభత్సం ఇంకా కొనసాగుతోంది. పంజాబ్‌లో 12జిల్లాల్లో వరదల ఉధృతి తీవ్రంగా ఉంది. 1988నుంచి పంజాబ్‌లో ఇంతటి వరదలు సంభవించలేదని అధికారులు తెలిపారు. వర్షాల కారణంగా పంజాబ్‌లో ఇప్పటివరకు 29మంది చనిపోయారు.

విదేశాలకు ప్రభుత్వ ఉపాధ్యాయులు

- ఉత్తమ విద్యావిధానాల అధ్యయనం లక్ష్యం

హైదరాబాద్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): అత్యుత్తమ విద్యావిధానాల అధ్యయనం కోసం విద్యాశాఖ ఉన్నతాధికారులు, ప్రభుత్వ ఉపాధ్యాయులను విదేశాలకు పంపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఫిన్లాండ్, వియత్నాం, జపాన్ దేశాల్లో విద్యలో అనుసరిస్తున్న వినూత్న పద్ధతులు అధ్యయనం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అనుమతించారు. గురుపూజోత్సవం సందర్భంగా ఈనెల 5న మాదాపూర్‌లోని శిల్పారామం ఆడిటోరియంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారిక కార్యక్రమం నిర్వహించనుంది. ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించే ఈ సభలోనే విదేశాలకు ప్రభుత్వ ఉపాధ్యాయులను పంపే విషయంపై సీఎం ప్రకటన చేస్తారు.

రాజీ పడి జైలు శిక్ష తప్పించుకోవచ్చు

చెక్‌బౌన్స్ కేసులపై సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: చెక్‌బౌన్స్ కేసుల్లో నిందితుడు ఫిర్యాదీదారుతో రాజీపడి జైలు శిక్ష నుంచి తప్పించుకోవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇరు పార్టీలు రాజీ ఒప్పందంపై సంతకాలు చేసిన తరువాత నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టంలోని సెక్షన్ 138 ప్రకారం శిక్షించాల్సిన పనిలేదని తెలిపింది. చెక్‌బౌన్స్‌లు సివిల్ కేసులని, రాజీ కుదిరిన తరువాత ఇక శిక్షలు అవసరం లేదని జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం పేర్కొంది. చెక్‌బౌన్స్ నేరాలు 'సివిల్ గొర్రెల దుస్తులను ధరించిన క్రిమినల్ తోడేళ్ల'లాంటివని గతంలో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యను గుర్తు చేసింది. చెక్కుల వంటి పత్రాలకు చట్టబద్ధత ఉందని, ఉల్లంఘిస్తే కఠిన శిక్షలు ఉంటాయని చెప్పడమే దాని ఉద్దేశమని వివరించింది. అయితే సొమ్ము చెల్లింపుపై ఫైనల్ సెటిల్‌మెంట్ జరిగిన తరువాత శిక్ష వేయాల్సిన అవసరం లేదని తెలిపింది. చెక్‌బౌన్స్ కేసులో రాజీ కుదిరిన తరువాత కూడా నిందితుడు నేరం చేశాడన్న కారణంతో పంజాబ్-హరియాణా హైకోర్టు శిక్ష విధించింది. దీనిపై నిందితుడు సుప్రీంకోర్టులో అప్పీలు చేయగా హైకోర్టు తీర్పును కొట్టివేసింది. కేసులు వద్దనుకొని స్వచ్ఛందంగా వారు రాజీ కుదుర్చుకున్నందున మళ్లీ శిక్ష వేయాల్సిన అవసరం లేదని తెలిపింది.

హైదరాబాద్‌లో గణేష్ నిమజ్జనం.. 6న సెలవు

- హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డికి వర్తింపు
- అక్టోబరు 11న రెండో శనివారం వర్కింగ్ డే

హైదరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గణేష్ నిమజ్జన ఊరేగింపు కారణంగా ఈ నెల 6న (శనివారం) ప్రభుత్వం సాధారణ సెలవుగా ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలతో పాటు రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కాలేజీలకు సెలవు ఉంటుందని తెలిపింది. శనివారం సెలవు ఇస్తున్నందున... అక్టోబరు 11న రెండో శనివారం ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కాలేజీలకు పని దినం(వర్కింగ్ డే) వర్తిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది.

పంప్డ్ స్టోరేజీలకు సీఈఏ అనుమతి అక్కర్లేదు

- కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్

హైదరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దేశంలో పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర విద్యుత్ సంస్థ(సీఈఏ) అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అయితే సీఈఏ నుంచి సాంకేతిక సహాయం తీసుకోవచ్చని సూచించింది. ఈమేరకు బుధవారం కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇక రూ.3 వేల కోట్లకు పైగా వెచ్చించి.. కట్టే జల విద్యుత్ కేంద్రాలు విధిగా సీఈఏ అనుమతి తీసుకోవాలని నిర్దేశించింది. పంప్డ్ స్టోరేజీ జలవిద్యుత్ కేంద్రాలు జాతీయ ఆనకట్టల భద్రత చట్టం(ఎన్‌డీఎస్‌ఏ)-2021లోని నిబంధనలకు కట్టుబడి ఉండాలని గుర్తుచేసింది. ఇప్పటిదాకా పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేయాలంటే విధిగా సీఈఏ అనుమతి తీసుకోవాలనే నిబంధన ఉండగా... దీన్ని సవరించింది. ఇది తెలంగాణలో ఏర్పాటు కానున్న ఏడు పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్ కేంద్రాలకు శుభవార్త కానుంది.

బీసీ రిజర్వేషన్లకు పార్టీల మోకాలడ్డు: జాజుల

బాలసముద్రం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల పెంపునకు అగ్రకుల ఆధిపత్య రాజకీయ పార్టీలు మోకాలడ్డుతున్నాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ ఆరోపించారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. పార్టీలు బీసీ రిజర్వేషన్ల బిల్లుకు నోటితో మద్దతు తెలుపుతూ నొసటితో వెక్కిరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు ఉన్నాయని, జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు కనీసం 42% రిజర్వేషన్లు అమలు చేయడానికి రాజకీయ పార్టీలు ఎందుకు ముందుకు రావడం లేదన్నారు. పార్లమెంట్‌లో చట్టం చేసేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పూనుకోవాలని, ప్రతిపక్షంలో ఉన్న ఇండియా కూటమి రిజర్వేషన్ల కోసం డిమాండ్ చేయాలని అన్నారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ నాయకులు కేంద్రానికి కనీసం వినతిపత్రం కూడా ఇవ్వలేదని, వారి కుట్రను బీసీలు అర్థం చేసుకున్నారన్నారు. రాజకీయ పార్టీలన్నీ బీసీ రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇచ్చి గవర్నర్, రాష్ట్రపతిల వద్దకు వెళ్లి బిల్లుకు ఆమోదం తెలపాలని కోరాలని కోరారు.

ఫుడ్ పాయిజన్ ఘటనలపై ఏం చర్యలు తీసుకున్నారు ?: హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలు, హాస్టళ్లలో చోటుచేసుకున్న ఫుడ్ పాయిజన్ ఘటనలపై వివరణ ఇవ్వడంతోపాటు వాటిని నివారించేందుకు ఏయే చర్యలు తీసుకుంటున్నారో తెలియజేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని హైకోర్టు బుధవారం ఆదేశించింది. ప్రభుత్వ గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలకు సంబంధించి 2023 నాటి ప్రజాప్రయోజన వ్యాజ్యంలో చిక్కుడు ప్రభాకర్ అనే న్యాయవాది మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. ఈ మధ్యంతర పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. విషాహార ఘటనలపై చర్యలు తీసుకున్నామని, టాస్క్‌ఫోర్స్ కమిటీ, విద్యాసంస్థ స్థాయి ఆహారభద్రతా కమిటీలు వేశామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో అవేవీ అమలు కావడం లేదని న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ ఈ సందర్భంగా ధర్మాసనానికి తెలియజేశారు. ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదిస్తూ.. ప్రభుత్వ గురుకులాల్లో 3 లక్షలకు పైగా విద్యార్థులు ఆహారం తీసుకుంటున్నారని.. అరుదుగా ఎక్కడో ఓ ఘటన జరుగుతోందని.. వెంటనే సిబ్బంది, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ దశలో జోక్యం చేసుకున్న చీఫ్ జస్టిస్ ఏకే సింగ్.. విద్యార్థులు, హాస్టళ్ల పరిశుభ్రంగా ఉండేలా క్లీనింగ్ పనులు ఎవరు చేస్తారని ప్రశ్నించగా.. దానికి ప్రత్యేకంగా సిబ్బంది ఉంటారని ఏఏజీ బదులిచ్చారు. అయితే, ఎవరి పనులు వాళ్ల చేసుకోవడంలో తప్పులేదని.. తాను రామకృష్ణ మిషన్ పాఠశాలలో చదువుకున్న రోజుల్లో ప్లేట్లు కడగడం, దుస్తులు ఉతకడం, తోటపని, మరుగుదొడ్లు శుభ్రం చేసుకోవడం వంటి పనులు తామే చేసేవాళ్లమని చీఫ్ జస్టిస్ ఈ సందర్భంగా తెలిపారు. దీనికి ఏఏజీ స్పందిస్తూ.. విద్యార్థులతో పనిచేయిస్తే న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వెంటనే మరో వ్యాజ్యం దాఖలు చేస్తారని చమత్కరించారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఎస్‌వోపీ అమలుకు కాంపిటెంట్ అధికారులు ఎవరు? ప్రతి విద్యార్థికి ఇచ్చే ఆహారం ఎంత? విషాహారం ఘటనలు చోటుచేసుకోకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? తదితర వివరాలతో సమగ్ర నివేదిక సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

15న ఇంజనీర్లకు అభినందన సభ

హైదరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15న జాతీయ ఇంజనీర్ల దినోత్సవం (మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి) సందర్భంగా హైదరాబాద్‌లోని జలసౌధలో ఇటీవలే పదోన్నతులు పొందిన ఇంజనీర్లకు అభినందన సభ నిర్వహించనున్నారు. మూడు దశాబ్దాల విరామం తర్వాత అన్ని స్థాయిల్లోని అధికారులకు పదోన్నతి కల్పించారు. ఈనెల 1 వరకు అన్ని దశల్లో పదోన్నతి పొందినవారికి పోస్టింగులు ఇచ్చారు. దీంతో 360మందికిపైగా అధికారులకు ప్రయోజనం కలిగింది. శాఖలో సర్వీసు వివాదం జోన్ 5, జోన్ 6 మధ్య ఉండేది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగుల సర్వీసు వివాదంపై సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. న్యాయస్థానం నుంచి అనుకూల తీర్పు వెలువడటంతో వెంటనే శాఖ పదోన్నతుల కమిటీ వేసి పదోన్నతుల ప్రక్రియను చేపట్టారు. ఈ నేపథ్యంలో పదోన్నతులు పొందిన ఇంజనీర్లను అభినందించేందుకు నిర్వహించే కార్యక్రమంలో సీఎం, మంత్రి పాల్గొని వారికి దిశానిర్దేశం చేయనున్నారు.

ఖేడా భార్య నీలిమకూ రెండు ఓటరు ఐడీలు

- ఒకటి ఖైరతాబాద్‌లో.. మరొకటి ఢిల్లీలో...
- కోటరీలోని నాయకుల నేరాల నుంచి రాహుల్ గాంధీ తప్పించుకోలేరు: బీజేపీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: కాంగ్రెస్ నేత పవన్ ఖేడాకే కాదు ఆయన భార్య కోట నీలిమకు కూడా రెండు ఓటరు ఫొటో గుర్తింపు కార్డులు (ఎపిక్‌లు) ఉన్నాయని బీజేపీ ఆరోపించింది. నీలిమకు ఖైరతాబాద్ (తెలంగాణ), ఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గాల్లో వేర్వేరు నంబర్లతో ఓటరు ఐడీలు ఉన్నాయని బీజేపీ ఐటీ విభాగం హెడ్ అమిత్ మాలవీయ బుధవారం 'ఎక్స్'లో పేర్కొంటూ అసలు ఓట్ల దొంగ కాంగ్రెస్సేనని విమర్శించారు. తన కోటరీలోని నాయకులు పాల్పడుతున్న నేరాల నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తప్పించుకోలేరని వ్యాఖ్యానించారు. నీలిమ 2023లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. సీడబ్ల్యూసీ సభ్యుడు, కాంగ్రెస్ మీడియా విభాగం ఇన్‌చార్జి అయిన పవన్ ఖేడాకు ఢిల్లీ, జంగ్‌పురా అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెండు ఓటరు ఐడీలు ఉన్నాయని బీజేపీ మంగళవారం ఆరోపించిన సంగతి తెలిసిందే. దీనిపై ఎన్నికల కమిషన్ (ఈసీ) ఆయనకు నోటీసులు జారీ చేసింది. అయితే ఒకచోట తన పేరు తొలగించాలని 2016లో దరఖాస్తు చేశానని, కానీ ఈసీ తొలగించలేదన్న విషయం బీజేపీ ఆరోపణల వల్లే తెలిసిందని ఖేడా పేర్కొన్నారు.

5 నెలలు.. రూ.760 కోట్లు!

జీహెచ్‌ఎంసీకి పెరిగిన భవన నిర్మాణ అనుమతుల ఆదాయం

గతేడాదితో పోలిస్తే 90 శాతం ఎక్కువ గాడినపడుతున్న 'రియల్' రంగం

క్రయ విక్రయాల్లో పెరుగుదల.. కొత్త ప్రాజెక్టులకు దరఖాస్తులు.. అనుమతుల జారీలో పెరిగిన వేగం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగర స్థిరాస్తి రంగంలో పురోగతి కనిపిస్తోంది. గత ఏడాదితో పోలిస్తే జీహెచ్‌ఎంసీ పరిధిలో భవన నిర్మాణ అనుమతుల జారీ, తద్వారా సంస్థకు వచ్చిన ఆదాయం భారీగా పెరిగింది. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు భవన నిర్మాణ అనుమతులు, నివాసయోగ్య పత్రాల జారీ (ఓసీ) ద్వారా రూ.399.61 కోట్ల ఆదాయం రాగా.. ఈ ఏడాది అదే కాలానికి రూ.759.98 కోట్ల ఆదాయం సమకూరిందని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో బల్దియా పేర్కొంది. 90 శాతం పెరుగుదల ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 4,389 భవన నిర్మాణ అనుమతులు, 1,008 ఓసీలు జారీ చేశారు. జీహెచ్‌ఎంసీకి ఆస్తి పన్ను, నిర్మాణ అనుమతుల రుసుము ప్రధాన ఆదాయ వనరులు. గత ఆర్థిక సంవత్సరం (2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు) రూ.2 వేల కోట్లకుపైగా ఆస్తి పన్ను వసూలు కాగా.. పట్టణ ప్రణాళికా విభాగం ద్వారా రూ.1138.44 కోట్ల ఆదాయం వచ్చింది. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదు. దీంతో కేవలం రూ.399.61 కోట్ల ఆదాయం సమకూరింది. గత ఏడాది సెప్టెంబరు నుంచి ఈ ఏడాది మార్చి వరకు వచ్చిన రూ.738.83 కోట్లతో కలిపి మొత్తం ఆదాయం రూ.1138.44 కోట్లకు పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025 ఏప్రిల్ నుంచి 2026 మార్చి) మొదటి ఐదు నెలల్లో గతంలో ఎప్పుడూ లేని విధంగా రూ.759.98 కోట్లు రావడం గమనార్హం. ఈ నేపథ్యంలో స్థిరాస్తి రంగం గాడిన పడుతోందని, క్రయ విక్రయాలు పెరగడం వల్లే నూతన ప్రాజెక్టులు ప్రారంభించేందుకు రియల్ ఎస్టేట్ కంపెనీలు ముందుకు వస్తున్నాయని ఓ అధికారి పేర్కొన్నారు. అదే సమయంలో ఇండిపెండెంట్, ఐదు అంతస్తుల్లోపు భవనాల నిర్మాణంలోనూ పెరుగుదల కనిపిస్తోంది.

అనుమతుల జారీలో వేగం

భవన నిర్మాణ అనుమతుల జారీకి అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ ఏడాది మార్చి 20 నుంచి బిల్డ్ నౌ విధానం అమలు చేస్తున్నారు. బిల్డ్ నౌలో ప్లాన్ పరిశీలన నిమిషాల వ్యవధిలో పూర్తవుతుండగా సింగిల్ విండో ద్వారా రెవెన్యూ, ఇరిగేషన్, ఇతర విభాగాలకు దరఖాస్తు వెళుతోంది. భూమి యజమాన్య హక్కు, చెరువులు, నాలాలు, కుంటల పక్కన స్థలం లేకుంటే ఎన్‌వోసీ ఇస్తున్నారు. దీంతో భవన నిర్మాణాల అనుమతుల జారీలో వేగం పెరిగిందని బల్దియా వర్గాలు చెబుతున్నాయి.

కేంద్రం వల్లే యూరియా కొరత

దేశమంతటా ఈ సమస్య ఉంది.. 11 లక్షల టన్నులు అడిగితే.. 5 లక్షల టన్నులు ఇచ్చారు

- వరదలతో 2.5 లక్షల ఎకరాల్లో నష్టం
- ఢిల్లీలో మీడియాతో మంత్రి తుమ్మల
- వ్యవసాయ యంత్రాలపై 12% జీఎస్టీ తొలగించాలి
- కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్‌కు తుమ్మల విజ్ఞప్తి



ఢిల్లీలో కేంద్ర మంత్రి శివరాజ్‌ను కలిసిన మంత్రి తుమ్మల, జితేందర్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితోనే దేశవ్యాప్తంగా యూరియా కొరత నెలకొందని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. ఎరువుల ఉత్పత్తిని పెంచకపోవటం వల్ల సమస్య పెరిగిపోయిందన్నారు. రాష్ట్రంలో సాగురంగంలో నెలకొన్న సమస్యలను కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఢిల్లీకి వచ్చిన మంత్రి తుమ్మల బుధవారం మీడియాతో మాట్లాడారు. చైనా నుంచి ఎర్రసముద్రం మీదుగా వచ్చే యూరియా రాకపోవడం వల్ల కొరత ఏర్పడిందన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రానికి 11 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కావాలని అడిగితే కేంద్రం 9.8 లక్షల మెట్రిక్ టన్నులు ఇస్తామని చెప్పిందని, ఇప్పటి వరకు 5.20 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చిందని తెలిపారు. యూరియా సరైన సమయానికి రాకపోవడం వల్ల రైతాంగం ఆందోళనలో ఉందని, ఈ నెలలో పంటలకు ఎరువులు చాలా అవసరమన్నారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో గత నాలుగు నెలలుగా యూరియా ఉత్పత్తి జరగటం లేదని, మరో 15 రోజుల వరకూ ఇదే పరిస్థితి అని చెప్పారు. తెలంగాణలో ఎరువుల బ్లాక్ మార్కెట్‌కు ఆస్కారం లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో భారీవర్షాలు, వరదల వల్ల ప్రాథమిక అంచనాల ప్రకారం 2.5 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, దీనిని కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. గతంలో రాష్ట్రంలో వరదలు సంభవించినప్పుడు కేంద్రం సాయం చేయలేదని విమర్శించారు. ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకం తగ్గించాలన్న కేంద్రం నిర్ణయంతో తెలంగాణలోని పామాయిల్ రైతులకు తీవ్ర నష్టం కలుగుతుందని, ఆ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఆయిల్ పామ్ గెలలకు టన్నుకు రూ.25 వేల కనీస మద్దతు ధర కల్పించేలా ఆయిల్ పామ్ దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచాలన్నారు. బుధవారం శివరాజ్‌సింగ్‌తో ఆయన నివాసంలో మంత్రి తుమ్మల భేటీ అయ్యారు. ఎన్‌బీఎస్ (న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీ) పాలసీ కింద ఫాస్పరస్, పొటాషియంపై రాయితీని పెంచాలని, యూరియాతో సమానంగా ధరల సమతుల్యత పాటించాలని కేంద్ర మంత్రిని కోరారు. భద్రాద్రి కొత్తగూడెం, నారాయణపేట, ములుగు, కొమురంభీం ఆసిఫాబాద్, సంగారెడ్డి జిల్లాలను ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి యోజన (పీఎండీడీకేవై) పథకంలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ యంత్రాలపై 12 శాతం జీఎస్టీ విధించటం వల్ల యంత్రాల కొనుగోలు చిన్న, సన్నకారు రైతులకు భారంగా తయారైందని, జీఎస్టీని మినహాయించాలని విజప్తి చేశారు. తుమ్మల వెంట రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి, గౌరవ్ ఉప్పల్ ఉన్నారు.



కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి శెలగట్టులో ధర్నా చేస్తున్న రైతులు, అఖిలపక్ష నేతలు

యూరియా కొరత.. అన్నదాత వెత!

పలు జిల్లాల్లో తప్పని నిరీక్షణలు

- రోడ్డెక్కుతున్న రైతులు.. ఆందోళనలు.. కేంద్రాల వద్ద ఉద్రిక్తతలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కొరతతో రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. పంపిణీ కేంద్రాలు, దుకాణాల ముందు రేయింబవళ్లు బారులు తీరి పడిగాపులు కాస్తున్నారు. చాలాచోట్ల తోపులాటలు, తొక్కిసలాటలు, గలాటాలు చోటుచేసుకుంటున్నాయి. యూరియా రాక తక్కువగా ఉండటం.. అదే సమయంలో రైతులు భారీ సంఖ్యలో ఎగబడుతుండటంతో చాలాచోట్ల తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఒక్క బస్తా కోసం అన్నదాతలు పడుతున్న బాధలు అన్నీ ఇన్నీ కావు. సరిపడినంత యూరియా లభించకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ధర్నాలు, రాస్తారోకోలకు దిగుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలు చోట్ల రైతులు ఆందోళనకు దిగడంతో పోలీసు బందోబస్తు మధ్య యూరియాను పంపిణీ చేశారు. ఖమ్మం జిల్లా ఆళ్లపల్లి, జూలూరుపాడులో అఖిలపక్ష నాయకులతో కలిసి రైతులు రాస్తారోకోలు నిర్వహించారు. వరంగల్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల్లో ధర్నాలు, రాస్తారోకోలతో రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అనేక సొసైటీల కార్యాలయాల వద్ద రైతులు పక్కన పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులు, చెప్పులు, ఖాళీ సంచులు పెట్టుకుని యూరియా కోసం రాత్రి నిద్ర చేశారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తపేటలోని శ్రీ దివ్య ఫర్టిలైజర్ షాపునకు మంగళవారం రాత్రి వచ్చిన 111 బస్తాల యూరియా మాయమైంది. రైతులనుంచి ఫిర్యాదులు అందడంతో షాపు లైసెన్స్‌ను 30 రోజుల పాటు సస్పెండ్ చేసినట్లు ఏవో తెలిపారు.

100 కోట్ల మందికి మానసిక రుగ్మతలు

ప్రతి ఏడుగురిలో ఒకరికి మానసిక వ్యాకులత

కుంగుబాటు, మానసిక ఆందోళన బాధితులే ఎక్కువ.. ప్రతి 100 మరణాల్లో ఒక ఆత్మహత్య

మానసిక ఆరోగ్యంపై వ్యయం 2% మాత్రమే.. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ఆందోళన

హైదరాబాద్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని 100 కోట్లమందికి పైగా ప్రజలు మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) నివేదిక వెల్లడించింది. ప్రతి ఏడుగురిలో ఒకరికి మానసిక రుగ్మతలు ఉన్నాయని తెలిపింది. మొత్తం కేసుల్లో మూడింట రెండొంతుల మంది కుంగుబాటు, మానసిక ఆందోళన బాధితులే. మానసిక ఒత్తిడి, వ్యాకులత కారణంగా పెద్ద ఎత్తున ప్రాణ నష్టంతో పాటు ఆర్థికంగా కూడా నష్టం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేసింది.

యువత మరణాల్లో ఆత్మహత్యలు

2021 సంవత్సరానికి సంబంధించి డబ్ల్యూహెచ్‌ఓ తాజాగా 'వరల్డ్ మెంటల్ హెల్త్ టుడే', 'మెంటల్ హెల్త్ అట్లాస్-2024' పేర ఓ నివేదికను విడుదల చేసింది. యువత మరణాల్లో ఆత్మహత్యలు ప్రధానంగా ఉంటున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి 100 మరణాల్లో ఒక ఆత్మహత్య ఉంటుందని, 20 ఆత్మహత్యాయత్నాల తర్వాత ఒక మరణం చోటు చేసుకుంటుందని నివేదిక వెల్లడించింది. ప్రతి 200 మందిలో ఒకరు స్కిజోఫ్రెనియాకు, ప్రతి 150 మందిలో ఒకరు బైపోలార్ డిజార్డర్‌కు గురవుతున్నారని, ఇది చాలా ఇబ్బందికర పరిణామమని తెలిపింది. నిజానికి స్కిజోఫ్రెనియా మిగతా అనారోగ్య సమస్యలకు హేతువవుతోందని, చాలా ఖరీదైన జబ్బుగా పరిణమిస్తుందని వెల్లడించింది.

వ్యయం అంతంత మాత్రమే

ప్రపంచవ్యాప్తంగా మానసిక రుగ్మతలున్న ప్రతి లక్షమందికి 13 మంది మానసిక ఆరోగ్య సిబ్బంది మాత్రమే ప్రస్తుతం సేవలందించగలుగుతున్నారని, ఈ సంఖ్య చాలా తక్కువ అని నివేదిక తెలిపింది. అనేక దేశాలు ఆరోగ్య రంగంపై పెట్టే వ్యయంలో 2 % నిధులనే మానసిక ఆరోగ్యంపై వెచ్చిస్తున్నాయని, 2017 నుంచి ఈ ధోరణి మారడం లేదని ఆందోళన వ్యక్తం చేసింది. మానసిక ఆరోగ్యంపై పెడుతున్న వ్యయాన్ని ప్రజలపై పెడుతున్న వ్యయంగా చూడాలని డబ్ల్యూహెచ్‌ఓ డైరెక్టర్ జనరల్ డా.టెడ్రోస్ అధనామ్ సూచించారు. ప్రజల మానసిక ఆరోగ్యంపై ప్రతి దేశం, ప్రతి నాయకుడు దృష్టి పెట్టాలని, నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు.

పీసీ ఘోష్ కమిషన్ నివేదిక మీకు ఎక్కడిది?

రిపోర్టును కొట్టేయాలని పిటిషన్ వేసిన రిటైర్డ్ ఐఏఎస్ ఎస్కే జోషీకి హైకోర్టు ప్రశ్న

కమిషన్ నివేదికను ఎక్కడా అప్‌లోడ్ చేయలేదు : ప్రభుత్వం

హైదరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక మీ చేతికి ఎలా వచ్చింది ? అంటూ నీటిపారుదల శాఖ మాజీ ముఖ్య కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషిని హైకోర్టు ప్రశ్నించింది. సాక్షిగా మాత్రమే పిలిచి, చట్టప్రకారం ఎలాంటి నోటీసు ఇవ్వకుండా తనకు వ్యతిరేకంగా ఫైండింగ్స్ ఇవ్వడం చెల్లదని, ఘోష్ కమిషన్ నివేదికను కొట్టేయాలంటూ జోషి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారించింది. కమిషన్ నివేదిక ఆధారంగా తనపై చర్యలు తీసుకోకుండా స్టే విధించాలని ఎస్కే జోషీ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన ధర్మాసనం.. అసలు కమిషన్ నివేదిక మీ చేతికి ఎలా వచ్చిందని ప్రశ్నించింది. దీనికి పిటిషనర్ న్యాయవాది బదులిస్తూ.. పబ్లిక్ డొమైన్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు మంత్రులు నిర్వహించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో రిపోర్టు ఎగ్జిక్యూటివ్ సమ్మరీ విడుదల చేశారని పేర్కొన్నారు. నివేదికను అసెంబ్లీలో కూడా ప్రవేశపెట్టారని.. ఈ నేపథ్యంలోనే డౌన్‌లోడ్ చేసుకున్నామని చెప్పారు. అసెంబ్లీలో ప్రవేశపెడితే కేవలం ఎమ్మెల్యేల వద్దే ఉంటుందని.. అది బయటకు ఎలావచ్చింది? అని ధర్మాసనం ప్రశ్నించింది. "ప్రభుత్వ వెబ్‌సైట్లు, పబ్లిక్ డొమైన్‌లో నివేదిక సారాంశం ఉంటే తొలగించాలని ఇప్పటికే ఆదేశించామని, అయినా మీరెలా డౌన్‌లోడ్ చేసుకున్నారు? నివేదిక ఎక్కడి నుంచి వచ్చిందో వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేయండి" అని పిటిషనర్‌ను ధర్మాసనం ఆదేశించింది. మరోవైపు, ఘోష్ కమిషన్ నివేదికను పబ్లిక్ డొమైన్‌లో పెట్టలేదని, కావాలంటే లిఖిత పూర్వక వివరణ ఇస్తామని ప్రభుత్వ న్యాయవాది ధర్మాసనానికి తెలియజేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషనర్ ప్రభావితవ్యక్తి అవునా?కాదా? ముందు తెలియాలని వ్యాఖ్యానించింది. సరైన విధానంలో కమిషన్ రిపోర్టు అందకుండా పిటిషనర్ బాధిత వ్యక్తి అని ఎలా తేలుస్తామని ప్రశ్నించింది. కమిషన్ నివేదికను ఎక్కడ అప్‌లోడ్ చేశారో తెలపండని ప్రభుత్వాన్ని ఆదేశించి విచారణను 10కి వాయిదా వేసింది.

23న సమ్మక్కసాగర్‌పై సీడబ్ల్యూసీ భేటీ

- అనుమానాలను నివృత్తి చేయాలంటూ రాష్ట్రానికి లేఖ

హైదరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సమ్మక్కసాగర్ (తుపాకులగూడెం) ప్రాజెక్టుకు అనుమతులివ్వాలంటూ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాసిన లేఖతో కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) కదిలింది. ఈనెల 23వ తేదీన హాజరై ఆ ప్రాజెక్టుపై అనుమానాలన్నీ నివృత్తి చేయడానికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని నీటి పారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు లేఖ రాసింది. దీంతో ఈ ప్రాజెక్టుకు చెందిన చీఫ్ ఇంజనీర్‌తో పాటు అధికారులంతా ఢిల్లీకి వెళ్లడానికి సమాయత్తం అవుతున్నారు. రూ.9,257 కోట్లతో సమ్మక్కసాగర్ నిర్మాణం చేపట్టగా.. పనులు 95 శాతం మేర పూర్తయ్యాయి. అయితే ప్రాజెక్టు ప్రయోజన వ్యయ నిష్పత్తి (బీసీఆర్)ని రూ.1.67 (రూపాయికి రూ.1.67 రాబడిగా) పేర్కొంటూ ఎస్సారెస్పీ రెండో దశ ఆయకట్టు స్థిరీకరణను సమ్మక్కసాగర్ ఖాతాలోనే చూపారు. కాళేశ్వరం కింద కూడా అదే ఆయకట్టును చూపడంతో.. అసలు సమస్య మొదలైంది. తాజాగా మారిన పరిణామాలతో ప్రధానంగా రెండు చర్యలు తీసుకుంటే తప్ప సమ్మక్కసాగర్‌కు అనుమతి రాదని సీడబ్ల్యూసీ స్పష్టం చేసింది. ఒకటి ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ.. రెండోది 2 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టును దీని కింద చూపించాల్సి ఉంటుంది. అయితే ఛత్తీస్‌గఢ్‌లో ముంపునకు గురయ్యే వంద ఎకరాలకు పరిహారం చెల్లించేందుకు వీలుగా నిర్ణయం తీసుకుంటే ఎన్‌వోసీకి మార్గం సుగమం కానుంది.

గిరిజన పంచాయతీలకు మహర్దశ

అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై సర్కారు ప్రత్యేక దృష్టి

- పైలట్ ప్రాజెక్టుగా జగిత్యాల జిల్లా ఎంపిక
- రెండు విడతల్లో ప్రగతి పనులకు ప్రణాళిక
- తొలి దశ కోసం 81.59 కోట్లు మంజూరు

జగిత్యాల, సెప్టెంబరు 03 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గిరిజన పంచాయతీలకు మహర్దశ పట్టనుంది. గిరిజనుల నివాస ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా తొలుత పైలట్ ప్రాజెక్టుగా జగిత్యాల జిల్లాను ఎంపిక చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్.. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న జగిత్యాల జిల్లాలో పనులు చేపట్టడానికి కసరత్తు చేస్తున్నారు. వచ్చే రెండేళ్లలో రెండు విడతలుగా అభివృద్ధి పనులు చేయాలని సంకల్పించారు. మొదటి విడత పనులను ఏడాదిలో పూర్తి చేయడానికి కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే జగిత్యాల జిల్లాలో గిరిజనులు ఎక్కువగా ఉన్న పంచాయతీలను గుర్తించారు. అక్కడ చేపట్టాల్సిన పనులపై ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. తాజాగా జగిత్యాలలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి అలుగు వర్షిణి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. జిల్లాలో మొదటి విడతగా 801పనులను గుర్తించి రూ.81.59కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీలైనంత త్వరగా పనులను ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో గిరిజన పంచాయతీల్లో సంవత్సరాల తరబడి నెలకొన్న సమస్యలకు పరిష్కారం లభించనుంది.

23 పంచాయతీల ఎంపిక

జగిత్యాల జిల్లాలోని తొమ్మిది మండలాల్లో అత్యధికంగా గిరిజన జనాభా కలిగిన 23 పంచాయతీలను పైలట్ ప్రాజెక్టులో అభివృద్ధి చేయడానికి ఎంపిక చేశారు. ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గంలో మూడు పంచాయతీలు, చొప్పదండి నియోజకవర్గంలో ఒక పంచాయతీ, జగిత్యాల నియోజకవర్గంలో 12పంచాయతీలు, కోరుట్ల నియోజకవర్గంలో 6పంచాయతీలు, వేములవాడ నియోజకవర్గంలో ఒక పంచాయతీని ఎంపిక చేశారు. ఇందులో రోడ్ల అభివృద్ధి, అంతర్గత సీసీ రహదారులు, మురికి కాలువలు, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, తాగు నీరు, విద్యాభివృద్ధి, కమ్యూనిటీ హాళ్లు, ఆరోగ్య ఉప కేంద్రాలు, వెటర్నరీ ఆస్పత్రులు, విద్యుత్ అభివృద్ధి పనులు నిర్వహించడానికి నిర్ణయించారు. ఎంపిక చేసిన గిరిజన పంచాయతీల్లో 801 పనులను గుర్తించి రూ.81.59 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో 14 రహదారులు, బ్రిడ్జిల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులకు రూ.25.98 కోట్లు.. 23అంతర్గత సీసీ రహదారులు, మురికి కాలువల పనులకు రూ.16.33 కోట్లు.. 19 గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు రూ.5.01 కోట్లు, 19 అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు రూ.3.04 కోట్లు, 18 తాగునీటి అభివృద్ధి పనులకు రూ.1.70 కోట్లు.. 23 పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, ప్రహరీ నిర్మాణం తదితర పనులకు రూ.6.41కోట్లు, 18 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణ పనులకు రూ.5.15 కోట్లు, 10 ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణ పనులకు రూ.2.01 కోట్లు.. 608 విద్యుత్ స్తంభాలు, హైమాస్ట్ లైట్లు, ఇతర అభివృద్ధి పనులకు రూ.2.17 కోట్లు, 60 రకాల అభివృద్ధి పనులకు రూ.11.11 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. జగిత్యాల జిల్లాలో పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

ముఖ్యమంత్రి నిర్ణయం మేరకే..



రేవంత్‌రెడ్డి నిర్ణయం మేరకే గిరిజన పంచాయతీల అభివృద్ధికి శ్రీకారం చుట్టాం. ఇందులో భాగంగా పైలట్ ప్రాజెక్టుగా జగిత్యాలను ఎంపిక చేశాం. జిల్లాలో సాధిం చిన ఫలితాలను పరిశీలించి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించాం. ఏడాది కాలంలో తొలి విడతగా ఎంపిక చేసిన పంచాయతీల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయాలని సంకల్పించాం.

- అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి

గిరిజన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం..

గిరిజన పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాం. ఇందులో భాగంగా పైలట్ ప్రాజెక్టుగా జగిత్యాల జిల్లాను ఎంపిక చేశాం. జిల్లాలో 25 గిరిజన పంచాయతీలను ఇప్పటికే గుర్తించాం. ఈ పంచాయతీల్లో రూ.81.59 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులను పూర్తి చేయడానికి కసరత్తులు చేస్తున్నాం. గిరిజన పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం.

- అలుగు వర్షిణి, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.